www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

కేపీహెచ్‌బీలో గజం
రూ.2.98 లక్షలు

- హౌసింగ్ బోర్డు ప్లాట్ల వేలంలో అత్యధిక ధర
- హాట్ కేకుల్లా అమ్ముడుపోయిన ప్లాట్లు
- 18 స్థలాల విక్రయంతో బోర్డుకు రూ.142 కోట్లు
- 2000 సంవత్సరంలో అక్కడ గజం రూ.1818



14

గురువారం | 12-6-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 74 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, బహుళ పక్షం తిథి: పాడ్యమి మ.2:28 తదుపరి విదియ, నక్షత్రం: మూల రా.9:57 తదుపరి పూర్వాషాఢ, వర్జ్యం: రా.8:13 - 9:57, దుర్ముహూర్తం: ఉ.10:04 -10:56, మ.3:17 - 4:09, అమృతఘడియలు: మ.3:04 -4:47, రాహుకాలం: మ.1:30 -3:00, సూర్యోదయం: 5:44, సూర్యాస్తమయం: 6:46 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



నేనున్నంత వరకు కేసీఆర్ ఫ్యామిలీని
కాంగ్రెస్‌లోకి రానివ్వ

- కేసీఆర్‌ది తెలంగాణ ద్రోహుల కుటుంబం
- దుష్మన్ పరివారానికి కాంగ్రెస్‌లో జాగా లేదు
- వారిది సెల్ఫ్ క్రియేషన్.. కవితది ఫ్యామిలీ డ్రామా
- ఇప్పుడు ఆమె కూడా దయ్యంగా మారిపోయారా?
- మోదీ చదివిన బడిలోనే నేనూ చదివా
- మంత్రులకు పనిభారం ఎక్కువైతే తగ్గిస్తా
- రాహుల్‌ది, నాది 'రేర్' కాంబినేషన్
- 2 రోజుల్లో 'కాళేశ్వరం'పై ప్రజలకు వివరిస్తా
- తెలంగాణ అభివృద్ధిని కిషన్‌రెడ్డే అడ్డుకుంటున్నారు
- కేటీఆర్ ఏం చెబితే అదే మాట్లాడతారు
- ఏనాడైనా రాష్ట్రం కోసం మోదీతో మాట్లాడారా?
- మీడియాతో ఇష్టాగోష్ఠిలో సీఎం రేవంత్‌రెడ్డి

న్యూఢిల్లీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): "నేను ఉన్నంత వరకు కేసీఆర్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీలో చోటు లేదు" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్‌ది తెలంగాణ ద్రోహుల కుటుంబమన్నారు. కేసీఆర్ కుటుంబానిది సెల్ఫ్ క్రియేషన్ అని, కవితది ఫ్యామిలీ డ్రామా అని ఆరోపించారు. ప్రజల్లో బీఆర్ఎస్, కల్వకుంట్ల కుటుంబంపై చర్చ లేకపోతే అందరి దృష్టిని తమవైపు తిప్పుకొనేందుకు ఆ కుటుంబం సెల్ఫ్ క్రియేషన్

మిగతా 12వ పేజీలో...

వివేక్‌కు గనులు, ఉపాధి కల్పన

- అడ్లూరికి ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమం
- వాకిటికి పశుసంవర్ధకం, యువజన, క్రీడలు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ప్రస్తుత మంత్రుల శాఖల్లో మార్పులు లేవు

12

నీటి నిల్వ నిర్ణయం
అధికారులదే

- పంప్‌హౌస్ హెడ్‌కు తాకేంతవరకు నీటిని వారే నిల్వ చేశారు.. నేను ఆదేశాలివ్వలేదు
- ప్రాజెక్టుల ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌కు రూ.280 కోట్ల నిధులు విడుదల చేశాం
- వినియోగించే అధికారాలనూ వారికే ఇచ్చాం.. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్ణయం క్యాబినెట్‌దే
- స్థలాల ఎంపిక పూర్తిగా సాంకేతికమైనదే.. నిధుల సమీకరణకే ఇరిగేషన్ కార్పొరేషన్
- ప్రాజెక్టు వినియోగం ద్వారా సమకూరే నిధులతో రుణాలు చెల్లించాలనుకున్నాం
- వివిధ కారణాల వల్ల సాధ్యం కాలేదు.. పీసీ ఘోష్ కమిషన్ ఎదుట కేసీఆర్
- మాజీ సీఎంపై కమిషన్ ప్రశ్నల వర్షం.. బహిరంగ విచారణపై కేసీఆర్ అభ్యంతరం
- ముఖాముఖి విచారించిన జస్టిస్ ఘోష్.. 50 నిమిషాలపాటు కొనసాగిన విచారణ

హైదరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయాలన్న నిర్ణయం అధికారులదేనని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్.. జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్‌కు తెలిపారు. పంప్‌హౌస్ హెడ్‌కు తాకేంతవరకు నీటిని వారే నిల్వ చేశారని చెప్పారు. నీటి నిల్వకు తాను ఎటువంటి ఆదేశాలూ ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో ప్రాజెక్టుల ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ కోసం తమ ప్రభుత్వ హయాంలో రూ.280 కోట్ల నిధులు విడుదల చేశామని, వాటిని వినియోగించే అధికారం కూడా అధికారులకు దఖలు పరిచామని వెల్లడించారు. కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణానికి సంబంధించిన నిర్ణయం నాటి మంత్రివర్గం తీసుకుందని, ప్రభుత్వ ఆమోదంతోనే ప్రాజెక్టు నిర్మాణం చేపట్టామన్నారు. బ్యారేజీల కోసం స్థలాల ఎంపిక పూర్తిగా సాంకేతికంగానే జరిగిందని తెలిపారు. కాళేశ్వరం నిర్మాణం కోసం నిధులు సమీకరించేందుకే ఇరిగేషన్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశామని, ప్రాజెక్టు వినియోగం ద్వారా సమకూరే నిధులతో ఆ రుణాలను తిరిగి చెల్లించాలనుకున్నామని వివరించారు. కానీ, వివిధ కారణాల వల్ల అది సాధ్యం కాలేదన్నారు. కాళేశ్వరంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట కేసీఆర్ బుధవారం హాజరయ్యారు. అయితే విచారణకు ముందు నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఓపెన్ కోర్టులో కేసీఆర్‌ను విచారించేందుకు

మిగతా 13వ పేజీలో...



కాళేశ్వరం కమిషన్ ఎదుట హాజరుకావటానికి వస్తున్న కేసీఆర్

కవితను పలకరించని
కేసీఆర్!

- గుడ్ మార్నింగ్ డాడీ.. అంటూ కవిత పలకరింపు
- మాట్లాడకపోగా.. ఆగాలంటూ కేసీఆర్ సైగ

14

కేసీఆర్ ఫాంహౌస్‌లో జారిపడ్డ పల్లా

- విరిగిన ఎడమ తుంటి.. యశోద ఆస్పత్రిలో శస్త్రచికిత్స
- పరామర్శించిన కేసీఆర్

10

ఈటల, హరీశ్
తప్పుడు సమాచారం ఇచ్చారు

- వారిపై తగిన చర్యలు తీసుకోవాలి
- కాళేశ్వరానికి, మంత్రివర్గ ఉపసంఘానికి సంబంధం లేదు
- జస్టిస్ ఘోష్ కమిషన్‌కు తుమ్మల లేఖ

13



అప్పుడు గొప్పలు చెప్పి..
ఇప్పుడు సంబంధం లేదంటున్నారు

- కాళేశ్వరం..అతి పెద్ద ఇంజనీరింగ్ తప్పిదం
- ఆ తప్పులు చూడలేకే పార్టీ నుంచి బయటికొచ్చా
- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

13



'గాలి' జైలు శిక్ష రద్దు

- ఓబుళాపురం కేసులో కర్ణాటక ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డికి ఊరట
- ఆయనతోపాటు మరో ముగ్గురు నిందితులకు జైలు శిక్ష రద్దుతోపాటు బెయిల్ మంజూరు
- సీబీఐ కోర్టు తీర్పును కొట్టేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు
- తీర్పుతో గాలి అసెంబ్లీ సభ్యత్వం పునరుద్ధరణ!

3



ప్రముఖ గాయని
మంగ్లీపై కేసు!

- చేవెళ్లలోని ఓ రిసార్ట్‌లో పుట్టిన రోజు వేడుకలు
- అనుమతిలేని పార్టీలో పలువురు సినీ ప్రముఖులు
- రిసార్టుపై అర్ధరాత్రి పోలీసుల దాడులు
- అనుమానితులకు డ్రగ్స్ పరీక్షలు
- ఓ వ్యక్తి శరీరంలో గంజాయి ఆనవాళ్లు
- మంగ్లీ సహా నలుగురిపై కేసు నమోదు

3

హాషిష్ ఆయిల్ పట్టివేత

- విలువ 1.2 కోట్లు.. ఓఆర్ఆర్ వద్ద ఇద్దరి అరెస్టు
- నిందితుల్లో ఒకరు ఆర్టీయే ఏజెంట్

తత్కాల్‌కు కొత్త నిబంధనలు

- ఇకపై ఆధార్ వెరిఫైడ్ యూజర్లకు మాత్రమే టికెట్లు.. జూలై 1 నుంచి అమలు
- అవకతవకలను నివారించడమే లక్ష్యంగా..

2

జర్నలిస్టు కృష్ణంరాజు అరెస్టు!

- అమరావతిపై అసభ్య వ్యాఖ్యల కేసులో అదుపులోకి తీసుకున్న ఏపీ పోలీసులు
- నేడు మంగళగిరి కోర్టులో హాజరు

3

నీటిపారుదల శాఖ ఈఈ అక్రమాస్తులు
రూ.100 కోట్లపైనే!

లగ్జరీ విల్లాలు, ఆకాశ హర్మ్యాల్లో ఫ్లాట్లు, బహుళ అంతస్తుల భవనాలు



- 16 ఎకరాల వ్యవసాయ భూమి, 19 ఇళ్ల స్థలాలు, హోటళ్లలో భాగస్వామ్యం
- డెస్టినేషన్ వెడ్డింగ్ తరహాలో థాయ్‌లాండ్‌లో ఘనంగా కుమారుడి వివాహం
- ఏసీబీ వలలో నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నూనె శ్రీధర్
- కాళేశ్వరం బాహుబలి మోటార్ల కొనుగోళ్లలో కమీషన్లు తీసుకున్నట్లు ఆరోపణలు
- 13 చోట్ల ఏకకాలంలో దాడులు.. శ్రీధర్‌ను అరెస్టు చేసిన అధికారులు
- కొనసాగుతున్న సోదాలు.. బ్యాంకు డిపాజిట్లు, లాకర్ల గుర్తింపు

హైదరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదల శాఖకు చెందిన అవినీతి తిమింగలం ఏసీబీ వలకు చిక్కింది. చొప్పదండి డివిజన్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)గా పనిచేస్తున్న నూనె శ్రీధర్‌ను ఆదాయానికి మించి ఆస్తుల కేసులో ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఆయన అక్రమాస్తుల విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.100 కోట్లకు పైనే ఉంటుందని సమాచారం. శ్రీధర్‌తో పాటు అతని బంధువులు, సన్నిహితులకు సంబంధించి.. హైదరాబాద్, కరీంనగర్, బెంగళూరులో 13 చోట్ల బుధవారం ఉదయం ఏకకాలంలో తనిఖీలు ప్రారంభించారు. కరీంనగర్‌లో శ్రీధర్‌ను అదుపులోకి తీసుకొని హైదరాబాద్ తరలించారు. బెంగళూరులో నాలుగు చోట్ల, హైదరాబాద్‌లో ఆరుచోట్ల ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. కరీంనగర్‌లోని కాళేశ్వరం ప్రాజెక్టు కార్యాలయంలోనూ తనిఖీలు నిర్వహించారు. శ్రీధర్ అక్రమార్జనకు సంబంధించి భారీగానే ఆస్తులను గుర్తించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని కీలకమైన గాయత్రి పంప్‌హౌస్ బాధ్యతలను శ్రీధర్ చూసేవారని, అక్కడ ఏర్పాటు చేసిన బాహుబలి మోటార్ల కొనుగోళ్లలో ఆయన కమీషన్లు తీసుకున్నారన్న ఆరోపణలు రావడంతో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు. చొప్పదండి నియోజకవర్గంలోని రామడుగు మండలంలో నిర్మించిన భారీ పంప్‌హౌస్ బాధ్యతలు కూడా శ్రీధర్ చూశారని తెలుస్తోంది. శ్రీధర్ ఆస్తుల జాబితాలోని వివరాలు.. హైదరాబాద్‌లోని మలక్‌పేటలో విలాసవంతమైన నాలుగంతస్తుల భవనం, షేక్‌పేటలో ఖరీదైన గేటెడ్ కమ్యూనిటీ స్కై హైలో 4,500 చదరపు అడుగుల ఫ్లాట్, తెల్లాపూర్‌లోని మరో ఖరీదైన గేటెడ్ కమ్యూనిటీ ఉర్జిత్ ఎన్‌క్లేవ్‌లో లగ్జరీ విల్లా, వరంగల్‌లో జీ+3 భవనం, కరీంనగర్‌లో మూడు ఫ్లాట్లు, ఒక ఇండిపెండెంట్ ఇల్లు, అమీర్‌పేటలోని వాణిజ్య సముదాయంలో ఆస్తులు, 16 ఎకరాల వ్యవసాయ భూమి, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్‌లోని

మిగతా 14వ పేజీలో...



సర్కారీ ప్రీస్కూల్స్ సిద్ధం

- 13 జిల్లాల్లోని 210 ప్రాథమిక పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ
- ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభం
- కొత్త ప్రవేశాలతోపాటు సమీప అంగన్‌వాడీ విద్యార్థుల విలీనం
- ప్రస్తుతం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఒక వలంటీర్‌తో బోధన
- భవిష్యత్తులో ప్రాథమిక ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ
- విద్యా కమిషన్ సిఫారసుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం

హైదరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ విద్యా వ్యవస్థలో కొత్త అధ్యాయం మొదలవుతోంది. ఇప్పటి వరకు ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత పాఠశాలలుగా ఉన్న పాఠశాల విద్యలో.. కొత్తగా పూర్వ ప్రాథమిక (ప్రీస్కూల్) బడులు ప్రారంభమవుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల్లోని 210 ప్రాథమిక పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం నుంచే పూర్వ ప్రాథమిక తరగతులు కూడా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఏటేటా తగ్గిపోతున్న నేపథ్యంలో.. పూర్వ ప్రాథమిక పాఠశాలలు (ప్రీస్కూల్స్) ప్రారంభించాలని తెలంగాణ విద్యా కమిషన్ ప్రభుత్వానికి రెండు నెలల క్రితం

మిగతా 10వ పేజీలో...



జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో సిట్ విచారణకు హాజరైన ప్రభాకర్‌రావు

జడ్జిల ఫోన్లు ఎందుకు
ట్యాప్ చేశారు?

- ఆదేశాలిచ్చిందెవరు? మీ పరిధిని దాటి ఎందుకు వెళ్లారు?
- ట్యాపింగ్‌లో ప్రైవేటు వ్యక్తుల్ని ఎందుకు ఉపయోగించారు?
- రివ్యూ కమిటీకి ట్యాపింగ్ సమాచారం ఎందుకివ్వలేదు?
- ఈ మొత్తం వ్యవహారం వెనక ఉన్నది ఎవరు?
- రెండో రోజూ 8 గంటలపాటు ప్రభాకర్‌రావు విచారణ
- ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ వెలికితీసిన సమాచారంతో సిట్ ప్రశ్నలు
- ఆయన 2 ఫోన్లు స్వాధీనం.. 14న మరోసారి రావాలని ఆదేశం?

14

న్యాయవ్యవస్థ క్రియాశీలత..
న్యాయఉగ్రవాదం కావద్దు

- జోక్యం చేసుకోకూడని అంశాల్లో కలుగజేసుకోవడం మంచిది కాదు
- న్యాయసమీక్ష అధికారాన్ని అరుదైన కేసుల్లోనే వినియోగించాలి
- రాజ్యాంగ మూలసూత్రాలకు, ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగినప్పుడే ఆ అధికారం వినియోగించాలి: సీజేఐ బీఆర్ గవాయ్



న్యూఢిల్లీ, జూన్ 11: న్యాయవ్యవస్థ తాను జోక్యం చేసుకోకూడని అంశాల్లో కలుగజేసుకోవడం మంచిది కాదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. న్యాయవ్యవస్థ క్రియాశీలత న్యాయ ఉగ్రవాదంగా మారకూడదని వ్యాఖ్యానించారు. ప్రజల ప్రాథమిక హక్కులను పరిరక్షించడంలో ఏదైనా చట్టంగానీ, కార్యనిర్వాహక యంత్రాంగంగానీ విఫలమైనప్పుడు న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవచ్చని.. అయితే ఈ న్యాయసమీక్ష అధికారాన్ని అరుదైన కేసుల్లో మాత్రమే వినియోగించాలని పేర్కొన్నారు. బుధవారం ఆక్స్‌ఫర్డ్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్

మిగతా 2వ పేజీలో...



కేసీఆర్ వెంట్రుక కూడా
రేవంత్ పీకలేరు

- ఆయన ఓ చిల్లర ముఖ్యమంత్రి
- మంత్రులకు శాఖలిచ్చే అధికారం లేనోడు
- దృష్టి మళ్లించేందుకే విచారణ పేరిట కుట్రలు
- రాజకీయ స్వార్థమే ముఖ్యమనుకొని
- రాక్షసానందం పొందటం రేవంత్ నైజం
- ఆయన గురువునే కేసీఆర్ తరిమేశారు
- కాంగ్రెస్‌ను బజార్‌లో నిలబెడతాం: కేటీఆర్

హైదరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : గతంలో చిల్లర పనులు చేసి, బ్యాగులు మోసి జైల్లో పడిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు బీఆర్ఎస్ నాయకులను కూడా జైల్లో పెట్టాలనే వికృత ఆలోచనతో ఉన్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ .

మిగతా 13వ పేజీలో...

తత్కాల్ బుకింగ్‌కు కొత్త నిబంధనలు

ఆధార్ వెరిఫైడ్ యూజర్లకు మాత్రమే టికెట్లు



న్యూఢిల్లీ, జూన్ 11: తత్కాల్ బుకింగ్‌లో అవకతవకలను నిరోధించడానికి, అంతిమ వినియోగదారుడు మాత్రమే లబ్ధి పొందేలా రైల్వే శాఖ నిబంధనలు మార్చింది. ఆధార్ వెరిఫైడ్ యూజర్లు మాత్రమే తత్కాల్ బుకింగ్ చేసుకునేలా ఐఆర్‌సీటీసీ వెబ్‌లో, యాప్‌లో మార్పులు చేయాలని, జూలై 1 నుంచి అమలు చేయాలని రైల్వే నిర్ణయించింది. ఈమేరకు జూన్ 10న అన్ని జోన్‌లకు సర్క్యులర్ జారీ చేసింది. అలాగే జూలై 15 నుంచి అదనంగా తత్కాల్‌లో టికెట్ బుక్ చేసుకున్న ప్రయాణికుడు ఆధార్ ఆధారిత ఓటీపీని కూడా నిర్ధారించాల్సి ఉంటుంది. అలాగే రైల్వే రిజర్వేషన్ ఏజెంట్లు తత్కాల్ మొదటి రోజు మొదటి అరగంట టికెట్లు బుక్ చేయకుండా వెబ్‌సైట్‌లో మార్పులు చేసింది. ఏసీ టికెట్ అయితే 10.30 తరువాత, సాధారణ తరగతిలో అయితే 11.30 తరువాత మాత్రమే ఏజెంట్లకు అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. కాగా ఇప్పటి వరకూ వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికులకు రైలు బయలుదేరడానికి కేవలం నాలుగు గంటల ముందు మాత్రమే తమ టికెట్ స్టేటస్ తెలుస్తుంది. దీనివలన ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో 24 గంటల ముందే వెయిటింగ్ లిస్ట్ టికెట్ స్టేటస్ వెల్లడించేందుకు రైల్వే సిద్ధమవుతోంది. ఈ మేరకు బికనీర్ డివిజన్‌లో దీనిని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు రైల్వే బోర్డు సమాచార, ప్రచార విభాగం డైరెక్టర్ దిలీప్ కుమార్ తెలిపారు.

రూ.3 వేలు దాటే యూపీఐ చెల్లింపులపై ఎండీఆర్ చార్జీలు?

- రెండు నెలల్లో అమలు!
- ఖండించిన కేంద్రం




న్యూఢిల్లీ, జూన్ 11: యూపీఐ లావాదేవీలపై మళ్లీ మర్చంట్ డిస్కౌంట్ రేట్(ఎండీఆర్) చార్జీలను విధించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. రూ.3 వేలకు పైబడి చేసే యూపీఐ చెల్లింపులకు ఈ చార్జీలు వర్తిస్తాయి. ఒకట్రెండు నెలల్లో ఈ విధానం అమల్లోకి వస్తుందంటూ 'ఎన్‌డీటీవీ ప్రాఫిట్' ఓ కథనాన్ని ప్రచురించింది. ఈ మేరకు ప్రభుత్వ వర్గాలను ఉటంకించింది. ఆ కథనం ప్రకారం.. యూపీఐ విధానం అమల్లోకి వచ్చిన తొలినాళ్లలో ఎండీఆర్ చార్జీలు 0.3శాతంగా ఉండేవి. అంటే.. క్రెడిట్ కార్డుల(0.9% నుంచి 2%) మాదిరిగానే వర్తకులపై ఎండీఆర్ భారం పడేది. 2020 జనవరి నుంచి కేంద్ర ప్రభుత్వం వర్తకులకు సాంత్వన కల్పిస్తూ.. జీరో ఎండీఆర్ విధానాన్ని అమలు చేసింది. ఇప్పుడు 80శాతానికి పైగా డిజిటల్ చెల్లింపులు యూపీఐ ద్వారా జరుగుతుండడంతో.. బ్యాంకులు, చెల్లింపు సేవాసంస్థల నిర్వహణ చార్జీలను దృష్టిలో పెట్టుకుని, ఎండీఆర్‌కు సిద్ధమైంది. అయితే.. ఎండీఆర్ పెంపు వార్త అవాస్తవమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

లోకం తీరు



యాక్సియం-4 మిషన్.. మళ్లీ వాయిదా



న్యూఢిల్లీ, జూన్ 11: భారత వ్యోమగామి శుభాన్షుశుక్లా సహా నలుగురిని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి పంపేందుకు చేపట్టిన యాక్సియం-4 మిషన్ మరోసారి వాయిదా పడింది. స్పేస్‌ఎక్స్ క్రూ డ్రాగన్‌ను కక్ష్యలో ప్రవేశపెట్టాల్సిన ఫాల్కన్ 9 రాకెట్‌లో ద్రవ ఇంధన (లిక్విడ్ ఆక్సిజన్) లీకేజీ కారణంగా వాయిదా నిర్ణయం తీసుకున్నట్టు స్పేస్‌ఎక్స్ ప్రకటించింది. దీనికి సంబంధించిన మరమ్మత్తులు పూర్తయ్యాక కొత్త లాంచ్ డేట్‌ను ప్రకటిస్తామని 'ఎక్స్' వేదికగా వెల్లడించింది. కాగా.. ఫాల్కన్ 9 రాకెట్ లాంచ్‌ప్యాడ్‌పై ఉండగా నిర్వహించిన ఏడు సెకన్ల హాట్ టెస్ట్ సందర్భంగా.. రాకెట్‌లోని 'ప్రొపల్షన్ బే'లో ద్రవ ఇందన లీకేజీని గుర్తించినట్టు ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ తెలిపారు. నిజానికి ఈ మిషన్‌ను మే 29న చేపట్టాలని యాక్సియం సంస్థ నిర్ణయించిన సంగతి తెలిసిందే. కానీ.. దాన్ని జూన్ 9కి, ఆ తర్వాత జూన్ 10కి.. జూన్ 11కి.. ఇలా మూడుసార్లు వాయిదా వేశారు. అయితే.. ఈసారి మాత్రం మిషన్ కొన్నిరోజులపాటు వాయిదా పడే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఆర్‌సీబీ సన్మానానికి నన్ను ఆహ్వానించారు

- గవర్నర్‌ను నేనే రమ్మన్నాను: సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, జూన్ 11: చిన్నస్వామి స్టేడియంలో ఈ నెల 4న జరిగిన తొక్కిసలాట, ఆర్‌సీబీకి సన్మాన కార్యక్రమాలతో తమ ప్రభుత్వానికి సంబంధం లేదని నిన్నటిదాకా చెబుతూ వచ్చిన కర్ణాటక సీఎం సిద్దరామయ్య ఇప్పుడు మాటమార్చారు. విధానసౌధలో ఐపీఎల్ విజేతలకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆర్‌సీబీ, కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు స్వయంగా తనను కోరారని.. అందుకు తాను అంగీకరించానని బుధవారం ఆయన మీడియాకు వెల్లడించారు. 'విధానసౌధలో జరిగే సన్మానానికి హాజరు కావాలని నన్ను ఆహ్వానించారు. నేను సరేనన్నాను. ఈ కార్యక్రమానికి గవర్నర్ గెహ్లాట్ తనంత తాను వచ్చినట్లు మీడియా పేర్కొంది. ఇది వాస్తవం కాదు. సన్మానానికి నేను హాజరవుతున్నందున మీరు కూడా వస్తే బాగుంటుందని గవర్నర్‌ను కోరాను. ఆయన వచ్చారు. 20 నిమిషాల్లోనే సన్మానం పూర్తయింది. ఆ వెంటనే ఆయన వెళ్లిపోయారు. నేను కూడా నా నివాసానికి చేరుకున్నాను' అని సీఎం వివరించారు. మరోవైపు.. ఆర్‌సీబీ, బీసీసీఐ అనుమతులు తీసుకోకుండా చిన్నస్వామి స్టేడియంలో విజయోత్సవాలను నిర్వహించడమే తొక్కిసలాటకు కారణమని రాష్ట్రప్రభుత్వం కర్ణాటక హైకోర్టుకు తెలిపింది. ఇదిలా ఉండగా, చిన్నస్వామి గేట్లను సకాలంలో తెరవకపోవడం వల్లనే తొక్కిసలాట జరిగిందని బాధితులు విచారణాధికారికి తెలిపారు.

ఏసీల కనిష్ఠ ఉష్ణోగ్రత ఇక 20 డిగ్రీలకే పరిమితం

న్యూఢిల్లీ, జూన్ 11: అవసరం ఉన్నా లేకున్నా.. కొందరు ఏసీ ఉష్ణోగ్రతను 16 డిగ్రీలు పెట్టేసి దుప్పటి ముసుగు తన్ని నిద్రపోతుంటారు. ఇలాంటి విద్యుత్ దుర్వినియోగాన్ని అరికట్టేందుకు, దేశ విద్యుత్ సామర్థ్యాన్ని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ఏసీల కనిష్ఠ ఉష్ణోగ్రతపై పరిమితులు విధించనుంది. ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న ఏసీల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతను 16 డిగ్రీల సెల్సియస్ వరకు పెట్టుకోవచ్చు. కానీ, ప్రతిపాదిత నిబంధన ప్రకారం ఏసీ కనిష్ఠ ఉష్ణోగ్రత 20 డిగ్రీలకు.. గరిష్ఠ ఉష్ణోగ్రత 28 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం కానుంది. అంటే, 20 డిగ్రీల కంటే ఉష్ణోగ్రతను తగ్గించలేరు. అలాగే 28 డిగ్రీల కంటే ఉష్ణోగ్రతను పెంచలేరు. ఈ మేరకు ఏసీల్లో మార్పులు చేసేందుకు తయారీ సంస్థలతో ప్రభుత్వం పని చేస్తోంది. గృహ, వాణిజ్య అవసరాలకు వినియోగించే అన్ని రకాల ఏసీలతోపాటు వాహనాల్లో ఉపయోగించే ఎయిర్ కండిషనర్లలోనూ ఈ మార్పులు చేయనున్నారు.

ముసుగు వేసేద్దాం.!

- సిందూర్ దెబ్బతో మూడు మిలిటరీ సైట్లపై టార్పాలిన్లు



న్యూఢిల్లీ, జూన్ 11: అబ్బెబ్బే.. ఆపరేషన్ సిందూర్ దాడుల్లో మాకేం నష్టంలేదు అని పాకిస్థాన్ చెప్పడం ఉత్తి బుకాయింపే అని శాటిలైట్ చిత్రాల్లో బయటపడింది. సిందూర్ దాడుల్లో దెబ్బతిన్న మూడు మిలిటరీ సైట్లలో రూఫ్‌టాప్‌కు టార్పాలిన్లు కప్పి రిపేర్లు చేస్తోంది. దానిని హైరిజల్యూషన్ శాటిలైట్ చిత్రాలు పసిగట్టాయి. పాక్ కవరింగ్‌ను ఆ ఫొటోలు బహిర్గతం చేశాయి. ఆ వివరాలను ఇండియా టుడే తన కథనంలో వివరించింది. పాక్‌లోని మురిద్, జకోబాబాద్, భోలారీల్లోని బేస్‌లు భారత్ దాడుల్లో తీవ్రంగా దెబ్బతిన్నాయి. సింధ్‌లోని భోలారీ ఎయిర్ బేస్ భారత్ దాడుల్లో బాగా దెబ్బతిన్నట్లు గతంలోనే బయటపడింది. అయితే దెబ్బతిన్నట్లు కనబడకుండా ఉండేందుకు దాని పైకప్పునకు నీట్‌గా ఓ కవర్ కప్పేసింది. అయితే ఈనెల 4న తీసిన శాటిలైట్ ఫొటోల్లో అది కవరింగే అన్న విషయం స్పష్టంగా తెలుస్తోంది. ఇక పంజాబ్‌లోని మురిద్ బేస్‌ది కూడా ఇదే కథ. ఇక్కడి కమాండ్ కంట్రోల్ సెంటర్‌పై టార్పాలిన్ కప్పి కింద రిపేర్లు చేస్తునట్లు స్పష్టంగా కనిపిస్తోంది.. ఇక ఎఫ్-16కు స్థావరమైన జకోబాబాద్ ఎయిర్‌ఫోర్స్ బేస్‌లో కూడా ఇలాంటి పనులే కనిపిస్తున్నాయి.

సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలు విడుదల

హైదరాబాద్ సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత సర్వీసుల్లో ఉద్యోగాల భర్తీకి మే 25న నిర్వహించిన సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష-2025 ఫలితాలను బుధవారం యూపీఎస్సీ వెల్లడించింది. సివిల్స్ మెయిన్ పరీక్షకు అర్హత సాధించిన అభ్యర్థుల రోల్ నంబర్లతో కూడిన జాబితాను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. తెలుగు రాష్ట్రాల నుంచి ఈ పరీక్షకు 74,427 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 42,804 మంది పరీక్షకు హాజరయ్యారు. దేశవ్యాప్తంగా ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన 14,161 మందిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన అభ్యర్థుల సంఖ్య 450 నుంచి 500 వరకు ఉన్నట్లు తెలుస్తోంది. సివిల్స్ మెయిన్ పరీక్షలు దేశవ్యాప్తంగా పలు కేంద్రాల్లో ఆగస్టు 22 నుంచి 5 రోజుల పాటు జరగనున్నాయి.

ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీ మాజీ ఉద్యోగిపై సీబీఐ విచారణ


హైదరాబాద్/కంది, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ(ఓడీఎఫ్) మాజీ స్టోర్స్ ఇన్‌చార్జి మాశెట్టి గోపాల్‌పై సీబీఐ ఆదాయానికి మించి ఆస్తుల కేసు నమోదు చేసింది. 2010 నుంచి 2024 మధ్య కాలంలో గోపాల్ ఓడిఎఫ్‌లో పనిచేస్తున్న సమయంలో లంచాలు తీసుకుని భారీగా అక్రమాస్తులు కూడబెట్టాడని అతనిపై ఏసీబీకి ఫిర్యాదు అందింది. వెంటనే ఏసీబీ అధికారులు గోపాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సైన్యానికి యుద్ధ ట్యాంకులు తయారు చేసే ఫ్యాక్టరీ కావడంతో ఏసీబీ అధికారులు సీబీఐని రంగంలోకి దించారు. దర్యాప్తు ప్రారంభించిన సీబీఐ గోపాల్ తన ఆదాయానికి మించి 778% ఆస్తులు కూడబెట్టినట్లు గుర్తించింది. గోపాల్ ఇళ్లు, కార్యాలయాల్లో మూడు చోట్ల నిర్వహించిన సోదాల్లో రూ.2.17 కోట్ల అక్రమ ఆస్తులను గుర్తించింది.

న్యాయ వ్యవస్థ క్రియాశీలత..

న్యాయ ఉగ్రవాదం కావద్దు

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడారు. భారత రాజ్యాంగం రాతప్రతి రూపంలో ఉన్న నిశ్శబ్ద విప్లవమని అభివర్ణించారు. దేశ పౌరుల హక్కులకు అభయమివ్వడమే కాకుండా అణగారినవర్గాల అభ్యున్నతికి తోడ్పడిన శక్తి రాజ్యాంగమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అండ్ బెంచ్ వెబ్‌సైట్ ప్రతినిధి అడిగిన ఓ ప్రశ్నకు స్పందిస్తూ.. "భారతదేశంలో న్యాయవ్యవస్థ క్రియాశీలత అవసరమే. అయితే న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోకూడని అంశాల్లో కలుగజేసుకోవడం మంచిదికాదు. న్యాయవ్యవస్థ క్రియాశీలత న్యాయ ఉగ్రవాదంగా మారకూడదు. మీరు పరిమితులను మీరడానికి ప్రయత్నిస్తే.. సాధారణంగా న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోకూడని అంశాల్లోకి వెళ్లాల్సి వస్తుంది. ప్రజల హక్కుల పరిరక్షణలో చట్టాలు, కార్యనిర్వాహక యంత్రాంగం విఫలమైనప్పుడు న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవచ్చు. కానీ న్యాయసమీక్ష అధికారాన్ని అరుదైన కేసుల్లో మాత్రమే వినియోగించాలి. ఏదైనా చట్టం రాజ్యాంగ మూలసూత్రాలతో విభేదించినప్పుడుగానీ, రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు నేరుగా విఘాతం కలిగినప్పుడుగానీ, ఏదైనా శాసనం పూర్తి ఏకపక్షంగా, వివక్షాపూరితంగా ఉన్నప్పుడుగానీ న్యాయసమీక్ష అధికారాన్ని వినియోగించుకోవాలి" అని చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు.



రాష్ట్రపతికి గడువు నిర్దేశించిన అంశంపై కలకలంతో..

రాష్ట్రపతి, గవర్నర్లు తమకు అందిన బిల్లులపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలంటూ ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు గడువు నిర్దేశించడం కలకలం రేపిన విషయం తెలిసిందే. ఇలా గడువు నిర్దేశించే అధికారం కోర్టుకు ఉంటుందా? ఈ అంశంలో రాజ్యాంగం ఏం చెబుతోంది? రాష్ట్రపతి, గవర్నర్లు తమ విధి నిర్వహణకు సంబంధించి ఏ కోర్టుకూ జవాబుదారీ కాదని ఆర్టికల్ 361 స్పష్టం చేసిన అంశాలపై అభిప్రాయం తెలపాలంటూ సుప్రీంకోర్టుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము లేఖ కూడా రాశారు. ఈ నేపథ్యంలో తాజాగా చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

ట్రంప్‌పై పెట్టిన పోస్టులపై మస్క్ విచారం

- అవి చాలా దూరం వెళ్లాయని వ్యాఖ్య

వాషింగ్టన్, జూన్ 11: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఉద్దేశించి గత వారం తాను చేసిన కొన్ని సోషల్ మీడియా పోస్టులపై టెస్లా, స్పేస్ ఎక్స్ సంస్థల సీఈవో ఎలాన్ మస్క్ విచారం వ్యక్తం చేశారు. అవి చాలా దూరం వెళ్లాయంటూ బుధవారం 'ఎక్స్'లో ఒక పోస్టు పెట్టారు. ట్రంప్ ప్రభుత్వం నుంచి మస్క్ వైదొలిగాక టీవీ ఇంటర్వ్యూల్లోనూ, సోషల్ మీడియా పోస్టుల్లోనూ ఇరువురూ పరస్పరం విమర్శించుకున్న విషయం తెలిసిందే. కాగా, వీరిద్దరూ వైరాన్ని పక్కన పెట్టనున్నట్టు మంగళవారమే సంకేతాలు వెలువడ్డాయి. మస్క్‌తో మాట్లాడాలనే ఆలోచన ఉందా? అని విలేకరులు ట్రంప్‌ను ప్రశ్నించగా.. తనకు ఆ ఆలోచన ఏమీ లేదని, అయితే తానే గనుక మస్క్ స్థానంలో ఉంటే మాట్లాడాలనే ఆలోచన చేసేవాడినని చెప్పారు.

చైనాతో డీల్ కుదిరింది: ట్రంప్

న్యూఢిల్లీ, జూన్ 11: చైనాతో వాణిజ్య ఒప్పందంలో భాగంగా ఓ డీల్ కుదిరిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బుధవారం ప్రకటించారు. ఇందులో భాగంగా చైనా తమకు అరుదైన ఖనిజాలను సరఫరా చేస్తుందన్నారు. ఒప్పందంలో భాగంగా చైనా అమెరికాకు పూర్తి మ్యాగ్నెట్‌లను, అవసరమైన అన్ని అరుదైన ఖనిజాలను సరఫరా చేస్తుందని ట్రంప్ తెలిపారు. ఇందుకు బదులుగా చైనా విద్యార్థులు అమెరికా కళాశాలలు, వర్సిటీల్లో చదువుకొనేందుకు అనుమతిస్తామన్నారు. చైనా నుంచి అమెరికాకు దిగుమతయ్యే వస్తువుల మీద 55 శాతం, అమెరికా నుంచి చైనాకు ఎగుమతయ్యే ఉత్పత్తుల మీద 10% టారిఫ్‌లు అమలవుతాయని తెలిపారు. ఈ ఒప్పందాన్ని తాను, చైనా అధ్యక్షుడు ఆమోదించడమే తరువాయి అని ట్రంప్ తెలిపారు.

చిన్నారులతో రైలుకి అడ్డం వెళ్లి..

- భార్యపై కోపంతో నలుగురు పిల్లలతో సహా కూలీ ఆత్మహత్య
- అడిగినవి కొనిచ్చి మరీ దారుణం.. హరియాణాలో ఘటన

గుర్‌గావ్, జూన్ 11 : హరియాణాలోని ఫరీదాబాద్‌లో ఘోరం జరిగింది. భార్యపై కోపంతో ఓ వ్యక్తి తన నలుగురు పిల్లలతో సహా రైలు పట్టాలపైకి వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. బిహార్‌కు చెందిన మనోజ్ మహతో(36) అనే కూలీ మూడు నుంచి పదేళ్ల వయస్సున్న తన నలుగురు పిల్లలు చోటు(3), మురళి(5), కరు(9), పవన్(10)లను మంగళవారం మధ్యాహ్నం రైలు పట్టాలపైకి తీసుకువెళ్లాడు. గోల్డెన్ టెంపుల్ ఎక్స్‌ప్రెస్ రైలు దూసుకు వస్తుండగా పిల్లలు ప్రాధేయపడుతున్నా వదలకుండా గట్టిగా పట్టుకున్నాడు. దీంతో ఐదుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పిల్లలతో అతడు రైలు పట్టాలు దాటేందుకు వెళుతున్నాడని భావించామని స్థానికులు చెప్పారు. కాగా పిల్లల్ని పార్కుకు తీసుకువెళ్తున్నానని తనకు చెప్పాడని అతడి భార్య ప్రియ పోలీసులకు తెలిపింది. అయితే మనోజ్ పిల్లల్ని పార్కుకు తీసుకువెళ్లకుండా రైలు పట్టాల దగ్గరకు తీసుకువెళ్లాడు. అక్కడి ఫ్లైఓవర్ కింద రైలు వచ్చేంత వరకు పిల్లలు అడిగిన చిప్స్, కూల్ డ్రింకులు కొనిచ్చి గంట సేపు ఉంచాడు. అనంతరం ఎక్స్‌ప్రెస్ రైలు దూసుకువస్తుండగా ఘోరానికి పాల్పడ్డాడు. దుర్ఘటన తర్వాత లోకో పైలెట్ రైల్వేస్టేషన్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మనోజ్ జేబులో అతడి భార్య ఫోన్ నెంబరు రాసి ఉండడాన్ని గుర్తించారు. దీంతో అతడు ముందస్తు ప్రణాళిక ప్రకారమే ఈ చర్యకు పాల్పడ్డాడని భావిస్తున్నారు. భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయని గుర్తించారు. ఘటనకు దారితీసిన పరిస్థితులపై విచారిస్తున్నట్లు వెల్లడించారు.

కర్ణాటక వాల్మీకి స్కాం కేసులో

ఈడీ దాడులు

బళ్లారి ఎంపీ తుకారాం ఇంట్లో సోదాలు

ఐదుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఇళ్లలోనూ

బళ్లారి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో మహర్షి వాల్మీకి ఎస్టీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు చెందిన రూ.187కోట్ల నిధులను లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి మళ్లించారన్న ఆరోపణలపై బళ్లారి ఎంపీ ఈ.తుకారాం, అదే జిల్లాలో ఐదుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఇళ్లలో ఈడీ తనిఖీలు చేపట్టింది. సుమారు పది బృందాలు బుధవారం ఉదయం 6 గంటలకే రంగంలోకి దిగాయి. తుకారాం, బళ్లారి సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, సండూరు ఎమ్మెల్యే అన్నపూర్ణ, కంప్లి ఎమ్మెల్యే గణేశ్, బళ్లారి రూరల్ ఎమ్మెల్యే బి.నాగేంద్ర, కూడ్లిగి ఎమ్మెల్యే ఎన్‌టీ శ్రీనివాసులు నివాసాలు, బెంగళూరులోని విధానపరిషత్‌లో మాజీ మంత్రి బి.నాగేంద్రకు కేటాయించిన కార్యాలయం, బళ్లారిలో ఆయన ఆప్తుడు గోవర్ధన్‌రెడ్డి ఇల్లు, నాగేంద్ర పీఏ విజయ్‌కుమార్ ఇంట్లో ఈడీ బృందాలు ఏకకాలంలో సోదాలు చేశాయి. ఈడీ అధికారులు స్థానిక పోలీసులను కాకుండా భద్రత కోసం బీఎస్ఎఫ్ బలగాలను తెచ్చుకున్నారు. స్థానిక పోలీసులు వెళ్లినా వెనక్కి పంపించారు. తమను ఎస్పీ పంపించారని ఓ సీఐ చెప్పగా.. 'మీ సహాయం అవసరం లేదు' అని తిప్పి పంపించారు.

అబద్ధాలకోరు ప్రధాని!

- పేదలు, యువతను ట్రాప్ చేస్తారు..

వారి ఓట్లు కాజేస్తారు: మల్లికార్జున ఖర్గే



బెంగళూరు-ఆంధ్రజ్యోతి/న్యూఢిల్లీ, జూన్ 11: ప్రధాని మోదీవంటి అబద్ధాలకోరును తానింతవరకు చూడలేదని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. 11 ఏళ్ల పాలనలో 33 తప్పులు చేశారని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం వచ్చి 11 ఏళ్లు.. మూడో టర్మ్‌లో మొదటి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం కలబురగిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఇన్ని అబద్ధాలాడే ప్రధానిని నేనింతవరకు చూడలేదు. ఎన్నో తప్పులు చేస్తారు. ప్రజలను ఉచ్చులో బిగిస్తారు.. యువతను మోసగిస్తారు.. పేదలను ట్రాప్ చేస్తారు.. ఓట్లు పొందుతారు. నేను 55 ఏళ్లు అధికార పదవుల్లో ఉన్నాను. 65 ఏళ్లుగా రాజకీయాల్లో కొనసాగుతున్నాను. మోదీ లాంటి వ్యక్తి ఎక్కడా లేరు. ప్రతి విషయంలోనూ అసత్యాలాడతారు. చెప్పేది ఒక్కటీ అమలు చేయరు. 11 ఏళ్లుగా ఇదే తంతు' అని ధ్వజమెత్తారు. రాజ్యాంగం ప్రకారం లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్‌ను నియమించాలని మోదీకి తాను లేఖ రాశానన్నారు. ఆయన ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్యం అని అంటుంటారని.. కానీ స్వాతంత్ర్యం వచ్చాక ఏ ప్రధానమంత్రీ ఇన్నేళ్లు ఈ పదవిని ఖాళీగా ఉంచలేదన్నారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్షానికి చెందిన నాయకుడికి ఈ పదవి కట్టబెట్టామని.. అంతకుముందు కూడా నియామకం జరిగిందని తెలిపారు. మోదీ చర్య చట్టవిరుద్ధం, అప్రజాస్వామికమని.. విపక్షానికి డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వాలనుకోవడం లేదని.. ఆయనకు ప్రజాస్వామ్యం అంటే నమ్మకం లేదని విమర్శించారు. ఆర్‌సీబీ జట్టును సన్మానించే క్రమంలో బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాట అకస్మిక సంఘటనగా పేర్కొన్నారు. దీనికి తమ వాళ్లు క్షమాపణలు చెప్పారని.. అయినా వివాదం ఎందుకని ప్రశ్నించారు. కుంభమేళాలో తొక్కిసలాటకు బాధ్యత వహించి, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ రాజీనామా చేశారా అని ఖర్గే ప్రశ్నించారు.

పహల్గాంపై సభలో చర్చించాలి

పాకిస్థాన్ ప్రేరిత సీమాంతర ఉగ్రవాదం, ఆపరేషన్ సిందూర్‌పై పార్లమెంటరీ బృందాలను విదేశాలకు పంపించిన ప్రధాని మోదీ.. పహల్గాం దాడి అనంతరం దేశంలో భద్రత, విదేశాంగ విధానం సవాళ్లపై పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో సమగ్ర స్థాయి చర్చకు అంగీకరిస్తారా అని కాంగ్రెస్ ప్రశ్నించింది. 'చైనా, పాకిస్థాన్‌లపై భావి వ్యూహం.. ఆపరేషన్ సిందూర్‌లో కొన్ని యుద్ధవిమానాలను కోల్పోయామని సీడీఎస్ అనిల్ చౌహాన్ వెల్లడించిన దరిమిలా ఏర్పడిన పరిణామాలపై చర్చించేందుకు ప్రధాని తన నేతృత్వంలో అఖిలపక్ష సమావేశం, భేటీలు ఏర్పాటుచేస్తారా? అన్ని పార్టీలను విశ్వాసంలోకి తీసుకుంటారా' అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్'లో ప్రశ్నించారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని మోదీ సర్కారు నాశనం చేస్తోందని ఆయన ఆరోపించారు.

బడుగుల హాస్టళ్లు దుర్భరం: రాహుల్

ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ విద్యార్థుల సంక్షేమ హాస్టళ్లలో దుర్భర పరిస్థితులు ఉన్నాయంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రధాని మోదీకి లేఖ రాశారు. అట్టడుగు వర్గాల విద్యార్థులకు పోస్ట్-మెట్రిక్ ఉపకార వేతనాల విడుదలలో ఎందుకు జాప్యం జరుగుతోందని ప్రశ్నించారు. ప్రతి హాస్టల్లో ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, ఓబీసీ విద్యార్థులు ఎంతమంది ఉన్నారో ఆడిట్ నిర్వహించాలన్నారు.

ఆన్‌లైన్‌లో బుక్ చేస్తే

రాకెట్‌లో వచ్చేస్తుంది!

- 'డెలివరీ రాకెట్' ప్రయోగం చేసిన చైనా సంస్థ సెపోచ్
- అలీబాబా ఈ-కామర్స్‌కు చెందిన 20 కిలోల ప్యాకేజీలతో ప్రయోగం



సెపోచ్ సంస్థ పరీక్షించిన డెలివరీ రాకెట్ ఇదే

బీజింగ్, జూన్ 11: ఏదైనా వస్తువు ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తే.. చాలా వేగంగా రాకెట్‌లా డెలివరీ చేస్తామని కంపెనీలు చెబుతూ ఉంటాయి. అయితే రాకెట్‌లా కాదు.. అచ్చంగా రాకెట్‌తోనే డెలివరీ చేస్తే!? భూమ్మీద ఏ మూలనో, వేల కిలోమీటర్ల దూరంలోనో ఉన్నా.. గంటా, రెండు గంటల్లోనే ప్యాకేజీలు చేతికి అందితే!? చైనాకు చెందిన ప్రైవేటు రాకెట్ సంస్థ సెపోచ్ గత నెల 29న చైనా తూర్పు తీర ప్రాంతంలో ఈ తరహా ప్రయోగం నిర్వహించింది. సరుకు రవాణా కోసం ప్రత్యేకంగా స్టెయిన్‌లెస్ స్టీలు రాకెట్ ప్రాథమిక రూపాన్ని అభివృద్ధి చేసింది. మళ్లీ మళ్లీ వినియోగించగల (పునర్వినియోగ) ఈ రాకెట్ ఎత్తు 26.8 మీటర్లు, బరువు 57 టన్నులు. దీనిలోని కంటెయినర్‌లో సుమారు 10 టన్నుల మేర సరుకులను మోసుకెళ్లగలదు. ప్రస్తుతం రాకెట్ కంటెయినర్‌లో ప్రముఖ ఈ కామర్స్ సంస్థ అలీబాబా అనుబంధ సంస్థ టావోబావోకు చెందిన 20 కిలోల బరువున్న ప్యాకేజీలను పెట్టి ప్రయోగాత్మకంగా పరిశీలించారు. రాకెట్ 125 సెకన్ల పాటు మంటలు విరజిమ్ముతూ 2.5 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకుందని.. తర్వాత షాంగ్‌డోంగ్ ప్రావిన్స్ తీరానికి సమీపంలో సముద్రంలో నిలువునా ల్యాండ్ అయిందని సెపోచ్ సంస్థ తెలిపింది. ఆ రాకెట్‌ను రికవరీ చేశామని, అది ఏమాత్రం దెబ్బతినలేదని.. తమ ప్రయోగం విజయవంతమైందని ప్రకటించింది. ఈ ఏడాది చివరి నాటికి పూర్తి స్థాయి ప్రయోగం చేస్తామని తెలిపారు. కాగా, అమెరికా రక్షణశాఖ, వైమానిక దళం, రాకెట్ ల్యాబ్స్ ప్రైవేటు సంస్థ కలసి.. డెలివరీ రాకెట్‌ను అభివృద్ధి చేయడంపై పనిచేస్తున్నాయి. అయితే అమెరికా ఆయుధాలను రవాణా చేసేందుకు దానిని రూపొందిస్తున్నారు.

నేరాన్ని అంగీకరించిన సోనమ్!

- పెళ్లి ఇష్టం లేకనే భర్త రాజా రఘువంశీ హత్య
- దర్యాప్తులో పాల్గొన్న ఓ పోలీసు అధికారి వెల్లడి



రాజా తల్లిని ఓదారుస్తున్న గోవింద్

న్యూఢిల్లీ, జూన్ 11: హనీమూన్ హత్యకేసులో నిందితురాలు సోనమ్ పోలీసుల విచారణలో నేరాన్ని అంగీకరించినట్లు సమాచారం. భర్త రాజా రఘువంశీ హత్యలో తన ప్రమేయం ఉందని సోనమ్ ఒప్పుకొన్నట్లు ఓ పోలీసు అధికారి వెల్లడించారు. షిల్లాంగ్‌లో ట్రెక్కింగ్‌కు వెళ్లినప్పుడు సోనమ్ పథకం ప్రకారమే వెనుకబడిపోయిందని, రాజా రఘువంశీ కోసం కొండపైన అప్పటికే కాపు కాసి ఉన్న మిగతా ముగ్గురు నిందితులు అతన్ని కత్తితో పొడిచి చంపేశారని వివరించారు. హత్యకు ముందు సోనమ్ 'అతన్ని చంపేయండి' అంటూ నిందితులను ప్రోత్సహించిందని పేర్కొన్నారు. రఘువంశీతో పెళ్లి సోనమ్‌కు ఇష్టం లేదని, ఆమెకు అప్పటికే రాజ్ కుశ్వాహాతో ప్రేమలో ఉందని వివరించారు. ఈ కేసులో సోనమ్‌తో పాటు మిగతా నిందితులను బుధవారం పోలీసులు షిల్లాంగ్ తీసుకువెళ్లారు. కాగా, షిల్లాంగ్ కోర్టు సోనమ్, మిగతా నిందితులకు 8రోజుల పోలీసు కస్టడీ విధించింది. మరోవైపు, సోనమే హత్యకు కుట్ర పన్నిందని ఆమె సోదరుడు గోవింద్ తేల్చి చెప్పాడు. గోవింద్ బుధవారం రాజా రఘువంశీ కుటుంబసభ్యులను కలిసి ఓదార్చాడు. న్యాయపోరాటంలో వారికి అండగా ఉంటానన్నాడు. సోనమ్‌కు రాజా రఘువంశీతో పెళ్లి ఇష్టం లేదని, రాజ్ కుశ్వాహాను పెళ్లి చేసుకుంటానని ఆమె ముందే తన తల్లితో చెప్పిందని, అందుకు తల్లి ఒప్పుకోలేదని రాజా రఘువంశీ సోదరుడు విపిన్ ఆరోపించాడు. అప్పుడే సోనమ్.. "ఇష్టం లేని పెళ్లి చేస్తే ఏం జరుగుతుందో చూడు" అంటూ తల్లిని హెచ్చరించిందన్నాడు. ఈ విషయాన్ని సోనమ్ సోదరుడు గోవిందే తనకు చెప్పాడని పేర్కొన్నాడు.

15 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాపై నిషేధం

ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్

పారిస్, జూన్ 11: ఫ్రాన్స్‌లో 15 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాను నిషేధించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ తరహా చర్యలు తీసుకోవాలని యూరోపియన్ యూనియన్‌కు ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ సూచించారు. లేకుంటే కొన్ని నెలల్లో తామే ఈ నిషేధాన్ని అమలు చేస్తామని స్పష్టం చేశారు. తూర్పు ఫ్రాన్స్‌లోని నోజెంట్‌లో ఉన్న ఓ పాఠశాలలో 14 ఏళ్ల విద్యార్థి తన బ్యాగ్ చెక్ చేస్తున్న స్కూల్ సిబ్బందిని కత్తితో పొడిచి చంపిన ఘటన తరువాత మెక్రాన్ ఈ ప్రకటన చేయడం గమనార్హం. పిల్లలు పర్యవేక్షణ లేకుండా డిజిటల్ వేదికలను వాడుతుండడం వల్ల వారిలో హింస పెరుగుతోందని మెక్రాన్ నొక్కి చెప్పారు.

ప్రముఖ గాయని మంగ్లీపై కేసు!



చేవెళ్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ గాయని మంగ్లీపై పోలీసులు కేసు నమోదు చేశారు. అనుమతి లేకుండా చేవెళ్లలోని ఓ రిసార్ట్‌లో మంగ్లీ బర్త్‌డే వేడుకలపై ఎస్‌వోటీ పోలీసులు మంగళవారం అర్ధరాత్రి దాడులు నిర్వహించారు. ఎలాంటి అనుమతులూ లేకుండా పుట్టిన రోజు పార్టీ నిర్వహించడం, మద్యం సరఫరా చేయడం, గంజాయి సేవించిన వ్యక్తి పట్టుబడడంతో మంగ్లీ సహా నలుగురిపై కేసు పెట్టారు. సీఐ భూపాల్ శ్రీధర్ కేసు వివరాలను వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఈర్లపల్లిలోని త్రిపుర రిసార్ట్‌లో సింగర్ మంగ్లీ అలియాస్ సత్యవతి మంగళవారం రాత్రి తన బర్త్‌డే వేడుకలు జరుపుకొన్నారు. ఈ పార్టీకి కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు, సినిమా పరిశ్రమకు చెందిన 22 మంది హాజరయ్యారు. అయితే అర్ధరాత్రి వేళ పెద్ద పెద్ద శబ్దాలతో పార్టీ చేసుకుంటున్నారనే సమాచారంతో ఎస్‌వోటీ పోలీసులు సుమారు 12:45 గంటలకు చేవెళ్ల పోలీసులతో కలిసి త్రిపుర రిసార్ట్‌పై దాడులు నిర్వహించారు. ఈ వేడుకలకు ఎలాంటి అనుమతి తీసుకోలేదని, మద్యానికి కూడా ఎక్సైజ్ శాఖ నుంచి అనుమతులు లేవని గుర్తించారు. దీంతో అక్కడ ఉన్న 22 మందిలో 9 మంది అనుమానితులకు పోలీసులు డ్రగ్స్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో దామోదర్‌రెడ్డికి పాజిటివ్‌గా వచ్చింది. తాను మూడు రోజుల కిందట గంజాయి తీసుకున్నానని, ఈ పార్టీలో కాదని అతను పోలీసులకు తెలిపాడు. తనకు గంజాయి సరఫరా చేసిన వారి సమాచారం కూడా ఇచ్చాడు. దీనిపై పోలీసులు లోతుగా విచారిస్తున్నారు. పార్టీ వ్యవహారానికి సంబంధించి నలుగురిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. గాయని మంగ్లీతోపాటు ఆమె మేనేజర్ దున్న మేఘరాజ్, అతని స్నేహితుడు దామోదర్‌రెడ్డి(గంజాయి సేవించిన వ్యక్తి), త్రిపుర రిసార్ట్ అసిస్టెంట్ మేనేజర్ శివ రామకృష్ణలపై కేసు నమోదు చేసి 41ఏ నోటీసులు జారీ చేశారు. ఆరు ఖాళీ మద్యం సీసాలతోపాటు నాలుగు ఫుల్ బాటిళ్లు లభ్యమయ్యాయి. దీంతోపాటు డీజే సౌండ్ బాక్స్‌లను సీజ్ చేశారు. ఈ పార్టీలో విదేశీ మద్యం బాటిళ్లు దొరికాయన్న ప్రచారం జరగ్గా.. అలాంటిదేమీ లేదని పోలీసులు తెలిపారు. నిందితులపై ఎన్‌డీపీఎస్, శబ్దకాలుష్య చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పుట్టిన రోజు నాడే కేసు..

పుట్టిన రోజు నాడే సింగర్ మంగ్లీపై కేసు నమోదవడం గమనార్హం. రిసార్ట్‌లో విపరీతమైన శబ్ద కాలుష్యంతో పార్టీ నిర్వహించారు. పార్టీకి వచ్చిన స్నేహితులకు మంగ్లీ మద్యం సరఫరా చేయించారు. డ్రగ్స్ పరీక్షల సమయంలో మంగ్లీ స్నేహితురాలు దివి పోలీసులతో దురుసుగా ప్రవర్తించినట్లు తెలిసింది. పోలీసులు వీడియో తీస్తుండగా అడ్డుపడడంతో.. 'మా పని చేయకుండా అడ్డుపడితే మీకే నష్టం' అని పోలీసులు హెచ్చరించారు. ఈ పార్టీలో మంగ్లీ కుటుంబ సభ్యులు, దగ్గరి స్నేహితులతోపాటు సింగర్ ఇంద్రావతి, దివి, సినీ గేయ రచయిత కాసర్ల శ్యామ్, రచ్చ రవి కూడా ఉన్నట్లు సమాచారం. అయితే పోలీసుల దాడి సమయంలో తాను అక్కడ లేనని కాసర్ల శ్యామ్ ప్రకటించారు.

జర్నలిస్టు కృష్ణంరాజు అరెస్టు!

- అమరావతిపై అసభ్య వ్యాఖ్యల కేసులో పోలీసుల అదుపులోకి

విశాఖపట్నం/గుంటూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): 'సాక్షి' చానల్ డిబేట్‌లో అమరావతి ప్రాంత మహిళలను తీవ్రంగా కించపరుస్తూ దారుణ వ్యాఖ్యలు చేసిన కేసులో ఏ1, సీనియర్ జర్నలిస్టు కృష్ణంరాజు ఎట్టకేలకు పోలీసులకు చిక్కారు. బుధవారం మధ్యాహ్నం మూడున్నర గంటల సమయంలో కృష్ణంరాజు ఫార్చునర్ వాహనంలో శ్రీకాకుళం నుంచి విశాఖ నగరం వైపు వస్తున్నట్టు గుంటూరు జిల్లా తుళ్లూరు పోలీసులకు సమాచారం అందింది. దీంతో విజయనగరం పోలీసులతో పాటు విశాఖ సిటీ పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చిని అప్రమత్తం చేశారు. కృష్ణంరాజు ప్రయాణిస్తున్న కారు విశాఖపట్నం జిల్లా భీమిలి మండల పరిధిలోని అమనాం జంక్షన్‌కు చేరుకోగానే భీమిలి పోలీసులు ఆ వాహనాన్ని ఆపి, అందులో ఉన్న కృష్ణంరాజుతోపాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని తుళ్లూరు పోలీసులకు అప్పగించారు. దీంతో కృష్ణంరాజును రోడ్డుమార్గంలో తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాక్షి టీవీ చానల్‌లో ఈ నెల 6న నిర్వహించిన డిబేట్‌లో జర్నలిస్టు కృష్ణంరాజు రాజధాని అమరావతిని వేశ్యల రాజధానిగా అభివర్ణించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో దళిత మహిళ కంభంపాటి శిరీష ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఈ విషయం తెలుసుకున్న కృష్ణంరాజు అజ్ఞాతంలోకి వెళ్లారు. బుధవారం రాత్రి ఆయనను నల్లపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గురువారం కృష్ణంరాజును మంగళగిరి కోర్టులో హాజరుపరచనున్నారు.

ప్రభుత్వ బడుల్లో ఏఐ బోధన

1 నుంచి 9 తరగతులకు కృత్రిమ మేధ పాఠాలు.. 5,651 ప్రాథమిక పాఠశాలల్లో బోధన

- తెలుగు, ఇంగ్లిషు, గణితంలో.. వెనకబడిన విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ
- ప్రత్యేక అవసరాల విద్యార్థులకు 602 భవిత కేంద్రాల్లో బోధన
- 9,10 తరగతులకు నీట్, ఎప్‌సెట్ శిక్షణ
- నేటి నుంచే బడుల పునః ప్రారంభం

హైదరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాఠశాలలకు వేసవి సెలవులు ముగిశాయి. గురువారం నుంచే బడులు మళ్లీ తెరుచుకుంటున్నాయి. 2025-26 విద్యా సంవత్సరం ప్రారంభమవుతోంది. ఈ క్రమంలో గతంలో ఎన్న డూ లేనివిధంగా కీలక సంస్కరణలకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. విద్యాశాఖ బాధ్యతలు కూడా పర్యవేక్షిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా అనేక కార్యక్రమాలు అమల్లోకి రానున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ)పాఠ్యాంశాలు, బాలికల విద్యకు ప్రోత్సా హం, ప్రత్యేక అవసరాల విద్యార్థులకు ప్రత్యేక కేం ద్రాలు, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ సహా ఎన్నో మార్పులు జరగనున్నాయి.

కృత్రిమ మేధ ఆధారిత బోధన..

ఏఐ సాంకేతికతకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా 1-9 తరగతులకు ప్రాథమిక పాఠాలను బోధించేందుకు ప్రత్యేక పాఠ్యాంశాలు సిద్ధం చేశారు. మెషీన్ లెర్నింగ్, డేటా, బాధ్యతాయుత ఏఐ వినియోగంపై పాఠాలుంటాయి. ఇక ప్రభు త్వ పాఠశాలల్లో అనేక మంది మాతృభాష తెలుగుతోపాటు ఇంగ్లిషు, గణితంలో వెనకబడినట్టు పలు అధ్యయనాలు తేల్చాయి. ఈ నేపథ్యంలో ఇకపై ఏఐ టెక్నాలజీ ఆధారంగా ఈ మూడు సబ్జెక్టులను బోధించనున్నారు. ఇప్పటికే ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. బెంగళూరు కేంద్రం గా ఉన్న ఏక్‌స్టెప్ ఫౌండేషన్ దీనికి సహకారం అందించనుంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 5,651 ప్రాథమిక పాఠశాలల్లో ఏఐ ఆధారిత బోధనకు ఏర్పాట్లు చేశారు.



ఉపాధ్యాయుల శిక్షణలో విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా

కేజీబీవీల్లో 12వ తరగతి వరకు బోధన

బాలికల విద్యలో జాతీయ సగటు కంటే రాష్ట్రం వెనుకబడి ఉంది. ఈ క్రమంలో బాలికల విద్యను ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలోని 120 కస్తూర్బా (కేజీబీవీ) పాఠశాలల్లో ఇప్పటివరకు 6-10 తరగతి వరకు బోధిస్తుండగా.. ఇప్పుడు 12వ తరగతి వరకు ఉన్నతీకరించారు. దీనితో 11, 12వ తరగతుల్లో కొత్తగా 7,680 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. ఇక, రాష్ట్రంలోని 602 భవిత కేంద్రాలను ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల బడులుగా వినియోగించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. కొత్త పాఠశాలల ఏర్పాటు వరకు వీటిని కొనసాగించనున్నారు.

తెలంగాణ-స్టెమ్ ల్యాబ్స్

సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ (స్టెమ్) సబ్జెక్టులపై విద్యార్థులకు మరింత అవగాహన కల్పించేందుకు.. రాష్ట్రంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో టీ-స్టెమ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. వాటిని 6 నుంచి 10 తరగతి ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు సైతం ఉపయోగించుకోవచ్చు. దీనికోసం ఖాన్ అకాడమీ సహకారం అందించనుంది. అలాగే చదువులో వెనుకబడిన విద్యార్థులపై మరింత శ్రద్ధ పెట్టేందుకు పీజీ కాంట్రాక్టు టీచర్లను నియమించనున్నారు. అలాగే ఇప్పటికే జూనియర్ లెక్చరర్లుగా విధులు నిర్వర్తిస్తున్న వారి సేవలనూ పాఠశాలల్లో వినియోగించనున్నారు.

తొలిరోజే పుస్తకాలు, యూనిఫామ్..

ఈసారి విద్యా సంవత్సరం ప్రారంభమైన తొలి రోజే ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌లు అందించేందుకు ఏర్పాట్లు చేసినట్టు విద్యాశాఖ తెలిపింది. తొలిసారి ఈసారి 1-5 తరగతుల విద్యార్థులకు నోటు పుస్తకాలనూ ఉచితంగా అందిస్తున్నారు. బోధనలో నాణ్యతను పెంచే లక్ష్యంతో ఇటీవలే రాష్ట్రవ్యాప్తంగా 1.12 లక్షల మంది ఉపాధ్యాయులకు 5రోజుల పాటు ప్రత్యేక శిక్షణ అందించారు. ఇక కేజీబీవీలు, గురుకులాలు, మోడల్ స్కూళ్లలో అందించే భోజనం నాణ్యత, పరిశుభ్రత లక్ష్యంగా 51,500 వంటమనుషులకు.. ప్రభుత్వ బడుల్లో పరిశుభ్రత కోసం 48,292 శానిటేషన్ వర్కర్లకు ప్రత్యేక శిక్షణ అందించారు.

గాలి జనార్దన్‌రెడ్డి జైలుశిక్ష రద్దు

- ఓబుళాపురం కేసులో ఊరట
- మరో ముగ్గురు నిందితులకూ జైలు శిక్ష రద్దు, బెయిల్ మంజూరు
- సీబీఐ కోర్టు తీర్పును కొట్టేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

హైదరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) కేసులో దోషిగా తేలిన కర్ణాటక మాజీ మంత్రి, బీజేపీ ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డికి సీబీఐ కోర్టు విధించిన జైలుశిక్షను రాష్ట్ర హైకోర్టు సస్పెండ్ చేసింది. ఈ మేరకు మధ్యంతర ఆదేశాలు ఇచ్చింది. గాలితోపాటు మిగతా ముగ్గురు నిందితులకు బెయిల్ మంజూరు చేసింది. హైకోర్టు ఇచ్చిన ఈ మధ్యంతర తీర్పుతో కర్ణాటక శాసనసభ సభ్యుడిగా గాలి జనార్దన్‌రెడ్డి సభ్యత్వం పునరుద్ధరణ జరగనుంది. ఓఎంసీ కేసులో బెయిల్ ఇవ్వడంతోపాటు జైలుశిక్షను రద్దు చేయాలంటూ గాలి జనార్దన్‌రెడ్డి, బీవీ శ్రీనివాసరెడ్డి, వీడీ రాజగోపాల్, మెఫూజ్ అలీఖాన్, ఓఎంసీ కంపెనీ వేర్వేరు క్రిమినల్ అప్పీళ్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టి బుధవారం తీర్పు వెలువరించింది. నిందితులందరికీ బెయిల్ మంజూరు చేసింది. గాలి జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, అలీఖాన్ రూ.పది లక్షల చొప్పున వ్యక్తిగత బాండ్, సీబీఐ కోర్టు నిర్దేశించిన మొత్తానికి ఇద్దరి పూచీకత్తులు సమర్పించాలని పేర్కొంది. రాజగోపాల్ రూ.ఒక లక్ష వ్యక్తిగత బాండ్, రెండు పూచీకత్తులు సమర్పించాలని తెలిపింది. నిందితులెవరూ హైకోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదని, ఎలాంటి క్రిమినల్ చర్యల్లో భాగస్వాములు కారాదని షరతులు విధించింది. ఇక ఈ కేసులో ప్రధాన పిటిషన్లు ఆగస్టులో విచారణకు రానున్నాయి. హైకోర్టు తీర్పు కాపీ అందిన తర్వాత కర్ణాటక అసెంబ్లీ కార్యదర్శి గాలి జనార్దన్‌రెడ్డి శాసనసభ సభ్యత్వాన్ని పునరుద్ధరిస్తూ నోటిఫికేషన్ వెలువరించనున్నారు. ఓబుళాపురం కేసులో సీబీఐ కోర్టు 14 ఏళ్ల విచారణ తర్వాత గత నెల 6వ తేదీన తీర్పునిచ్చింది. గాలి జనార్దన్‌రెడ్డితోపాటు మరో ముగ్గురిని దోషులుగా నిర్ధారిస్తూ వారికి ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. ఈ మేరకు వారిని హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలుకు తరలించారు. సీబీఐ కోర్టు తీర్పు నేపథ్యంలో, గాలిని ఆరేళ్లపాటు కర్ణాటక అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేశారు.



కౌంటర్ ఎందుకు వేయలేదు?

ఇదే కేసులో నిందితురాలిగా ఉన్న ఏపీకి చెందిన ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మి దాఖలు చేసిన క్రిమినల్ రివిజన్ (డిశ్చార్జి) పిటిషన్‌లో కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐకి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిప్పి పంపి నెలరోజులు అవుతున్నా.. ఎందుకు ఆలస్యమైందని సీబీఐని ప్రశ్నించింది. ఈ పిటిషన్‌ను మూడునెలల్లో పరిష్కరించాలని పేర్కొంటూ సుప్రీంకోర్టు స్పష్టమైన గడువు నిర్దేశించినా కౌంటర్ దాఖలు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. సీబీఐ తెలంగాణ చీఫ్‌ను వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశిస్తామని వ్యాఖ్యానించింది. 'సీబీఐ వాదన వినలేదు' అనే కారణంతోనే శ్రీలక్ష్మికి అనుకూలంగా హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కొట్టేసిందని ధర్మాసనం గుర్తుచేసింది. సీబీఐ పూర్తిస్థాయిలో కౌంటర్ దాఖలు చేయాలని తెలిపింది. తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది.

కొణతం దిలీప్ అరెస్టు

- శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి నేరుగా నిర్మల్ పోలీసు స్టేషన్‌కు తరలింపు

నిర్మల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జి కొణతం దిలీప్ ను నిర్మల్ జిల్లా పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఇప్పటికే రాష్ట్ర పోలీసులు ఆయనపై లుక్ అవుట్ జారీ చేసిన సంగతి తెలిసిందే. కాగా, మంగళవారం రాత్రి అమెరికా నుంచి ఆయన శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోగానే నిర్మల్ పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకొని.. ఇక్కడి రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. 2024లో దిలీప్ రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. దీనిపై జిల్లాలోని పలు స్టేషన్‌లలో కాంగ్రెస్ కార్యకర్తలు ఫిర్యాదులు చేయగా.. పోలీసులు దిలీప్‌పై కేసులు నమోదు చేసి దర్యాప్తు మొదలుపెట్టారు. అయితే నిర్మల్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల్లో దిలీప్‌కు స్టేషన్ బెయిల్ లభించింది. ఖానాపూర్‌కు సంబంధించి మాత్రం స్టేషన్ బెయిల్ రాకపోవడంతో పోలీసులు ఆయనను ఇక్కడి కోర్టు జడ్జి ముందు హాజరుపర్చారు. ఆయనకు నిర్మల్ సెషన్ కోర్టు న్యాయాధికారి భవిష్య బెయిల్ మంజూరు చేశారు.



దిలీప్‌ను కోర్టుకు హాజరుపరుస్తున్న పోలీసులు

కారును ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు.. ముగ్గురు యువకుల మృతి

- నలుగురికి తీవ్ర గాయాలు.. రంగారెడ్డి జిల్లా యాచారంలో ఘటన

యాచారం, మూసాపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలకు వెళ్లి తిరుగు ప్రయాణమైన యువకులు ప్రయాణిస్తున్న కారును ఓ ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ముగ్గురు మరణించగా, నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం గుడిబండకు చెందిన వాస సాయితేజ, పవన్‌కుమార్, రాఘవేందర్, శివకుమార్‌గౌడ్, సాయికుమార్, మేకల సందీప్, శివకుమార్ స్నేహితులు, దాయాదులు. వీరంతా హైదరాబాద్‌లో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. అయితే, తమ స్నేహితుడు వాస శివకుమార్ పుట్టినరోజు వేడుకల కోసం వీరంతా మంగళవారం నల్లగొండ జిల్లా దేవరకొండ సమీపంలోని వైజాగ్‌కాలనీకి వెళ్లారు. వేడుకల అనంతరం తిరిగి వస్తుండగా అర్ధరాత్రి యాచారం మండలం మాల్ వద్ద వీరి కారును ఎదురుగా వస్తున్న ట్రావెల్స్ బస్సు బలంగా ఢీకొట్టింది. దీంతో కారులోని ఏడుగురిలో సాయితేజ(24), పవన్‌కుమార్ (26), రాఘవేందర్ (22) అక్కడికక్కడే మరణించారు. తీవ్రంగా గాయపడిన నలుగురిని ఆస్పత్రులకు తరలించారు. మృతుల్లో ఒకరైన పవన్ కుమార్(26)కు భార్య వరలక్ష్మి, కుమార్తె దీక్షిత(1), తల్లిదండ్రులు ఉన్నారు. కాంక్రీట్ మిషన్ ఆపరేటర్‌గా పని చేసే పవనే ఆ కుటుంబానికి ఆధారం. పవన్ భార్య వరలక్ష్మి ప్రస్తుతం నిండు గర్భిణి. ఇక, సాయితేజ డ్రైవర్‌గా, రాఘవేందర్ కోళ్ల పరిశ్రమలో పని చేస్తున్నారు.



పవన్‌కుమార్, రాఘవేందర్, సాయితేజ(ఫైల్)

క్యాబినెట్ నిర్ణయాలపై జీవోలివ్వండి

- సీఎస్‌ను కోరిన టీజీఈజేఏసీ నేతలు

హైదరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు సంబంధించి ఇటీవల రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాలపై వెంటనే ఉత్తర్వులు(జీవో) జారీ చేయాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ (టీజీఈజేఏసీ) ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావును కోరింది. ఈమేరకు టీజీఈజేఏసీ సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో జేఏసీ నాయకులు బుధవారం సచివాలయంలో సీఎస్‌ను కలిశారు. సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గ ఉప సంఘం, అధికారుల కమిటీని ఏర్పాటు చేసి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించినందుకు వారు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అయితే క్యాబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై వెంటనే జీవోలను విడుదల చేయాలని సీఎస్‌ను కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు టీజీఈజేఏసీ నాయకులు తెలిపారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి ఏనుగుల సత్యనారాయణ, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రామారావు, నేతలు లక్ష్మణ్‌గౌడ్, మోహన్, శ్రీరామ్‌రెడ్డి, షౌకత్, శ్రీరామ్, సత్తయ్య, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

రూ. 1.2 కోట్ల హాషిష్ ఆయిల్ పట్టివేత

- ఇద్దరి అరెస్టు.. పరారీలో మరో ఇద్దరు
- నిందితుల్లో ఒకరు ఆర్టీయే ఏజెంట్

హైదరాబాద్ సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి జిల్లా నుంచి హైదరాబాద్ మీదుగా బెంగళూరుకు తరలిస్తున్న 20 కిలోల హాషిష్ ఆయిల్(ద్రవరూప గంజాయి)ని రాచకొండ పోలీసులు సీజ్ చేశారు. దీని విలువ రూ.1.2 కోట్లుగా ఉంటుందని రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు వెల్లడించారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేశామని, మరో ఇద్దరు పరారీలో ఉన్నారని చెప్పారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. మంగళవారం రాత్రి ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) వద్ద లారీ దిగి.. అనుమానాస్పద స్థితిలో ఆటోరిక్షా ఎక్కేందుకు యత్నించిన ఇద్దరు వ్యక్తులను ఎల్బీనగర్ ఎస్‌వోటీ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, అబ్దుల్లాపూర్‌మెట్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డిల నేతృత్వంలోని బృందాలు అదుపులోకి తీసుకున్నాయి. తదుపరి దర్యాప్తులో.. వారిద్దరిని ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి జిల్లా హుకుంపేటకు చెందిన పంగి కేశవరావు అలియాస్ కేశ, ఒడిసాకు చెందిన జయరాం కెముండుగా గుర్తించాయి. ఆరి వద్ద 20 కిలోల బరువున్న హాషిష్ ఆయిల్‌ను సీజ్ చేశాయి. దీని విలువ రూ.1.2 కోట్లుగా ఉంటుంది. గంజాయి స్మగ్లింగ్‌లో అనుభవమున్న కేశవరావుకు అతని బాల్యమిత్రుడు, ఆర్టీయే ఏజెంట్ కృష్ణ ద్వారా జయరాం పరిచయం అయ్యాడు. వీరంతా ఏపీ నుంచి బెంగళూరుకు హాషిష్ ఆయిల్‌ను సరఫరా చేయడం మొదలు పెట్టారు. కేశవరావును గతంలో గంజాయి కేసులో అనకాపల్లి పోలీసులు అరెస్టు చేశారు. అప్పటి నుంచి పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు లారీలు, ఆటోరిక్షాలను మారుస్తూ.. బెంగళూరులో ఓ పెడ్లర్‌కు సరుకును పంపేవారు. కేశవరావు, జయరాం అరెస్టవ్వగా.. కృష్ణ, బెంగళూరుకు చెందిన పెడ్లర్ పరారీలో ఉన్నట్లు సీపీ వివరించారు.

కాంగ్రెస్‌తోనే దళితులకు న్యాయం

బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎస్సీలకు ఒకే మంత్రి పదవి

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే దళితులకు న్యాయం జరుగుతోందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో దళితులకు దక్కింది ఒకే మంత్రి పదవన్నారు. బుధవారం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఆయన క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నలుగురు దళితులకు మంత్రి పదవులు ఇవ్వడంతో పాటు, స్పీకర్ పదవి ఇచ్చి దళితులకు గతంలో ఎన్నడులేని విధంగా ప్రాధాన్యం ఇవ్వడం దళిత సమాజానికి గొప్ప విషయమన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ దళితులకు క్యాబినెట్‌లో ఇంత ప్రాధాన్యం ఏనాడు దక్కలేదన్నారు. సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యం అనేదానికి మంత్రి పదవులే నిదర్శనమన్నారు. సుప్రీంకోర్టులో ఎస్సీ వర్గీకరణ అంశమై తీర్పు వచ్చిన వెంటనే సీఎం స్పందించడమే కాకుండా వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. జనాభాకు అనుగుణంగా బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్రంలో కులగణన చేసి, విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తీర్మానం చేసి కేంద్రానికి పంపించిన రాష్ట్రం తెలంగాణ అన్నారు. తెలంగాణలో జరిగిన కులగణన ఆధారంగానే 2027 జనాభా లెక్కలను కేంద్రం చేపట్టబోతుందన్నారు. సంక్షేమ పథకాల అమలు, సామాజిక న్యాయం విషయంలో తెలంగాణ దేశానికి రోల్ మోడల్ అని అన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆరని అగ్ని

మణిపూర్‌లో శాంతినెలకొనాలని కేంద్రహోంమంత్రి అమిత్‌షా గట్టిగా కోరుకుంటున్నారని, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని ప్రతిష్ఠించేందుకు ఆయన సానుకూలంగా ఉన్నారని మణిపూర్ మాజీ ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ బుధవారం వ్యాఖ్యానించారు. ఢిల్లీనుంచి వచ్చి ఇంఫాల్‌లో వాలగానే చుట్టూచేరిన మీడియాతో ఆయన తన పర్యటన విశేషాలు పంచుకున్నారు. అమిత్‌షాతో గంటలతరబడి చర్చోపచర్చలు చేశానని, పరిస్థితిని చక్కదిద్దడం కోసం ఆయన తనకు కొన్ని బాధ్యతలు అప్పగించారని, వాటిని బహిర్గత పరచకూడదు కానీ, రాష్ట్రం గాడినపడేందుకు వార్డు సభ్యుడినుంచి ఎమ్మెల్యేవరకూ అంతా ఏకతాటిమీద నడవాలన్నారు బీరేన్. అలా అంతా కలసిమెలసి ఉండకుండా, తెగలమధ్య వైషమ్యాలు పెంచి, మణిపూర్ ఇంకా మండుతూనే ఉండటానికి ప్రధాన కారకుడు బీరేన్. అటువంటి వ్యక్తికి హోంమంత్రి ఏ రహస్య కర్తవ్యాన్ని బోధించారో మరి.

ఆదివారం రాజుకున్న అగ్ని క్రమంగా చల్లారుతోంది. కర్ఫ్యూ ఉన్నప్పుడు కూడా మీతీలు భారీగా నిరసన ప్రదర్శనలు నిర్వహించిన దశను కూడా చూశాం కనుక, ఇప్పుడు సదరు నిరసనలు, ప్రదర్శనలు తగ్గుముఖం పట్టినందుకు సంతోషించాల్సిందే. మీతీ రాడికల్ సంస్థ 'అరంబై తెంగోల్' నాయకుడు కనాన్ సింగ్‌ను సీబీఐ అరెస్టుచేయడంతో ఈ అగ్గిరాజుకుంది. తమ నాయకుడిని పట్టుకుపోయినందుకు ఆ సంస్థ సభ్యులు, తమ రక్షకుడిని జైల్లోకి నెట్టినందుకు మీతీలు కలిసి ఈ విధ్వంసకాండ సృష్టించారు. పోలీసు హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేసిన ఈ కనాన్‌సింగ్ 2020లో ఈ సంస్థను ఆరంభించడం వెనుక పొలిటికల్ పెద్దల ఆశీస్సులున్నాయని అంటారు. మీతీలకు ఎస్టీహోదా కట్టబెట్టే ఒక ప్రయత్నం కుకీల గుండెలు రగల్చడంతో, 2023 మే3నుంచి రాష్ట్రం తగలబడుతున్న దశలో, ఈ సంస్థ అనూహ్యమైన వేగంతో ఎదిగింది. పేరుకు మీతీల ఘనమైన గతాన్ని కీర్తించే ఒక సాంస్కృతిక సంస్థ కావచ్చును గానీ, ప్రత్యేక సాయుధ శిక్షణతో ఆయుధాల వినియోగంలోనూ, ప్రయోగంలోనూ దీనికి తిరుగేలేదని అంటారు. చేతిలో ఆయుధాలు, బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు, వాకీటాకీలతో ఈ సంస్థ సభ్యులు బహిరంగంగా తిరుగుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో తరచూ కనిపిస్తూ ఉంటాయి. గత ఏడాది జనవరిలో ఈ సంస్థ ఆదేశించిన మేరకు అన్ని పార్టీలకు చెందిన మీతీ ఎమ్మెల్యేలు, ఎంపీలు సమావేశానికి హాజరై డిమాండ్ల పత్రం మీద సంతకం చేసిన విషయం తెలిసిందే. ఇంతటి శక్తిమంతమైన ఈ సంస్థ నాయకుడి అరెస్టుతో మణిపూర్ లోయ మళ్ళీ భగ్గుమన్నది.

బీరేన్ అధికారంలో ఉండివుంటే, కుకీ–జో తెగలను ఊచకోతకోసే ఇటువంటి మీతీ మిలిటెంట్ సంస్థలమీద ఈగవాలనిచ్చేవారు కాదు. పైగా వాటిని ఆయుధాలతో బలోపేతం చేసిందీ, పోలీసు బలగాలను వాటివైపు పోకుండా ఇంతకాలమూ నిరోధించిందీ ఆయనే. 'వాళ్ళను ఆయుధాలు దోచుకోనివ్వండి' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలే ఆడియోటేపుల రూపంలో లీకై, అమిత్ షా పంపిన ప్రత్యేక కమిషన్లు కూడా బేఖాతరుచేసిన నేపథ్యంలో, వ్యవహారం సుప్రీంకోర్టు వరకూ పోయి, ఆ గొంతు బీరేన్‌దేనని నిజనిర్ధారణ జరగడంతో బీరేన్‌తో పాటు బీజేపీ పెద్దలు కూడా పరువుపోగొట్టుకున్న విషయం తెలిసిందే. అప్పటికే బీరేన్‌మీద పార్టీలో వ్యతిరేకత తీవ్రమై, స్పీకర్ కేంద్రంగా కొత్త రాజకీయం ఆరంభంకావడం, దానిని రాజకీయంగా వాడుకోవడానికి ఈ ఏడాది ఫిబ్రవరిలో కాంగ్రెస్ అవిశ్వాసతీర్మానానికి సిద్ధపడటం తెలిసిందే. సమావేశాలు జరగకుండా చేసి రాష్ట్రం చేజారిపోకుండా బీజేపీ చూసుకోగలిగింది కానీ, రాష్ట్రపతిపాలన విధించి కూడా పరిస్థితిలో పూర్తిమార్పు సాధించలేకపోయింది.

బీరేన్ నిష్క్రమణ తరువాత మీతీల జోరు తగ్గి, కుకీ–జోలకు కాస్తంత నమ్మకం హెచ్చి గతంతో పోల్చితే హింస స్థాయి కాస్తంత తగ్గినమాట నిజం. కానీ, బీరేన్ నాటిన విషాలు, వైషమ్యాల ప్రభావం నుంచి రాష్ట్రం ఇంకా బయటపడని నేపథ్యంలో ఆయన మళ్ళీ తెరమీద చురుకుగా కనిపించడం ఏ మాత్రం మంచిదికాదు. రెండేళ్ళుగా మోదీ మణిపూర్‌మీద నోరువిప్పలేదు. అంతా సవ్యంగా ఉందని అమిత్‌షా భరోసా ఇస్తూంటారు కానీ, స్వల్ప విరామం తరువాత ఏదో ఒక చిన్నకారణంతో మణిపూర్ మళ్ళీ రాజుకుంటోంది. ప్రధాని స్వయంగా ఆ రాష్ట్రంలో పర్యటించి ప్రజలకు భరోసా ఇవ్వడంతోపాటు, సాధ్యమైనంత వేగంగా రాష్ట్రపతిపాలన ఎత్తివేసి, అన్ని జాతులు, తెగల సముచిత ప్రాతినిధ్యంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగితే మార్పు కనిపించవచ్చు.

బాలకార్మికతకు అంతమెప్పుడు?

ఈ రోజు అంతర్జాతీయ బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేకదినం. అంటే బానిస సంకెళ్ళను తెంచుకొని, మూసిన కనురెప్పలు విప్పుకొని, రెక్కలు కట్టుకొని స్వేచ్ఛా విహంగాలై చిన్నారులు ఎగిరిపోవాల్సిన రోజు ఇది. ఈ ప్రపంచంలో అత్యంత దయనీయమైన విషయం ఏదైనా ఉందీ అంటే అది బాలకార్మిక వ్యవస్థ. రేపటి తరం అని మురుస్తున్న ఆ భవిష్యత్ తరం వేరే దిక్కులేక అన్నమో రామచంద్రా అంటూ రోడ్డున పడడం ప్రపంచంలో అన్నింటినీ మించిన విషాదం.

పాపం, పుణ్యం, ప్రపంచ మార్గం ఏదీ తెలియని బాలలు మోయలేని భారాన్ని మోస్తున్నారు. పలకా బలపం పట్టాల్సిన చేతులు పత్తి చేలల్లో మగ్గిపోతున్నాయి. చెంగు చెంగున గంతులు వేయాల్సిన బాల్యం ఇటుక బట్టీల్లో మసిబారిపోతోంది. కాఫీ హోటళ్లలో, కార్ఖానాల్లో, ఇంకా కాదంటే ఖరీదైన ఇళ్ళల్లో పసిబతుకులు వసివాడిపోతున్నాయి. ఈ రోజు ప్రపంచ వ్యాప్తంగా 160 మిలియన్ల మంది బాలలు బాలకార్మిక వ్యవస్థ విషవలయంలో చిక్కుకున్నారని యూనిసెఫ్ లెక్కలు తెలియజేస్తున్నాయి. దీనర్థం ప్రపంచంలోని ప్రతి పదిమందిలో ఒక పసిప్రాణం బాలకార్మిక వ్యవస్థకు బలైపోతోంది. ఇది స్వయంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించిన గణాంకాలు.

బాలలను శారీరకంగా, మానసికంగా, సామాజికంగా అణచివేసి, శ్రమదోపిడీకి పాల్పడుతున్న ధనిక, పెట్టుబడీదారీ వర్గం బాలకార్మిక వ్యవస్థను పెంచి పోషిస్తోంది. బట్టీల్లోనూ, గనుల్లోనూ, కార్ఖానాల్లోనూ, కార్యాలయాల్లోనే కాదు... చివరకు అక్రమ రవాణా ద్వారా చిన్నారులపై లైంగిక దోపిడీ కూడా సర్వసాధారణంగా మారిపోయింది. దీన్ని అడ్డుకునేందుకు అరాకొరా చర్యలే తప్ప, పూర్తిస్థాయిలో, చిత్తశుద్ధితో జరుగుతున్న పనులు చాలా తక్కువ.



బాలకార్మిక వ్యవస్థకు ప్రధానమైన కారణం పేదరికం. రెక్కలు ముక్కలు చేసుకున్నా కడుపు నిండని జీవితాలు చిట్టి చేతుల చిన్నారులను పనుల్లోకి దింపుతున్నాయి. దీనికి తోడు నిరక్షరాస్యత చిన్నారులను బడులవైపు కాకుండా పనుల వైపు మళ్ళిస్తోంది. యావత్ ప్రపంచాన్ని కుదిపేస్తోన్న చైల్డ్ లేబర్ సమస్యని ప్రపంచ దేశాలు దశాబ్దాల క్రితమే గుర్తించినప్పటికీ నేటికీ ఎక్కడ వేసిన గొంగడి అక్కడనే అన్న చందంగా ఉంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన గణాంకాలకే పరిమితమైంది.

ఈ నేలపైన పుట్టిన ప్రతి బిడ్డకీ జీవించే హక్కు ఉంటుంది. బాలలకు విద్య, ఆరోగ్యం... రాజ్యాంగం కల్పించిన హక్కులు. బాలకార్మిక వ్యవస్థ చిన్నారుల ప్రతి హక్కునీ హరించివేస్తోంది. కానీ పేదరికంలో జన్మించిన ప్రతి చిన్నారికీ ఇవేవీ వర్తించడం లేదు. బాలకార్మిక నిషేధ చట్టం పనితీరు, చట్టానికి వ్యతిరేకంగా పనిచేయించుకుంటున్న వారికి వేస్తున్న శిక్షలను బట్టి అంచనా వేయవచ్చు. ఇక స్వంత కుటుంబాల్లోనే బాలకార్మికులుగా మిగిలిపోతున్నవారు మన దేశంలో కోకొల్లలు. తల్లిదండ్రులు కూలికిపోతే, బడిమానేసి, బిడ్డల సంరక్షణ చేస్తున్న చిన్నారుల సంఖ్య మనదేశ పాలకుల లెక్కలకు అందనిది. బడ్జెట్ కేటాయింపుల్లో దేశంలో సంగతి సరే, ప్రపంచవ్యాప్తంగా చూసినా సామాజిక రక్షణ నగదు ప్రయోజనాలు (సోషల్ ప్రొటెక్షన్ క్యాష్ బెనిఫిట్స్) పొందుతున్న బాలలు 26.4 శాతం మాత్రమే. ఇక పేదల ఇళ్ళు గడవని స్థితిలో ప్రభుత్వ పథకాల కోసం ఎదురుచూస్తున్న స్థితి. పేదలు బతుకు గడవని స్థితిలో తమ బిడ్డలనే బానిసలుగా మారుస్తున్నారు. దీన్ని అడ్డుకోవడానికి వారి ఆర్థిక పరిస్థితులు మెరుగుపరచడం తప్ప మరో మార్గమే లేదు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు చట్టం చేసి చేతులు దులుపుకునే పరిస్థితి నుంచి దేశం బయటపడాలంటే బడ్జెట్ కేటాయింపులపై దృష్టి సారించాలి. అలాగే వృద్ధుల సంఖ్య గణనీయంగా పెరుగుతూ, నైపుణ్యం లేమితో బాధపడుతున్న మన దేశంలో భవిష్యత్ తరాల చదువుకి ప్రాధాన్యత అత్యంత ఆవశ్యకం. చిన్నారులను విజ్ఞానవంతులుగా తయారుచేయడంలో తొలి అడుగు అక్షరాస్యతను పెంపొందించడం. బడుల నుంచి దూరమవుతోన్న బాలలను గుర్తించి పాఠశాలల్లోకి వారు అడుగిడే ప్రయత్నం చేయడం. నాణ్యమైన చదువుని పిల్లలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్న విషయం గుర్తించే వరకూ సమైక్యంగా పోరాడటం. ఇందుకు సుదీర్ఘ కార్యాచరణని రూపొందించుకొని ముందుకు సాగాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

– మద్దులూరి ఆంజనేయులు
అక్షరం, వ్యవస్థాపక కార్యదర్శి

ప్రభవిస్తున్న భారత్‌పై అగ్రరాజ్యాల అసూయ

ప్రభవిస్తున్న ఒక కొత్త శక్తిని ఎవరూ అభిమానించరు. నేను ప్రస్తావిస్తున్న కొత్త శక్తి భారత్. అవును, మన భారత్ ఉత్థానాన్ని అమెరికా అంగీకరించదు. చైనా సహించదు. ఐరోపా ఇష్టపడదు. ప్రభవించే కొత్త శక్తి యథాతథ పరిస్థితిని మార్చివేసి, ప్రాబల్య సమతుల్యతను తలకిందులు చేస్తుంది కనుకనే ఆ విముఖత. చైనా అగ్రరాజ్య ప్రతిపత్తిని సమకూర్చుకుంటున్నప్పుడు తాము ప్రాధాన్యం కోల్పోతామని పాశ్చాత్య అగ్ర రాజ్యాలు భయపడ్డాయి. చైనాను ప్రపంచ అగ్రగామి ఆర్థిక శక్తిగా, అధునాతన సాంకేతికతల కాణాచిగా అంగీకరించేందుకు వాటికి దశాబ్దాలు పట్టింది.

భారత్ ప్రగతి విజయాల పట్ల అమెరికా నేతృత్వంలోని పాశ్చాత్య ప్రపంచ ప్రతిస్పందన మరింత సంక్లిష్టంగా ఉన్నది. తమ ప్రపంచాధిపత్యానికి ఒక ప్రత్యక్ష ముప్పుగా చైనాను భావించిన ఆ సంప్రదాయ అగ్రరాజ్యాలు భారత్ సర్వోన్నతిని అలా భావించడం లేదు. అయితే భారత్ రాబోయే ఇరవై సంవత్సరాలలో పాశ్చాత్య అగ్రరాజ్యాలకు ఒక శక్తిమంతమైన ఆర్థిక, సైనిక, సాంకేతికతా ప్రత్యర్థిగా ప్రభవించనున్నదని వాషింగ్టన్‌లోని ముందుచూపుగల ఆలోచనాపరులు గ్రహించారు.

ప్రపంచ శక్తులుగా ప్రభవిస్తున్న దేశాల పట్ల పాశ్చాత్య అగ్రరాజ్యాలు ఎలా వ్యవహరిస్తాయో తెలుసుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది. సోవియట్ యూనియన్ 1960వ దశకం వరకు అమెరికాకు ప్రధాన ప్రత్యర్థిగా ఉన్నది. దాని స్థాయిని తగ్గించేందుకు అమెరికా ఒక జంట వ్యూహాన్ని అనుసరించింది. తొలుత చైనాతో స్నేహం చేసింది. 1972లో అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్, తన విదేశాంగ కార్యదర్శి హెన్రీ కిస్సింజర్‌తో కలిసి బీజింగ్‌ను సందర్శించారు. ప్రపంచ అగ్రగామి కమ్యూనిస్టు దిగ్గజ రాజ్యాలు సోవియట్ యూనియన్, చైనాల మధ్య విభేదాలు సృష్టించడమే అమెరికా లక్ష్యం.

తమతో మైత్రికి రావడంలో అమెరికా లక్ష్యమేమిటో చైనా సర్వోన్నత నాయకుడు మావో జెడాంగ్‌కు బాగా తెలుసు. అయినప్పటికీ గుంభనగా అమెరికాతో స్నేహం నెరిపారు. 1979లో అమెరికా, చైనాల మధ్య పూర్తి స్థాయి దౌత్య సంబంధాలు నెలకొన్నాయి. ఇందుకు ప్రత్యుపకారంగా చైనీస్ శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులకు అమెరికా టెక్నాలజీని నిర్నిబంధంగా అందుబాటులో ఉంచేందుకు వాషింగ్టన్ పాలకులు అంగీకరించారు. దరిమిలా మూడు దశాబ్దాల పాటు చైనా ఆ సౌలభ్యాన్ని ఎంత గరిష్ఠంగా ఉపయోగించుకోవాలో అంత గరిష్ఠంగా ఉపయోగించుకుంది. అమెరికా సృష్టించిన అధునాతన సాంకేతికతల గుట్టు మట్టులు తెలుసుకుంది. వాటి ఆలంబనతో సొంతంగా సాంకేతికతలను అభివృద్ధిపరచుకున్నది. 'మీ శక్తి సామర్థ్యాలను గుప్తంగా ఉంచండి, సమయం కోసం వేచి ఉండండి' అని కమ్యూనిస్టు చైనా మహా సంస్కర్త డెంగ్ జియావో పింగ్ తన ప్రజలకు ఉపదేశించారు.



> పాశ్చాత్య అగ్రరాజ్యాల ఆధిపత్యానికి భారత్ నుంచి తక్షణ సవాళ్లు ఏమీ లేవు. అయితే రాబోయే ఇరవై ఏళ్లలో తమ ఆధిక్యతను భారత్ సమర్థంగా సవాల్ చేయగలదని అమెరికా నాయకులకు అవగతమయింది. ఈ కారణంగానే, ఇటీవల పాకిస్థాన్ భారత్ సాయుధ సంఘర్షణల సందర్భంగా రెండుదేశాలను సమస్కంధులుగా పరిగణించేందుకు వాషింగ్టన్ పాలకులు ప్రయత్నించారు! చైనా ప్రాబల్యాన్ని ఎదుర్కొనేందుకు భారత్ ఎలా ఉపయోగకరమో , భారత్ ఉత్థానాన్ని అదుపు చేసేందుకు పాకిస్థాన్ కూడా అదే విధంగా ఉయోగపడగలదని వాషింగ్టన్ భావిస్తోంది.

ఆ సమయం 2010లో వచ్చింది. అమెరికా దిమ్మ తిరిగి పోయేలా చైనా జీడీపీ 20 రెట్లు పెరిగింది (1980లో 0.30 ట్రిలియన్ డాలర్ల నుంచి 2010లో 6.10 ట్రిలియన్ డాలర్లకు చేరింది). ఇదే కాలంలో అమెరికా జీడీపీ కేవలం ఐదు రెట్లు మాత్రమే అధికమయింది (1980లో 2.86 ట్రిలియన్ డాలర్ల నుంచి 2010లో 15.05 ట్రిలియన్ డాలర్లకు పెరిగింది).

ఇదిలావుండగా అమెరికా తన వ్యూహంలోని రెండో అంశాన్నీ అమలుపరచసాగింది. 1991లో ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన తరువాత రష్యా ముప్పును తటస్థీకరించడమే ఈ రెండో ఎత్తుగడ. సైనిక కూటమి నాటోను విస్తరించి రష్యా ముంగిటకు తీసుకువెళ్లింది. 1991లో 16 సభ్య దేశాలు ఉన్న నాటో 2025లో 32 సభ్య దేశాల కూటమిగా మహాబలోపేతమయింది. ఈ సభ్య దేశాలు రష్యాను ప్రభావశీలంగా చుట్టుముట్టాయి. మరింత స్పష్టంగా చెప్పాలంటే రష్యా ఇప్పుడు నాటో చక్ర బంధంలో ఉన్నది. ఇదే సమయంలో పాశ్చాత్య అగ్ర రాజ్యాల ఆధిపత్యానికి అంతకంతకు పెరుగుతోన్న ఒక మహా ముప్పుగా చైనా మరింత తీవ్ర స్థాయిలో పరిణమిస్తోంది. బీజింగ్‌కు వ్యతిరేకంగా వాణిజ్య యుద్ధాన్ని ప్రారంభించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనీస్ సరుకులపై దిగుమతి సుంకాలను 145 శాతం నంచి 30శాతానికి అనివార్యంగా తగ్గించుకున్నారు.

పాశ్చాత్య అగ్రరాజ్యాల ఆధిపత్యానికి భారత్ నుంచి తక్షణ సవాళ్లు ఏమీ లేవు. అయితే రాబోయే ఇరవై ఏళ్లలో తమ ఆధిక్యతను భారత్ సమర్థంగా సవాల్ చేయగలదని ఆలోచనాపరులు అయిన అమెరికా నాయకులకు అవగతమయింది. ఈ కారణంగానే, ఇటీవల పాకిస్థాన్ భారత్ సాయుధ సంఘర్షణల సందర్భంగా భారత్‌ను, ఉగ్రవాదాన్ని ఎగుమతి చేస్తున్న పాకిస్థాన్‌ను సమస్కంధులుగా పరిగణించేందుకు వాషింగ్టన్ పాలకులు ప్రయత్నించారు! పెరుగుతోన్న చైనా ప్రాబల్యాన్ని ఎదుర్కొనేందుకు భారత్ ఎలా ఉపయోగకరమో , భారత్ ఉత్థానాన్ని అదుపు చేసేందుకు పాకిస్థాన్ కూడా అదే విధంగా ఉయోగపడుతుందని వాషింగ్టన్ భావిస్తోంది.

జపాన్‌ను అధిగమించి భారత్ ప్రపంచ నాలుగో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించింది. భారత్ జీడీపీ 4.187 ట్రిలియన్ డాలర్లు (రూ.3,56,61,000 కోట్లు) కాగా జపాన్ జీడీపీ 4.186 ట్రిలియన్ డాలర్లు (రూ.3,56,53,000 కోట్లు). 2027లో జర్మనీని అధిగమించి ప్రపంచ అతి పెద్ద మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్ ప్రభవించనున్నది. అద్భుత పురోగమనం, సందేహం లేదు. అయినా ఈ ప్రగతిపథంలో మన దేశం చైనా, అమెరికాలకు చాలా దూరంలో వెనక పట్టునే ఉండిపోయింది. ఒక వాస్తవమేమిటంటే చైనా, అమెరికాలు మన కంటే చాలా ముందున్నప్పటికీ వాటి వార్షిక వృద్ధిరేటు మన వార్షిక వృద్ధిరేటులో సగంగా మాత్రమే ఉన్నది.

ఈ బహు దూరాలు అధిగమించలేనివా? కానే కావు. గత రెండు దశాబ్దాలలో చైనా త్వరితగతిన పురోగమించి అమెరికా తరువాతి స్థానానికి చేరలేదూ? మరి భారత్ కూడా రాబోయే ఇరవై ఏళ్లలో అటువంటి అద్భుత పురోగతి సాధించగలుగుతుందా? దీర్ఘకాలానికి వర్తించే అంచనాలు వేయడం అంత సులభం కాదు. అసాధ్యం అని కూడా ఒప్పుకుందాం. అయితే ఆర్థికాభివృద్ధిలో అమెరికా, చైనాలతో ఉన్న అంతరాన్ని భారత్ తప్పకుండా గణనీయంగా అధిగమించి తీరుతుంది. ఇది తథ్యం.

శక్తిమంతమైన చైనీస్, టర్కిష్ ఆయుధ వ్యవస్థలను తుత్తినియలు చేసి పాకిస్థాన్‌పై భారత్ నిర్ణయాత్మక సైనిక విజయాన్ని సాధించడాన్ని ప్రపంచ వ్యాప్తంగా రక్షణ వ్యవహారాల నిపుణులు గుర్తించారు. ప్రత్యర్థి రష్యా బలిమిని తగ్గించడంలో సఫలమైన అమెరికా ఇప్పుడు చైనా, భారత్‌లతో ఆసియా ప్రపంచ మహా శక్తిగా పునరుజ్జీవమవనున్నదని అమితంగా కలవరపడుతోంది. 2035 సంవత్సరం నాటికి చైనా, భారత్‌ల మొత్తం జీడీపీ అమెరికా జీడీపీని పూర్తిగా అధిగమించనున్నదని ప్రపంచ ఆర్థికవేత్తలు ఘంటాపథంగా చెప్పుతున్నారు. ఆధునిక ప్రపంచ చరిత్రలో ప్రప్రథమంగా సంభవించనున్న పరిణామమిది.

అగ్రరాజ్యమంటే ఏమిటి? తన జాతీయ ప్రయోజనాలకు ప్రమాదమేర్పడినప్పుడు స్వీయ సైనిక శక్తిని నిర్ణయాత్మకంగా ఉపయోగించగల సామర్థ్యం, సంకల్పం కలిగి ఉండడమే ఒక అగ్రరాజ్యాన్ని నిర్వచించే విశిష్ట లక్షణం. పాశ్చాత్య అగ్రరాజ్యాలు తమ జాతీయ ప్రయోజనాలకు ముప్పు వాటిల్లినప్పుడు తమ సైనిక బలాన్ని నిస్సంకోచంగా, అంతర్జాతీయ సమాజం ఆమోదం పొందనవసరంలేకుండా ఉపయోగించాయి. ఆపరేషన్ సిందూర్‌తో భారత్ ఈ శతాబ్దంలో మొట్టమొదటసారి అదే విధంగా వ్యవహరించింది. పాకిస్థాన్‌పై భారత్ నిర్ణయాత్మక సైనిక చర్య పాశ్చాత్య అగ్రరాజ్యాలలో అసూయ రేకెత్తించింది. వాస్తవిక దృష్టినీ కల్పించింది. ప్రపంచ అగ్రగామి ఆర్థిక వ్యవస్థగా ప్రభవిస్తున్న భారత్ తన సైనిక పాటవాన్ని నిర్ణయాత్మకంగా ఉపయోగించగల సామర్థ్యాన్ని, సంకల్పాన్ని నిరూపించుకుంది. అందుకే అసూయ. ఆపరేషన్ సిందూర్ ప్రపంచ అధికార సమతౌల్యతను పునర్ నిర్దేశించింది. దీనితో భారత్ శక్తి సామర్థ్యాలు పాశ్చాత్య అగ్రరాజ్యాలకు అవగతమయ్యాయి.

■ మిన్హాజ్ మర్చెంట్
('ఓపెన్' సౌజన్యం)

ఆంధ్ర బీసీ కులాలను తెలంగాణలో చేర్చొద్దు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 138 బీసీ కులాలు ఉండేవి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అందులోని 26 బీసీ కులాలను జీవో నెం. 16 ద్వారా (మార్చి 11, 2015న) గత తెరాస ప్రభుత్వం తొలగించింది. అయితే తెలంగాణలో ఏపీ జాబితాల్లో నుంచి ఆ కులాలను తొలగించారో ఆ జాబితాల్లోనే మళ్లీ చేర్చాలని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ కులాల ప్రతినిధులు అడగడం, ఆ వెంటనే బీసీ కమిషన్‌ను పురమాయించి, పబ్లిక్ హియరింగ్‌కు పిలవడమంటే తెలంగాణ బీసీ సమాజానికి ద్రోహం తలపెట్టినట్లే అవుతుంది. ప్రజల సమ్మతి లేకుండానే పాలకులు ఆ కులాలను ఇక్కడి బీసీ జాబితాలో చేర్చడానికి సన్నద్ధం అయ్యారని అర్థం.

తెలంగాణ బీసీ సంఘాలతో పాటు, రాజకీయ పార్టీలు, ప్రతిపక్షాలు ఈ కులాల చేరికను ఆహ్వానిస్తున్నాయో లేదో స్పష్టం చేయాలి. అసలు ఎందుకు తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చుకున్నామో కూడా స్పష్టం చేయాలి. ఇప్పటికే తెలంగాణలో ఆంధ్రా వలస, పెత్తందారీ కులాల దోపిడీ ఎక్కువైంది. అభివృద్ధి చెందిన ఆంధ్ర అణగారిన కులాల వల్ల.. తెలంగాణ పీడిత కులాలవారు అన్యాయానికి గురవుతున్నారు. బీసీ జాబితాలో తూర్పు కాపులను, కళింగలను చేర్చవద్దని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే ఆందోళనలు జరిగిన చరిత్రను గుర్తు తెచ్చుకోవడం అవసరం. నాటి ఉమ్మడి బీసీ సంఘాలన్నీ తెలంగాణ బీసీలకు ఎంత ద్రోహం చేయాలో అంతా చేశాయి. తూర్పు కాపులు, కళింగ కులాలు పాలక, భూస్వామ్య, పెత్తందారీ ఆధిపత్య కులాలు. మిగతా కులాలు అలా కాకపోయినా తెలంగాణ బీసీ కులాల కన్నా సామాజికంగా, సాంస్కృతికంగా అభివృద్ధి చెందిన కులాలే. తెలంగాణలోని బీసీ కులాలు సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతికంగా వెనుకబాటుతనానికి గురైన పరిస్థితి ఉంది. ఒకవేళ ఆ తొలగించిన కులాలను తెలంగాణలో చేర్చితే ఇక్కడి బీసీ కులాల అభివృద్ధికి విఘాతం కలిగించిన వాళ్లు అవుతారు. నాడు తెలంగాణలోని నీళ్లు, నిధులు, నియామకాలను కోస్తాంధ్ర వలసవాద పాలకులు కొల్లగొట్టారు. ఆ కొల్లగొట్టిన వారిలో పీడిత కులాల్లోని పాలకవర్గాలవారు లేరు అనటం అవివేకమే అవుతుంది. ఆంధ్ర వలసవాద, పెత్తందారీ పాలక దోపిడీదారుల 'ఆధిపత్యం, వివక్ష, దోపిడీ'లకు వ్యతిరేకంగా తెలంగాణ పీడిత వర్గాలే మూకుమ్మడిగా ఉద్యమించి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్న విషయం మరచిపోకూడదు.

– పాపని నాగరాజు
కుల నిర్మూలన వేదిక అధ్యక్షుడు

బడిబాటలో.. ముళ్ళు, రాళ్లు!!

పేదవాళ్లకైనా, పెద్దవాళ్లకైనా 'ఒకే చదువు, ఒకే బడి' అది కామన్ స్కూల్ విధానంలో అందరికీ సమానంగా అందించబడాలన్న రాజ్యాంగ స్ఫూర్తి పాలకుల విధానాల వల్ల నీరుగారిపోయింది. పర్యవసానంగా డబ్బు ఉన్నవాళ్లకి కార్పొరేట్ విద్య, ఏ ఆధారం లేని పేద బిడ్డలకు ప్రభుత్వ విద్య.. ఇలా రెండు 'క్లాస్'ల విధానం కొనసాగుతున్నది.

తెలంగాణ ప్రభుత్వం విద్యారంగాన్ని సమీక్షిస్తూ దాని మూలాలను మార్చే ప్రయత్నంలో భాగంగా విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేయడం అభినందించదగ్గ అంశమే. ఆ విద్యా కమిషన్ సూచించినట్టుగా మండలానికి మూడు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ప్రీ ప్రైమరీ స్కూల్స్ దశలవారీగా ఏర్పాటు చేయడానికి సూచించిన బడ్జెట్‌ను ఆమోదించకపోవడం విచారకరం.

మే నెలలో దాదాపు లక్షన్నర ఉపాధ్యాయులకు రాష్ట్రవ్యాప్తంగా ఐదు రోజుల పాటు ఆయా సబ్జెక్టులలో నైపుణ్యాలను పెంపొందించడం కోసం శిక్షణా తరగతులు జరిగాయి. ఆ శిక్షణా తరగతుల్లో ఉపాధ్యాయులు కాస్త ప్రేరణ పొందుతున్నా, తీరా బడి దాకా వచ్చాక.. విద్యార్థుల సంఖ్య పెరగటం లేదు. విద్యా ప్రమాణాలు కనీస స్థాయిలో ఎందుకు సాధించటం లేదు అనే ప్రశ్నలు టీచర్ల మీదకు బాణాల్లా వస్తున్నాయి. అసర్ లాంటి నివేదికలు, యుడైస్ రిపోర్టుల ప్రకారం ప్రభుత్వ బడుల్లో గతంతో పోల్చితే రెండు లక్షల వరకు ప్రవేశాలు తగ్గాయి. ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలు విద్యార్థుల సంఖ్య పెంచడానికి తీసుకోవలసిన చర్యల గురించి హైదరాబాదులో టీపీ జేఏసీ ఆధ్వర్యంలో చర్చ జరిగినప్పుడు అనేక అంశాలు, ఉపాధ్యాయుల, ప్రజల, విద్యార్థుల అభిప్రాయాలు చర్చకు వచ్చాయి. తెలంగాణ విద్యారంగం ఎదుర్కొంటున్న అత్యంత ప్రధానమైన అంశాల్లో విద్య అనేది ప్రైవేట్, ప్రభుత్వ రంగాల్లో కొనసాగడమేనని పలువురు అభిప్రాయపడ్డారు.

ఏకోపాధ్యాయ పాఠశాలలే 5వేలకు పైగా ఉండడం, అన్ని సబ్జెక్టులను ఒకరో, ఇద్దరో టీచర్లు బోధించలేకపోవడం వంటి సమస్యల వల్ల ప్రాథమిక విద్యారంగంలో ఒక భయంకరమైన గడ్డుస్థితి కొనసాగుతున్నది. ఇలాంటి స్థితి నుంచి అయిదవ తరగతి పూర్తి చేసుకుని వచ్చిన పిల్లలు నిజంగానే అసర్ నివేదిక చెప్పినట్టు రెండో తరగతి పుస్తకంలోని అంశాలు లేదా మూడో తరగతి లెక్కల్ని చేయలేని స్థితి కొనసాగుతున్నది. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, మంచినీళ్లు, మరుగుదొడ్లు మధ్యాహ్న భోజనం, పరిశుభ్రత వంటి అంశాలకు ప్రాధాన్యం కల్పించాలి.

ఒక జిల్లా హెడ్మాస్టర్ల శిక్షణ తరగతుల్లో 'ఎందుకు పాఠశాల విద్యార్థుల సంఖ్యను, ప్రమాణాలను పెంచలేకపోతున్నారన్న ప్రశ్నకి వాళ్ళు ఇచ్చిన సమాధానాలు ఆశ్చర్యకరంగా ఉన్నాయి. మొత్తం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలు ఎవరికీ అవసరంలేని ఎవరూ పట్టించుకోలేని స్థితిలోకి వెళ్లిపోయాయని తెలిపారు. తల్లిదండ్రులతో వారి పిల్లల అభ్యసన స్థితి గురించి మాట్లాడదామంటే.. 'వాళ్ళ సామాజిక ఆర్థిక స్థితి వల్ల పేరెంట్స్ మీటింగ్‌కు వాళ్లు ఏనాడూ రారు. పిల్లలు వివిధ సామాజిక మాధ్యమాలు, సినిమాల ప్రభావం వల్ల చదువు పట్ల నిరాసక్తత కనబరుస్తున్నారు. తప్పుడు ధోరణుల్లో పెడదోవ పడుతున్న విద్యార్థులను మందలించలేని స్థితిలో వారి తల్లిదండ్రులున్నారు. ఇలాంటి సమస్యలెన్నో ఉన్నాయని ప్రధానోపాధ్యాయులు ఆ సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు.

కొన్ని కార్పొరేట్ పాఠశాలలు కొన్ని సబ్జెక్టులు చెప్పకుండా కేవలం మ్యాథ్స్ సైన్స్ పట్ల దృష్టి పెట్టి, ఐఐటీ సీట్లే పరమావధిగా కొనసాగుతున్నాయి. అలాంటి బోధన ప్రభుత్వ పాఠశాలల్లో లేదు. కానీ ఆ విద్యార్థులకు పోటీగా నిలబడాలంటే ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకూ ఇతర సబ్జెక్టులతో పాటు, పోటీ పరీక్షలకూ శిక్షణనివ్వాల్సిన అవసరం ఉంది. ఈ భేదాలను తగ్గించడానికి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల పనివేళలు, పాఠ్యప్రణాళికలు, పరీక్ష విధానం ఒకే రకంగా ఉండవలసిన స్థితిని గుర్తించవలసి ఉంది. పాఠశాల బోధన సమయాల్లో సహపాఠ్య కార్యక్రమాలతో పాటు.. నిరంతరం పాఠశాల సమయాన్ని విద్యార్థుల సంక్షేమం కోసం తమ బోధన నైపుణ్యాలను పెంపొందించుకోవడం కోసం ఆలోచించాల్సిన, చర్చించాల్సిన స్టాఫ్ రూములు స్టాఫ్ మీటింగ్‌లు వాటికి దూరంగా జరిగిపోయాయి. అవసరం ఉన్నా లేకపోయినా తరగతి గదిలో, బడిలో నిరంతరం సెల్ ఫోన్ వినియోగించడం కూడా ఉపాధ్యాయులు తగ్గించుకోవాలి.



ఇన్ని సమస్యల మధ్య పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడంతో పాటు, ప్రమాణాలను పెంచడానికి బడిబాటను ఒకరకంగా ప్రభుత్వ టీచర్లు సవాలుగా స్వీకరించవలసి ఉన్నది. విద్యార్థుల హాజరు, టీచర్ల హాజరు సరిగ్గా ఉన్న పాఠశాలల్లో కూడా ఎందుకు విద్యా ప్రమాణాలు పెరగట్లేదు అన్న ప్రశ్నకు కారకులు ఎవరో సమీక్షించుకోవాల్సి ఉంది. తగిన అర్హతలు, కనీస వేతనం, సెలవులు, ఉద్యోగ భద్రత లేని ప్రైవేటు టీచర్లు కొంత మేర కనీస సామర్థ్యాలు సాధిస్తున్నప్పుడు అవన్నీ ఉన్నా ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎందుకు వెనుకబడిపోతున్నారో సమీక్షించుకోవాలి. ఆచార్య జయశంకర్ అన్నట్టుగా 'ఆర్థికంగా, సామాజికంగా కోల్పోయిన వాటిని తిరిగి పొందవచ్చు. కానీ విద్యా సాంస్కృతిక పరంగా ఏమైనా కోల్పోతే మళ్లీ పొందలేము' అన్న స్ఫూర్తితో తెలంగాణ విద్యా రంగాన్ని సంస్కరించుకోవాల్సిన అవసరం ఉంది.

• ప్రభాకర్ కస్తూరి
కన్వీనర్, తెలంగాణ విద్యావికాస వేదిక

ప్రభుత్వ బడులను కాపాడుకోలేమా?

తెలంగాణలో ప్రభుత్వ బడి రక్షణ కోసం, పిల్లలను 'బడిబాట' పట్టించడం కోసం ఉపాధ్యాయ సంఘాలు ప్రచార జాతలు, ఆటలు, పాటలు, మాటలతో ఇంటింటి ప్రచారం చేయడంలో తప్పులేదు. కానీ అవి ఎంత వరకు ప్రభుత్వ పాఠశాలలో నమోదు శాతం పెంచుతున్నాయనేదే ప్రశ్నార్థకం. ఎందుకంటే.. విద్యార్థులు బడిలో చేరాలంటే భౌతిక, వాస్తవిక స్థితి ప్రధానాంశంగా ఉంటుంది. పాఠశాల క్యాచ్‌మెంట్ ఏరియా అనేది ముఖ్యమైన అంశం. ఒక పాఠశాల క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి ప్రభుత్వ పాఠశాలకు కాకుండా ప్రైవేటు పాఠశాల, రెసిడెన్షియల్ పాఠశాలలకు విద్యార్థులు వెళ్లడాన్ని ఎవరూ ఆపలేరు. ఎందుకంటే తల్లిదండ్రుల వెసులుబాటు, క్రమశిక్షణాయుతమైన విద్యనందించడం ఇక్కడ ప్రధానాంశాలు. అయితే ప్రభుత్వ బడిని అందుబాటులో ఉంచిన పాలకులు, దానిని ప్రజల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దకపోవడం ఒక అంశమైతే, ప్రభుత్వ బడి క్యాచ్‌మెంట్ ఏరియాలో విచ్చలవిడిగా ప్రైవేటు పాఠశాలలను, వారి ట్రాన్స్‌పోర్టు సౌకర్యాలు అనుమతించడం మరో ఆలోచించదగిన అంశం. గురుకులాల పేరుతో విచ్చలవిడిగా రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేసే బదులుగా ప్రభుత్వ బడినే రెసిడెన్షియల్ పాఠశాలగా మార్చితే బాగుండేదేమో. ప్రస్తుతం సామాజిక అవసరాలు తీర్చలేని అసౌకర్యపు పాఠశాలలుగా మన బడులు మారిపోయాయనిపిస్తోంది. చాలా పాఠశాలల్లో విద్యార్థులు టాయ్‌లెట్లు లేక ఇబ్బందులు పడుతుంటారు.

సర్వశిక్షా అభియాన్ నిబంధనలు అనుసరించి కిలో మీటరు పరిధిలో ఒక ప్రాథమిక పాఠశాల, మూడు కిలోమీటర్ల పరిధిలో ప్రాథమికోన్నత పాఠశాల, ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉన్నత పాఠశాల ఉండాలనే నియమం ఉంది. 2023–24 ప్రభుత్వ విద్యా గణాంకాల ప్రకారం తెలంగాణలో 30,022 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇన్ని పాఠశాలలు, ఇంతమంది బోధనా సిబ్బంది ఉన్నా గత ఏడాది అసర్ విద్యా నివేదిక ప్రకారం తెలంగాణ విద్యా సామర్థ్యాలు దారుణంగా పడిపోయాయి. ప్రధాన కారణం విద్యను ప్రాధాన్య అంశంగా పట్టించుకోని పాలకవర్గాలు మాత్రమే అని అనిపించక మానదు. సరైన విద్యా ప్రణాళిక లేకపోవడం, ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కొరత, విచ్చలవిడిగా ప్రైవేటు పాఠశాలలకు అనుమతులు ఇవ్వడం వంటివి ఎన్నో. ఏకీకృత పాఠశాల వ్యవస్థ ఏర్పాటు జరగలేదు. పాఠశాల బోధనా సిబ్బంది పంపకంలో కూడా శాస్త్రీయత లేదు. ప్రభుత్వ బడుల్లో బోధనా సిబ్బంది ఉన్నా విద్యార్థులు లేక వెలవెలబోతున్నాయి. అదే, ఇరుకు భవనాల్లోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు కిక్కిరిసిన విద్యార్థులు ఉన్నా సామర్థ్యం కలిగిన బోధనా సిబ్బంది లేరు. ఇక రెసిడెన్షియల్ పాఠశాలలు తాత్కాలిక ఉపాధ్యాయులతో, అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. కొత్తగా వచ్చిన విద్యాహక్కు చట్టంతో పాటు, నూతన విద్యా విధానంలోని అంశాలు ఎంత వరకు పాఠశాలల్లో నెరవేరుతున్నాయనేది ప్రశ్నార్థకం.

ఇటీవల తెలంగాణ ప్రభుత్వం నియమించిన తెలంగాణ విద్యా కమిషన్ ప్రభుత్వ పాఠశాల వైఫల్యం గురించి వివరిస్తూ.. రాష్ట్రంలోని సుమారు 13వేల ప్రాథమిక పాఠశాలల్లో 50మంది కంటే తక్కువ సంఖ్యలో విద్యార్థులు ఉన్నారని తెలిపింది. ఇక ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల పరిస్థితి కూడా అలాగే ఉంది. ఒకప్పుడు పాఠశాల ఏర్పాటు స్థలం, అభివృద్ధి గురించి ప్రజలు ఆలోచించేవారు. కానీ ప్రస్తుతం కార్పొరేట్ విద్యాసంస్థలు పట్టణాల్లో విచ్చలవిడిగా వెలసి విద్యా వ్యాపారం చేస్తున్నాయి. ఇంత దారుణమైన పరిస్థితిలో ప్రభుత్వ బడిని బతికించడం, ప్రైవేటు పాఠశాల నియంత్రణ ప్రస్తుత ప్రభుత్వం ముందున్న అత్యవసర కర్తవ్యాలు. ప్రభుత్వ పాఠశాలల పునరేకీకరణ, సిబ్బంది సర్దుబాటు తదితర విషయాల్లో ప్రభుత్వం కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ, ప్రభుత్వాలు అవేమీ చేయకుండా కేవలం పైపై లేపనాలతోనే సరిపెడుతున్నాయి. తెలంగాణ విద్యా కమిషన్ ఇచ్చిన నివేదికలోని అంశాలను పటిష్ఠంగా అమలు చేయడం ప్రభుత్వం ముందున్న బాధ్యత. ఈ నివేదికలోని అంశాలు అమలు కావాలంటే నిధుల కేటాయింపు, ప్రణాళికేతర వ్యయంతో తప్ప మరో గత్యంతరం లేదు. ప్రభుత్వ బడుల భూములను అన్యాక్రాంతం కాకుండా చూడాలి. రాష్ట్రంలోని 9,517 అంగన్వాడీ కేంద్రాలను ప్రాథమిక పాఠశాలల్లో విలీనం చేసి, పూర్వ ప్రాథమిక విద్యపై దృష్టి సారించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని రుచితో, శుచితో విద్యార్థులకు అందజేయాలి. ఇలాంటి అనేక విధానాలను అమలుచేసినప్పుడే ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరిగే అవకాశం ఉంటుంది.

○ ఎన్. తిర్మల్
జర్నలిస్టు



బెలూన్లు, మామిడి తోరణాలతో స్వాగతం పలుకుతున్న జాలైవాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల

బడి గంటలు మోగే వేళ..

నేటి నుంచి పాఠశాలల పునః ప్రారంభం

- సమస్యలతో స్వాగతం పలుకుతున్న ప్రభుత్వ పాఠశాలలు
- అసంపూర్తిగా ఏపీపీ, ఎంవోఎంబీ అభివృద్ధి పనులు
- మూత్రశాలలు, మరుగుదొడ్ల వసతులు అంతంతమాత్రమే..
- మొదటి రోజే బడుల్లో పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): అరకొర వసుతులు.. అసంపూర్తి పనులతోనే విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. గత ఏడాది అట్టహాసంగా ప్రారంభించిన అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. అంతకు ముందు గత ప్రభుత్వం ప్రారంభించిన మన ఊరు-మన బడి అభివృద్ధి పనులు అర్థాంతరంగానే ఆగిపోయాయి. గురువారం నుంచి బడి గంటలు మోగనున్నాయి. నెల రోజులుగా సెలవుల్లో సేద తీరిన పిల్లలు బడిబాట పట్టనున్నారు. వరంగల్ జిల్లాలో జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యంలో మొత్తం 1,028పాఠశాలలు ఉండగా, అందులో 1,37,287 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇక హనుమకొండ జిల్లాలో అన్ని యాజమాన్యంలో మొత్తం 878పాఠశాలలు ఉండగా, 1,35,575మంది విద్యార్థులు పాఠశాలలకు హాజరుకానున్నారు. పాఠశాలల ప్రారంభం నాడే యూనిఫామ్లు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందజేయనున్నారు.

అరకొరగానే అభివృద్ధి పనులు

గత ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభానికంటే ముందుగానే మార్చిలో అమ్మ ఆదర్శ పాఠశాల పథకంతో ప్రభుత్వ పాఠశాలల్లో (మిగతా 6వ పేజీలో)

నేడు రామప్పకు పీసీ గోష్



హనుమకొండ టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి, కాళేశ్వరం ప్రాజెక్టు ఎంక్వైరీ కమిషన్ చైర్మన్ పీసీ గోష్ గురువారం రామప్ప పర్యటనకు వెళ్లనున్నట్లు సంబంధిత అధికారులు బుధవారం తెలిపారు. ఢిల్లీ నుంచి హైదరాబాద్ తాజ్ కృష్ణ హోటల్ నుంచి బయల్దేరి హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌కు బుధవారం సాయంత్రం చేరుకున్నారు. గురువారం ఉదయం 9.30 గంటలకు హరిత కాకతీయ హోటల్ నుంచి రోడ్డు మార్గం ద్వారా రామప్పకు ఉదయం 10.40 గంటలకు చేరుకొని దర్శనం చేసుకొని మధ్యాహ్నం 1.30 గంటలకు హరిత కాకతీయ హోటల్‌కు చేరుకుంటారని, హైదరాబాద్‌కు సాయంత్రం 3 గంటలకు బయల్దేరి రాత్రి 7గంటలకు హోటల్ తాజ్‌కృష్ణ చేరుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

సుందరీకరణ జరిగేనా!?

నిధుల కొరతతో అర్థాంతరంగా నిలిచిన చెరువు పూడికతీత పనులు



- 382 ఎకరాల్లో 13లక్షల క్యూబిక్ మీటర్ల పూడికతీత తీసేలా లక్ష్యం
- 3 నెలల్లో కేవలం 6.40 లక్షల క్యూబిక్ మీటర్లే పూడికతీత
- పూడికమట్టికి డిమాండ్ లేకపోవటంతో ఖాళీస్థలాల్లో డంప్ చేసేలా ప్రణాళిక
- మట్టిని తరలించేందుకు రూ.16.11 కోట్లకు టెండర్లు పిలిచిన ఇరిగేషన్ శాఖ
- టెండర్లు ఖరారైనా అడ్మినిస్ట్రేషన్ అనుమతులు ఇవ్వని ప్రభుత్వం
- వర్షాకాలం ప్రారంభంతో ఇక సుందరీకరణ పనులు అటకెక్కినట్లే..

దే'ద్వీప'మానంగా రూపుదిద్దుకొని పర్యాటకులను అలరిస్తుందని, చారిత్రక నగర సిగలో మణిమకుటంగా స్థానం పొందుతుందని భావించిన భద్రకాళి చెరువు.. నిరాశనే మిగుల్చుతోంది. చెరువు సుందరీకరణ పనులు అటకెక్కే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అందుకు నిధుల లేమియే కారణంగా కనిపిస్తోంది. సర్కారు చెప్పిన మాటలు ఆరంభశూరత్వంగా మారుతున్నాయి. నగరంలోని చారిత్రక భద్రకాళి చెరువులో పూడికతీత మట్టిని తరలించేందుకు కావాల్సిన రూ.18 కోట్ల నిధుల విడుదలకు ప్రభుత్వం ఆమోదం తెలపటం లేదు. టెండర్లు నిర్వహించి, కాంట్రాక్టు అప్పగించినప్పటికీ, ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాకపోవటంతో మట్టి తరలింపు నిలిచిపోయింది. చెరువులో 13 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తీయాల్సి ఉండగా, మూడునెలల్లో 'కుడా', ఇరిగేషన్ శాఖ వేర్వేరుగా కేవలం 6.40లక్షల క్యూబిక్ మీటర్ల మట్టినే తరలించారు. నిధుల కొరతకు తోడు వర్షాలు ప్రారంభం కావటంతో చెరువులో మట్టి తరలింపు పనులు ముందుకు సాగే పరిస్థితులు కనిపించడం లేదు.

▪ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

కబ్జాలు, అక్రమణల తరువాత భద్రకాళి చెరువు 382 ఎకరాల్లో విస్తరించి ఉంది. గత నవంబరు 7వ తేదీన భద్రకాళి చెరువులో నీటిని మత్తడి వద్ద గండి కొట్టి బయటకు విడుదల చేశారు. చెరువులో 1.5 మీటర్ల లోతు నుంచి మట్టి తీయాలని తొలుత నిర్ణయించినప్పటికీ, లోతు పెరిగితే ముంపు ప్రాంతాలు కూడా ఎక్కువగా పెరుగుతాయని భావించిన అధికారులు.. 1.2మీటర్ల లోతుగా పూడిక మట్టి తీస్తున్నారు. దీంతో 18లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తీయాలని నిర్ణయించినప్పటికీ, మట్టి తీసే లోతు తగ్గటంతో 13లక్షల క్యూబిక్ మీటర్లకే పూడిక మట్టి తీయాలని నిర్ణయించారు. ఇందులో 10లక్షల క్యూబిక్ మీటర్లు ఇరిగేషన్ శాఖ, 3లక్షల క్యూబిక్ మీటర్లు 'కుడా' ఆధ్వర్యంలో పూడికమట్టిని తీసేలా ప్రణాళిక రూపొందించారు.

ఇక చెరువులో పూడికమట్టి తరలించేందుకు నీటిపారుదలశాఖ అధికారులు చేసిన ప్రయత్నాలు కొలిక్కి రాలేదు. తొలుత జనవరి 5వ తేదీన క్యూబిక్ మీటర్ మట్టికి రూ.250చొప్పున ధర నిర్ణయించారు. మట్టిని తీసుకెళ్లేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదని ఆ టెండర్‌ను రద్దు చేశారు. ఆ తరువాత జనవరి 10వ తేదీన మట్టి పూడికతీత, మట్టి తరలింపు పనులకు టెండర్లు పిలిచారు. పూడిక తవ్వటం, లోడింగ్ పనుల కోసం రూ.3.49కోట్లు, పూడిక మట్టిని తరలించేందుకు క్యూబిక్ మీటర్‌కు 162.56చొప్పున 5.85లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తరలించేందుకు రూ.9.51కోట్లు చెల్లించేలా మరో టెండర్ పిలిచారు. క్యూబిక్ మీటర్‌కు రూ.162.56 చొప్పున ధర నిర్ణయించి టెండర్ పిలిచిన ఎవరు ముందుకు రాలేదు. దీంతో చివరకు మూడోసారి అధికారులు క్యూబిక్ మీటర్ మట్టికి రూ.71.83గా చెల్లించి, ఇష్టం వచ్చిన వారు మట్టి తీసుకెళ్లవచ్చునని ప్రకటించారు. దీంతో మార్చి 11వ తేదీ నుంచి నీటిపారుదల శాఖ అధికారులు మట్టి విక్రయాలు చేపట్టారు. సుమారు మూడు నెలల కాలంలో 3.40లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని వివిధ వర్గాల వారు తీసుకెళ్లారు. ఇంకా 6.60లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని నీటిపారుదల శాఖ అధికారులు తరలించాల్సి ఉంది. కాగా, 75 ఎకరాల్లో కుడా ఆధ్వర్యంలో చేపట్టిన పూడిక మట్టితీతతో చెరువులోనే ఐదు నక్షత్రాల ఐల్యాండ్‌లను ఏర్పాటు చేశారు. తవ్విన భద్రకాళీ ఆలయం చుట్టూ అంతర్గత రోడ్లు వేశారు. కుడా చేపట్టిన పూడికతీత పనులు దాదాపు పూర్తి కాగా, నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనులే సుందరీకరణకు అటంకాలు కలిగిస్తున్నాయనే చర్చ జరుగుతోంది.

మట్టి డంప్‌కు నిధుల్లేవ్..

ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భద్రకాళి చెరువు పూడికతీత పనులకు నిధుల గ్రహణం పట్టుకుంది. వర్షాకాలం ప్రారంభం నాటికే పనులన్నీ పూర్తి చేయాలని మంత్రులు పొంగులేటి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పదేపదే ఆదేశించిన నిధుల గండం (మిగతా 6వ పేజీలో)



పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- తల తాకట్టు పెట్టైనా సంక్షేమ ఫలాల అమలు
- అర్హులందరికీ దశల వారీగా ఇళ్లు
- ములుగు జిల్లాకు మరో వెయ్యి ఇళ్లు మంజూరు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ములుగు జిల్లాను పర్యాటక ఖిల్లాగా మారుస్తాం: మంత్రి సీతక్క



ఇంచర్ల సభలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

ములుగు రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మించి ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. తల తాకట్టు పెట్టైనా సంక్షేమ ఫలాలను అమలు చేయడం జరుగుతుందని, అర్హులందరికీ దశల వారీగా ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. ములుగు మండలం ఇంచర్ల గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో బుధవారం ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ, నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి 23మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా రూ.22,500 కోట్లతో 4.5లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోందని అన్నారు. గతంలో సైతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పూర్తిచేసిందని తెలిపారు. గత పదేళ్లుగా డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని పేదలకు సాకులు చెప్పిన బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం 93వేల ఇళ్లకు టెండర్లు పిలిచి 60వేల ఇళ్లను మాత్రమే పూర్తి చేసిందని అన్నారు. రాష్ట్రంలోని ఇందిరమ్మ ప్రభుత్వం సంవత్సర కాలంలోనే 4.5లక్షల ఇళ్లను నిర్మించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతుందని, ఇందులో ములుగు నియోజకవర్గానికి 3వేల ఇళ్లు మంజూరు కాగా, ఐటీడీఏకు మరో 1,500ఇళ్లు మంజూరు అయ్యాయని పేర్కొన్నారు. తాను మరో 1000ఇళ్లను మంజూరు చేస్తున్నానని హామీ ఇచ్చారు.

మంత్రి సీతక్క మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ డబుల్‌బెడ్‌రూం ఇళ్లు అందిస్తామని ప్రజలను మోసం చేశారని అన్నారు. నేడు ఇందిరమ్మ ప్రభుత్వం ఇళ్ల నిర్మాణ పనులను చేపట్టడంతో దానిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. జిల్లాను పూర్తిస్థాయిలో పర్యాటక ప్రాంతంగా మార్చడానికి నిధులు కేటాయించడం జరిగిందని, రూ.70కోట్లతో రామప్పలో పనులు చేపట్టడమే కాకుండా రూ.30కోట్లతో ఐలాండ్ అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సీహెచ్.మహేందర్‌జీ, సంపత్ రావు, ఆర్డీవో వెంకటేష్, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు హెలికాప్టర్ ద్వారా ములుగు చేరుకున్న మంత్రులు పొంగులేటి, సీతక్క, ఎంపీ పోరిక బలరాంనాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావులకు కలెక్టర్ టీఎస్ దివాకర, ఎస్పీ శబరీశ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్‌లు పూలమొక్కలు అందజేసి స్వాగతం పలికారు.

దేశానికే తెలంగాణ రోల్ మోడల్

- మంత్రి పదవుల్లో దళితులకు ప్రాధాన్యం చరిత్రాత్మకం
- కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మంత్రి పదవుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు ప్రాధాన్యం ఇవ్వడం చరిత్రాత్మకమని, ఉమ్మడి రాష్ట్రంలోనూ దళితులకు మంత్రి వర్గంలో ఇంత గుర్తింపు ఏ ప్రభుత్వం ఇవ్వలేదని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లోని క్యాంపు కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో పేదల సంక్షేమం కోసం వినూత్న పథకాలు తీసుకువచ్చిందన్నారు. సంక్షేమ పథకాలు అమలు, సామాజిక న్యాయమే లక్ష్యంగా పాలనను అందిస్తున్నామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ 13,500 కోట్లు ఖర్చు చేసి రాష్ట్రంలోని 3.10 కోట్ల మంది ప్రజలకు సన్నబియ్యం అందిస్తున్న దేశంలోనే ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. జనాభాకు అనుగుణంగా బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్రంలో కులగణన చేసి, విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తీర్మానం చేసి కేంద్రంకు పంపించిన రాష్ట్రం తెలంగాణ అని అన్నారు.

అసెంబ్లీ స్థానాల ఆధారంగా రాష్ట్రంలో 18 మంది మంత్రులు ఉండాలి.. 15 మంది మంత్రులను ఎంపిక చేయగా దళితులకు 4 మంత్రి పదవులను అందించారు.. స్పీకర్ పదవి సైతం దళితుడికి ఇచ్చి 5 కీలక స్థానాలు దళితులకు కట్టబెట్టడం గతంలో ఏనాడూ జరగలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రెండు టర్మ్‌లలో ఒక్క మంత్రి పదవే దళితులకు ఇచ్చారని గుర్తు చేశారు. సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యం అనేదానికి మంత్రి పదవులే నిదర్శనమన్నారు.

భద్రకాళి ఆలయానికి ట్రస్టుబోర్డు

12 మందితో ఏర్పాటు చేసిన ప్రభుత్వం

వరంగల్ కల్చరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు పన్నెండేళ్ల తర్వాత చారిత్రక భద్రకాళి దేవస్థానానికి ట్రస్టు బోర్డు ఏర్పాటైంది. ఈ మేరకు బుధవారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో ట్రస్టు బోర్డును ఏర్పాటు చేస్తామని ఇటీవలె చెప్పిన దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ.. మాట నిలుపుకున్నారు. 12 మందితో కూడిన ట్రస్టు బోర్డును ప్రకటించారు. ఒక ఎక్స్ అఫీషియో మెంబర్‌తో కలిపి మొత్తం 13 మందితో బోర్డు ఏర్పాటు చేశారు.

ట్రస్టు సభ్యులు వీరే..

టి.వీరన్న, కటకం రాములు, గాదె శ్రవణ్‌కుమార్ రెడ్డి, ఓరుగంటి పూర్ణచందర్, తొగరు క్రాంతి, బింగి సతీష్, మోతుకూరి మయూరి, గాండ్ల సరస్వతి, నార్ల సుగుణ, పాలడుగు ఆంజనేయులు, జారతి వెంకటేశ్వర్లు, అనంతుల శ్రీనివాస్‌రావుతో పాటు ఎక్స్ అఫీషియో సభ్యుడిగా పి.నర్సింహమూర్తిని నియమించారు.

ఖరీఫ్ సాగుకు సర్వం సిద్ధం

- పంటల ప్రణాళిక ఖరారు
- 2.31 లక్షల ఎకరాల్లో పంటల సాగు
- 1.46 లక్షల ఎకరాల్లో పత్తి
- గత సీజన్ కన్నా సాగు 5 శాతం పెరిగే అవకాశం
- అందుబాటులో విత్తనాలు, ఎరువులు
- నకిలీ విత్తనాలు, పురుగు మందులను అరికట్టేందుకు దాడులు
- జిల్లా వ్యవసాయాధికారి రవీందర్ సింగ్



హనుమకొండ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ పంటల ప్రణాళిక ఖరారైంది. ఈసారి 2.31 లక్షల ఎకరాల్లో వివిధ పంటల సాగుకు అవకాశాలున్నాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే పంటల సాగు విస్తీర్ణం గత సీజన్‌లో కన్నా 5 శాతం మేరకు పెరగవచ్చు. రైతులకు సరిపడే ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. నకిలీవిత్తనాలు, పురుగుల మందులను అరికట్టేందుకు విస్తృతంగా తనఖీలు జరుగుతున్నాయి అని జిల్లా వ్యవసాయాధికారి రవీందర్ సింగ్ తెలిపారు. ఖరీఫ్ సాగు కార్యాచరణ తదితర వివరాలు ఆయన మాటల్లోనే..

2.31 లక్షలు ఎకరాల్లో సాగు

జిల్లాలో మొత్తం 2,31,320 ఎకరాల్లో పంటల సాగుకు ప్రణాళికను రూపొందించాం. ఇందులో వరి 1,46,800 ఎకరాలు, మొక్కజొన్న 5400 ఎకరాలు. పత్తి 78,000 ఎకరాలు, నూనె గింజలు 190 ఎకరాలు, పప్పుధాన్యాలు 930 ఎకరాలు. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే గత సీజన్‌కన్నా ఈ సారి పంటల సాగు కొంత మేరకు పెరిగే అవకాశం ఉంది.

విత్తనాల అందుబాటు

జిల్లాలో దాదాపు అన్ని చోట్ల

(మిగతా 6వ పేజీలో...)



హైవే నిర్మాణ పనులను అడ్డుకుంటున్న రైతులు

గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు షురూ

- అడ్డుకున్న రైతులు.. అధికారులతో వాగ్వాదం
- బహిరంగ మార్కెట్ ధర చెల్లించాలని డిమాండ్
- అధికారులు సర్దిచెప్పడంతో సద్దుమణిగిన వివాదం

6

ఇంటర్ లింకింగ్ లైన్ల పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

రాంనగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పురోగతిలో ఉన్న ఇంటర్ లింకింగ్ లైన్ల పనులను యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం హనుమకొండ కార్పొరేట్ కార్యాలయంలో సీఈలు నోడల్ జీఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్లలో వంద శాతం రెవెన్యూ కలెక్షన్లు తీసుకురావాలని, కేబుల్ ఆపరేటర్లు విద్యుత్ పోల్స్‌పైన చిందర వందరంగా వైర్లు పెట్టకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోల్‌రెంటల్ గ్రామాల్లో రూ.15, అర్బన్‌లో రూ.20 వసూలు చేయాలని సూచించారు. కాలిపోయిన, పని చేయని విద్యుత్ మీటర్లను తొలగించి కొత్త మీటర్లను అమర్చాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్లను తగ్గించి డిపార్ట్‌మెంట్ షెడ్‌ల్లోనే ట్రాన్స్‌ఫార్మర్లను రిపేర్ చేయాలన్నారు. లైన్ క్లియరెన్స్ ఎల్‌సీ యాప్ ద్వారానే చేయాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డైరెక్టర్ బి.అశోక్ కుమార్, పి.సదర్‌లాల్, వి.తిరుపతిరెడ్డి, సీఈలు కె.తిరుమల్‌రావు, రాజ్‌చౌహాన్, అశోక్, వెంకటరమణ, జీఎంలు వేణుబాబు, కృష్ణమోహన్, వెంకటకృష్ణ, శ్రీనివాస్, సత్యనారాయణ, సురేందర్, ఉత్తమ్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

డైట్, బీఈడీ కళాశాలల్లో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని ప్రభుత్వ డైట్, బీఈడీ కళాశాలల్లో వివిధ విభాగాల్లో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీ కోసం అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా డైట్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్‌హై బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 65 సంవత్సరాలలోపు వయస్సు కలిగి, నిరుద్యోగ, రిటైర్డ్ అధ్యాపకులు దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులని ఆయన తెలిపారు. ఎంపికైన కరిక్యులర్ అభ్యర్థులకు నెలకు రూ.23,400, కోకరిక్యులర్ అభ్యర్థులకు నెలకు రూ.15,600 గౌరవ వేతనం అందజేస్తారని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు సంబంధిత దరఖాస్తు ఫారాలను 13 నుంచి 19 వరకు ఆయా కళాశాలల్లో సమర్పించాలని సూచించారు. 21న తుది జాబితాను ప్రకటించి 24 నుంచి 26 వరకు మెరిట్ ప్రాతిపదికన 1:5 నిష్పత్తిలో డెమో, ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను 28న ప్రకటిస్తామని, వారు జూలై 1నుంచి కళాశాలకు హాజరు కావాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. పోస్టులు, వాటికి సంబంధిత ఖాళీలకు ఆయా కళాశాలల్లో సంప్రదించాలని ఆయన కోరారు.

ముగిసిన రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్ ప్రవేశాల ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) ఆదేశాల మేరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో హనుమకొండ జేఎన్ఎస్‌లోని రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్ లో ప్రవేశాలకు రెండు రోజులుగా జేఎన్ఎస్‌లో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఎంపిక పోటీలు బుధవారం ముగిశాయి. ఈ ముగింపు వేడుకల్లో డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. జేఎన్ఎస్‌లోని రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్లో ప్రవేశాల కోసం అండర్ -10, 12, 14, 16 బాలబాలికలకు జిమ్నాస్టిక్స్, హ్యాండ్‌బాల్, రెజ్లింగ్, అథ్లెటిక్స్, స్విమ్మింగ్ క్రీడావిభాగాల్లో నిర్వహించిన ఎంపిక పోటీల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి 400మంది పాల్గొన్నా రు. ఇక్కడ నిర్వహించిన ఎంపిక పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి, ఎక్కువ మార్కులు సాధించిన క్రీడా కారుల పేర్లను సాట్‌కు పంపిస్తామన్నారు. తర్వాత సాట్ ఆదేశాలకు అనుగుణంగా ప్రతిభ కలిగిన క్రీడాకారు లను హాస్టల్‌లో ప్రవేశం కోసం ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సాట్ అబ్జర్వర్లు డాక్టర్ రవికుమార్, నర్సింగ రావు, స్వర్ణలత, సంతోష్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్, రెజ్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.డి. కరీం, స్విమ్మింగ్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి మంచాల స్వామిచరణ్, డీఎస్ఏ కోచ్‌లు నరేందర్, శ్రీమన్నారాయణ, దేవిక, అఫ్జల్, వెంకటేశ్వర్లు, జీవన్‌గౌడ్, నవీన్, శంకర్, రమేష్, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు షురూ

- అడ్డుకున్న రైతులు.. అధికారులతో వాగ్వాదం
- బహిరంగ మార్కెట్ ధర చెల్లించాలని డిమాండ్
- అధికారులు సర్దిచెప్పడంతో సద్దుమణిగిన వివాదం


హైవే నిర్మాణ పనులను అడ్డుకున్న భూ బాధిత రైతులు

దామెర, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా దామెర మండలం పసరుగొండ క్రాస్ రోడ్‌లో చేపట్టిన గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు నిర్మాణ పనులను బుధవారం రైతులు అడ్డుకున్నారు. పోలీసు బలగాల పహారాలో రెవెన్యూ, నేషనల్ హైవే అథారిటీ అధికారులు రోడ్డు నిర్మాణ పనులను చేపట్టడంతో బాధిత రైతులు బొల్లు రాజిరెడ్డి, సమ్మిరెడ్డి, తిరుపతిరెడ్డి, సమ్మిరెడ్డిలు స్వయంగా అడ్డుకున్నారు. తమకు బహిరంగ మార్కెట్ ధర చెల్లిస్తేనే వ్యవసాయ భూములను ఇస్తామని తెగేసి చెప్పారు. దీంతో పోలీసు ఉన్నతాధికారులు, బలగాల పహారాలో నేషనల్ హైవే అథారిటీ అధికారులు నిర్మాణ పనులను ప్రారంభించారు. అక్కడే వేచి ఉన్న బాధిత రైతులు వచ్చి ఎక్స్‌కవేటర్ సహాయంతో చేపట్టిన పనులను అడ్డుకున్నారు. తమ భూములకు సంబంధించిన విషయమై కోర్టులో కేసు నడుస్తోందని, తమ భూములను బలవంతంగా లాక్కుంటారా..? అంటూ అధికారులను, పోలీసులను నిలదీశారు. ప్రస్తుత బహిరంగ మార్కెట్ ధర ఎకరానికి రూ.4 కోట్లు చెల్లించాల్సిందేనని తెగేసి చెప్పారు. అలా కాకుండా ఎకరానికి రూ. 80 లక్షలు చెల్లిచస్తామంటే ఊరుకోమని చెప్పారు. గతంలో ప్రభుత్వానికి అప్పటి జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తమ భూములకు ఎకరానికి రూ.3కోట్లు నుంచి రూ.4కోట్లు ధర పలుకుతోందని నివేదిక పంపారని, ఆ నివేదికను ఆధారంగా చేసుకుని తమకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మూడు పంటలు పండించుకునే పంట పొలాల నుంచి తమ అనుమతి లేకుండా బలవంతంగా రోడ్డు నిర్మాణ పనులను జరపడమేమిటని రైతులు ప్రశ్నించారు. పనులు చేస్తున్న ఎక్స్‌కవేటర్‌కు అడ్డుగా నిలిచారు.


పనులు చేస్తున్న ఎక్స్‌కవేటర్

దీంతో బాధిత రైతులకు పోలీ సు, రెవెన్యూ అధికారుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. కాగా, రెవెన్యూ, పోలీసు అధికారులు కలుగచేసుకుని నచ్చచెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డీవో కె.నారాయణ, తహసీల్దార్ ఎం.జ్యోతివరలక్ష్మీదేవి, పరకాల రూరల్ సీఐ పి.రంజిత్‌రావు, దామెర ఎస్సై కొంక అశోక్, ఆర్ఐ ఎల్.భాస్కర్‌రెడ్డి, ఎన్‌హెచ్ఏఐ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సుందరీకరణ జరిగేనా!?

(5వ పేజీ తరువాయి)

వెంటాడుతోంది. భద్రకాళి చెరువు నుంచి క్యూబిక్ మీటర్‌కు రూ.71.83 చొప్పున చెల్లించి, మట్టి అవసరం ఉన్నవారు 3.40లక్షల క్యూబిక్ మట్టిని తీసుకెళ్లారు. ఇక ప్రజలెవ్వరూ ముందుకు రాకపోవటంతో అధికారులు చెరువు మట్టిని ప్రభుత్వ స్థలాల్లో డంప్ చేసి, అవసరం ఉన్నవారికి విక్రయించాలని నిర్ణయించారు. భద్రకాళి చెరువు నుంచి పూడిక మట్టిని పలివేల్పుల, న్యూశాయంపేట, పద్మాక్షి ఆలయం, అమ్మవారిపేట సమీపంలోని ప్రభుత్వం ఖాళీ స్థలాల్లోకి సుమారు 6.60లక్షల మట్టిని తరలించేలా ఏర్పాట్లు చేశారు. ఈమట్టిని తరలిస్తే చెరువు పూడికతీత పూర్తవటమే కాకుండా, సుందరీకరణ పనులను కొనసాగించవచ్చునని భావించారు. దీనికి రూ.18.50కోట్ల నిధులు అవసరంగా అంచనా వేశారు. చెరువు మట్టి విక్రయించగా వచ్చిన రూ.2.44 కోట్లు పోగా, మరో రూ.16.11కోట్ల నిధులు కావాలని ప్రభుత్వానికి నీటిపారుదల శాఖ అధికారులు గత నెలలో ప్రతిపాదనలు పంపించారు. స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సైతం సంబంధిత శాఖ అధికారులు, మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అయితే ప్రజలకు అవసరం లేని మట్టి మనకెందుకని నీటిపారుదల శాఖ అధికారులు నిధుల విడుదలకు సుముఖత వ్యక్తం చేయటం లేదని సమాచారం. దీంతో మే రెండోవారం నుంచే పూడికతీత పనుల నిలిపివేశారు. ప్రభుత్వం నుంచి రూ.16.11కోట్ల నిధులు వస్తేనే చెరువులో పూడికతీసే అవకాశం ఉంది. అయితే నిధులను విడుదల చేసేందుకు ప్రభుత్వం సుముఖంగా లేకపోవటంతో ఇక భద్రకాళి చెరువు సుందరీకరణ పనులు అటకెక్కినట్లేనా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

అధికారుల నిర్లక్ష్యం.. వర్షాల రాక..

భద్రకాళి చెరువు పూడికతీతలో అధికారుల నిర్లక్ష్యమే ప్రధాన కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎలాంటి ముందస్తు ప్రణాళిక లేకుండా చెరువులో నీటిని బయటకు వదిలేశారనే ఆరోపణలు ఉన్నాయి. పూడిక మట్టిని విక్రయించి రూ.9.50కోట్ల ఆదాయం వస్తుందనే ఆశతో క్యూబిక్ మీటర్ మట్టికి తొలుత రూ.256, ఆ తరువాత రూ.162.56 ధర నిర్ణయించారు. అయితే నీటిపారుదల శాఖ అధికారులు ఆశించిన స్థాయిలో కాంట్రాక్టర్ల నుంచి స్పందన రాలేదు. దీంతో చివరకు రూ.71.83కు క్యూబిక్ మీటర్ అమ్ముకోవాల్సి వచ్చింది. ఇదంతా నీటిపారుదల శాఖ అధికారుల వైఫల్యమే అనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లా అధికారయంత్రాంగం కూడా ముందస్తు అంచనాలు లేకుండా పూడికమట్టిని తీసేందుకు తలూపిందనే చర్చ జరుగుతోంది.

మట్టిని డంప్ చేసేందుకు కావాల్సిన రూ.16.11 కోట్ల నిధులు ప్రభుత్వం నుంచి మంజూరు కాకపోవటంతో చారిత్రాత్మక చెరువులో పూడికతీత పనులకు బ్రేక్ పడిందనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి. మరోవైపు వర్షాలు కూడా మొదలయ్యాయి. దీంతో చెరువులోకి వర్షం నీరు చేరుతోంది. బురదతో పాటు వాహనాలు చెరువు లోపలికివెళ్లే పరిస్థితి లేదు. దీంతో భద్రకాళి చెరువు పూడికతీత పనులకు ఇక ఫుల్‌స్టాప్ పడినట్లేననే చర్చ జరుగుతోంది. దీంతో మాడవీధుల నిర్మాణంతోపాటు చెరువులో బోటింగ్, బండ్ విస్తరణ, కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఐదు ఐల్యాండ్‌లల్లో అభివృద్ధి పనులకు కూడా పూడికతీత అర్థాంతరంగా నిలిచిపోటం అడ్డంకులుగా మారే పరిస్థితి ఉందనే అభిప్రాయాలు ఉన్నాయి.

రైలు ఢీ ఒకరి మృతి


మృతుడు పేరబోయిన నాగరాజు

నెక్కొండ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నెక్కొండ రైల్వే స్టేషన్ సమీపంలోని ఫ్లైఓవర్ వద్ద బుధవారం సాయంత్రం హైదరాబాద్ వెళ్తున్న ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని పేరబోయిన నాగరాజు (35) మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి వద్ద లభించిన ఆధార్ కార్డులో మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం గుర్తూరుకు చెందిన పేరబోయిన నాగరాజు అని వివరాలు ఉన్నాయని హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. ప్రమాదానికి గల పూర్తికారణాలు తెలియాల్సి ఉందన్నారు. పంచనామ జరిపి మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించామన్నారు.

నేటి నుంచి జేఎన్ఎస్‌లో విద్యుత్ ఉద్యోగుల క్రీడలు

రాంనగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులు పాటు తెలంగాణ ట్రాన్స్‌కో అండ్ డిస్కంల ఇంటర్ సర్కిల్ కబడ్డీ, బాల్‌బ్యాడ్మింటన్ టోర్నమెంట్స్ హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ స్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు, హనుమకొండ సర్కిల్ సూపరింటెండెంట్ వి.మధుసూదన్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి హాజరై క్రీడలను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ క్రీడలకు రాష్ట్రంలోని ట్రాన్స్ కో, డిస్కంల నుంచి సుమారు 20 టీంలు పాల్గొంటున్నట్లు స్పోర్ట్స్ కౌన్సిల్ నిర్వహకులు తెలిపారు.

రేపటి నుంచి జాతీయ స్థాయి నాటక పోటీలు

వరంగల్ కల్చరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోతన విజ్ఞాన పీఠంలో ఈ నెల 13 నుంచి 15 వరకు జాతీయ స్థాయి నాటక పోటీలు ప్రదర్శిస్తున్నట్లు రంగస్థల కళాకారుల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు కాజీపేట తిరుమలయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, ఐక్య వేదిక పరపతి సంఘం సభ్యుల సహకారంతో వరంగల్ జిల్లా రంగస్థల కళాకారుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో 16వ వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమకాలీన అంశాలను ప్రతిబింబించే ఇతివృత్తంతో ఈనాటకాలు కొనసాగుతాయని, నాటక అభిమానులు, కవులు, కళాకారులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై నాటకాలను వీక్షించాలని కోరారు. జాతీయ స్థాయి నాటక పోటీలకు అఖిల భారత పద్మశాలీ సంఘం మాజీ అధ్యక్షుడు ఈగ మల్లేశం రాజపోషకులుగా వ్యవహరిస్తారని తెలిపారు.

కొప్పూర్‌లో అనుమతి లేని మందుల విక్రయాలు


కొప్పూర్‌లో మందులను సీజ్ చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు

భీమదేవరపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొప్పూర్ గ్రామంలో అనుమతి లేకుండా ఆర్ఎంపీ వైద్యుడు విలాసాగరం శ్రీనివాస్ మందులు విక్రయిస్తున్నట్లు హనుమకొండ, వరంగల్ జిల్లాల డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కొప్పూర్‌లో విలాసాగరం శ్రీనివాస్ అనే ఆర్ఎంపీ వైద్యుడు అనుమతులు లేకుండా మందులు విక్రయిస్తున్నాడని ఫిర్యాదు అందింది. ఈ మేరకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో రూ. లక్ష విలువ చేసే 71 రకాల మందులు లభించాయని, వాటిని సీజ్ చేశామన్నారు. శ్రీనివాస్‌పై 18సీ సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సంవత్సరం జనవరి 1నుంచి ఇప్పటి వరకు జిల్లాలో అనుమతులు లేకుండా మందులు విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేశామన్నారు. వీటి విలువ సుమారు రూ.7లక్షల వరకు ఉంటుందన్నారు. కాలం చెల్లిన మందులు, అనుమతులు లేకుండా విక్రయించడం నేరమన్నారు. పశు సంవర్థక శాఖ, మనుషులకు సంబంధించిన అనుమతి లేని మందులు విక్రయిస్తే చట్టరీత్యా నేరమని, వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. దాడుల్లో బాలకృష్ణ, పావని, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు సర్వం సిద్ధం

(5వ పేజీ తరువాయి)

దుక్కులు దున్నడం ప్రారంభమైంది. మొదట విత్తనాలు రైతులకు అందుబాటులో ఉండేలా ఇప్పటికే చర్యలు తీసుకున్నాం. వరి విత్తనాలు 36,700 క్వింటాళ్లు, మొక్కజొన్న 432 క్వింటాళ్లు, పత్తి 1,95,000 ప్యాకెట్లు, నూనె గింజలు 114 క్వింటాళ్లు, పప్పుధాన్యాలు 37 క్వింటాళ్లు అవసరమవుతాయి. ఆమేరకు వీటిని అందుబాటులో ఉంచడానికి అన్ని ఏర్పాట్లు చేశాము. ఎరువులు వేయడం మొదలుకాగానే వాటిని కూడా రైతులకు అవసరమైనంత మేరకు అందుబాటులో ఉంచుతాం.

విస్తృతంగా తనఖీలు

ఎన్‌ఫోర్సుమెంట్ దాడులు చేస్తోంది. వ్యవసాయ శాఖ సిబ్బంది కూడా విత్తన విక్రయ షాపులను తనఖీ చేసి శాంపుళ్లను సేకరిస్తున్నారు. ఇటీవల పరకాలలో నకిలీ విత్తనాలను విక్రయిస్తున్న ముఠాను పట్టుకొని పెద్దమొత్తంలో నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకున్నది తెలిసిందే. టాస్క్‌ఫోర్సు, పోలీసులు, వ్యవసాయ శాఖ సంయుక్త దాడులు నిర్వహిస్తున్నాయి. ఎక్కడ నకిలీ విత్తనాలు అమ్మకం కాకుండా గట్టి నిఘా వేసి ఉంచాం. అనుమానం కలిగిన ప్రతీ షాపును ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నాం. పత్తి బీటీ-3 విత్తనాన్ని ఒక దాన్నే ప్రభుత్వం నిషేధించింది. ఇందులో జన్యుపరంగా జీన్స్‌ను మార్చారు. ఇది ప్రకృతికి హానికరం. ఇలాంటి విత్తనాల విక్రయంపై నిషేధం అములులో ఉంది. ఎవరు విక్రయించినా చట్టరిత్యానేరం. రైతులు కూడా ఇలాంటి విత్తనాలను సాగు చేయవద్దు.

విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు

రైతులు తమకు కావలసిన విత్తనాలను అధీకృత డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలి. విత్తనాలు కొన్నతర్వాత రశీదును తప్పనిసరిగా తీసుకోవాలి. విత్తనాలువాడిన తర్వాత ఖాళీ ప్యాకెట్లను భద్రపరుచుకోవాలి. దీనిపై లాట్ నెంబర్, ఇతరత్రా వివరాలు ఉంటాయి. ఒక వేళ అవి నకిలీ విత్తనాలైన పక్షంలో సదరు డీలర్ నుంచి పంట నష్టపరిహారం వసూలు చేసేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది. రైతులు తాము విత్తనాలను వాడే ముందు వాటి మొలకెత్తే సామర్థ్యాన్ని పరీక్షించుకుంటే మంచింది. వీటి గురించి రైతు వేదికల్లో చెబుతున్నాం. రైతు ముంగిట్లో శాస్త్రవేత్త, వికసిత్ అభియాన్. రైతు నేస్తం వంటి కార్యక్రమాల్లో కూడా అవగాహన కల్పిస్తున్నారు. ప్రతీ మంగళవారం రైతు వేదికలో వీడియోకాన్ఫరెన్స్‌లో సైతం వివరిస్తున్నాం.

బడిగంటలు మోగే వేళ..

(5వ పేజీ తరువాయి)

అనేక అభివృద్ధి పనులు ప్రారంభించారు. అయితే 15 నెలలు గడుస్తున్నా అభివృద్ధి పనులు అరకొరగానే పూర్తయ్యాయి. బిల్లులు చెల్లించకపోవడంతో కొన్ని చోట్ల కమిటీలు పనులను పూర్తి స్థాయిలో నిలిపివేశారు. వరంగల్ జిల్లాలో 533 పాఠశాలల్లో 458 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు చేసి వాటి ద్వారా 1,228 రకాల అభివృద్ధి పనులు చేపట్టారు. అయితే అందులో ఇప్పటి వరకు 950 రకాల పనులు పూర్తి కాగా, మిగతా పనులు అసంపూర్తిగానే మిగిలాయి. మొత్తం రూ.20.5కోట్ల పనులకు శ్రీకారం చుట్టగా రూ.18.24కోట్ల నిధులు కేటాయించారు. అందులో ఇప్పటి వరకు రూ.11.58కోట్ల పనులు పూర్తి కాగా, రూ.10.25కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. ఇక హనుమకొండ జిల్లాలో 508 పాఠశాలలకు గాను 416 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా రూ.16.98కోట్ల నిధులతో 1,238 పనులను ప్రారంభించగా, 991 పనులు పూర్తవగా మిగతా పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటి వరకు రూ.9.3కోట్ల పనులు పూర్తి కాగా, రూ.4.23కోట్ల నిధులు మాత్రమే విడుదల అయ్యాయి. ఇదిలా ఉండగా, గత ప్రభుత్వం ప్రారంభించిన మన ఊరు-మన బడి అభివృద్ధి పనులు అర్థాంతరంగానే మిగిలిపోయాయి. వరంగల్ జిల్లాలో 223 పాఠశాలల్లో రూ.89.26కోట్లతో ప్రారంభించిన అభివృద్ధి పనులు అర్థాంతరంగానే ఆగిపోయాయి. నాలుగో వంతు నిధులు సైతం విడుదల కాకపోవడంతో పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. హనుమకొండ జిల్లాలోనే 176 పాఠశాలల్లో రూ.40.55 కోట్లతో పనులు ప్రారంభించగా అవి అర్థాంతరంగానే నిలిచిపోయాయి.

మూత్రశాలలు, మరుగుదొడ్లు అంతంత మాత్రమే..

ప్రభుత్వ పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్ల వసతుల పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. వరంగల్‌లోని 13 మండలాలు, హనుమకొండలోని 14 మండలాల్లో సుమారు 25 శాతం పాఠశాలల్లో మూత్రశాలలు నిర్మాణ దశలోనే ఉన్నాయి. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా నిర్మాణవుతున్న మూత్రశాలలు, మరుగుదొడ్లు నిధులు రాక నిర్మాణాలను మధ్యలోనే ఆపేశారు. ముందుగా 25 శాతం నిధులు కేటాయించిన ప్రభుత్వం ఆతర్వాత నిధుల విడుదలలో జాప్యం చేయడంతో అప్పులు చేసి కొంత మేరకు నిర్మాణం చేపట్టిన కమిటీలు ఆ తర్వాత నిధులు రాకపోవడంతో నిర్మాణాలను ఆపేశారు.

ముస్తాబవుతున్న పాఠశాలలు

2025-26 విద్యా సంవత్సరం ప్రారంభానికి ప్రభుత్వ పాఠశాలలు ముస్తాబవుతున్నాయి. పాఠశాలల్లో పేరుకుపోయిన చెత్తను పారిశుద్య కార్మికులు తొలగిస్తున్నారు. తరగతి గదుల్లోని బూజును దులుపుతున్నారు. వాటర్ ట్యాంకులను శుభ్రం చేస్తున్నారు. పాఠశాల ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలను క్లీన్ చేస్తున్నారు. అలాగే పాఠశాలల్లో కరెంట్, నీటి వసతుల కోసం మరమ్మతులను సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చేపడుతున్నారు.

మొదటి రోజే పంపిణీ

ఈ ఏడాది పాఠశాలల పునఃప్రారంభం నాడే విద్యా సంవత్సరం తొలిరోజే విద్యార్థులకు యూనిఫామ్‌లతో పాటు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందజేయనున్నారు. ఒక జిల్లాకు ఇప్పటికే 100శాతం పుస్తకాలు వచ్చాయి. అందులో 86 శాతం పుస్తకాలు పాఠశాలలల్లో పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. 100 శాతం నోట్ పుస్తకాలు, యూనిఫామ్‌లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. వరంగల్ జిల్లాలో మొత్తం 2,49,510 పాఠ్యపుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉండగా, హనుమకొండలో 2,60,240 పాఠ్యపుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. గురువారం నాడు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 33,878 మంది విద్యార్థులకు ఒక్కోజత చొప్పున పంపిణీ చేయనున్నారు. ఇక హనుమకొండలో 30,922 మంది విద్యార్థులకు ఒక్కో జత చొప్పున యూనిఫామ్స్ పంపిణీ చేయనుండగా రెండో జత యూనిఫామ్‌లు మరో 15 రోజుల్లో విద్యార్థులకు పంపిణీ చేయనున్నారు.

వరంగల్ జిల్లాలో పాఠశాలలు

యాజమాన్యం	పాఠశాలలు	విద్యార్థులు
ప్రభుత్వ	77	9,151
లోకల్ బాడి	568	18,135
కేజీబీవీలు	10	2,341
మోడల్ స్కూల్స్	6	2,825
ఎయిడెడ్	58	2,129
గురుకులాలు	36	10,151
ప్రైవేటు	252	77,003
సీబీఎస్ఈ	9	6,762

హనుమకొండ జిల్లాలో..

యాజమాన్యం	పాఠశాలలు	విద్యార్థులు
ప్రభుత్వ	60	6,765
లోకల్ బాడి	432	18,083
కేజీబీవీలు	9	1,879
మోడల్ స్కూల్స్	3	901
ఎయిడెడ్	25	1,222
గురుకులాలు	28	11,516
ప్రైవేటు	285	75,469
సీబీఎస్ఈ	24	18,015


కరీమాబాద్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న మూత్రశాలలు


కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్లాబ్‌ల వరకే నిర్మాణమైన మూత్రశాలలు, మరుగుదొడ్లు


ఎల్కతుర్తి మండలం దండెపల్లి జడ్పీహెచ్ఎస్‌లోని పాఠశాల ఆవరణను శుభ్రం చేస్తున్న దృశ్యం

బడికి బదులు పనికి..

- వెట్టిచాకిరిలో బందీ అవుతున్న బాల్యం
- పేదరికంతో పుస్తకం పట్టని చిన్ని చేతులెన్నో..
- ఆపరేషన్ స్మైల్, ముస్కాన్‌తో చదువులమ్మ ఒడికి
- నేడు ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం



జనగామలో భవన నిర్మాణ పని వద్ద తనిఖీ చేస్తున్న ఆపరేషన్ ముస్కాన్ బృందం (ఫైల్)

జనగామ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పేదరికం, నిరక్షరాస్యత చిన్నారుల జీవితాలను అంధకారంలోకి నెడుతున్నాయి. పుస్తకం చేతబట్టి చదువులమ్మ ఒడిలో ఆడుతూ పాడుతూ గడపాల్సిన బాలలు కార్మికులుగా మగ్గిపోతున్నారు. చిన్న వయస్సులోనే బరువులు మోస్తూ కూలీలుగా మారుతున్నారు. తమ ఈడు పిల్లలతో చదుకోవాల్సిన చిన్నారులు జీవనోపాధి కోసం శ్రమించాల్సి వస్తోంది. బడిలో పాఠాలు నేర్చుకోవాల్సిన బాలలు పనిలో కార్మికులుగా మిగిలిపోతున్నారు. చట్టాలు ఎన్ని వచ్చినా బాల కార్మికులు ఎక్కడో ఒక చోట మిగిలిపోతూనే ఉన్నారు. చిన్నారి చేతులకు వెట్టి చాకిరి నుంచి విముక్తిని కల్పించి బడికి బాటలు వేసేలా చేయాల్సిన ఆవశ్యకత ఉంది. నేడు(గురువారం) ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

పేదరికంతో విద్యకు దూరం

పిల్లలు బాల కార్మికులుగా మారడానికి ప్రధానంగా పేదరికం, తల్లిదండ్రులు నిరక్షరాస్యులు కావడం, చదువుకోవడానికి అనుకూలతలు లేకపోవడం, పిల్లల పెంపకం కుటుంబానికి భారం కావడం కారణాలుగా ఉన్నాయి. నేటి ఆధునిక సమాజంలో చాలా కుటుంబాలు పేదరికంలోనే మగ్గుతున్నాయి. ప్రభుత్వాలు ఎన్ని సంక్షేమ పథకాలు పెట్టినా పేదలు, పేదలుగానే మిగిలిపోతున్నారు. గ్రామీణ ప్రాంతాలకు తోడు పట్టణ ప్రాంతాల్లోనే నిరక్ష్యరాస్యత శాతం ఎక్కువగానే ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశ అక్షరాస్యత రేటు 72.98 ఉండగా తెలంగాణ అక్షరాస్యత 66.54 శాతంగా ఉంది. జనగామ జిల్లా వరకు చూస్తే 61.44 శాతంగా ఉంది. ఈ లెక్కలను బట్టి చూస్తే దాదాపు 35 శాతానికి పైగా నిరక్షరాస్యులు ఉన్నట్లే లెక్క. తల్లిదండ్రులు నిరక్షరాస్యులు కావడం, పేదరికంతో కొట్టుమిట్టాడుతుండడంతో వారికి పిల్లల చదువు కంటే పనిలో పెట్టడమే తక్షణ కర్తవ్యంగా భావిస్తున్నారు.

పనిలో పెట్టుకుంటే కఠిన శిక్షలు

బాల కార్మిక నిషేధం, నియంత్రణ చట్టం (1986, సవరణ చట్టం 2016) ప్రకారం 14 ఏళ్ల లోపు వయస్సు వారు పని చేస్తే బాల కార్మికులుగా వ్యవహరిస్తారు. ఈ వయస్సులోపు ఉన్న వారికి పనిలో పెట్టుకుంటే యజమానులకు కఠిన శిక్ష విధించే అవకాశం ఉంది. బాల కార్మిక చట్టంలో భాగంగా ప్రమాదకరమైన, ప్రమాదకం కాని పనులుగా విభజించారు. 14 ఏళ్ల లోపు బాలలతో ఏ పని చేయించ కూడదు. 14 నుంచి 18 ఏళ్ల మధ్య కౌమార బాలలతో ప్రమాదకరమైన పనులు చేయించవద్దని చట్టంలో నిర్ధేశించారు. బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే యజమానులకు ఆరు నుంచి 2 సంవత్సరాల వరకు జైలు లేదా రూ. 20 వేల నుంచి రూ. 50 వేల వరకు జరిమానా పడొచ్చు లేదా ఈ రెండింటినీ విధించవచ్చు. తిరిగి అదే తప్పు చేస్తే మూడేళ్ల వరకు కచ్చితమైన జైలు శిక్ష పడే అవకాశం ఉంది.

బడి వదిలి పనికి..

ఆడుతూ పాడుతూ చదుకోవాల్సిన పిల్లలు పేదరికం కారణంగా బాల కార్మికులుగా మారుతున్నారు. ఆర్థిక కారణాలతో హోటళ్లు, ఇటుక బట్టీలు, బస్సు, రైల్వే స్టేషన్లు, చాయ్ దుకాణాలు, భవన నిర్మాణ పనుల్లో, మైనింగ్, పరిశ్రమలు, చిన్నపాటి కర్మాగారాల్లో కూలీలుగా మారుతున్నారు. ఇందులో ఎక్కువగా పేద వర్గానికి చెందిన పిల్లలే కాకుండా తప్పిపోయిన పిల్లలు, తల్లిదండ్రులు చనిపోయి అనాథలుగా మారిన పిల్లలు ఎక్కువగా ఉండడం ఆందోళన కల్గించే అంశం. తల్లిదండ్రులు కోల్పోయి, తప్పిపోయిన పిల్లలు, పేదరికంలో మగ్గుతున్న పిల్లలను బాల కార్మికులుగా మారకుండా చూడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉంది. గురువారం ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రతిఒక్కరూ ప్రతిన బూనాల్సిన అవసరం ఉంది. బాల కార్మిక వ్యవస్థను రూపుమాపడంతో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలు సత్ఫలితాలిస్తున్నాయి. జనగామ జిల్లాలో గడిచిన ఎనిమిదేళ్ల కాలంలో అనగా 2017 నుంచి 2025 వరకు 654 మంది బాల కార్మికులకు విముక్తి కలిగింది. ఇందులో 558 బాలురు ఉండగా 96 మంది బాలికలు ఉన్నారు. ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం, కార్మిక, విద్య, పోలీస్ శాఖలు, చైల్డ్ హెల్ప్‌లైన్, మహిళల రక్షణ విభాగాలు సంయుక్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి.



గోవిందరావుపేటలో జరిగిన రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

భూ భారతితో ప్రతి రైతుకు న్యాయం

- అధికారులు తప్పు చేస్తే చర్యలు తప్పవు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

గోవిందరావుపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రైతుల భూ సమస్యలను పరిష్కరించడానికి ప్రజా ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని ప్రవేశ పెట్టిందని, ఈ చట్టం ద్వారా ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం గోవిందరావుపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో జరిగిన భూ భారతి అవగాహన సదస్సులో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయసీతక్క, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, ములుగు కలెక్టర్ టీఎస్.దివాకర, ఎస్పీ శబరీశ్‌లతో కలిసి పాల్గొన్నారు. ముందుగా ఆయన భూ సమస్యల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గత పాలకులు తెచ్చిన ధరణి చట్టంతో రైతులు అనేక ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఈ చట్టంలో ప్రతి సమస్యను పరిష్కరించుకునేందుకు వీలు కల్పించిందని చెప్పారు. అర్హులైన వారందరికీ అండగా ఉండేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ప్రతి రైతుకు న్యాయం చేయడానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని, అధికారులు తప్పు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మంత్రి సీతక్క మాట్లాడుతూ వ్యవసాయం చేస్తున్న ప్రతి రైతుకు పట్టాలు అందించాలన్న ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి అనేక అంశాలతో భూ భారతి చట్టాన్ని పొందుపరిచారని, చట్టం అమలుపై రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో మొదటి విడతలో పైలెట్ ప్రాజెక్టులుగా తీసుకుని విజయవంతం చేశారని అన్నారు. రెండో విడతలో హైదరాబాద్ మినహా మిగతా 28 జిల్లాల్లోని 28 మండలాలను పైలెట్‌గా ఎంపిక చేశామని చెప్పారు. తొలి విడతలో ములుగు జిల్లా వెంకటాపూర్ మండలాన్ని ఎంపిక చేసి ప్రజల నుంచి 4,100 దరఖాస్తులు స్వీకరించామని, ఇప్పటి వరకు 2వేలకు పైగా సమస్యలను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని రైతులందరికీ భూములపై హక్కులు పొందడానికి ఈ చట్టం ఎంతగానో దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ఆగస్టు 15 నాటికి రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆమె వెల్లడించారు. భూ భారతి చట్టం ద్వారా తహసీల్దార్, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలోనే సమస్యలు పరిష్కరిస్తామని, కలెక్టర్ వద్ద సాధ్యం కాకపోతే సీసీఎల్‌ఏలో ఫిర్యాదు చేయవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సీహెచ్.మహేందర్‌జీ, సంపత్‌రావు, ఆర్డీవో వెంకటేష్, సంబంధిత శాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విపత్తులను ఎదుర్కొనేందుకు సిద్ధం

- ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాల ఏర్పాటు
- వరదల సమయంలో తక్షణ స్పందన
- అందుబాటులో అధునాతన పరికరాలు, వాహనాలు



రెస్క్యూ టెండర్ వాహనం



బోటు, ఏరియా లైట్లు



ఎస్‌డీఆర్ఎఫ్ వినియోగించే పరికరాలు

మట్టెవాడ(వరంగల్), జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వరదలు, విపత్తులను ఎదుర్కొనేందుకు, తక్షణ సహాయ చర్యలు చేపట్టేందుకు ప్రత్యేక ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉంటాయి. వీటిని అగ్నిమాపక శాఖ ఏర్పాటు చేసింది. ఫైర్ స్టేషన్ల వారిగా సిబ్బందిని ఎంపిక చేసి 10 మంది చొప్పున 24గంటల పాటు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ ఫైర్ స్టేషన్లలో పనిచేస్తున్న సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. మొత్తం 60 మంది సిబ్బంది వర్షాకాలంలో రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నారు. వరంగల్ జిల్లాలో అకస్మిక వరదలు భారీవర్షాల సమయంలో బాధితులను అదుకునేందుకు, సహాయ చర్యల కోసం ప్రత్యేక శిక్షణను పొందారు.

వరదల సమయంలో బాధితులను రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రత్యేక వాహనాలను సిద్ధంగా ఉంచారు. అదే విధంగా అనేక రకాల అధునూతన పరికరాలను వినియోగించడంతో ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. భారీ వృక్షాలు పడిపోయినప్పుడు, రోడ్లు కట్టింగ్ చేసేందుకు ప్రత్యేక కట్లర్లను వినియోగించనున్నారు. వరదల సమయంలో బోట్ల ద్వారా లోతట్టు ప్రాంతాలకు వెళ్లేందుకు బోట్లను సిద్ధంగా ఉంచారు. వరదల సమయంలో ప్రజల ప్రాణాలను రక్షించేందుకు లైఫ్ బాయ్స్, లైఫ్ జాకెట్లు, రోప్‌లు, రెస్క్యూ ట్యూబ్‌లు, ఏరియా లైటింగ్ సిస్టం, జనరేటర్, రోడ్డు కట్టర్, రేయిన్‌కోట్లు, బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు మినీ వ్యాన్లు, ట్రక్కులను వినియోగించనున్నారు.

అధునాతన పరికరాలు సిద్ధం

పడవలు 3, లైఫ్‌బాయ్స్ 100, లైఫ్ జాకెట్లు 50, రోప్స్ -30, ఏరియా లైటింగ్ సిస్టం-2, జనరేటర్లు, పిడ్డర్, కట్టర్లు-2, డీసీఎం వ్యాన్-1, ట్రక్కు-1, మినీవ్యాన్-1తోపాటు స్ట్రెచర్, జనరేటర్లు తదితర పరికరాలు అందుబాటులో ఉంచారు.



RAHUL GANDHI
LEADER OF OPPOSITION
LOK SABHA

9th June, 2025

Dear Dr. Kancha Ilaiah,

I am sorry to hear about the passing of your brother Shri Kancha Kattaiah. Our siblings are often our first friends and confidantes. Their love and support help us navigate life at its hardest. I am sure that your brother's wisdom and affection will continue to guide you.

I can imagine your anguish and sorrow at losing him. Please accept my heartfelt condolences. My thoughts and prayers are with you and your family in this difficult time.

Sincerely,

రాహుల్ గాంధీ పంపిన సంతాప సందేశ పత్రం

ప్రొఫెసర్ కంచ ఐలయ్యకు రాహుల్ గాంధీ సంతాప సందేశం

చెన్నారావుపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాపయ్యపేట గ్రామానికి చెందిన ప్రొఫెసర్ కంచ ఐలయ్య సోదరుడు కంచ కట్టయ్య ఈ నెల 7న గుండె పోటుతో మృతి చెందగా, లోక్‌సభ ప్రతి పక్ష నాయకుడు రాహుల్ గాంధీ సంతాప సందేశాన్ని బుధవారం పంపించారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

రిలయన్స్ గుప్పిట్లోకి పశుగ్రాసం

- టన్నుల కొద్దీ సేకరిస్తున్న ఇండస్ట్రీ
- యంత్రాలతో నేరుగా పొలాల వద్దకే రాక
- తక్కువ ధరకే గంపగుత్తగా కొనుగోళ్లు
- పశువులకు కరువవుతున్న వరిగడ్డి
- పాల పరిశ్రమకు పొంచి ఉన్న ముప్పు



రైతు పొలాల్లో రిలయన్స్ ఇండస్ట్రీ యంత్రాలు కట్టిన వరి గడ్డి కట్టలు

ఎల్కతుర్తి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ ఆధారిత రైతులు ప్రత్యామ్నాయంగా పాడి పశువుల పోషణతో ఆర్థికాభివృద్ధి సాధించే వారు. వ్యవసాయంలో యాంత్రికణరణ వినియోగం పెరగడంతో పశు పోషణ భారమైంది. కేవలం పాల ఉత్పత్తిపై ఆధారపడిన రైతులు తమ వ్యవసాయ పొలాల్లో లభించే వరి గడ్డిని నిల్వ చేసుకుని పశువులకు గ్రాసంగా ఉపయోగించుకుని పశు పోషణ చేస్తున్నారు. మెట్ట ప్రాంతానికి చెందిన పశువుల పెంపకం దారులు ఈ ప్రాంతం నుంచి పశు గ్రాసాన్ని కొనుగోలు చేసేవారు. దీంతో పశువులకు కావలసినంత పశుగ్రాసం ఎల్కతుర్తి మండల పరిధిలోని ఏ గ్రామానికి వెళినా అందుబాటులో ఉండేది. కానీ ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామ శివారులో ఇటీవల రిలయన్స్ ఇండస్ట్రీ బయో ఎనర్జి గ్యాస్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. గ్యాస్ తయారీకి వరి గడ్డి అవసరం ఉండడంతో రైతుల వద్ద భారీగా గడ్డిని సేకరించి నిల్వ చేస్తున్నారు. దీంతో పశు పెంపకం దారులకు పశుగ్రాసం కొరత ఏర్పడింది. ఎల్కతుర్తి మండల పరిధిలోని ఎల్కతుర్తి, బావుపేట, తిమ్మాపూర్, కేశవపూర్, గుంటూర్‌పల్లి, దండేపల్లి, వీరనారాయణపూర్, సూరారం, గ్రామాలు పూర్తిగా ఎస్సారెస్పీ ప్రధాన కాలువకు దిగువన ఉన్నాయి. ఈ ప్రాంతంలో ప్రధాన పంటలుగా పూర్తి విస్తీర్ణంలో వరి పంటలను సాగు చేస్తున్నారు. సంవృద్ధిగా పంటలు పండడంతో కావలసినంత పశుగ్రాసం అందుబాటులో ఉంటుంది. మెట్ట ప్రాంతానికి చెందిన రైతులు, పాల డైయిరీలకు చెందిన వ్యాపారులు ఈ ప్రాంతం నుంచి ఎక్కువగా వరి గడ్డిని రైతుల వద్ద కొనుగోలు చేసేవారు. దీంతో పశు పెంపకం దారులకు పశుగ్రాసం కొరత లేకుండా ఉంటుంది.

దక్కని గిట్టుబాటు ధర

రైతులు వరి పంట సాగు చేయగా కోత అనంతరం వచ్చిన గడ్డిని వాములుగా నిల్వ చేసుకుని గిట్టు బాటు ధరలకు విక్రయించుకుని ఆదాయం పొందేవారు. రిలయన్స్ ఇండస్ట్రీ నిర్వాహకులు భారీ యంత్రాలతో నేరుగా రైతు పొలంలో సుమారు రెండు క్వింటాళ్ల బరువు ఉన్న వరి కట్టలు ప్రత్యేక మిషన్‌ల ద్వారా కడుతున్నారు. ఒక్క వరి గడ్డి కట్టకు రైతుకు రూ. 50 మాత్రమే చెల్లించి తీసుకెళ్తున్నారు. ఒక ఎకరంలో సుమారు 10 నుంచి 12 వరి గడ్డి కట్టలు తయారు చేస్తున్నారు. దీంతో రైతుకు సుమారుగా రూ. 500 నుంచి వెయ్యి లోపు వరకు మాత్రమే గిట్టుబాటు అవుతుంది.

టన్నుల కొద్దీ సేకరణ

ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామ శివారులో రిలయన్స్ బయో ఎనర్జి గ్యాస్ ఉత్పత్తి ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. గ్యాస్ ఉత్పత్తి కోసం వరి గడ్డి పెద్ద మొత్తంలో అవసరం ఉండడంతో ఎల్కతుర్తి మండల పరిధిలోని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున వరి గడ్డిని సేకరిస్తున్నారు. రబీలో పండిన వరి గడ్డిని రిలయన్స్ ఇండస్ట్రీ నిర్వహకులు మొదటి సారిగా వరి గడ్డిని సేకరించించే పనిలో పడ్డారు. గ్రామాల్లో సేకరించిన వరి గడ్డి కట్టలను ఇండస్ట్రీకి తరలించి నిల్వ చేస్తున్నారు. దీంతో పశువులకు పశుగ్రాసం కొరత తీవ్ర స్థాయిలో నెలకొననుంది.

ఉపాధి కోల్పోతున్న ట్రాక్టర్ యాజమానులు

వరి గడ్డి కట్టలు కట్టడానికి గ్రామాల్లో ట్రాక్టర్ యాజమానులు లక్షలు వెచ్చించి గడ్డి కట్టల యంత్రాలను కొనుగోలు చేశారు. రైతులకు అందుబాటులో ఉంటు గడ్డి కట్టలు కట్టి ఆదాయం పొందుతున్నారు. ప్రస్తుతం రిలయన్స్ ఇండస్ట్రీ భారీ యంత్రాలతో గడ్డి కట్టలు కట్టడంతో పాటు వారే స్వయంగా తీసుకెళ్లడంతో ట్రాక్టర్ యాజమానులు ఉపాధి కోల్పోతున్నారు. లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన యంత్రాలు మూలకు పడి ఉపాధి కొల్పోతున్నారు.

పోలీసుల కొరడా..

ఎల్కతుర్తి నుంచి వరి గడ్డి కట్టలను మెట్ట ప్రాంతాలకు, డెయిరీ ఫాంలకు స్థానిక ట్రాక్టర్‌ల ద్వారా తరలిస్తుండగా వాటిని పోలీసులు పట్టుకుని ఇబ్బందులకు గురి చేస్తున్నట్టు ట్రాక్టర్ యాజమానులు ఆరోపిస్తున్నారు.

గతంలో ఏ ప్రాంతానికి గడ్డిని తరలించిన పోలీసులు వాహనాలను అడ్డుకునే వారు కాదని పేర్కొన్నారు. రిలయన్స్ ఇండస్ట్రీ గడ్డి సేకరిస్తున్నప్పటి నుంచి పోలీసులు గడ్డి కట్టలు తరలించకుండా వాహనాలను అడ్డుకుని ఫైన్‌లు వేస్తున్నారని ఆరోపిస్తున్నారు. రిలయన్స్ నిర్వహకులు గడ్డిని ఇతర ప్రాంతాలకు తరలించకుండా ఉండేందుకు పోలీసులచే వాహనాలను అడ్డుకుని ఫైన్‌లు వేయిస్తున్నారని ట్రాక్టర్ యాజమానులు ఆరోపిస్తున్నారు.

రూల్స్ జానాన్తైనై..

- ప్రజాప్రతినిధులు, అధికారుల అండదండతో ఇసుక అక్రమ రవాణా..?
- వే బ్రిడ్జీల వద్ద చెక్ పోస్టులు కరువు
- ఓవర్ స్పీడ్‌తో ప్రమాదాలు...
- మృత్యువాత పడుతున్న మూగజీవాలు
- ఇసుక లారీలతో తరుచూ ట్రాఫిక్ జామ్



ఇసుక లారీ ఢీ కొట్టడంతో మృతి చెందిన రవికిరణ్ (ఫైల్ ఫొటో)

ములుగు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాకు అడ్డు, అదుపు లేకుండా పోతుంది. పలు క్వారీల నిర్వాహకులు ప్రజా ప్రతినిధులు, అధికారులతో కుమ్మక్కై ఇష్టారీతిన ఇసుక తోడేస్తున్నారు. నిబంధనలను తుంగలో తొక్కి పర్మిషన్ లేని లారీలలో ఇసుక నింపుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కొందరు వ్యాపారులు దనార్జనే ధ్యేయంగా జీరో దందా సాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. లారీలలో పరిమితికి మించి ఇసుక తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి పెడుతున్నారు. ఇదిలా ఉండగా లారీ డ్రైవర్లు మితిమీరిన వేగంతో నడుపుతూ ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. ఇసుక లారీల మూలంగా జాతీయ రహదారిపై తరచూ ట్రాఫిక్ జామవుతుంది. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లారీలు అతి వేగంతో వచ్చి ఢీ కొట్టడంతో ప్రజలు, మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంపట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా

ఇసుక క్వారీలలో మైనింగ్ పనులు చేట్టాలంటే పలు నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. అయితే జిల్లాలో కొందరు రేజింగ్ కాంట్రాక్టర్లు వారికేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక తవ్వకాలు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు తవ్వకాలు చేపట్టవచ్చని కేంద్ర ప్రభుత్వం మార్గ దర్శకాలు చెబుతున్నాయి. ఇందుకు కాస్త వెసులు బాటు కల్పిస్తూ టీజీఎండీసీ రాత్రి 9 గంటల వరకు తవ్వకాలు నిర్వహించవచ్చని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. అలాగే 2 మీటర్ల లోతు కన్నా ఎక్కువ తోడకూడదనే నిబంధన కూడా ఉంది. వీటితో పాటు ఓవర్‌లోడ్, పెసా చట్టం అమలు వంటి నిబంధనలు ఉన్నాయి. లారీలలో ఇసుక నింపించడం ద్వార అక్కడున్న ప్రజలకు కాస్త జీవనోపాధి దొరుకుతుంది.

అయితే పలువురు కాంట్రాక్టర్లు అవేవి తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తూ జేసీబీలు, ప్రొక్రేనర్లను పెట్టి లారీలలో ఇసుక నింపిస్తూ మా పొట్ట కొడుతున్నారని పలు ఆదివాసి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. లారీల్లో అదనపు బకెట్ వేస్తూ టన్నుకు అదనంగా డబ్బులు వసూల్ చేస్తున్నారని, దీంతో ప్రభుత్వం ఆదాయానికి గండి పడుతుందని వారు చెబుతున్నారు. గతంలో వే బ్రిడ్జీల వద్ద అధికారులు చెక్ పోస్టులు ఏర్పాటు చేశారని, అయితే ప్రస్తుతం వాటిని తొలగించారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ తతంగమంతా కొందరు అధికారుల కనుసన్ననలోనే జరుగుతుందని అంటున్నారు. ఇసుకను నిబంధనలకు మించి లోడ్ చేయడానికి లేదు. అయితే కొన్ని చోట్ల పలువురు కాంట్రాక్టర్లు అదనపు బకెట్ల పేరిట వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీస్, రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు రాత్రి సమయంలో క్వారీల వద్ద ఉండక పోవడంతో అదనపు బకెట్ దందాకు తెరలేపి సొమ్ము చేసుకు ంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు షెడ్యూల్ తెగలకు చెందాల్సిన హక్కులను వారి అధికారంతో దక్కించుకుంటున్నారని చెబుతున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇసుక మైనింగ్ గిరిజన సొసైటీల ద్వారా మాత్రమే జరపాలని, అలాంటిది టెండర్లకు పిలిచి కాంట్రాక్టర్లకు అప్పగించడంతో వారు లాభపడుతున్నారని, దీంతో పెసా చట్టం లక్ష్యం నీరుగారి పోతుందని అంటున్నారు.

ఓవర్ స్పీడ్‌తో ప్రమాదాలు

ములుగు జిల్లాలోని తాడ్వాయి, వాజేడు, వెంకటాపురం, మంగపేట మండలాల నుంచి నిత్యం వందలాది లారీలలో హైదరాబాద్, హన్మకొండ, వరంగల్ తదితర ప్రాంతాలకు ఇసుకను తరలిస్తుంటారు. కాగా 12 టైర్స్ లారీలో 26 టన్నులు, 14 టైర్ల లారీలో 32 టన్నుల ఇసుకను మాత్రమే తీసుకెళ్లాల్సి ఉంటుంది. అయితే పరిమితికి మించి ఇసుకను నింపుకుని ఓవర్ స్పీడ్‌తో వెళ్తున్న క్రమంలో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో మూగజీవాలు, ప్రజలు మృత్యువాత పడుతున్నారు.

ఇటీవలి ప్రమాదాలు..

ములుగు జిల్లా 163వ జాతీయ రహదారి వెంట ప్రయాణిస్తున్న ఇసుకు లారీల వల్ల తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ప్రజలతో పాటు మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయి. అందులో కొన్ని ప్రమాదాల వివరాలు.. జనవరి 2న మంగపేట మండలం కమలాపూరంలో ఇసుక లారీ ఢీ కొనడంతో దోమల నర్సయ్యకు చెందిన రెండు గేదెలు మృతి చెందాయి. ఫిబ్రవరి 6న కమలాపురం ఆర్ఎంసీ చర్చి సమీపంలో ఇసుక లారీ ఢీకొట్టడంతో నిమ్మల సత్తమ్మకు చెందిన రెండు సూడి గేదలు మృత్యువాత పడ్డాయి. ఏప్రిల్ 23న ఏటూరునాగారం మండలంలోని జంపన్నవాగు రెండో బ్రిడ్జివద్ద ఇసుక లారీ అతివేగంతో వచ్చి ఢీ కొట్టడంతో వెంకటాపురం మండలం బస్తగూడెం గ్రామానికి చెందిన ద్విచక్ర వాహనదారుడు రవికిరణ్ మృతి చెందాడు. మరో వ్యక్తి రవి శంకర్ తీవ్రంగా గాయపడ్డాడు. మే 2న ఏటూరునాగారం మండలం చిన్న బోయినపల్లి వద్ద వేగంగా దూసుకువస్తున్న ఇసుక లారీని తప్పించబోయిన ఆటో ఆర్టీసీ బస్సును ఢీ కొట్టడంతో ఒక వ్యక్తి కాలు విరిగింది, మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి.

అదే నెల 18న తాడ్వాయి మండల కేంద్రంలో 163 జాతీయ రహదారి పక్కకు నిలిపి ఉన్న ట్రాక్టర్‌ను వేగంగా వచ్చిన ఇసుకలారీ ఢీ కొట్టడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపేరం మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన ఉప్ప దుర్గ, చేతుపల్లి సీత మరణించారు. 25 మందికి పైగా గాయపడ్డారు. అదె నెల 30న ఏటూరునాగారం మండలం జీడివాగు వద్ద ఇసుక లారీ ఢీ కొట్టడంతో రెండు పాడి గేదలు అక్కడికక్కడే మృతిచెందాయి. ఈ నెల 1న అదే మండలంలోని చిన్నబోయినపల్లిలో ఇసుక లారీ ఢీ కొట్టడంతో ఒక పాడిగేదె మృత్యువాత పడింది. ఈ నెల 5న అదే మండల కేంద్రంలో ఇసుక లారీ ఢీ కొట్టడంతో గేదె మరణించింది. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా లారీ డ్రైవర్లు నిర్లక్ష్యంగా వెళ్తుంటే ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఇలాంటి ప్రమాదాలతో ప్రజలు విసిగి వేసారుతుంటే.. నిత్యం గంటల తరబడి ట్రాఫిక్ జామై వాహనదారులు, ప్రయాణిలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్టవేసి, లారీలను కట్టడి చేసి ప్రమాదాలను అరికట్టాలని, ట్రాఫిక్ జామ్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కేఎంసీలో 5కే రన్

వరంగల్ మెడికల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ సర్జన్స్ డేను పురస్కరించుకొని సర్జన్స్ సేవలను గుర్తించి ఏఎస్ఐ వరంగల్ బ్రాంచ్, ఐఎంఏ వరంగల్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సర్జన్స్ బుధవారం 5కే రన్ నిర్వహించారు. ఈ ర్యాలీ కేఎంసీ నుంచి ఐఎంఏ వరంగల్ బ్రాంచ్ వరకు కొనసాగింది. ఏఎస్ఐ స్టేట్ చైర్మన్ డాక్టర్ మోహన్‌దాస్, ఐఎంఏ వరంగల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ.. ఈర్యాలీ ద్వారా ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడమే కాకుండా సర్జన్ల పాత్రను సమాజానికి వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కూరపాటి రమేశ్, డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్, డాక్టర్ నాగేందర్, డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ రూప, డాక్టర్ కార్తీక్, డాక్టర్ నవీన్, కేఎంసీ విద్యార్థులు పాల్గొన్నారు.



5కే రన్ నిర్వహిస్తున్న దృశ్యం



ఆపద మిత్రులకు నీటి ప్రమాదలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ అధికారి నాగరాజు

ఆపద మిత్రులకు నీటి ప్రమాదాలపై శిక్షణ

వరంగల్ క్రైం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో 11రోజులుగా ఆపదమిత్రులకు ఇస్తున్న శిక్షణలో భాగంగా బుధవారం నీటి ప్రమాదాలనుంచి బాధితులను కాపాడే టెక్నిక్స్‌పై రెడ్డిపురంలోని చెరువులో అవగాహన కల్పించారు. ఈ శిక్షణకు 257 మంది ఆపద మిత్రులు హాజరు కాగా,నీటిలోపడ్డవారిని ఎలా ఒడ్డుకు తేవాలనే దానిపై బోటుపై తిప్పుతూ ఇన్‌చార్జి అగ్నిమాపకశాఖ అధికారిఅంగోతు నాగరాజుమెళకువలు నేర్పారు.

హనుమకొండ సీఐగా శివకుమార్ బాధ్యతలు

వరంగల్ క్రైం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ ఇన్‌స్పెక్టర్‌గా ఎం.శివకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. 2012 ఎస్సై బ్యాచ్‌కు చెందిన శివకుమార్ అదిలాబాద్‌లోని పలు పోలీసస్టేషన్‌లలో ఎస్సైగా విధులు నిర్వర్తించి సీఐగా పదోన్నతి పొందిన అనంతరం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు అలాట్ అయి ఇంతేజార్‌గంజ్ సీఐగా కొంత కాలం విధులు నిర్వర్తించాడు. ఆ తర్వాత సీసీఎస్‌లో విధులు నిర్వర్తిస్తూ ప్రస్తుతం జరిగిన బదిలీలల్లో హనుమకొండ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ కాగా బుధవారం విధుల్లో చేరారు.



ఇన్స్‌పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న శివకృష్ణ

నిబంధనలను ఉల్లంఘించిన వాహనదారులకు జరిమానా

వరంగల్ క్రైం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన 23మంది వాహనదారులను బుధవారం కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి ఎ.వేణుగోపాల్ జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.సీతారెడ్డి తెలిపారు. 23 మందిలో 18 మంది డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడగా రూ.24600 జరిమానా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ ఐదుగురికి రూ.3800 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలి

వడ్డెపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ గోపాల్‌పూర్ క్రాస్ రోడ్డులోని హన్మంతరావు నగర్‌లో గల వేంకట గణేశ సాయి సువర్చల అభయాంజనేయ స్వామి దేవాలయంలో ఈ నెల 13నుంచి 15వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ ప్రధానార్చకుడు ఆరుట్ల కిరణ్‌కుమారాచార్యులు తెలిపారు. ఈ నెల 13న స్వామివారికి అభిషేకాలు, సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం, 14నలక్ష్మీ వేంకటేశ్వర స్వామి హోమం, విఘ్నేశ్వరుడికి పంచామృతం, 15న శ్రీభూనీళా సమేత శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు. ఇదే రోజు మధ్యాహ్నం 12గంటలకు మహా అన్నదాన కార్యక్రమం జరుగుతుందని భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని దర్శించుకొని ఆయన కృపకు పాత్రులు కావాలని కోరారు.

తప్పిపోయిన వృద్ధుడిని కుమారుడికి అప్పగింత

మడికొండ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన వృద్ధుడిని పోలీసులు చేరదీసి తన కుమారుడికి అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మసాగర్ మండలంధర్మపురం గ్రామానికి చెందిన ఎం.డి. హైదర్ సాబ్ అనే వృద్ధుడు మంగళవారం జగిత్యాలలో ఉంటున్న తన కుమార్తె వద్దకు వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి మడికొండకు చేరుకొని ఎక్కడికి వెళ్లాలో తెలియక వాల్మీకి నగర్ వద్ద ఒక చోటనే ఉండడాన్ని స్థానికులు గమనించారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఘట నా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ధర్మపురంలో ఉన్న వృద్ధుడి కుమారుడు రహీముద్దీన్‌ను పిలిపించి అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఎస్సై రాజ్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ జయరాజ్, కానిస్టేబుల్ రాజు పాల్గొన్నారు.



తప్పిపోయిన వృద్ధుడిని అతడి కుమారుడకి అప్పగిస్తున్న ఇన్‌స్పెక్టర్ కిషన్

పోలీస్ కస్టడీ నుంచి దొంగ పరార్

ఎంజీఎం ఆస్పత్రిలో ఘటన

మట్టెవాడ జూన్ 11, (ఆంధ్రజ్యోతి): పోలీసుల కళ్లు గప్పి కస్టడీలో ఉన్న దొంగ పరారయ్యాడు. మట్టెవాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట మండలం కడిపికొండ ప్రాంతానికి చెందిన కట్కూరి సాయికుమార్‌ను దొంగతనం కేసులో కాజీపేట పోలీసులు అరెస్టు చేశారు. అతడిని రిమాండ్‌కు తరలించే క్రమంలో వైద్య పరీక్షల నిమిత్తం బుధవారం ఎంజీఎం ఆస్పత్రికి తీసుకువచ్చారు.

ఈ క్రమంలో ఎస్కార్ట్ పోలీసుల కళ్లుగప్పి పారిపోయాడు. దీంతో కాజీపేట పోలీసులు బుధవారం రాత్రి మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడి కోసం మట్టెవాడ, కాజీపేట పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. నగరంలో సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు.

మందు బాబులను చెదరగొట్టిన పోలీసులు

వరంగల్ క్రైం, జూన్11(ఆంధ్రజ్యోతి): హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రంజిత్ వైన్స్ పరిసరాల్లో రోడ్లపై విచ్చలవిడిగా మద్యం తాగుతున్న మద్యం బాబులను సీఐ శివకుమార్ చెదరగొట్టారు. పట్టుబడ్డ వారిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైన్‌షాప్ నిర్వాహకులను సైతం బయట మద్యం తాగనివ్వొద్దని హెచ్చరించారు.

రేపు పద్మశ్రీ మంద కృష్ణమాదిగకు సన్మానం

కేయూ క్యాంపస్ జూన్ 11 ,(ఆంధ్రజ్యోతి): జూన్ 13న ఆదివారం పద్మశ్రీ మంద కృష్ణమాదిగను వర్సిటీ మాదిగఎంప్లాయీస్ ఫెడరేషన్ సమక్షంలోఘనంగా సన్మానిస్తామని కేయూ మాదిగ ఉద్యోగుల సంఘం అధ్యక్షకార్యదర్శులు కేయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోడేటి శ్రీనివాస్, డాక్టర్ ఎన్.సుజాతలు తెలిపారు. శుక్రవారం కేయూ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్, సుజాతలు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ పోరాట ఫలితంగా అత్యున్నత పురస్కారం పొందిన మంద కృష్ణమాదిగ సెనెట్ హాల్‌లో ఘనంగా సన్మానిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ సంకినేని వెంకట్, డాక్టర్ పుల్లా శ్రీనివాస్, బొడ్డు దయాకర్, మంద భాస్కర్, డాక్టర్ వడ్డెపల్లి మధు, బొట్ల మనోహర్, కల్లెపల్లి ప్రశాంత్, ఎల్తూరి సాయికుమార్; నమిండ్ల కిరణ్, బొక్క మొగిలి, డాక్టర్ పుల్లా కుమార్, శోభన్, ఏమీలియ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాదిగ ఉద్యోగుల సంఘం నేతలు

డ్రైన్ బ్లాకేజీల్లో మెష్‌లు ఏర్పాటు చేయండి

ఇంజనీరింగ్ అధికారులతో మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని డ్రైన్‌లలో నీటి బ్లాకేజీ ప్రాంతాల్లో మెష్‌లు ఏర్పాటు చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. బుధవారం బల్దియాలోని మేయర్ చాంబర్‌లో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వరంగల్ నగరంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో డ్రైనేజీలలో బ్లాకేజీలు లేకుండా చూడాలని, ఎక్కడ నీటి నిలిచినా రానున్న రోజుల్లో ప్రమాదం పొంచి ఉన్నట్టేనని అన్నారు. 66 డివిజన్‌లలో ఎన్నిమెష్‌లు అవసరమో ముందస్తు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి ఎస్ఈ శ్రీనివాస్‌చారి, ఈఈలు రవికుమార్, సంతోష్‌బాబు, మహేందర్, మాదవిలత, డీఈలు రాజ్‌కుమార్, సారంగం, కార్తీక్‌రెడ్డి, రోజారాణి, రవికిరణ్, రంగారావులతో పాటు ఏఈలు పాల్గొన్నారు.



ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

మేయర్‌ను కలిసిన బల్దియా అకౌంట్స్ అధికారి

బల్దియా అకౌంట్స్ ఆఫీసర్ (ఏవో)గా బాధ్యతలు చేపట్టిన శివలింగం బుధవారం మేయర్ సుధారాణిని కలిశారు. మేయర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు. ఈ సందర్భంగా మేయర్ ఏవోకు శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీలో శివలింగం ఖమ్మం కార్పొరేషన్ నుంచి వరంగల్ కార్పొరేషన్‌కు బదిలీపై వచ్చారు.

గురుకులాల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచాలి

జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, జూన్11(ఆంధ్రజ్యోతి): గురుకులాల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచేందుకు గురుకులాల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య కోరారు. విద్యాసంవత్సరం ప్రారంభం నేపథ్యంలో బుధవారం హనుమకొండ కలెక్టరేట్‌లో విద్యాలయాల్లో ఏర్పాట్లపై సాంఘిక సంక్షేమ గురుకుల ప్రిన్సిపాళ్లతో కలెక్టర్ ప్రావీణ్య సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 2025- 26 విద్యాసంవత్సరం గురువారం నుంచి ప్రారంభం అవుతున్న నేపథ్యంలో విద్యాలయాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. గురుకుల డిగ్రీ కళాశాలల్లో అందిస్తున్న కోర్సులలో విద్యార్థులు చేరే విధంగా చూడాలన్నారు. గురుకుల విద్యాలయాల్లో ప్రభుత్వం నాణ్యమైన విద్యాబోధనతో పాటు కల్పిస్తున్న వసతులు, అత్యున్నత ప్రమాణాలు కలిగిన అధ్యాపకులతో విద్యాబోధన ఉంటుందన్నారు. క్రీడలు, కెరీర్ గైడెన్స్, ప్రాంగణ ఎంపికలతో పాటు జాతీయ, అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో అనుసంధానం ఉన్న వివరాలను తెలియజేస్తూ విద్యార్థుల నమోదు శాతం పెంచాలన్నారు. అనంతరం గురుకుల డిగ్రీ కళాశాలల్లోని వివిధ కోర్సులు, ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్లు కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సమీక్షలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేష్, బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ గురుకుల విద్యాలయాల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

పోలీస్ కుటుంబానికి భద్రత చెక్కు అందజేత

వరంగల్ క్రైం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ఆనారోగ్యంతో మరణించిన కానిస్టేబుల్ వెంకటరమణ కుటుంబానికి బుధవారం సీపీ సన్‌ప్రీత్‌సింగ్ భద్రత చెక్కును అందజేశారు. కానిస్టేబుల్ భార్య వాణికి బుధవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో కార్యాలయంలో పోలీస్ భద్రత విభాగం నుంచి మంజూరైన రూ.7,23,637 లక్షల చెక్కును అందజేసి కుటుంబ స్థితిగతులపై సీపీ ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ రవి, సూపరింటెండెంట్ రమాదేవి పాల్గొన్నారు.



కానిస్టేబుల్ భార్య వాణికి చెక్కు అందజేస్తున్న సీపీ



ఫేస్ పెయింటింగ్‌లో పాల్గొన్న విద్యార్థినులు

సీజేఐటీలో ముగిసిన టెక్నోజీల్-2025

- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు
- ఫేస్ పెయింటింగ్, ఫ్యాషన్ షో అదరహో

జనగామ కల్చరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): జనగామ మండలం యశ్వంతాపురం క్రీసుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాల (సీజేఐటీ)లో టెక్నోజీల్-2025 సంబరాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం ముగింపు ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇందులో స్లోబైక్ రైడింగ్, మెహందీ, రంగోలి, ఫేస్ పెయింటింగ్, నృత్య, గాన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఫ్యాషన్‌షో, డీజే నైట్ కార్యక్రమాలు ప్రత్యేకతను చోటు చేసుకున్నాయి. ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఈ కార్యక్రమాలను తిలకించారు. ఫేస్ పెయింటింగ్, ఫ్యాషన్‌షో అదరహో అనిపించాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు రకాల క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. డీజే పాటలకు విద్యార్థులు స్టెప్పులు వేశారు. పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డీ విజయపాల్‌రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలను విద్యార్థులు నెరవేర్చాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్ చంద్రశేఖర్‌రెడ్డి, వేడుకల కన్వీనర్ ఏ సన్యాసిరావు, కోకన్వీనర్ జీ సరిత, అధ్యాపకులు, సహాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నకిలీ హార్పిక్ బాటిల్స్ పట్టివేత

వరంగల్ క్రైమ్, జూన్11(ఆంధ్రజ్యోతి): నకిలీ హార్పిక్ బాటిల్స్‌తో పాటు కాలం చెల్లిన రూ.3,87,419 విలువ చేసే కాలం చెల్లిన బాత్రూమ్ క్లీనర్స్ పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు ఇంతేజార్ గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓల్డ్ బీట్ బజార్లో సీఐ మేకల రంజిత్ బృందం దాడులు చేసి సీజ్ చేశారన్నారు. ఈ ఘటనలో ముగ్గురిని అరెస్టు చేసి స్థానిక పోలీసులకు అప్పగించడం జరిగిందన్నారు.

క్రైం డీసీపీ, ఏసీపీలకు సత్కారం

వరంగల్ క్రైం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వరంగల్ పోలీస్ కమిషనరేట్ అపరేషన్ అండ్ క్రైం అడిషినల్ డీసీపీగా బాధ్యతలు చేపట్టిన బోనాల కిషన్, క్రైం ఏసీపీ పంతాటి సదయ్యలను తెలంగాణ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో బుధవారం శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుప్పాల రజినీకాంత్, సాయిని రవీందర్, కొత్త దశరథం, కొండ నాగరాజు, కూరపాటి సత్యప్రకాశ్‌రావు, రాగంశెట్టి సత్యనారాయణ, జినుకల లక్ష్మణ్‌రావు, గుండ్ల శ్రీనివాస్, లింగంపల్లి సురేందర్, పుట్ట కిషోర్, తోట పవన్, తోట రాజయ్య, అలూరి ప్రభాకర్, బక్కి సదానందరావు, రామచందర్, పత్రి శ్రీకాంత్, బండారి సతీష్, మొగిలి శ్రీనువాస్ రావు పాల్గొన్నారు.



పోలీస్ అధికారులు బోనాల కిషన్, సదయ్యలను సత్కరిస్తున్న మున్నూరు కాపు నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న సాయిని నరేందర్

బీసీ శక్తిని రాజకీయ శక్తిగా మార్చాలి

ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్

హనుమకొండ కలెక్టరేట్, జూన్11(ఆంధ్రజ్యోతి): తరతరాలుగా ఉత్పత్తి శ్రమలో కీలకపాత్ర పోషిస్తున్న బీసీ సమాజాన్ని రాజకీయ శక్తిగా మార్చాలని ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ అన్నారు. ఆల్ ఇండియా ఓబీసీ జాక్ సమావేశం హనుమకొండ అలంకార్ జంక్షన్‌లోని టీఎన్‌జీవోస్ భవన్‌లో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సాయిని నరేందర్ మాట్లాడుతూ.. సమాజ హితం కోసం నిత్యం శ్రమ చేస్తున్న బీసీ సమాజం.. నేడు బతకలేక బలిదానాలు చేసుకుంటోందన్నారు. బీసీ సమాజాన్ని రాజకీయ శక్తిగా మార్చి చట్టసభల్లో వాటా సాధించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆల్‌ఇండియా ఓబీసీ జాక్ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో చాపర్తి కుమార్ గాడ్గే, రంజిత్‌కుమార్‌గౌడ్, మాదం రజనికుమార్, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత మన సామాజిక బాధ్యత

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



ఇందిరానగర్‌లో స్థానిక ప్రజలతో మాట్లాడుతున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత మన సామాజిక బాధ్యత అని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. వంద రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా గ్రేటర్ వరంగల్ 58,59 డివిజన్‌లలోని ఇందిరానగర్, ఎన్‌జీవోఎస్ కాలనీ, భవానీనగర్‌లలో స్థానిక కార్పొరేటర్లతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. తడిచెత్త, పొడిచెత్త సేకరణపై అక్కడి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత కాలనీ ప్రజలు, శానిటేషన్ కార్మికులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను మాత్రమే వాడాలని అన్నారు. అంతేకాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం మన అందరి బాధ్యత అని గుర్తు చేశారు. ఇంకా నగరంలో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని అన్నారు. ప్రత్యామ్నాయంగాజూట్ బ్యాగులను మాత్రమే వాడాలని అన్నారు. కార్పొరేటర్లు గుజ్జుల వసంత, ఇమ్మడి లోహిత, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, డీఈ సారంగం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ భాషానాయక్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ మధుకర్ పాల్గొన్నారు.

కేసీఆర్‌పై కక్ష సాధింపు చర్యలు సరికాదు..

మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమం నడిపి ప్రజల 60 ఏళ్ల కలను సాకారం చేసిన మాజీ సీఎం కేసీఆర్‌పై కమిషన్ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చేపట్టడం సరికాదని మాజీ ఎమ్మెల్యే, హనుమకొండ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష పూరితంగా ఏర్పాటు చేసిన కమిషన్ ముందుకు బుధవారం కేసీఆర్ హాజరు కాగా, కేసీఆర్‌కు మద్దతుగా దాస్యం వినయ్ భాస్కర్ బీఆర్ఎస్ నాయకులతో కలిసి హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. 60 ఏళ్ల సమైక్య పాలనలో వ్యవసాయానికి ఒక్క పంటకు నీళ్లు ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం.. కేసీఆర్ రెండున్నర ఏళ్లలో తాగునీరు, సాగు నీరు అవసరాల కోసం ప్రాజెక్టుల పునరుద్ధరణ, రీ డిజైన్లతో గోదావరి, కృష్ణా నదీజలాలను ఒడిసిపట్టి తెలంగాణ మాగాణాలకు తరలించారని కొనియాడారు. తెలంగాణ రైతులకు నీళ్లు ఇవ్వకుండా అన్యాయం చేసిన కాంగ్రెస్ నీళ్లు ఇచ్చిన కేసీఆర్‌పై నిందలు మోపడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రలతో కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టి తెలంగాణను మళ్లీ ఎడారిగా చేయాలని చూస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో ప్రాజెక్టుల నిర్మాణంతో మూడు కోట్ల టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి జరిగిందని, దీంతో తెలంగాణ దేశంలోనే అగ్రభాగాన నిలిచినట్లు తెలిపారు. తెలంగాణలో నీలి విప్లవం, హరిత విప్లవం సృష్టించిన సృష్టికర్త కేసీఆర్ అని కొనియాడారు. కాంగ్రెస్ కమిషన్లు కేసీఆర్‌ను తప్పుగా చిత్రీకరించే ప్రయత్నం చేసినా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, పశ్చిమ నియోజక వర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, కార్పొరేటర్లు సోదా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌కు తరలి వెళ్లిన దాస్యం వినయ్ భాస్కర్, బీఆర్ఎస్ నాయకులు

ప్రభుత్వ విద్య బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి ఉపాధ్యాయులంతా కృషిచేయాలని టీచర్స్ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండలోని పీఆర్టీయూ భవన్‌లో వరంగల్, హనుమకొండ జిల్లాల ఎయిడెడ్ ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డిని సత్కరించారు. ఈ సందర్భంగా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. తన పాఠశాల విద్యాభ్యాసం ఎయిడెడ్ పాఠశాలలోనే పూర్తి చేశానన్నారు. ఎయిడెడ్ టీచర్ల సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎయిడెడ్ టీచర్ల జాక్ నాయకులు సీతారామాచారి, శ్రీధర్, శివకుమార్, సరళ, నరేందర్, పూర్ణచందర్, పీఆర్టీయూ నాయకులు తిరుపతిరెడ్డి, రవీందర్‌రెడ్డి, భిక్షపతి, శ్రీనివాస్, గఫార్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎయిడెడ్ టీచర్లు

ఉపాధ్యాయ కుటుంబాలకు అండగా ఉంటా..

ప్రభుత్వ ఉపాధ్యాయుల కుటుంబాలకు పీఆర్టీయూ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆ సంఘం టీచర్స్ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. ఇటీవలే అనారోగ్యంలో వరంగల్‌లో మృతి చెందిన గందె శ్రవణ్‌కుమార్ కుటుంబ సభ్యులనుమంగళవారం రాత్రి వారి ఇంటికెళ్లి శ్రీపాల్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రవణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రభుత్వం నుంచి రావాల్సిన బెనిఫిట్స్‌ను ఇప్పించేందుకు కృషి చేస్తానని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంఈవో గంప అశోక్, హెడ్మాస్టర్ లక్ష్మయ్య, ఉపాధ్యాయులు ఆకుతోట శ్రీనివాస్, రమేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

కౌన్సెలింగ్

పసికందులకు ఎలాంటి ఘనాహారం?

డాక్టర్! మా బాబుకు ఐదో నెల. ఆరో నెల నుంచి ఘనాహారం మొదలుపెట్టాలని అనుకుంటున్నాం. బిడ్డకు ఏడాది వయసొచ్చేవరకూ ఎలాంటి ఆహారం అందించాలో వివరించగలరు? - ఓ సోదరి, హైదరాబాద్

ఆరో నెల నుంచి సాధారణంగా అన్నంలో పప్పు, నెయ్యి కలిపి తినిపించడం మొదలు పెడతాం! కానీ వీటి ద్వారా బిడ్డకు అందే పోషకాలు అతి స్వల్పం. కాబట్టి...

- పప్పుధాన్యాలు, అన్ని రకాల కూరగాయలు, పులుపు లేని పళ్లు తినిపించాలి. రుచి కోసం చాలా పరిమితంగా నెయ్యి వాడొచ్చు. లేదంటే ఏదైనా వెజిటబుల్ ఆయిల్ అయినా అన్నంలో కలిపి పెట్టొచ్చు.
- ఉప్పు, తీపి... ఈ రెండూ రుచిని పెంచే మాట నిజమే అయినా, పసికందులకు వీటిని అలవాటు చేయకూడదు. వీటికి బదులుగా రుచి కోసం పసుపు, దాల్చిన చెక్క, యాలకులు, సోంపు, అల్లం, వెల్లుల్లి పేస్ట్, జీలకర్ర, ధనియాల పొడులను వంటకాల్లో కలిపి తినిపిస్తే పిల్లలు ఇష్టంగా తింటారు.
- తీపి పెట్టాలనుకుంటే తగు మాత్రంగా బెల్లం వాడొచ్చు. నీళ్లు తాగడానికి ఇష్టపడకపోతే బెల్లం లేదా పళ్ల ముక్కలు వేసి తాగించవచ్చు.
- తొమ్మిదో నెల నుంచి గుడ్డు పచ్చసొన తినిపించవచ్చు.
- ఉడికించే ఆహారం మెత్తగా ఉండాలి.
- ప్రతి పూటా అన్నమే తినిపించాలని లేదు. అన్నం బదులు కూరగాయ ముక్కలను తగుపాళ్లలో మసాలాలు జోడించి తినిపించవచ్చు. ఉడికించి, చిదిమిన పళ్ల ముక్కలు తినిపించవచ్చు.



- పెద్దలతో సమానంగా పిల్లలూ మూడు పూటలు తినాలి అనుకుంటే పొరపాటు. ఒకేసారి ఎక్కువ పరిమాణాల్లో పిల్లలు తినలేకపోతే, అదే పరిమాణాన్ని 6 భాగాలుగా వేర్వేరు సమయాల్లో తినిపించవచ్చు.
- సెరెలాక్ లాంటి ప్రత్యామ్నాయ మిల్క్ ఫుడ్స్, ప్రయాణాల్లో, ఇంటి భోజనం వండలేని సమయాల్లో మాత్రమే ఇవ్వాలి. దీన్లో చక్కెర కలపకూడదు.

ఇవి కూడదు...

పిల్లలకు తినిపించకూడని పదార్థాలు కూడా ఉన్నాయి. అవేంటంటే...

- అలర్జీ తలెత్తకుండా ఉండడం కోసం కొత్తగా ఏ రెండు కొత్త పదార్థాలను కలిపి తినిపించకూడదు. ఒకదాని తర్వాత మరొకటిగానే రుచి అలవాటు చేయాలి.
- ఈ వయసు పిల్లలకు నట్స్ నుంచి అలర్జీ లాంటి ఇబ్బందులు తలెత్తవచ్చు. కాబట్టి వేరుశనగ, బాదం, జీడిపప్పు లాంటివి పొడి రూపంలో కూడా తినిపించకూడదు.
- సంవత్సరం లోపు పిల్లలకు తేనె, ఉప్పు, చక్కెర తినిపించకపోవడమే మంచిది. తీయదనం కోసం బెల్లం వాడొచ్చు.
- బాస్మతి లాంటి పాలిష్ పట్టిన బియ్యం వాడకూడదు.
- ఐస్‌క్రీమ్‌లు, బిస్కెట్లు, చాక్లెట్లు, శీతల పానీయాలు, కొబ్బరి నీళ్లు ఇవ్వకూడదు. **- డాక్టర్ సుమతి,** పిడియాట్రిషియన్, హైదరాబాద్

అభిరుచి



అలనాటి అరుదైన నటి సూర్యకాంతం. పాత్ర ఏదైనా పరకాయ ప్రవేశం చేసి... మరెవరికీ సాధ్యంకాదన్న రీతిలో అభినయించి... తెలుగు తెరపై తనదైన ముద్ర వేశారు. ఇది దశాబ్దాల కిందటి కథ మళ్లీ ఇప్పుడు ఆ నట విన్యాసాన్ని అనుకరించి... సూర్యకాంతాన్ని మరిపించి... తెలుగు ప్రేక్షకులను మురిపిస్తోంది... మంజూష ముక్కవిల్లి. వెండితెరపై నాటి అపురూప సన్నివేశాలను ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌లో పండించి... టాలీవుడ్ తారల ప్రశంసలు సైతం అందుకున్న మంజూషతో 'నవ్య' ముచ్చట్లు.

అచ్చం సూర్యకాంతంలా!

"ఒక అభిరుచి... చిన్నప్పుడే నాలో బలంగా నాటుకుపోయింది. అది మరేదో కాదు... నటించాలన్న తపన. నాకు తెలియకుండానే నాలోని నటుణ్ణి బయటకు తీసే ప్రయత్నం ఎప్పటికప్పుడూ చేస్తూనే ఉన్నాను. బడికి వెళ్లే రోజుల్లో... కాలేజీలో చదివే సమయంలో... అవకాశం దొరికినప్పుడల్లా అలనాటి మేటి తారల్లా అభినయిస్తూ వస్తున్నాను. నటులే కాదు... ఇంట్లోవాళ్లు, సన్నిహితులను అనుకరించడం కూడా నాకు ఒక అలవాటుగా మారిపోయింది. అమ్మమ్మలు, బామ్మలు, తాతయ్యలు... ఇలా పెద్దవాళ్ల హావభావాలను సరదాగా నాలో పలికిస్తుండేదాన్ని. దాంతోపాటు పాటలు పాడేదాన్ని. డ్యాన్స్ చేసేదాన్ని. చూసినవాళ్లందరూ బాగా ఆస్వాదించేవారు. అభినందించేవారు. వారి పొగడ్తలు నాకు మరింత ప్రోత్సాహాన్ని, ఉత్సాహాన్ని ఇచ్చేవి. అలా మొదలైంది నా ఈ ప్రయాణం. మా ఊరు భద్రాచలం. నేను అక్కడే పుట్టి పెరిగాను. 2010లో హైదరాబాద్‌లో ఎంబీయే పూర్తయింది.

ఉద్యోగం... పెళ్లి...

డిగ్రీ అవ్వగానే ఓ ఆంగ్ల పత్రికలో ఏడాదిన్నర సేల్స్ మార్కెటింగ్ విభాగంలో పని చేశాను. తరువాత ఆరేళ్లు రేడియో సిటీలో ఉద్యోగం. అక్కడ మార్కెటింగ్‌తో పాటు ప్రకటనలకు వాయిస్ ఓవర్ ఇచ్చేదాన్ని. అదే సమయంలో నాకు పెళ్లయింది. మావారు సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నారు. తన ఉద్యోగ నిమిత్తం ఫ్రాన్స్‌కు వెళ్లాం. కొన్నాళ్లకు తిరిగి భారత్‌కు వచ్చేశాం. ఆయనకు మంచి ఉద్యోగ అవకాశం రావడంతో 2021లో అమెరికాకు పయనమయ్యాం. ప్రస్తుతం ఇక్కడే నివాసం.

అమెరికా వచ్చాక...

మొదటి నుంచీ అందర్నీ అనుకరించడంవల్ల క్రమంగా నా ఆసక్తి నటన వైపు మళ్లింది. అమెరికా వచ్చాక అనిపించింది... ఒక ప్రయత్నం చేద్దామని. ఒకప్పుడంటే సినిమాలు, టీవీలు మినహా వేరే అవకాశాలు ఉండేవి కావు. కానీ ఇప్పుడు సామాజిక మాధ్యమాల వల్ల మన ప్రతిభ ప్రపంచానికి చూపడానికి అనువైన ఒక చక్కని వేదిక అందుబాటులో ఉంది కదా. దాని ద్వారా నాలోని నటిని సంతృప్తి పరచాలని అనుకున్నా. చిన్నప్పటి నుంచీ ఇమిటేట్ చేస్తున్నాను కాబట్టి... కంటెంట్ కూడా దానికి సంబంధించే పెట్టాలనుకున్నా. అలా మూడేళ్ల కిందట ఇన్‌స్టాగ్రామ్‌లో నా పేరు మీదనే ఒక చానల్ ప్రారంభించాను.

మధుర జ్ఞాపకాలెన్నో...



ప్రముఖ నటుడు హర్షవర్ధన్ గారు ఒక ఇంటర్వ్యూలో నా గురించి ప్రత్యేకంగా చెప్పారు. సూర్యకాంతంలా బాగా నటిస్తున్నానని. ఆ వీడియో ఎవరో నాకు పంపించారు. చూసి ఆశ్చర్యపోయాను. ఆయనతో నాకు పరిచయం లేదు. ఒక మెసేజ్ కూడా పంపారు... 'ఆ బాడీ లాంగ్వేజ్, ఆ వాయిస్ అనుకరణ అంత సులువు కాదు. కానీ మీరు సూర్యకాంతంలా అతికినట్టు చేస్తున్నారు. నేను మీకు పెద్ద అభిమానిని. మా కుటుంబం అంతా కూర్చొని మీ వీడియోలు చూస్తాం' అని. అలాగే సంగీత దర్శకుడు తమన్ తన ఇన్‌స్టా స్టోరీలో నా వీడియోలు షేర్ చేశారు. చార్మి, అవసరాల శ్రీనివాస్, నందినీరెడ్డి లాంటి పరిశ్రమ ప్రముఖులు అభినందన మెసేజ్‌లు పంపడమే కాదు, వాటిని ఇతర సామాజిక మాధ్యమాల్లో పంచుకొంటున్నారు కూడా. కొంతమంది అసిస్టెంట్ డైరెక్టర్‌లు, సినిమాటోగ్రాఫర్‌లు 'అవకాశం వస్తే సినిమాల్లో నటిస్తారా' అని అడుగుతున్నారు. తప్పకుండా చేస్తానని వారికి చెప్పాను. నా లక్ష్యం కూడా అదే.

నిర్మలమ్మ గారి రీల్‌తో...

చదువుకొనే రోజుల్లో డ్రామా, డ్యాన్స్ ప్రదర్శనలు ఇచ్చేదాన్ని. కాలేజీలోనే కాదు... బయటి వేదికలపై కూడా. కానీ ఎవరి దగ్గరా శిక్షణ తీసుకోలేదు. అన్నీ నాకు నేను చూసి నేర్చుకున్నవే. ఇన్‌స్టాలో చిన్న చిన్న వీడియోలు చేసి పెట్టాను కానీ... వాటికి అంత గుర్తింపు రాలేదు. 'శ్రీ కనకమహాలక్ష్మి రికార్డింగ్ డ్యాన్స్ ట్రూప్' చిత్రంలో నిర్మలమ్మ గారు నటించిన కోడి సన్నివేశం ఒకటి ఉంటుంది. ఆ బిట్ నేను చేశాను. దానికి మంచి స్పందన వచ్చింది. లక్షల మంది వీక్షించారు. అంతకు మించి షేర్ చేశారు. నాకు మంచి గుర్తింపు తెచ్చింది. ఆ ఉత్సాహంతో సూర్యకాంతం గారిని అనుకరించే ధైర్యం చేశా.

'ఏంటి నేను ఇంత లావున్నానా'...

అయితే నాకు బాగా పేరు వచ్చింది మాత్రం సూర్యకాంతం గారి వీడియోతే. రేలంగి గారితో కలిసి ఆమె నటించిన 'ఏంటి నేను ఇంత లావున్నానా' సన్నివేశం ఒకటి ప్రయత్నించాను. ఆ రీల్‌కు ఊహించనంత స్పందన లభించింది. సామాజిక మాధ్యమాల్లో తెగ చక్కర్లు కొట్టింది. నాకు బాగా పేరు వచ్చింది. ఇక అక్కడి నుంచి వెనక్కి తిరిగి చూసుకోలేదు. ఏ వీడియో పెట్టినా లక్షల్లో వ్యూస్. తరువాత ఛాయాదేవి గారిని అనుకరించాను. వాటికీ విపరీతమైన ఆదరణ లభించింది. వాస్తవానికి ఆ సలహా ఇచ్చింది రఘు కుంచె గారు. 'మీరు ఛాయాదేవి గారి పాత్రలు కూడా ప్రయత్నించండి. బాగా చేస్తారు' అన్నారు. ఆయన చెప్పాకే ఆవిడవి మొదలుపెట్టాను.

ఐదు వందలకు పైనే...

ఇప్పటివరకు నేను ఐదు వందలకు పైగా వీడియోలు చేశాను. ఇన్‌స్టాలో లక్షన్నర మంది సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. అత్యధికంగా చూసిన వీడియో సూర్యకాంతం గారిది. దానికి వ్యూస్ రెండు కోట్లు దాటాయి. ఆ తరువాత వరుసలో బ్రహ్మానందం, నిర్మలమ్మ, ఛాయాదేవి గారి వీడియోలు. అన్నీ నా మొబైల్ ఫోన్‌తోనే తీస్తాను. ముందుగా సన్నివేశం ఏంటనేది నిర్ణయించుకొని, ఓ అరగంట సాధన చేసి, నటిస్తాను. ఎడిటింగ్ లాంటివన్నీ నేనే చూసుకొంటాను. ఒక్కో వీడియోకు సగటున ఐదు లక్షల వ్యూస్ వస్తాయి. కాస్ట్యూమ్స్ ఇంట్లో ఉన్నవాటితోనే సరిపెడుతుంటా. అవి కుదరకపోతే షాపింగ్ చేస్తాను. కొన్ని భారత్ నుంచి కూడా తెప్పిస్తుంటాను. ఇక్కడ ఒక్కటే చెప్పదలుచుకున్నాను... సామాజిక మాధ్యమాలవల్ల ప్రతికూలతలు, అలాగే అనుకూలతలు కూడా ఉన్నాయి. దాన్ని మనం ఎలా ఉపయోగించుకొంటామనేది ముఖ్యం. ఒకప్పుడు నేరుగా వెళ్లి వేషాలు అడగాలంటే భయపడేదాన్ని. కానీ రీల్స్ వల్ల నాకు ఆ భయం పోయింది. నన్ను నేను ప్రపంచానికి పరిచయం చేసుకోగలిగాను. ఇది నాకు ఎంతో సంతృప్తిని, సంతోషాన్ని ఇస్తోంది. కాస్త గర్వంగానూ అనిపిస్తుంది."

• హనుమా

అదే నా బలం...

నేను చిన్నప్పటి నుంచీ సూర్యకాంతం, నిర్మలమ్మ సినిమాలు ఆసక్తిగా చూసేదాన్ని. దాంతో వాళ్ల నటన మీద కొంత అవగాహన వచ్చింది. ప్రత్యేకించి సూర్యకాంతాన్ని అనుకరించడం చాలా కష్టమనేది చాలామంది చెప్పే మాట. ఆవిడ డైలాగ్ డెలివరీ వేగంగా సాగిపోతుంది. డైలాగ్‌కు డైలాగ్‌కు మధ్య విరామం ఉండదు. నటనలో, మాటలో ఫోర్స్ ఉంటుంది. కానీ ఏదీ తెచ్చిపెట్టుకున్నట్టు కాకుండా, ఎంతో సహజంగా అనిపిస్తుంది. ఇంకో ప్రత్యేకత ఏంటంటే... నిలుచున్న మనిషి నిలుచున్నట్టే, కదలకుండా డైలాగులు చెప్పేస్తారు. అలా మా ఇంట్లో నాయనమ్మలు, అమ్మమ్మలను చూసేదాన్ని. వాళ్లను అనుకరించడంవల్ల ఇప్పుడు నేను ఇంత బాగా చేయగలుగుతున్నాను. కాంచన, భానుమతి, బ్రహ్మానందం, కోవై సరళ, ఆమని, సౌందర్య తదితరులని కూడా అనుకరిస్తుంటాను. ఎవరినైనా చూస్తే వారి హావభావాలను వెంటనే పట్టేయగలను. అదే నా బలం.

చెద పురుగులు పట్టాయా?

మన ఇంట్లో చెక్క అల్మారాలు, మంచాలు, తలుపులకు చెద పురుగులు పడుతూ ఉంటాయి. ఎంతో ఖరీదైన చెక్కను తెచ్చి ఇష్టంగా చేయించుకున్న అరలతో సహా పుస్తకాలు, దుస్తులను కూడా ఇవి పాడుచేస్తుంటాయి. ఒకసారి చేరితే వీటిని వదిలించుకోవడం చాలా కష్టం. రసాయనాలతో కూడిన స్ప్రేలకు బదులు కొన్ని ఇంటి చిట్కాలు ఉపయోగించి కొంతమేరకు వీటి బెడదను తగ్గించుకోవచ్చు.

- చెద పురుగులను నివారించడంలో కర్పూరం పొడి ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఇవి ఎక్కువగా చేరే మంచాలు, తలుపులు, కిటికీలు, అరల మూలల్లో సందుల్లో కర్పూరం పొడిని చల్లితే రెండు రోజుల్లో మంచి ఫలితం కనిపిస్తుంది.
- ముదురు వేపాకులను తెచ్చి ఎండబెట్టి మెత్తని పొడిలా చేయాలి. ఈ పొడిని గది మూలల్లో, అరల్లో, చెక్క సమాన్ల మీద చల్లితే వారం రోజుల్లో చెద పురుగులన్నీ చనిపోతాయి.
- పుస్తకాలు, దుస్తులు భద్రపరచుకునే చెక్క బీరువాల్లో; కంప్యూటర్ టేబుల్, డైనింగ్ టేబుల్ వద్ద కలరా వుండలు ఉంచితే చెద పురుగులు చేరవు.
- చెదపురుగులు ఉన్నాయన్న అనుమానం వచ్చిన ప్రదేశాల్లో చిటికెడు నల్ల జీలకర్ర ఉంచినా మంచి ఫలితం కనిపిస్తుంది.
- మంచాలు, సోఫాలు, టేబుళ్లు, కుర్చీల మీద కొద్దిగా వెనిగర్ చిలకరిస్తే ప్రయోజనం ఉంటుంది.
- ఇంట్లో ఉండే సామాన్లు, పుస్తకాలను ఎక్కువకాలం ఒకేచోట ఉంచకుండా కనీసం ఆర్నెల్లకోసారి కదిలిస్తూ ప్రదేశాలు మారుస్తూ ఉంటే చెదలు చేరవు.



లీచీ.. ఔషధ గుణాలెన్నో



ఎర్రగా చూడగానే తినేయాలనిపించే లీచీ పండు వలన ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. వాటి గురించి తెలుసుకుందాం..

- లీచీల్లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక శక్తికి ఊతమిస్తుంది.
- ఈ పళ్లలోని ఫైబర్ అజీర్తి, మలబద్ధకం సమస్యలను దూరం చేస్తుంది.
- లీచీల్లో నీటి శాతం ఎక్కువ. కాబట్టి డీహైడ్రేషన్ ముప్పు తప్పుతుంది.
- లిచి పళ్లలోని పొటాషియం రక్తపోటును నియంత్రిస్తుంది. గుండె సమస్యలను ఇది దరిచేరనీయదు.
- లీచీల్లో క్యాలరీలు, కొవ్వు తక్కువగా ఉంటాయి. కాబట్టి బరువు నియంత్రణకు ఈ పండ్లు బాగా ఉపయోగపడతాయి.
- ఇందులోని విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.

వంటగది శుభ్రం ఇలా..

అద్దంలా మెరిసే వంటగది అహ్లాదకరంగా ఉంటుంది. వంటగది పరిశుభ్రంగా లేకపోతే క్రిమి కీటకాలు చేరడమే కాకుండా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. వంట చేసేటప్పుడు చికాకుగా అనిపిస్తుంటుంది. కాబట్టి ఇంట్లో దొరికే వస్తువులతో సులువుగా వంటగదిని ఎలా శుభ్రం చేసుకోవాలో తెలుసుకుందాం...

- వంట చేసేటప్పుడు వెలువడే పొగ, ఆవిరి వల్ల స్టవ్ వెనక గోడపై అమర్చిన టైల్స్ మీద జిడ్డు చేరుతూ ఉంటుంది. ఒక్కోసారి పసుపు, కారం, మసాలాల మరకలు కూడా పడుతుంటాయి. అలాంటప్పుడు ఒక గిన్నెలో నాలుగు చెంచాల నిమ్మరసం, రెండు చెంచాల బేకింగ్ సోడా వేసి పేస్టులా కలపాలి. ఈ మిశ్రమాన్ని టైల్స్ మీద రాసి రెండు నిమిషాల తరవాత స్క్రబ్బర్ లేదా స్పాంజ్‌తో రుద్దాలి. తరవాత గోరువెచ్చని నీళ్లతో కడిగేస్తే టైల్స్ చక్కగా శుభ్రమవుతాయి. వంట పూర్తయిన వెంటనే టిష్యూ పేపర్‌తో టైల్స్‌ని తుడిచేస్తే ఏ సమస్యా ఉండదు.



- వంట చేస్తున్నప్పుడు స్టవ్ కింద, దాని చుట్టూ కూడా ఆహార పదార్థాలు చింది పడుతూ ఉంటాయి. వంట పూర్తయిన తరవాత వీటిని పలుచని గుడ్డతో శుభ్రంగా తుడవాలి. రెండు గ్లాసుల గోరువెచ్చని నీళ్లలో ఒక చెంచా ఉప్పు, రెండు చెంచాల వెనిగర్ లేదా లిక్విడ్ సోప్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని గట్టు మీద చల్లి పది నిమిషాలు ఉంచాలి. తరవాత వేడినీళ్లు పోసి కడిగేస్తే గట్టు పూర్తిగా శుభ్రపడుతుంది. ఇదేవిధంగా స్టవ్‌ని కూడా శుభ్రం చేయవచ్చు.
- వంటగదిలో ఉండే ట్యూబ్‌లైట్, ఎగ్జాస్ట్ ఫ్యాన్, స్విచ్ బోర్డులతోపాటు కిటికీ ఊచలు, తలుపులు కూడా జిడ్డు పట్టి దుమ్ము, ధూళితో నిండుతుంటాయి. అలాంటప్పుడు సర్ఫ్ లేదా లిక్విడ్ సోప్ కలిపిన నీళ్లలో ముంచి గట్టిగా పిండిన స్పాంజ్‌తో వీటిని తుడిచేస్తే సరిపోతుంది.
- అటకమీద, అరల్లో తరచూ బూజు పడుతూ ఉంటుంది. దీన్ని మెత్తని చీపురు లేదా వ్యాక్యూమ్ క్లీనర్‌తో శుభ్రం చేయాలి. అరల మూలల్లో కర్పూరం బిళ్లలు, లవంగాలు, వేపాకుల్లో ఒకటి ఉంచితే బొద్దింకలు చేరవు.
- వంటగదిలో నేలను ప్రతిరోజూ ఉప్పునీటితో తుడవాలి. పాత్రలు కడిగే సింక్‌లో కొన్ని వేడి నీళ్లు పోసి బ్రష్‌తో రుద్ది శుభ్రం చేయాలి.

స్ఫూర్తి

డైవింగ్ సంచలనం



ఎలాంటి పరికరాలు లేకుండా ఊపిరి బిగపట్టి లోతైన నీళ్లలోకి డైవ్ చేయడమే ఫ్రీ డైవింగ్. ఎంతో కష్టమైన, క్లిష్టమైన ఈ క్రీడలో పైచేయి సాధించడమే కాకుండా, ఏకంగా తొమ్మిది జాతీయ రికార్డులను నెలకొల్పారు చెన్నైకి చెందిన 32 ఏళ్ల అర్చన శంకర నారాయణన్. ఈ మహిళా డైవర్ గురించిన ఆసక్తికరమైన విశేషాలివి.

ఆరేళ్ల కిందట... కొత్త సంవత్సర వేడుకల కోసం అండమాన్‌కు వెళ్లినప్పుడు, అర్చనకు మొదటిసారిగా డైవింగ్ చేసే అవకాశం దొరికింది. అలా జీవితంలో మొదటిసారిగా స్కూబా డైవింగ్ చేశారామె. ఆ అనుభవం గురించి వివరిస్తూ... "నాకా అనుభవం ఎంతో బాగా నచ్చింది. నీటి అడుగున దాగి ఉండే అద్భుతమైన ప్రపంచాన్ని నేనప్పుడు మొదటిసారిగా చూడగలిగాను. సముద్రంతో తక్షణ అనుబంధం ఏర్పడిపోయిన భావనకు లోనయ్యాను. నీటి ప్రపంచంలో నెలకొని ఉండే ప్రశాంతత, నిశ్శబ్దం నన్నెంతో అబ్బురపరిచాయి. అలా మొదటి అనుభవంతోనే డైవింగ్‌కు ఎంతో దగ్గరైపోయాను. నా భవిష్యత్తు డైవింగ్‌తో ముడిపడి ఉందని అనిపించింది. కానీ అప్పటికే న్యాయవాద వృత్తిలో ఉన్నాను. కాబట్టి డైవింగ్ పట్ల ఏర్పడిన మక్కువను నా తల్లితండ్రులు అర్థం చేసుకోలేకపోయారు. అది ప్రాణాంతకమైన క్రీడ కాబట్టి వాళ్లు బాగా భయపడిపోయారు. మాది సంప్రదాయ తమిళ కుటుంబం. న్యాయవాద వృత్తిని వదిలేసి, ప్రాణాంతకమైన డైవింగ్‌లో కొనసాగాలనే నా కోరికను మొదట్లో వ్యతిరేకించిన తల్లితండ్రులు చివరకు అర్థం చేసుకుని ప్రోత్సహించారు. ఇప్పుడు నన్ను చూసి గర్వపడుతున్నారు" అంటూ తన డైవింగ్ ప్రయాణాన్ని వివరిస్తున్నారు అర్చన.

ఫ్రీడైవింగ్... అంత సులువు కాదు

నీళ్ల అడుగుకి డైవ్ చేయడం, సులభతరమైన క్రీడలాగే అనిపించవచ్చు. కానీ నీళ్లలో లోతుకు ప్రయాణించేకొద్దీ నీటి ఒత్తిడి పెరిగిపోతుంది. ఆక్సిజన్ మోతాదులు తగ్గిపోతాయి. దాంతో మెదడుకు సరిపడా ఆక్సిజన్ అందక స్పృహ కోల్పోయే ప్రమాదం ఉంటుంది. ఊపిరితిత్తుల మీద ఒత్తిడి పెరిగి, అవి కుంచించుకుపోతాయి. నీటి ఒత్తిడిలో చోటుచేసుకునే మార్పుల వల్ల కళ్లు, చెవులు, సైనస్‌లు, ఊపిరితిత్తులకు గాయలయ్యే అవకాశాలుంటాయి. లోతుకు చేరుకున్న తర్వాత అంతే వేగంగా నీళ్ల పైకి చేరుకునే వీలుండదు. అలా లోతు నుంచి వేగంగా నీటి పైకి ప్రయాణిస్తే, రక్తంలో నైట్రోజన్ బుడగలు ఏర్పడి, డీకంప్రెషన్ సిక్‌నెస్‌కు గురవుతారు.

లోతులన్నీ నెగ్గి...

అర్చన తాజాగా ఫిలిప్పైన్స్‌లో జరిగిన రెండు ప్రధాన అంతర్జాతీయ పోటీల్లో ఆరు కొత్త జాతీయ రికార్డులను నెలకొల్పారు. ఈ చెన్నై యువతి, రెండు అంతర్జాతీయ పోటీల్లో ఆరు జాతీయ రికార్డులను బద్దలు కొట్టడంతో పాటు, 35 మీటర్ల జాతీయ రికార్డును నెలకొల్పి, 42 మీటర్ల ఫ్రీడైవింగ్ తో స్వీయ వ్యక్తిగత ప్రతిభను కనబరచడం విశేషం. ఇలా ఏడాది వ్యవధిలో తొమ్మిది రికార్డులను నెలకొల్పిన తొలి భారతీయ మహిళా ఫ్రీడైవర్‌గా చరిత్ర సృష్టించారు. ఫ్రీడైవింగ్ ఊపిరిని బిగపట్టే క్రీడ. ఈ క్రీడలో పాల్గొనే క్రీడాకారులు ఎలాంటి శ్వాస పరికరాలు లేకుండా, నీటి అడుగున వీలైనంత లోతుకు ఫ్రీడైవింగ్ చేస్తూ ఉంటారు. అర్చన, గత నెలలో ఫిలిప్పైన్స్‌లోని మబినిలో జరిగిన ఎఐడిఎ మబిని డెప్త్ క్వెస్ట్‌లో పాల్గొని, తన రికార్డును బద్దలు కొట్టడంతో పాటు నాలుగు జాతీయ రికార్డులతో తన అసమానమైన ప్రతిభను చాటుకున్నారు. అనంతరం ఫిలిప్పీన్స్ పాంగ్లోలో జరిగిన హగ్ కప్ పోటీల్లో, మరొక సొంత రికార్డుతో పాటు, రెండు జాతీయ రికార్డులను నెలకొల్పారు. ఇలా ఇప్పటివరకూ అర్చన, కాన్‌స్టెంట్ వెయిట్, కాన్‌స్టెంట్ వెయిట్ బై ఫిన్స్, కాన్‌స్టెంట్ వెయిట్ నో ఫిన్స్, ఫ్రీ ఇమ్మర్షన్... ఇలా ఈ క్రీడలోని నాలుగు డెప్త్ విభాగాల్లో జాతీయ రికార్డులను సాధించి భారత దేశ సత్తాను చాటారు.

మక్కువతో మథించి...

ఆ ప్రయాణంలో భాగంగా మొదట బహిరంగ జలాల స్కూబా అడ్వాన్స్‌డ్ సర్టిఫికేషన్‌ను పొంది, రెస్క్యూ డైవర్‌గా మారారు. ఆ తర్వాత, ఎటువంటి ఆక్సిజన్ ఆసరా లేకుండా ఫ్రీడైవింగ్ చేసే భారత దేశానికి చెందిన శుభమ్ పాండే వీడియోలు చూసి అతని నుంచి ఎంతో ప్రేరణ పొందారు. ఆ సందర్భం గురించి మాట్లాడుతూ.. "నన్నీ క్రీడ విపరీతంగా ఆకర్షించింది. కేవలం రెస్క్యూ డైవర్‌గా స్థిరపడిపోకుండా, ఈ క్రీడలో మరింత పరిణతి సాధించాలని అనుకున్నాను. శుభమ్ వీడియోలు చూసిన తర్వాత, అతని దగ్గర శిక్షణ పొందాలని అనిపించింది. దాంతో బాలి వెళ్లి, భారతీయ అగ్ర ఫ్రీడైవింగ్ శిక్షకుల్లో ఒకడైన శుభమ్ దగ్గర శిక్షణ తీసుకున్నాను. ఆ తర్వాత, ఆసియాలోని సుప్రసిద్ధ ఫ్రీడైవింగ్ స్కూల్, ఆప్నియా బాలిలో కూడా శిక్షణ పొందాను" అంటూ చెప్పుకొచ్చారు అర్చన. శిక్షణలో భాగంగా ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుకోవడం కోసం విజువలైజేషన్, బ్రెత్‌వర్క్, ధ్యానం... సాధన చేశారామె. డయాఫ్రమ్ బ్రీదింగ్ లాంటి శ్వాస నైపుణ్యాలను సాధన చేయడం ద్వారా డైవింగ్ నైపుణ్యాన్ని పెంచుకోవడంతో పాటు, మహాసముద్రంలో ఆత్మవిశ్వాసంతో డైవింగ్ చేయగలిగే సామర్థ్యం కూడా పెరిగిందని అంటున్నారామె. అలాగే థాయిల్యాండ్‌లోని కొ టావోలో కైజెన్ ఫ్రీడైవింగ్‌లో కూడా అర్చన శిక్షణ తీసుకున్నారు. ఫ్రీడైవింగ్ ప్రపంచ రికార్డులు, 100 మీటర్లను అధిగమించాయి కాబట్టి భారతదేశ డైవర్లు ఈ క్రీడలో పైచేయి సాధించడానికి కఠోర శిక్షణ పొందడం అవసరమని గ్రహించిన అర్చన, ప్రస్తుతం తన శిక్షణ తీవ్రతను పెంచారు. "ఆగష్టు 1 నుంచి 3 వరకు, ఇండోనేషియాలోని, నార్త్ సులవేసిలో జరగబోయే మనాడొ డెప్త్ కాంపిటీషన్‌లో నెగ్గడం కోసం, శుభమ్ పాండేతో కలిసి ఇండోనేషియాలోని అమెద్‌లో శిక్షణ తీసుకుంటున్నాను" అంటూ చెప్పుకొస్తున్నారు.

హలం పట్టి.. పొలం దున్ని..


నాగలితో దుక్కి దున్నుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

» ఏరువాక పున్నమిలో మంత్రి పొన్నం

హుస్నాబాద్ రూరల్ /కోహెడ /మేళ్లచెర్వు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం నాగలి పట్టి.. దుక్కి దున్ని విత్తనాలు వేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పందిళ్ల గ్రామంలో ఏరువాక పున్నమి సందర్భంగా ఆయన రైతులతో కలిసి దుక్కి దున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వానాకాలంలో ఎక్కడా గుంట భూమి కూడా బీడు లేకుడా ఏదో ఒక రకమైన పంట వేయాలని రైతులకు పిలుపునిచ్చారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో విత్తనాలు కొనుగోలు చేసుకోలేని రైతులు ఉంటే తన కార్యాలయంలో సంప్రదించాలన్ని, స్వయంగా విత్తనాలు కొనుగోలు చేసి, రైతులకు ఇస్తానని హామీ ఇచ్చారు. మరోవైపు.. ఏప్రిల్ 27న ఎల్కతుర్తిలో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వెళ్లి వస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరి కుటుంబాలను మంత్రి పొన్నం ప్రభాకర్ ఇచ్చిన మాట ప్రకారం ఆదుకున్నారు. కోహెడ మండలం బస్వాపూర్‌లో బాధిత కుటుంబాలు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున చెక్‌లను అందజేశారు. వారి పిల్లల చదువులకు అండగా ఉంటాయని హామీ ఇచ్చారు.

మేళ్లచెర్వులో ఏరువాక పౌర్ణమి ఉత్సవాలు

సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండల కేంద్రంలో బుధవారం ఏరువాక పౌర్ణమి ఉత్సవాలను రైతులు ఘనంగా నిర్వహించారు. జ్యేష్ఠ శుద్ధ ఏరువాక పౌర్ణమిని తొలి పండుగగా రైతులు భావించడం ఆనవాయితీ. దీంతో రైతులు కాడెద్దులను శుభ్రంగా కడిగి కొమ్ములకు రంగులు వేసి అందంగా ముస్తాబు చేశారు. గ్రామ వీధుల్లో మేళతాళాలతో ఊరేగింపుగా బయలుదేరి ఏరువాక గణపయ్య, వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఎవరి పొలానికి వారు దున్నకాలకు వెళ్లారు.

మహిళా భద్రతలో తెలంగాణ అద్భుతం

» నన్ను కంటికిరెప్పలా చూసుకు న్న తెలంగాణ మహిళా పోలీసులు

» మిస్ వరల్డ్ ఓపల్ సుచాత.. ఆమెకు వీడ్కోలు పలికిన అధికారులు


శంషాబాద్ విమానాశ్రయంలో సుచాత

హైదరాబాద్, శంషాబాద్ రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రత చర్యల్లో తెలంగాణ అద్భుతమని మిస్ వరల్డ్ ఓపల్ సుచాత షుంగ్‌సిరి అన్నారు. తమ దేశం థాయ్‌లాండ్‌లో మహిళా పోలీసులే కనిపించరని ఆమె పేర్కొన్నారు. ప్రపంచ సుందరి పోటీల కోసం గత నెలలో హైదరాబాద్ వచ్చిన సుచాత.. బుధవారం నగరం నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. తాను హైదరాబాద్‌లో విమానం దిగిన దగ్గర నుంచి.. తిరిగివెళ్లే వరకు ఇక్కడి పోలీసుల్లో సగం మంది మహిళా పోలీసులే తనకు కనిపించారని అన్నారు. మహిళా పోలీసులే వెంట ఉండి తనని కంటికి రెప్పలా చూసుకున్నారని తెలిపారు. తెలంగాణలో మహిళా భద్రతా చర్యలు అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. ఇలాంటి మహిళా భద్రతా చర్యలు తమ దేశంలోనూ అమలు చేయాలని థాయ్‌లాండ్ ప్రభుత్వాన్ని కోరుతానని సుచాతషుంగ్‌సిరి వెల్లడించారు. కాగా, హైదరాబాద్ నుంచి తిరుగు ప్రయాణమైన మిస్ వరల్డ్ సుచాతషుంగ్‌సిరికి రాష్ట్ర పర్యాటక శాఖ అధికారులు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సంప్రదాయ పద్ధతితో ఘనంగా వీడ్కోలు పలికారు.


అనిల్‌కిరణ్‌కుమార్ రచించిన 'ఏ రెవెర్డ్ ట్రాన్స్‌ఫర్ అండ్ యాన్ అన్‌స్పోకెన్ లాస్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి, చిత్రంలో కె.సుందర్, వీవీ లక్ష్మీనారాయణ

'జస్టిస్ సుందర్' జీవితం స్ఫూర్తిదాయకం

» తెలంగాణ లోకాయుక్త జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి

» ఆయన న్యాయరంగ జీవితం ఆదర్శం: వీవీ లక్ష్మీనారాయణ

మన్సూరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): న్యాయరంగంలో జూనియర్లకే కాకుండా ఎంతో మంది సీనియర్లకు కూడా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సుందర్ జీవితం స్ఫూర్తిదాయకమని తెలంగాణ లోకాయుక్త జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. జస్టిస్ కె.సుందర్ న్యాయరంగ ప్రయాణంపై హైకోర్టు న్యాయవాది జి.అనిల్ కిరణ్‌కుమార్ రచించిన 'ఏ రెవెర్డ్ ట్రాన్స్‌ఫర్ అండ్ యాన్ అన్‌స్పోకెన్ లాస్' పుస్తకావిష్కరణ కార్యక్రమం బుధవారం హైదరాబాద్ కొత్తపేటలోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది. జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి, సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. న్యాయరంగం ఎంతో సాహసంతో, సున్నితత్వంతో కూడుకున్నదని, ఎంతటి ప్రతికూల కేసులు వచ్చినా ప్రశాంతతతో ఉంటేనే తడబాటు లేకుండా వాదించగలమని జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి చెప్పారు. జస్టిస్ ఎ.సుందర్ ఎప్పుడూ ప్రశాంతతతో న్యాయం వైపు ఉంటూ స్ఫూర్తిదాయకంగా నిలిచారని పేర్కొన్నారు. ఇక 2010 నుంచీ జస్టిస్ సుందర్‌తో తనకు పరిచయం ఉందని, ఆయన న్యాయ రంగ జీవితం ఆదర్శనీయమని వీవీ లక్ష్మీనారాయణ చెప్పారు. ఈ పుస్తకావిష్కరణలో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ జస్టిస్ కె.సుందర్ బదిలీకావడం తెలంగాణకు లోటు అని, మద్రాసు వారికి అదృష్టమని పేర్కొన్నారు. అనంతరం జస్టిస్ కె.సుందర్, శాంతి దంపతులను అతిథులు శాలువా, జ్ఞాపికతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.జగన్, వివిధ జిల్లా కోర్టుల జడ్జీలు, న్యాయవాదులుపాల్గొన్నారు.

కేటీఆర్.. వీపు సాపు చేస్తరు జాగ్రత్త!

» ఇప్పటికైనా భాష మార్చుకో: మేడిపల్లి

» సీఎంపై చిల్లర వ్యాఖ్యలు సహించబోం: కాల్వ సుజాత

» బీసీలను మోసం చేస్తున్న ఆర్.కృష్ణయ్య: ఈరవత్రి

హైదరాబాద్/న్యూఢిల్లీ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కేటీఆర్ భాషను తెలంగాణ ప్రజలు అసహ్యించుకుంటున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వ్యాఖ్యానించారు. అమెరికాలో చదివి, ఉద్యోగం చేసి వచ్చిన కేటీఆర్ భాష విని వీధి రౌడీలు సైతం సిగ్గుపడతారన్నారు. ఇప్పటికైనా భాష మార్చుకోని పక్షంలో తెలంగాణ ప్రజలు వీపు సాపు చేస్తరు.. జాగ్రత్త అంటూ హెచ్చరించారు. కేటీఆర్ అచ్చోసిన ఆంబోతులా రంకెలువేస్తూ సీఎం రేవంత్ రెడ్డిని పరుష పదజాలంతో తూలనాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ తప్పు చేసినందునే కాళేశ్వరం కమిషన్ ఆయనను విచారణకు పిలిచిందన్నారు. తమ అవినీతి బయటపడుతుందనే బీఆర్ఎస్ నేతలు గగ్గోలు పెడుతున్నారని మండిపడ్డారు. సీఎం రేవంత్‌పై చిల్లర మల్లర మాటలు మాట్లాడితే ఇక సహించబోమంటూ కేటీఆర్‌నుద్దేశించి టీపీసీసీ అధికార ప్రతినిధి, ఆర్య వైశ్య కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కాల్వ సుజాత హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో బీఆర్ఎస్ నేతలు ఇప్పటికైనా ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు. రాహుల్ గాంధీ ఒత్తిడి వల్లే కేంద్రంలో బీజేపీ కులగణన చేస్తోందని ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నారు. 40 ఏళ్లుగా పోరాడిన ఆర్.కృష్ణయ్య.. బీజేపీలో ఉంటూ బీసీలను మోసం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. సహకార ఉద్యమంలో యువతకు భాగస్వామ్యం కల్పించేందుకు దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్‌రెడ్డి తెలిపారు. ఇందుకోసం హైదరాబాద్‌లోని నిజాం కళాశాల నుంచి 120 మంది డిగ్రీ విద్యార్థులను ఎంపిక చేశామన్నారు.

కేటీఆర్ జీర్ణించుకోలేకపోతున్నారు: చామల

కాళేశ్వరం కమిషన్ ఎదుట కేసీఆర్ విచారణకు హాజరు కావడాన్ని కేటీఆర్ జీర్ణించుకోలేకపోతున్నారని, పిచ్చికుక్కలా రోడ్డుపై మొరుగుతున్నారని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఢిల్లీలో మీడియాతో ఆయన మాట్లాడారు. కేసీఆర్‌కు భయం లేకుంటే వన్ టు వన్ విచారణ ఎందుకని ప్రశ్నించారు. కాళేశ్వరం కమిషన్ విచారణకు అందరూ ఓపెన్ కోర్టులో సమాధానాలు ఇస్తుంటే, కేసీఆర్ మాత్రం ఎవరూ లేకుండా మాట్లాడతానని ఎందుకన్నారో చెప్పాలన్నారు.

ఎమ్మెల్యే పల్లాకు గాయం | కేసీఆర్ ఫాంహౌస్‌లో జారిపడిన రాజేశ్వర్‌రెడ్డి


యశోద ఆస్పత్రిలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని పరామర్శిస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

హైదరాబాద్ సిటీ/జనగామ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి గాయపడ్డారు. బుధవారం ఉదయం సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్‌లో బాత్‌రూమ్‌లో కాలుజారి పడ్డారు. దీంతో ఆయన తుంటికి బలమైన గాయమైంది. వెంటనే చికిత్స కోసం సోమాజిగూడలోని యశోద ఆస్పత్రికి తరలించారు. పరీక్షలు చేసిన వైద్యులు శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించి సాయంత్రం ఆపరేషన్ చేశారు. పల్లాకు ఆరు వారాలపాటు విశ్రాంతి అవసరమని సూచించారు. కాగా, బుధవారం కాళేశ్వరం కమిషన్ ఎదుట విచారణకు హాజరైన కేసీఆర్.. అనంతరం యశోద ఆస్పత్రికి వెళ్లి రాజేశ్వర్‌రెడ్డిని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. కేసీఆర్ వెంట హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, సంతోష్‌కుమార్ ఉన్నారు.

సర్కారీ ప్రీస్కూల్స్ సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

సిఫార్సు చేసింది. తెలంగాణ ఫౌండేషన్ స్కూల్స్ పేరుతో నర్సరీ నుంచి 2వ తరగతి వరకు ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేయాలని సీఎంకు కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి నివేదిక సమర్పించారు. దీనిపై ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు.. ప్రస్తుత విద్యా సంవత్సరంలోనే కొన్ని ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించాలని విద్యాశాఖ నిర్ణయించింది. అధికారులు 13 జిల్లాల్లోని 210 ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందులో పెద్దపల్లి జిల్లాలో 46, జగిత్యాలలో 32, భూపాలపల్లి 31, సిద్దిపేట 29, హన్మకొండ 16, నిజామాబాద్ 15, మంచిర్యాల 14, వరంగల్ 13, ఆసిఫాబాద్ 7, కరీంనగర్ 3, ములుగు 1, కామారెడ్డి జిల్లాలో 1 పాఠశాల ఉన్నాయి. ఈ పూర్వ ప్రాథమిక తరగతుల్లో కొత్తగా విద్యార్థులను చేర్చుకోవడంతోపాటు పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ విద్యార్థులను కూడా కలుపుతారు. సదరు అంగన్‌వాడీల కార్యకర్తలు, ఆయాతోపాటు ఒక వలంటీర్‌కు ఈ పూర్వ ప్రాథమిక తరగతుల నిర్వహణ బాధ్యత అప్పగించాలని విద్యా శాఖ భావిస్తోంది. అయితే దీనిపై ప్రభుత్వం నుంచి పూర్తి స్పష్టత లేదు. ఎంపిక చేసిన 210 ప్రాథమిక పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు పూర్వ ప్రాథమిక తరగతులకు సంబంధించి ఇంతవరకు ఎలాంటి శిక్షణ ఇవ్వలేదు. ప్రస్తుతానికి అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్‌తో బోధన ప్రారంభించాలని.. తర్వాత ప్రాథమిక ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి బోధన బాధ్యత అప్పగించాలని విద్యాశాఖ భావిస్తున్నట్లు సమాచారం.

నారాయణపేటలో సైనిక పాఠశాలను ఏర్పాటు చేయండి

» కేంద్రమంత్రి సంజయ్ సేథ్‌కు ఎంపీ డీకే అరుణ వినతి

న్యూఢిల్లీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేటలో సైనిక పాఠశాలను ఏర్పాటు చేయాలని కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్‌కు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ విజ్ఞప్తి చేశారు. కేంద్రమంత్రితో ఆయన కార్యాలయంలో బుధవారం భేటీ అయిన ఆమె గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల సైనిక పాఠశాల ఏర్పాటు ప్రక్రియ నిలిచిపోయిందని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సాధ్యమైనంత త్వరగా నారాయణపేటలో సైనిక పాఠశాలను ఏర్పాటు చేయాలని తాను చేసిన విజ్ఞప్తికి కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని ఎంపీ డీకే అరుణ తెలిపారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

డబ్బింగ్ షురూ...



ఎన్టీఆర్, హృతిక్ రోషన్ కథానాయకులుగా నటిస్తున్న చిత్రం 'వార్ 2'. అయన్ ముఖర్జీ దర్శకత్వంలో యశ్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తోంది. ఇటీవలే చిత్రీకరణ పూర్తయింది. ఎన్టీఆర్ బుధవారం తన పాత్రకు డబ్బింగ్ చెప్పడం ప్రారంభించారు. 'వార్ 2 డబ్బింగ్ ప్రారంభం' అంటూ ఎన్టీఆర్ స్టూడియోలోకి అడుగుపెడుతున్న వీడియోను చిత్ర బృందం సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఎన్టీఆర్‌కు ఇది తొలి హిందీ చిత్రం. ఈ స్పై థ్రిల్లర్‌లో సీక్రెట్ ఏజెంట్‌గా ఆయన డిఫరెంట్ లుక్‌లో కనిపించనున్నారు. కియారా అద్వానీ ఈ చిత్రంలో కథానాయిక. గతంలో హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ నటించిన 'వార్' చిత్రానికి ఇది కొనసాగింపు. ఆదిత్యా చోప్రా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు రానుంది.

ముస్సోరిలో మెగాస్టార్



మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. 'మెగా 157' వర్కింగ్ టైటిల్. ఇటీవలె హైదరాబాద్‌లో మొదటి షెడ్యూల్‌ను పూర్తి చేశారు మేకర్స్. ఈ చిత్ర రెండో షెడ్యూల్‌ను బుధవారం ముస్సోరిలో ప్రారంభించారు. ఈ అందమైన హిల్ స్టేషన్‌లో 10 రోజుల పాటూ వినోదాత్మక సన్నివేశాలను చిత్రీకరిస్తారు. చిరుతో పాటూ సినిమాలోని కీలక పాత్రదారులు ఇందులో పాల్గొంటున్నారు. ఆయనకు జోడిగా నయనతార నటిస్తున్నారు. 'ఉయ్యాలవాడ నరసింహా రెడ్డి', 'గాడ్ ఫాదర్' చిత్రాల తర్వాత వారిద్దరూ కలసి నటించడం ఇది మూడోసారి. సాహు గారపాటి, సుష్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి సినిమాను ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు. చాలా రోజుల తర్వాత చిరంజీవి వినోదానికి ప్రాధాన్యం ఉన్న పాత్ర చేస్తుండడంతో సినిమాపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ఇందులో ఆయన పాత్ర అభిమానులకు విజువల్ ట్రీట్‌లా ఉంటుందని మేకర్స్ హామీ ఇచ్చారు.





సినిమా అందర్నీ సర్‌ప్రైజ్ చేస్తుంది

నితిన్

నితిన్ కథానాయకుడిగా శ్రీరామ్ వేణు తెరకెక్కిస్తున్న చిత్రం 'తమ్ముడు'. 'కాంతార' ఫేమ్ సప్తమి గౌడ, వర్ష బొల్లమ్మ, స్వసిక విజయన్, లయ కీలక పాత్రలు పోషిస్తున్నారు. దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. జూలై 4న విడుదలవుతోంది. బుధవారం ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. దర్శకుడు వేణు శ్రీరామ్ మాట్లాడుతూ "ఇందులో సరికొత్త స్ర్కీన్ ప్లేను చూస్తారు. తన కోసం కాకుండా సినిమా గురించి ఆలోచించే వ్యక్తి నితిన్. నేను, నితిన్, దిల్‌రాజు.. పవన్‌కల్యాణ్ గారి అభిమానులం. అందుకే ఈ సినిమాకు 'తమ్ముడు' టైటిల్ పెట్టాం" అని తెలిపారు. "ఈ సినిమా మీ అందర్నీ తప్పక సర్‌ప్రైజ్ చేస్తుంది. ఇంతకన్నా ఎక్కువ ఈ సినిమా గురించి చెప్పను. జూలై 4న సినిమా మాట్లాడుతుంది. చిత్రం ఘనవిజయం సాధిస్తుంది" అని నితిన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో దిల్‌రాజు కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. అవి ప్రస్తుతం సంచలనంగా మారాయి.

నితిన్, శ్రీరామ్ వేణు సపోర్ట్ చేశారు



"ఈ ఏడాది విడుదలైన సినిమాల్లో కేవలం నాలుగైదు మాత్రమే ఆదరణ పొందాయి. దీన్ని బట్టి థియేట్రికల్‌గా సినిమాల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. 'తమ్ముడు' సినిమా షూటింగ్ ఎక్కువ రోజులు జరగడంతో బడ్జెట్ పెరిగింది. ఈ విషయం దర్శకుడు వేణుకు చెప్పా. 'అద్భుతమైన సౌండింగ్, ఉన్నత స్థాయి విజువల్స్ ఉన్న అవుట్‌పుట్ కోసమే బడ్జెట్ పెరిగింది. ఈ సినిమాకు ఇప్పటివరకూ ఇంత తీసుకున్నా. ఇక నుంచి ఒక్క రూపాయి తీసుకోను. సినిమా విడుదలై హిట్ అయ్యాక పారితోషికం ఇవ్వండి' అని అన్నారు. నా 22 ఏళ్ల కెరీర్‌లో ఇలాంటి దర్శకుడిని నేను చూడలేదు. అలాగే, నితిన్ కూడా పారితోషికం విషయంలో చాలా రాజీ పడ్డారు. 'ఎంత వీలైతే అంతే ఇవ్వండి' అని సపోర్ట్‌గా మాట్లాడారు. నిర్మాత పరిస్థితి తెలుసుకుని దర్శకుడు, హీరో ఇలా వ్యవహరించడం గొప్ప విషయం. ఇలా హీరో, దర్శకుడు నిర్మాతలకు మద్దతు ఇస్తూ ఓ కొత్త ఒరవడిని తీసుకురావాలి".

డబ్బులు పెట్టి వ్యూస్ కొనొద్దు

"తమ్ముడు' సినిమా ట్రైలర్‌కు ఒరిజినల్‌గా ఎన్ని వ్యూస్ వస్తాయో అన్నే చెప్పాలనుకుంటున్నాం. ఇన్ని మిలియన్స్, అన్ని మిలియన్స్ అనే ప్రచారం కోసం డబ్బులు పెట్టి వ్యూస్ కొనొద్దని, ప్రేక్షకుల నుంచి నిజంగా వచ్చిన వ్యూస్ మాత్రమే కనిపించాలని పీఆర్ టీమ్‌కు చెప్పా. అప్పుడు గాని టీజర్, పాటలు ప్రేక్షకులకు ఎంతగా చేరాయో తెలియదు. సినిమా రీచ్ ఎలా ఉందో అర్థం అవుతుంది. ఈ విషయంలో నేను ముందడుగు వేశా. కష్టమైనా ముందుకెళ్లాల్సిందే".

పవన్‌కల్యాణ్ ఆదర్శం

"ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఈ మధ్య థియేటర్లకు ప్రేక్షకులను ఎలా తిరిగి తీసుకురావాలో కొన్ని సూచనలు చేశారు. ఆయన చెప్పిన విషయాలు ఎంతో ఆదర్శవంతంగా ఉన్నాయి. వాటిని పాటించడానికి ప్రయత్నిస్తున్నాను. ఆయన సూచనలను నిర్మాతలంతా పాటించాలి. 'తమ్ముడు' చిత్రానికి ధరలు పెంచమని ప్రభుత్వాలను అడగను. ఇకపై తెలంగాణలో టికెట్ల ధర పెంచడం అంటూ ఉండదు. టికెట్ల ధరలు, తినుబండారాల ధరలు కూడా ప్రేక్షకులకు అందుబాటులో ఉండాలి. ఈ విషయాలను తెలంగాణ మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలోనూ చర్చించాం. పవన్‌గారి సూచనలపై తెలంగాణ ప్రభుత్వానికి ప్రతిపాదనలు ఇచ్చాను".

వేడుక... వినోదం




హీరో సూర్య నటిస్తున్న తొలి తెలుగు స్ట్రెయిట్ చిత్రం (సూర్య - 46) చిత్రం రెగ్యులర్ షూట్ బుధవారం హైదరాబాద్‌లో మొదలైంది. 'వేడుక, భావోద్వేగం, వినోదం వైపు తొలి అడుగు' అంటూ సూర్య ముందడుగు వేస్తున్న పోస్టర్‌ను చిత్రబృందం పంచుకుంది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రంలో మమితా బైజు కథానాయిక. రవీనాటాండన్, రాధికా శరత్‌కుమార్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. వచ్చే ఏడాది వేసవిలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు మేకర్స్ ప్రయత్నిస్తున్నారు. సంగీతం: జీవీ ప్రకాశ్, సినిమాటోగ్రఫీ: నిమిష్ రవి



తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో చేపట్టిన 'ఆపరేషన్ సంకల్ప్'కు మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ మద్దతు పలికింది. డ్రగ్స్ రహిత తెలంగాణను నిర్మించే లక్ష్యంతో చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమాన్ని బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభించారు. యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్యా, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మాదాల రవి తదితరులు పాల్గొని ప్రచార చిత్రాలు ఆవిష్కరించారు.

'యజ్ఞం' దర్శకుడు ఇక లేరు



టాలీవుడ్‌లో విషాదం నెలకొంది. ప్రముఖ దర్శకుడు ఏ. ఎస్ రవికుమార్ చౌదరి కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం రాత్రి గుండెపోటుతో కన్నుమూశారు. ఆయనకు భార్య నాగబిందు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. 2001లో ఆకాశ్ హీరోగా నటించిన 'మనసుతో' చిత్రంతో రవికుమార్ చౌదరి దర్శకుడిగా పరిచయమయ్యారు. గోపీచంద్‌ను హీరోగా ఆయన తెరకెక్కించిన 'యజ్ఞం' చిత్రం వారిద్దరికీ ఇండస్ట్రీలో బ్రేక్ ఇచ్చింది. సాయిదుర్గాతేజ్‌తో తెరకెక్కించిన 'పిల్లా నువ్వు లేని జీవితం' చిత్రం బాక్సాఫీసు దగ్గర మంచి విజయాన్ని అందుకుంది. బాలకృష్ణతో 'వీరభద్ర', నితిన్‌తో 'ఆటాడిస్తా' చిత్రాలను తెరకెక్కించినా అవి విజయవంతం అవ్వలేదు. రాజ్‌తరుణ్‌తో తెరకెక్కించిన 'తిరగబడరా సామి' రవికుమార్ ఆఖరిచిత్రం.

స్పోర్ట్స్

కాంబ్లిని అప్పుడే హెచ్చరించా.. ఇప్పుడదే జరిగింది..!


యోగ్‌రాజ్


కాంబ్లీ

న్యూఢిల్లీ: కెరీర్‌పై దృష్టి సారించాలని అంతర్జాతీయ క్రికెట్‌లోకి ప్రవేశించిన తొలినాళ్లలోనే వినోద్ కాంబ్లీకి సలహా ఇచ్చానని మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ తండ్రి యోగ్‌రాజ్ సింగ్ వెల్లడించాడు. 'అర్ధరాత్రి వరకు జరిగే పార్టీల్లో గడపడం, సిగరెట్లు తాగడం, యువతుల వద్దకు వెళ్లే అలవాట్లను మానుకోవాలని ఒకసారి కాంబ్లీకి చెప్పా. లేదంటే నీ కెరీర్ నాశనం అవుతుందని కూడా హెచ్చరించా. ఇప్పుడు చూడండి. అదే జరిగింది. కానీ కాంబ్లి నాతో మాట్లాడుతూ..'సార్ ఇవి మీ రోజులు కావు' అని చెప్పాడన్నాడు. అప్పట్లో తానే రాజునని కాంబ్లీ భావించేవాడు' అని ఓ ఇంటర్వ్యూలో యోగ్‌రాజ్ చెప్పుకొచ్చాడు.

బంగ్లా చెస్ ప్లేయర్‌ను తిప్పిపంపిన అధికారులు

న్యూఢిల్లీ: గతంలో వీసా నిబంధనలు ఉల్లంఘించిన బంగ్లాదేశ్ చెస్ క్రీడాకారిణికి భారత ఇమ్మిగ్రేషన్ అధికారులు అనుమతి నిరాకరించారు. విమానాశ్రయంలోనే అదుపులోకి తీసుకొని తర్వాతి రోజు తిప్పిపంపారు. ఢిల్లీ అంతర్జాతీయ ఓపెన్ గ్రాండ్ మాస్టర్స్ చెస్ టోర్నీలో పాల్గొనేందుకు బంగ్లా వెటరన్ ఐఎం రాణీ హమీద్ అలియాస్ సయిదా జసిమున్నీసా ఖాతూన్ (80) వచ్చింది. ఆమె తనకు తోడుగా మరో క్రీడాకారిణి ఆషియా సుల్తానా (37)ను భారత్‌కు తీసుకొచ్చింది. అయితే, సుల్తానా గతంలో మెడికల్ వీసాపై వచ్చి కోల్‌కతాలో ఓ టోర్నీలో పాల్గొంది. దీంతో ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ ఆమెను బ్లాక్ లిస్ట్‌లో పెట్టింది. ఈ నేపథ్యంలో ఢిల్లీలో దిగగానే సుల్తానాను అదుపులోకి తీసుకొన్న అధికారులు.. మరో విమానంలో బంగ్లాకు తిప్పిపంపారు. ఈ ఘటనపై హమీద్ మాట్లాడుతూ ప్రయాణంలో వృద్ధురాలైన తనకు సుల్తానా ఎంతో సాయంగా ఉండేదని చెప్పింది.


గిల్


జడేజా

ముమ్మర సాధన

లండన్: యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్‌ల సిరీస్ కోసం భారత్ కఠోరంగా శ్రమిస్తోంది. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల రిటైర్మెంట్‌తో ప్రస్తుతం జట్టులో అనుభవలేమి బాగా కనిపిస్తోంది. కానీ, కోచ్ గౌతమ్ గంభీర్ వ్యూహాలు, సూచనలతో టీమిండియా సంచలనాలు నమోదు చేయాలనుకొంటోంది. కెప్టెన్‌గా గిల్‌కు కూడా ఇది తొలి సిరీస్ కావడంతో అతడిపై ఒత్తిడి నెలకొనే అవకాశం ఉంది. ప్రస్తుతం బెకెన్‌హామ్‌ను బేస్‌గా చేసుకొన్న టీమిండియా ఈ నెల 20 నుంచి జరిగే సిరీస్ కోసం ముమ్మరంగా సాధన చేస్తోంది. భారత్-ఎ తరఫున చాలా మంది ఆటగాళ్లు ఈపాటికే ఇంగ్లండ్ లయన్స్‌తో రెండు అనధికార టెస్టులు ఆడేశారు. శుక్రవారం భారత జట్ల మధ్యే మూడో ప్రాక్టీస్ మ్యాచ్ జరగనుంది. అయితే, గంభీర్ మాత్రం ప్రతి విషయాన్ని



సీరియస్‌గా తీసుకొంటున్నట్టు తెలుస్తోంది. జట్టుకు బ్యాటింగ్ సాధనలా కాకుండా వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించే విధంగా ప్రాక్టీస్ వికెట్లను రూపొందించాలని క్యూరేటర్లకు సూచించాడట. సహజంగా ఇంగ్లిష్ పిచ్‌లు స్వింగ్‌కు ఎక్కువగా సహకరిస్తాయి. ఈ నేపథ్యంలో భారత కోచింగ్ సిబ్బంది మ్యాచ్ ప్రాక్టీస్ కోసం చక్కని వికెట్ కావాలని కోరినట్టు క్యూరేటర్ జోష్ మార్డెన్ తెలిపాడు. అందుకు అనుగుణంగా వికెట్‌ను రూపొందించినట్టు చెప్పాడు.

క్యాచింగ్.. త్రోయింగ్

టెస్ట్ సిరీస్ కోసం టీమిండియా తీవ్రంగా సాధన చేస్తోంది. గిల్ అండ్ కో ఫీల్డింగ్ ప్రాక్టీస్ చేస్తున్న వీడియోను బీసీసీఐ నెట్‌లో షేర్ చేసింది. ఫీల్డింగ్ కోచ్ దిలీప్.. ఆటగాళ్లతో క్యాచింగ్, త్రోయింగ్ ప్రాక్టీస్ చేయించాడు. కాగా, సుదర్శన్ అద్భుత క్యాచ్‌ను గిల్ ప్రశంసించాడు.

శ్రేయా‌స్‌కు గంగూలీ మద్దతు

ఫామ్ ఆధారంగా శ్రేయాస్ అయ్యర్‌కు జట్టులో చోటు కల్పించి ఉండాల్సిందని టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ అన్నాడు. మిడిలార్డర్‌లో శ్రేయాస్ ఎంతో ఉపయుక్తమైన ఆటగాడని చెప్పాడు. ఏడాదిగా పరుగుల వరద పారిస్తున్నా సెలెక్టర్లు అతడిని పట్టించుకోలేదని గంగూలీ అన్నాడు. ఈ సిరీస్‌కు శ్రేయా‌స్‌ను ఎంపిక చేసి ఉంటే.. అతడు జట్టు కోసం ఏం చేసేవాడో తెలిసేదని దాదా చెప్పాడు.

టాప్-3లో తిలక్

ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్



దుబాయ్: టీమిండియా యువ ఆటగాడు తిలక్ వర్మ ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో టాప్-3లోకి దూసుకొచ్చాడు. బుధవారం ఐసీసీ విడుదలజేసిన ర్యాంకింగ్స్ బ్యాటింగ్ విభాగంలో తిలక్ ఓ స్థానం ఎగబాకి మూడో ర్యాంక్‌లో నిలిచాడు. తిలక్ 804 రేటింగ్ పాయింట్లతో ఉన్నాడు. భారత్‌కే చెందిన అభిషేక్ శర్మ 829 పాయింట్లతో రెండో ర్యాంకులో ఉన్నాడు. ట్రావిస్ హెడ్ (856) టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. బౌలర్ల విభాగంలో భారత్ నుంచి వరుణ్ చక్రవర్తి 3, రవి బిష్ణోయ్ 7, అర్షదీప్ 10వ ర్యాంక్‌లతో టాప్‌టెన్‌లో కొనసాగుతున్నారు.

హాంప్‌షైర్ క్లబ్ తరఫున..

హైదరాబాద్: టీమిండియా యువ క్రికెటర్ తిలక్ వర్మ ఇంగ్లీష్ కౌంటీల్లో ఆడనున్నాడు. ఈ ఎడమచేతివాటం బ్యాటర్ హాంప్‌షైర్ క్లబ్ తరఫున కౌంటీ చాంపియన్‌షిప్‌లో పోటీపడనున్నాడని హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) బుధవారం ప్రకటించింది. యూకే కౌంటీ చాంపియన్‌షిప్‌లో తమ తరఫున ఆడాలంటూ హాంప్‌షైర్ క్లబ్ తిలక్‌ను సంప్రదించిందనీ, అందుకు అతను కూడా అంగీకరించాడని తెలిపింది. 22 ఏళ్ల తిలక్ భారత్ తరఫున 25 టీ20లు, 4 వన్డేలకు ప్రాతినిధ్యం వహించాడు. టీ20ల్లో 749, వన్డేల్లో 68 పరుగులు సాధించాడు.

బెంగళూరు కాదు.. రాజ్‌కోట్

'చిన్నస్వామి' మ్యాచ్‌ల తరలింపు

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ఆర్‌సీబీ విజయోత్సవాల తొక్కిసలాట నేపథ్యంలో కర్ణాటక క్రికెట్ సంఘానికి బీసీసీఐ షాక్ ఇచ్చింది. నవంబరు 13-19 మధ్య బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో ఇండియా-దక్షిణాఫ్రికా-ఎ జట్ల మధ్య జరగాల్సిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను రాజ్‌కోట్‌కు మార్చారు. అలాగే సెప్టెంబరు-నవంబరులో బెంగళూరులో నిర్వహించాల్సిన ఐసీసీ మహిళా వరల్డ్‌కప్ మ్యాచ్‌లను కూడా మరో చోటికి తరలించే అవకాశం కనిపిస్తోంది.

ఐపీఎల్ సమయంలోనే పీఎస్‌ఎల్?

లాహోర్: వచ్చే ఏడాది కూడా ఐపీఎల్ సమయంలోనే పాకిస్థాన్ ప్రీమియర్ లీగ్ (పీఎస్‌ఎల్)ను నిర్వహించేందుకు పాక్ బోర్డు యత్నిస్తోంది. సహజంగా పీఎస్‌ఎల్ కోసం ఫిబ్రవరి-మార్చి విండో ఉంది. అయితే, 2026 టీ20 వరల్డ్‌కప్‌ను కూడా ఫిబ్రవరి-మార్చిలో షెడ్యూల్ చేశారు. దీంతో ఏప్రిల్-మేలో ఐపీఎల్ జరిగే సమయంలోనే పీఎస్‌ఎల్‌ను జరపాలనుకొంటున్నారు. ఈ ఏడాది చాంపియన్స్ లీగ్ నేపథ్యంలో ఐపీఎల్ విండోలోనే పీఎస్‌ఎల్ కూడా నిర్వహించారు. ఇలా చేయడం వల్ల తమకు ఎటువంటి నష్టమూ కలగలేదని పీఎస్‌ఎల్ తెలిపింది.



ఎంఐ న్యూయార్క్ కెప్టెన్ పూరన్

న్యూయార్క్: అంతర్జాతీయ క్రికెట్‌కు అనూహ్యంగా వీడ్కోలు ప్రకటించిన వెస్టిండీస్ స్టార్ బ్యాటర్ నికోలస్ పూరన్ మేజర్ లీగ్ క్రికెట్ (ఎంఎల్‌సీ) జట్టు ఎంఐ న్యూయార్క్ కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. 29 ఏళ్ల పూరన్ మంగళవారం రిటైర్మెంట్ ప్రకటించిన విషయం విదితమే. 'బౌలర్ల గుండెల్లో గుబులు రేపే ఈ ఎడమచేతి వాటం బ్యాటర్ సారథ్యంలో ఎంఐ న్యూయార్క్ మరింత ఎత్తుకు ఎదుగుతుందని భావిస్తున్నాం' అని ఆ ఫ్రాంచైజీ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. అమెరికాలో 2023లో ప్రారంభమైన టీ20 టోర్నీ ఎంఎల్‌సీ తొలి సీజన్‌లో ఎంఐ న్యూయార్క్ విజేతగా నిలిచింది. ఐపీఎల్ ఫ్రాంఛైజీ ముంబై ఇండియన్స్ యాజమాన్యానికి చెందినదే ఈ న్యూయార్క్ ఎంఐ.


రబాడ (5/51)

డబ్ల్యూటీసీ ఫైనల్

తొలిరోజే 14 వికెట్లు

● విజృంభించిన పేసర్లు ● ఆస్ట్రేలియా 212 ఆలౌట్
● స్మిత్, వెబ్‌స్టర్ అర్ధ శతకాలు ● దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 43/4

లండన్: పేసర్ల ఆధిపత్యం సాగిన వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్లో తొలి రోజే 14 వికెట్లు నేలకూలాయి. వెబ్‌స్టర్ (72), స్మిత్ (66) అర్ధ శతకాలతోపాటు బౌలర్లు రాణిస్తుండడంతో డిఫెండింగ్ చాంప్ ఆస్ట్రేలియా దీటుగా బదులిస్తోంది. రబాడ (5/51) నిప్పులు చెరగడంతో.. బుధవారం ఆరంభమైన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 212 పరుగులకు ఆలౌటైంది. జాన్సెన్ 3 వికెట్లు పడగొట్టాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ ఆరంభంలోనే తడబడింది. ఓపెనర్ ఖవాజా (0)ను డకౌట్ చేసిన రబాడ.. వన్‌డౌన్ బ్యాటర్ కామెరూన్ గ్రీన్ (4)ను కూడా స్వల్ప స్కోరుకే పెవిలియన్ చేర్చాడు. ఓపెనర్‌గా బరిలోకి దిగిన లబుషేన్ (17)ను జాన్సెన్ బోల్తా కొట్టించడంతో ఆసీస్ 46/3తో నిలిచింది. హెడ్ (11) కూడా ఎక్కువ సేపు క్రీజులో నిలబడలేక పోయాడు. ఈ దశలో జతకలసిన స్మిత్, వెబ్‌స్టర్ ఐదో వికెట్‌కు 79 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. అయితే, ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న స్మిత్‌ను మార్‌క్రమ్ అవుట్ చేయడంతో టీ విరామానికి ఆస్ట్రేలియా 190/5తో నిలిచింది. ఆఖరి సెషన్‌లో క్యారీ (23)ను కేశవ్, హాఫ్ సెంచరీ సాధించిన వెబ్‌స్టర్‌ను రబాడ వెనక్కిపంపారు. అనంతరం తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 43/4తో కష్టాల్లో పడింది. మొదటి రోజు ఆట ఆఖరుకు బవుమా (3 బ్యాటింగ్), డేవిడ్ బెడింగమ్ (8 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఓపెనర్లు మార్‌క్రమ్ (0), రికెల్టన్ (16)ను స్టార్క్ వెనక్కిపంపాడు. ముల్డర్ (6)ను కమిన్స్ పెవిలియన్ చేర్చగా.. స్టబ్స్ (2)ను హాజెల్‌వుడ్ బౌల్డ్ చేశాడు. మొత్తంగా ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ స్కోరుకు సౌతాఫ్రికా ఇంకా 169 పరుగుల దూరంలో ఉంది.


వెబ్‌స్టర్ (72)

సంక్షిప్త స్కోర్లు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 212 ఆలౌట్ (వెబ్‌స్టర్ 72, స్మిత్ 66; రబాడ 5/51, జాన్సెన్ 3/49).
దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 43/4 (రికెల్టన్ 16; స్టార్క్ 2/10, కమిన్స్ 1/14).

'బాస్' క్వార్టర్స్‌లో బోపన్న జోడీ

స్టట్‌గార్ట్ (జర్మనీ): ఏటీపీ 250 బాస్ ఓపెన్ టోర్నమెంట్‌లో భారత టెన్నిస్ వెటరన్ స్టార్ రోహన్ బోపన్న డబుల్స్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లగా.. శ్రీరామ్ బాలాజీ, యుకీ భాంబ్రీ టోర్నీ నుంచి నిష్క్రమించారు. బోపన్న/శాండర్ గిల్లె (బెల్జియం) ద్వయం 6-3, 5-7, 11-9తో స్థానిక జంట జాకబ్/మార్క్‌పై గెలిచింది. మిగతా మ్యాచుల్లో యుకీ/రాబర్ట్ జంట 6-7(5), 6-7(5)తో గొంజాలెజ్/ఆస్టిన్ జోడీ చేతిలో, బాలాజీ/మిగెల్ (మెక్సికో) ద్వయం 7-6(5), 3-6, 5-10తో ఫ్రాన్స్ జంట సాడియో డౌంబియా/ఫాబియెన్ రెబోల్ చేతిలో పరాజయం పాలయ్యారు.

విండీస్‌ను ఊడ్చేశారు



ఇంగ్లండ్‌దే ఆఖరి టీ20

సౌతాంప్టన్ (ఇంగ్లండ్): వెస్టిండీస్‌తో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను ఆతిథ్య ఇంగ్లండ్ 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఆఖరి మ్యాచ్‌లో 37 పరుగుల తేడాతో కరీబియన్లను ఓడించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్.. ఓపెనర్లు బెన్ డకెట్ (84), జేమీ స్మిత్ (60) అర్ధ శతకాలతో మెరవడంతో 20 ఓవర్లలో 248/3 స్కోరు చేసింది. బెతెల్ (36 నాటౌట్), బ్రూక్ (35 నాటౌట్) రాణించారు. ఛేదనలో ల్యూక్ వుడ్ (3/31), రషీద్ (2/30) ధాటికి విండీస్ 211/8 స్కోరుకే పరిమితమై ఓటమి పాలైంది. పావెల్ (79 నాటౌట్), హోప్ (45) సత్తా చాటినా ఫలితం లేకపోయింది. ఇప్పటికే మూడు వన్డేల సిరీస్‌ను కూడా 0-3తో కోల్పోయిన విండీస్.. ఇంగ్లండ్ టూర్‌ను ఒక్క గెలుపూ లేకుండానే ముగించింది.

బిజినెస్

రూ.1.45 లక్షల కోట్ల ఐపీఓలు

ప్రైమరీ మార్కెట్లో మళ్లీ సందడి



ముంబై: ట్రంప్ సుంకాలతోపాటు భౌగోళిక రాజకీయ అనిశ్చితుల ప్రభావం నుంచి ఈక్విటీ మార్కెట్ క్రమంగా కోలుకుంటోంది. 52 వారాల కనిష్ఠ స్థాయి నుంచి నిఫ్టీ 15 శాతం మేర ఎగబాకింది. ఐపీఓల సందడి కూడా క్రమంగా పెరుగుతోంది. ప్రైమ్ డేటాబేస్ ప్రకారం.. ప్రస్తుతం 75కు పైగా కంపెనీలు సెబీ నుంచి ఐపీఓకు అనుమతి పొంది, పబ్లిక్ ఆఫర్‌ను ప్రారంభించేందుకు సరైన సమయం కోసం వేచి చూస్తున్నాయి. ఈ కంపెనీలు మార్కెట్ నుంచి మొత్తం రూ.1.45 లక్షల కోట్ల వరకు సమీకరించే అవకాశం ఉంది. మరో రూ.90,000 కోట్లకు పైగా విలువైన 65 కంపెనీల ఐపీఓలు సెబీ గ్రీన్ సిగ్నల్ కోసం ఎదురు చూస్తున్నాయి. ఈ కంపెనీలన్నీ కలిసి మార్కెట్ నుంచి రూ.2.35 లక్షల కోట్ల వరకు సమీకరించే అవకాశం ఉంది.

గత నెల నుంచి మళ్లీ గాడిలోకి..

ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్‌లో దాదాపుగా స్తంభించిపోయిన ఐపీఓ మార్కెట్‌లో గత నెల నుంచి మళ్లీ కదలిక మొదలైంది. 10కి పైగా కంపెనీలు పబ్లిక్ ఆఫరింగ్‌ల ద్వారా రూ.20,000 కోట్ల వరకు సమీకరించాయి. మున్ముందు ఇష్యూల జోరు మరింత పెరగవచ్చని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 105 కంపెనీలు ఐపీఓల ద్వారా రూ.2.11 లక్షల కోట్లకు పైగా నిధులు సేకరించాయి.

సెబీ అనుమతి పొందిన కొన్ని బడా ఐపీఓలు

కంపెనీ	(రూ.కోట్లు)
హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్	12,500
ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా	15,000(అంచనా)
హీరో ఫిన్‌కార్ప్	3,668
ఎన్‌ఎస్‌డీఎల్	3,420 (అంచనా)
విక్రమ్ సోలార్	1,500
కరంతార ఇంజనీరింగ్	1,750

రియల్టీ రంగంలోనూ జోష్

స్థిరాస్తి రంగంలోని పలు కంపెనీలు ఐపీఓ ద్వారా నిధుల సమీకరణకు సిద్ధమవుతున్నాయి. నోయిడాకు చెందిన బీపీటీపీ లిమిటెడ్, ఎం3ఎం గ్రూప్‌నకు చెందిన స్మార్ట్‌వరల్డ్ డెవలపర్స్, గౌర్‌సన్స్ ఇండియా, వాధ్వా గ్రూప్ ఈ జాబితాలో ఉన్నాయి. ఈ సంస్థలు ఐపీఓల ద్వారా రూ.15,000 కోట్లకు పైగా సమీకరించే అవకాశం ఉంది.

పెరగనున్న దరఖాస్తులు

ఐపీఓకు వచ్చేందుకు సెబీకి కంపెనీల దరఖాస్తులు కూడా భారీగా పెరిగే అవకాశాలున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఐటీ, ఫిన్‌టెక్, రెన్యువబుల్ ఎనర్జీ వంటి నవతరం కంపెనీలు ఐపీఓకు వచ్చేందుకు అధిక ఆసక్తి చూపుతున్నాయన్నారు. ఎంటీఆర్, ఈస్టర్న్ మసాలా బ్రాండ్ల యాజమాన్య సంస్థ ఓర్క్లా ఇండియా కూడా ఐపీఓకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. మర్చంట్ పేమెంట్స్ సేవల సంస్థ పైన్ ల్యాబ్స్ కూడా సెబీకి దరఖాస్తు సమర్పించనున్నట్లు తెలిపింది. ఐపీఓ ద్వారా సంస్థ రూ.5,000-6,000 కోట్ల వరకు సమీకరించవచ్చని సమాచారం. ఈ-కామర్స్ కంపెనీ మీషో కూడా ఐపీఓకు సిద్ధమైంది. 8,500 కోట్ల వరకు సమీకరించేందుకు ఈనెలలోనే డీఆర్‌హెచ్‌పీ ఫైల్ చేయవచ్చని తెలిసింది.

ఏపీలో కైటెక్స్ యూనిట్ !

రూ.4,000 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆంధ్రప్రదేశ్‌లో భారీ పెట్టుబడులకు మరో కంపెనీ సిద్ధమవుతోంది. కేరళ కేంద్రంగా పనిచేసే కైటెక్స్ సంస్థ రాష్ట్రంలో రూ.4,000 కోట్ల పెట్టుబడితో ఎగుమతుల కోసం దుస్తుల తయారీ యూనిట్ ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నట్టు సమాచారం. ఈ కంపెనీ ఇప్పటికే తెలంగాణలో రూ.3,600 కోట్లతో వరంగల్, హైదరాబాద్ సమీపంలోని సీతారాంపూర్ వద్ద చిన్న పిల్లల దుస్తుల తయారీ కోసం రెండు యూనిట్లు ఏర్పాటు చేసింది. ఇపుడు ఆంధ్రప్రదేశ్‌లోనూ రూ4,000 కోట్ల భారీ పెట్టుబడితో యూనిట్ ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్టు సమాచారం.

కేరళలో చుక్కెదురు: కేరళకు చెందిన ఈ కంపెనీ యాజమాన్యానికి, అక్కడి సీపీఎం నాయకత్వంలోని వామపక్ష ప్రభుత్వానికి పడడం లేదు. గత నెల రోజుల్లోనే కేరళ అధికారులు ఆ రాష్ట్రంలోని కైటెక్స్ యూనిట్లలో నిబంధనలు ఉల్లంఘిస్తున్నారనే పేరుతో అనేక సార్లు తనిఖీ చేశారు. అయినా ఏమీ తేల్చలేకపోయారు. ఈ తనిఖీలపై కైటెక్స్ సీఎండీ సాబు జాకబ్ బహిరంగంగానే విమర్శించారు. వామపక్ష ఫ్రంట్ పాలనతో రాష్ట్రంలో పరిశ్రమలు సక్రమంగా పనిచేసే పరిస్థితి లేకుండా పోయిందని విమర్శించారు. దీంతో తమ కొత్త యూనిట్లను పత్తి సమృద్ధిగా పండే ఆంధ్రప్రదేశ్‌కు విస్తరించాలని కంపెనీ నిర్ణయించినట్టు సమాచారం. ఈ ప్రాజెక్టు అమలైతే రాష్ట్రంలో కొన్ని వేల మందికి ఉపాధి లభిస్తుందని భావిస్తున్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



12వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	550
వరంగల్	542	గోదావరి	535
చిత్తూరు	613	విశాఖపట్నం	550
		దజను గుడ్లు రూ.	78

ఏఎస్‌బీఎల్ కొత్త వెంచర్ 'బ్రాడ్‌వే'

ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో జీ+50 ఫ్లోర్లతో నిర్మాణం

ఒక్కో ఫ్లాట్ కనీస ధర రూ.2.5 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్థానిక రియల్ ఎస్టేట్ సంస్థ ఏఎస్‌బీఎల్ నగరంలో మరో ప్రీమియం రెసిడెన్షియల్ గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టు చేపట్టింది. 'బ్రాడ్‌వే' పేరుతో ఈ నెల 14న ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఈ ప్రాజెక్టును ప్రారంభిస్తోంది. రూ.900 కోట్ల పెట్టుబడితో తలపెట్టిన ఈ ప్రీమియం రెసిడెన్షియల్ వెంచర్ కోసం ఏఎస్‌బీఎల్ ఇప్పటికే రూ.400 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో రూ.275 కోట్లు మోతీలాల్ ఓస్వాల్ గ్రూప్ నుంచి సమీకరించినట్టు కంపెనీ తెలిపింది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఐదు ఎకరాల విస్తీర్ణంలో చేపడుతున్న ఈ ప్రాజెక్టులో జీ+50 ఫ్లోర్లలో 885 లగ్జరీ ట్రిపుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లు నిర్మిస్తారు. ఇందులో ఒక్కో ఫ్లాట్ విస్తీర్ణం 2,035 నుంచి 2,650 చదరపు అడుగుల వరకు ఉంటుంది. అత్యాధునిక సదుపాయాలతో నిర్మిస్తున్న ఈ వెంచర్‌లో ఒక్కో ఫ్లాటు కనీస ధర రూ.2.5 కోట్ల వరకు ఉంటుందని కంపెనీ తెలిపింది. ఈ ప్రాజెక్టు 2029 డిసెంబరుకల్లా పూర్తవుతుందని ఏఎస్‌బీఎల్ తెలిపింది.

ఎస్‌బీఐలో 18,000 కొత్త నియామకాలు

న్యూఢిల్లీ: ఎస్‌బీఐ పెద్ద ఎత్తున నియామకాలు చేపట్టింది. ఈ సంవత్సరం ఇప్పటి వరకు 18,000 కొలువుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసింది. ఇందులో 13,500 క్లరికల్ పోస్టులు, 3,000 పైగా ప్రొబేషనరీ ఆఫీసర్లు, ఇతర ఆఫీసర్ల పోస్టులని బ్యాంకు చైర్మన్ సీ.శ్రీనివాసులు శెట్టి చెప్పారు. అవసరాలకు అనుగుణంగా వీరికి అవసరమైన నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చి విధుల్లోకి తీసుకుంటామని తెలిపారు.

కెనరా బ్యాంక్, యూబీఐ, ఐఓబీ రుణ రేట్లు తగ్గింపు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ), ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ).. రుణాలపై వడ్డీరేట్లను 0.50 శాతం తగ్గించాయి. రుణాలకు ప్రామాణికమైన ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేటుతో (ఈబీఎల్ఆర్) పాటు రెపో అనుసంధానిత రుణ రేటును (ఆర్‌ఎల్‌ఎల్ఆర్) అర శాతం తగ్గించినట్లు బుధవారం నాటి ప్రకటనలో యూబీఐ తెలిపింది. అలాగే ఆర్‌ఎల్‌ఎల్ఆర్‌ను 0.50 శాతం తగ్గిస్తున్నట్లు ఐఓబీ వెల్లడించింది. దాంతో బ్యాంక్ రుణ రేటు 8.85 శాతం నుంచి 8.35 శాతానికి తగ్గనుంది. గురువారం నుంచి ఈ రేటు అమలులోకి రానుంది.

కెనరా బ్యాంక్: కెనరా బ్యాంక్ కూడా ఆర్‌ఎల్‌ఎల్ఆర్‌ను 0.50 శాతం తగ్గించినట్టు ప్రకటించింది. దాంతో బ్యాంక్ రుణరేటు 8.75 శాతం నుంచి 8.35 శాతానికి తగ్గనుంది. గురువారం నుంచి ఈ రేటు అమలులోకి రానుంది. ఆర్‌బీఐ రెపోరేటును గత శుక్రవారం 0.50 శాతం తగ్గించడంతో పలు బ్యాంకులు ఆ ప్రయోజనాన్ని కస్టమర్లకు పంచుతున్నాయి.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	109
వరంగల్	100	గుంటూరు	112
కరీంనగర్	100	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	103
కర్నూలు	100	నెల్లూరు	108
విశాఖపట్నం	96	అనంతపురం	108
గోదావరి	109		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,400 ▲	90,200 ▲	1,19,000 ▲
విజయవాడ	99,500 ▲	93,500 ▲	1,10,000 ▲
విశాఖపట్నం	99,700 ▲	90,200 ▲	1,19,000 ▲
రాజమండ్రి	98,400 ▲	90,200 ▲	1,09,500 ▼
ప్రొద్దుటూరు	96,650 ▲	88,920 ▲	1,04,000 ▲
ముంబై	96,240 ▼	88,150 ▼	1,05,000 ▼

జీఆర్‌టీ నుంచి గోల్డెన్ ఎలెవెన్ ఫ్లెక్సీ ప్లాన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆభరణాల రిటైలింగ్ దిగ్గజం జీఆర్‌టీ జువెలర్స్ తమ కస్టమర్ల కోసం గోల్డెన్ ఎలెవెన్ ఫ్లెక్సీ ప్లాన్‌ను ప్రారంభించింది. ఇది 11 నెలల పాటు బంగారంపై పెట్టుబడి పెట్టే ఆకర్షణీయమైన ప్లాన్. కనీస పెట్టుబడి రూ.1000. ఆ పైన ఎంత మొత్తంలో అయినా ఇన్వెస్ట్ చేయవచ్చు. వారు 11 నెలల అనంతరం తమకు ఇష్టమైన ఆభరణాలు కొనుగోలు చేయవచ్చునని జీఆర్‌టీ జువెలర్స్ ఒక ప్రకటనలో తెలిపింది. ఇందులో రెండు ఆప్షన్లుంటాయి. ఒకటి బరువు ఆధారిత ప్లాన్ కాగా రెండోది విలువ ఆధారిత ప్లాన్. ఈ రెండింటిలో ఏదో ఒకటి కస్టమర్ ఎంచుకోవచ్చు. 18 శాతం వరకు ఎలాంటి తరుగు వసూలు చేయకపోవడం ఈ ప్లాన్ ప్రత్యేకత. బంగారం, వజ్రాలు, ప్లాటినం, వెండి ఆభరణాలన్నింటికీ ఈ ప్లాన్ వర్తిస్తుంది. బంగారం ధరలు భారీ ఆటుపోట్లకు గురవుతున్న ప్రస్తుత వాతావరణంలో ఇది కస్టమర్ల సొమ్ముకు విలువ చేకూర్చే చక్కని ప్లాన్ అని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ జీఆర్ 'ఆనంద్' అనంత పద్మనాభన్ అన్నారు. నెలవారీ వాయిదా ఎంపిక నుంచి ఎప్పటికప్పుడు చెల్లింపులకు సంబంధించిన అలర్ట్‌లు జారీ చేయడం వరకు అన్నింటిలోనూ తమ నిపుణులు కస్టమర్లకు మార్గదర్శకం చేస్తారని చెప్పారు. జన్మదినాలు, ఇతరత్రా వేడుకల సమయంలో కుటుంబ సభ్యులకు ఆకర్షణీయమైన బహుమతులు ప్లాన్ చేసేందుకు ఇది చక్కని అవకాశమని మేనేజింగ్ డైరెక్టర్ జీఆర్ రాధాకృష్ణన్ అన్నారు.

నిఫ్టీ ఆరో రోజూ ముందుకే..

ముంబై: స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం స్వల్పంగా లాభపడ్డాయి. గ్లోబల్ మార్కెట్ల ర్యాలీతోపాటు అమెరికా-చైనా మధ్య వాణిజ్య ఒప్పందంపై ఆశావహ వైఖరి, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల కొత్త పెట్టుబడులు సూచీలను ముందుకు నడిపించాయి. సెన్సెక్స్ 123.42 పాయింట్ల లాభంతో 82,515.14 వద్ద స్థిరపడింది. ఐటీ, ఇంధన రంగ షేర్లలో కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. నిఫ్టీ 37.15 పాయింట్ల వృద్ధితో 25,141.40 వద్ద క్లోజైంది. సూచీ లాభపడటం వరుసగా ఇది ఆరో రోజు. గడిచిన 6 సెషన్లలో నిఫ్టీ 598 పాయింట్లు (2.42 శాతం) పుంజుకుంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 16 రాణించాయి. హెచ్‌సీఎల్ టెక్ షేరు 3.22 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది.

- గేమింగ్, ఈ-స్పోర్ట్స్ కంపెనీ నజారా టెక్నాలజీస్‌లో ప్రముఖ మార్కెట్ ఇన్వెస్టర్ దివంగత రాకేశ్ ఝున్‌ఝున్‌వాలా సతీమణి రేఖా ఝున్‌ఝున్‌వాలా వాటాను దాదాపు సగానికి తగ్గించుకున్నారు. ఈ నెల 2-6 తేదీల్లో 1.98 శాతం, 9-10 తేదీల్లో మరో 1.4 శాతం వాటా షేర్లను విక్రయించారు. దాంతో కంపెనీలో ఝున్‌ఝున్‌వాలా వాటా 7.05 శాతం నుంచి 3.6 శాతానికి తగ్గింది.
- ఈ ఆర్థిక సంవత్సరానికిగాను హిందుస్థాన్ జింక్ తన వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.10 మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. డివిడెండ్ రూపంలో కంపెనీ మొత్తం రూ.4,225 కోట్లు చెల్లించనుంది.

ఇన్వెస్టర్ల రక్షణ కోసం 'సెబీ చెక్'.. అక్టోబరు నుంచి అమలు

ముంబై: తన వద్ద నమోదైన సంస్థలకు మదుపరులు చేసే యూపీఐ చెల్లింపులను సెబీ మరింత సురక్షితం చేస్తోంది. ఇక నుంచి ఈ చెల్లింపుల కోసం 'సెబీ చెక్' అనే ప్రత్యేక టూల్‌ను తీసుక రానుంది. దీంతో మదుపరులు తాము చెల్లింపులు చేసే సంస్థ యూపీఐ ఐడీని స్కానింగ్, క్యూఆర్ కోడ్ లేదా ఆ సంస్థ యూపీఐ ఐడీని ఎంటర్ చేయడం ద్వారా అది నిజంగా సెబీ వద్ద నమోదైన సంస్థా లేక బోగస్ సంస్థా అనే విషయం నిర్ధారించుకుని మరీ చెల్లింపులు చేయవచ్చు. ఈ ఏడాది అక్టోబరు 1 నుంచే ఈ చెల్లింపుల విధానం అమలు చేస్తామని సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే చెప్పారు.



ములుగు మండలం ఇంచర్ల గ్రామంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి; చిత్రంలో మంత్రి సీతక్క, ఎంపీ బలరాం నాయక్

గుడి లేని ఊరు ఉంటుందేమో కానీ.. ఇందిరమ్మ ఇల్లులేని ఊరు ఉండదు: పొంగులేటి

» అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు: సీతక్క

ములుగు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గుడి లేని ఊరు ఉంటుందేమో కానీ.. ఏ గూడానికి, ఏ తండాకు, ఏ మారుమూల గ్రామానికి వెళ్లినా ఇందిరమ్మ ఇల్లు మాత్రం ఉంటుందని, అది ఇందిరమ్మ ప్రభుత్వ గొప్పతనమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం ములుగు జిల్లాలో మంత్రి ధనసరి సీతక్క, ఎంపీ బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావులతో కలిసి మంత్రి పొంగులేటి పర్యటించారు. ములుగు మండలం ఇంచర్ల గ్రామంలో ఇందిరమ్మ కాలనీని ప్రారంభించి లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలోనే పేదలకు ఇళ్లు కట్టించినట్లు తెలిపారు. రాష్ట్ర విభజన జరగకముందు కాంగ్రెస్ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో తెలంగాణ ప్రాంతంలో సుమారు 24.50 లక్షల ఇళ్లు కట్టించినట్లు పేర్కొన్నారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన గత ప్రభుత్వం వాళ్ల సొంత ఇళ్లకు డబ్బులు ఖర్చు పెట్టారు కానీ.. పేదల గురించి పట్టించుకోలేదని విమర్శించారు. ఇల్లు రాలేదని ఏ ఒక్క ఆడబిడ్డ బాధపడొద్దని, భవిష్యత్‌లో అర్హులైన పేదలందరికీ ఇళ్లు కట్టిస్తామని భరోసా ఇచ్చారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని అన్నారు. ములుగు మండలం ఇంచర్లలో మంత్రి మాట్లాడుతూ 1974లో ఇందిరమ్మ హయాంలో ఇంచర్లలో కాలనీ ఏర్పడిందని, ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో ఇక్కడ నూతన భవనాలు నిర్మిస్తున్నామని పేర్కొన్నారు.



గాంధీభవన్‌లో ఫిర్యాదులను పరిశీలిస్తున్న మంత్రి కొండా సురేఖ

ప్రజా ప్రభుత్వంపై పెరిగిన విశ్వాసం

» 'మంత్రులతో ముఖాముఖి'లో కొండా సురేఖ

» వందకు పైగా వినతులు, ఫిర్యాదుల స్వీకరణ

హైదరాబాద్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులన్నింటినీ పరిష్కరించడంతో ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగిందని మంత్రి కొండా సురేఖ అన్నారు. ప్రజా ప్రభుత్వంలోనే ప్రజల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. బుధవారం గాంధీభవన్‌లో మంత్రులతో ముఖాముఖిలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తల నుంచి దాదాపు వందకు పైగా వినతులు, ఫిర్యాదులు రాగా.. మంత్రి అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... తమ ప్రభుత్వ పనితీరుపై ఉన్న నమ్మకం వల్లే.. ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందన్నారు. ప్రధానంగా ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, పింఛన్లు, రాజీవ్ యువ వికాసం, రెవెన్యూ భూ వివాదాలు.. తదితర సమస్యలపై దరఖాస్తులు వచ్చినట్టు వివరించారు. సంబంధిత అధికారులకు వెంటనే ఫోన్ చేసి వచ్చిన ఫిర్యాదుల వివరాలు తెలియజేసి వాటిని పరిష్కరించాలని ఆదేశాలిచ్చామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం.. ప్రజల ఆకాంక్షల మేరకు నడుచుకుంటోందని చెప్పారు.

మహోద్యమంలా వనమహోత్సవం: సురేఖ

హైదరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వనమహోత్సవం కార్యక్రమాన్ని అటవీ శాఖ అధికారులు మహోద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని మంత్రి కొండా సురేఖ అన్నారు. వన మహోత్సవం-2025 పోస్టర్‌ను జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మంత్రి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ ఏడాది వనమహోత్సవ కార్యక్రమం వంద శాతం విజయవంతమయ్యేలా చూడాలని, నాటిన ప్రతీ మొక్కను బతికించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

25న పోలవరంపై ప్రధాని సమావేశం

పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ముంపు అంశంతో పాటు పలు సమస్యలపై ప్రధాని మోదీ నేతృత్వంలో 25న ప్రత్యేకంగా ప్రగతి సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు తెలంగాణ, ఏపీ, ఒడిసా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు కేంద్రం సమాచారం అందించింది. పోలవరం డ్యామ్‌ను సత్వరం పూర్తి చేసి, నీటిని నిల్వ చేసేందుకు ఏపీ సర్కారుకు కేంద్రం ఇప్పటికే ఆమోదం తెలిపింది. ఆ దిశగా ఏపీ సర్కారు సైతం ముమ్మరంగా పనులు చేస్తోంది. అయితే పోలవరం బ్యాక్ వాటర్ వల్ల ముంపు, భూ సేకరణ, పునరావాసం-పునర్నిర్మాణం, ప్రజాభిప్రాయ సేకరణ ఇతరత్రా సాంకేతిక అంశాలపై తెలంగాణ సహా ఒడిసా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు సైతం అనేక అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 25న సమావేశం నిర్వహించేందుకు కేంద్రం సిద్ధమైంది. పోలవరం బ్యాక్ వాటర్‌తో ముంపు సమస్య ఎదుర్కొంటున్న రాష్ట్రాల సమస్యలను ప్రధాని తెలుసుకోనున్నారు.

రెండు రోజుల్లో జీపీవోలకు నియామక పత్రాలు

» సీఎం చేతుల మీదుగా పంపిణీకి సన్నాహాలు

కొత్తగా ఎంపికైన 3,550 మంది గ్రామ పాలనాధికారుల(జీపీవో)కు 2 రోజుల్లో నియామక పత్రాలు అందజేయడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. శనివారం లేదా ఆదివారం బహిరంగ సభ ఏర్పాటు చేసి సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కొంతమంది అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేయనున్నారు. హైదరాబాద్‌లో సమావేశం జరిగినా, నియామక పత్రాలు మాత్రం ఆయా జిల్లాల్లోని కలెక్టర్ల ద్వారానే పంపిణీ చేయనున్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి

» మంత్రి కోమటిరెడ్డికి కాంట్రాక్టర్ల విజ్ఞప్తి



'తెలంగాణ రైజింగ్' లోగో ఆవిష్కరిస్తున్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

రోడ్లు, భవనాల శాఖ పరిధిలో చేపట్టిన పలు పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను త్వరితగతిన చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంట్రాక్టర్లు కొంతమంది మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాల్లో చేపట్టిన వార్షిక నిర్వహణ పనులను సమయానికి పూర్తిచేసినా.. బిల్లులు మాత్రం చెల్లించలేదని తెలిపారు. ఈ సందర్భంగా చిన్న కాంట్రాక్టర్లందరివి కలిపి రూ.122 కోట్లు మాత్రమే బకాయిలు ఉన్నాయని, వాటిని చెల్లిస్తే దాదాపు 2,500 బిల్లులు క్లియర్ అవుతాయని వివరించారు. దీనికి స్పందించిన మంత్రి కోమటిరెడ్డి.. బిల్లులకు సంబంధించిన టోకెన్ నెంబర్లను సీఎం రేవంత్, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు నివేదించి వాటి చెల్లింపునకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షుడు డీవీఎన్ రెడ్డి తెలిపారు.

'తెలంగాణ రైజింగ్' లోగో ఆవిష్కరణ

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ కేంద్ర కార్యాలయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి 'తెలంగాణ రైజింగ్' లోగోను ఆవిష్కరించారు. ఈ లోగోను బోర్డు రూపంలో కాకుండా ప్రత్యేకంగా నాచుతో ఏర్పాటు చేయడం విశేషం.

చెవులు లేని వాళ్లని అడిగితే ఏం లాభం?

» ప్రధాని మోదీని కలవండి.. పనులు అవుతాయి

» ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీజేపీ నేత రాజాసింగ్ సూచన



హైదరాబాద్ సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అభివృద్ధికి కేంద్ర నుంచి కావాల్సిన నిధుల అంశంలో బీజేపీ నేత, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. చెవులు లేని వాళ్లని అడిగితే ఏం లాభం? చెవులు ఉన్న వాళ్లని అడిగితేనే ఫలితం ఉంటుందని.. సీఎం రేవంత్ రెడ్డికి హితవు పలికారు. ప్రధాని మోదీ మంచి నాయకుడని, సీఎం రేవంత్ ప్రధానిని కలిస్తే పనులు జరుగుతాయని సూచించారు. అలాగే, సీఎం రేవంత్‌నుద్దేశించి రాజాసింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రాష్ట్రంలో నోరు మూసుకుని ఉంటారని, కానీ ఢిల్లీకి వెళ్లిన తర్వాత నోరు ఎత్తుతారని, ఆ సీక్రెట్ ఏంటో చెప్పాలని కోరారు. "రేవంత్‌రెడ్డి గారు మొన్న మీరు కిషన్‌రెడ్డి ముందే ఉన్నారు కదా.. అప్పుడు కిషన్ రెడ్డిని ఎందుకు అడగలేదు. ఈ రోజు ఢిల్లీలో మీరు ఎందుకని బీజేపీ, కేంద్ర మంత్రిపై విమర్శలు చేస్తున్నారు?" అని రాజాసింగ్ ప్రశ్నించారు. ఢిల్లీలో ఉన్న రేవంత్ ప్రధాని మోదీని కలిసి విషయాన్ని ఆయన ముందు ఉంచాలని సూచించారు. అలాగే, 2014 నుంచి ఇప్పటివరకు తెలంగాణ అభివృద్ధికి కేంద్రం నుంచి ఎన్ని నిధులు వచ్చాయనే దానిపై ఓ జాబితా తీసుకురావాలని ముఖ్యమంత్రిని కోరారు.

రాజకీయాలంటే పదవి, అధికారం కాదు!

» ప్రజల గొంతుకను ప్రభుత్వం వరకూ తీసుకెళ్తా

» పార్టీని బలపర్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతా

» 'ఎక్స్'లో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పోస్టు



నల్లగొండ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): "రాజకీయాలంటే పదవులు కానీ, అధికారం కానీ కాదు. ప్రజల పట్ల నా నిబద్ధత, తెలంగాణ పునర్నిర్మాణం పట్ల నా కలలే నాకు ప్రేరణ. ఆ కారణంతోనే నేనే తిరిగి కాంగ్రెస్‌లోకి వచ్చా" అని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన మంత్రులను హృదయపూర్వకంగా అభినందిస్తున్నానని, ప్రజలకు సేవ చేయడంలో వారికి సంపూర్ణ విజయం దక్కాలని కోరుకుంటున్నానని 'ఎక్స్'లో ఆయన పోస్టు చేశారు. తాను ఈ రోజు మంత్రిగా లేకపోయినా పార్టీని బలపర్చడమే లక్ష్యంగా ప్రజల మద్దతుతో ముందుకు సాగుతానని తెలిపారు. ప్రజల సమస్యలు వినడంలో, వారి గొంతుకను ప్రభుత్వం వరకూ తీసుకెళ్లడంలో ముందుంటానని పేర్కొన్నారు. కొన్నిసార్లు పదవి లేకుండానే ప్రజల మధ్య పని చేయడం.. శక్తిమంతంగా మారుస్తుందని, ప్రస్తుతం తాను అదే మార్గాన్ని ఎంచుకున్నానన్నారు. మంత్రి వర్గ విస్తరణ తర్వాత తొలి రోజు అందుబాటులో లేకుండా పోయిన రాజగోపాల్‌రెడ్డిని ఆ తర్వాత అధిష్ఠానం ముఖ్యులు బుజ్జగించినట్లు తెలిసింది.

నేనున్నంత వరకు కేసీఆర్ ఫ్యామిలీని కాంగ్రెస్‌లోకి రానివ్వ

(మొదటి పేజీ తరువాయి)



చేస్తుందని చెప్పారు. అందులో భాగంగానే కవిత ఫ్యామిలీ డ్రామాకు తెరలేపారని చెప్పారు. "అసెంబ్లీ రౌడీ సినిమాలో బాషా క్యారెక్టర్‌ను చూస్తే కేసీఆర్ కుటుంబంలోని పాత్రలు అర్థమవుతాయి. బాషాలా కేసీఆర్, కేటీఆర్, కవిత, హరీశ్ సమయానికి తగిన పాత్రలు పోషిస్తున్నారు. అమాయకుడిని టార్గెట్ చేసి తమలో తాము కొట్టుకుంటున్నట్లు నటిస్తుంటారు. అలాగే ప్రజల్ని అమాయకులుగా భావించి ఈ కుటుంబం తమలో తాము గొడవ పెట్టుకున్నట్లు నటిస్తోంది. అందరూ కలిసి కాళేశ్వరం కమిషన్ దగ్గరకు పోయి ఆందోళన చేయడం చూస్తుంటేనే అదో డ్రామా అని అర్థమైపోతుంది. ఇంత కాలం కేసీఆర్ చుట్టూ దెయ్యాలు ఉన్నాయని చెప్పిన కవిత.. ఈ రోజు వాళ్లతో కలిసి కనిపించింది. అంటే కవిత కూడా దెయ్యంగా మారిపోయారా? ఆమే సమాధానం చెప్పాలి. నాకు ముందే తెలుసు కాబట్టి.. కేసీఆర్ కుటుంబమే కొరివి దెయ్యాలని చెప్పాను. అందుకే నేను ఉన్నంత వరకు కాంగ్రెస్ పార్టీలో కేసీఆర్ కుటుంబానికి చోటు లేదు. తెలంగాణకు కేసీఆర్, ఆయన కుటుంబం దుష్మణ్. అలాంటి దుష్మణ్ పరివారానికి కాంగ్రెస్ పార్టీలో జాగా లేదు" అని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధి కోసం ఎన్ని వందల సార్లయినా ఢిల్లీకి వస్తానన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం ఢిల్లీలో ఉన్నప్పుడు ఇక్కడికి రాకపోతే ఇంకెక్కడికి వెళ్తారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలు ఎర్రవెల్లి ఫాంహౌస్‌కు ఎందుకు వెళుతున్నారని నిలదీశారు. ఏబీవీపీ నుంచి తాను డ్రాపౌట్ విద్యార్థిని కాదని, ఎలివేట్ విద్యార్థినని చెప్పారు. 'మోదీ బడిలో నేను చదవలేదు. మోదీ చదివిన బడిలోనే నేనూ చదివాను' అని రేవంత్ తెలిపారు. మంత్రివర్గంలో ఎవరికైనా పనిభారం ఎక్కువనిపిస్తే తగ్గిస్తానన్నారు. హైదరాబాద్ వెళ్లిన తర్వాత సమీక్ష నిర్వహిస్తానని, అవసరమైతే మార్పులు చేస్తామని చెప్పారు. కొత్త మంత్రులకు తన దగ్గర ఉన్న శాఖలే కేటాయిస్తానన్నారు. కుల గణన ఆధారంగా రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని తెలిపారు. స్థానిక సంస్థల్లోనూ రిజర్వేషన్లు అమలు చేస్తామని, కేంద్రం చట్టం చేయకుంటే కాంగ్రెస్ పార్టీ సీట్ల కేటాయింపులోనైనా రిజర్వేషన్లు అమలు చేస్తామని స్పష్టత ఇచ్చారు. ప్రభుత్వ కార్యదర్శుల్లోనూ సామాజిక న్యాయం పాటిస్తున్నామని, 29 ప్రభుత్వ శాఖల్లో 80 శాతం ఎస్సీ ఎస్టీ, బీసీ అధికారులను నియమించామని తెలిపారు. బీఆర్ఎస్‌పై ఏనాడూ కక్ష పూరిత రాజకీయాలు చేయలేదన్నారు. రాహుల్ గాంధీతో తనది రేర్ కాంబినేషన్ అన్నారు. రేర్ అంటే 'రాహుల్-రేవంత్' అని అభివర్ణించారు. కుల గణన అమలు గురించి వివరించేందుకే ఢిల్లీ వచ్చానన్నారు. కుల గణనలో తెలంగాణ మోడల్ దేశానికే రోల్ మోడల్‌గా మారిందని తెలిపారు. రాహుల్, ఖర్గే, కేసీ వేణుగోపాల్ నేతృత్వంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు తెలంగాణ కుల గణన తీరు తెన్నులను వివరించానని తెలిపారు.

కుల గణన సర్వే 97 శాతం పూర్తి..

కుల గణన సర్వేను 97 శాతం పూర్తి చేశామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. బీఆర్ఎస్, బీజేపీ రాజకీయ స్వలాభం కోసమే అసత్య ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. కుల గణన సర్వేలో తన ఇంటికి ఎవరూ రాలేదన్న కిషన్‌రెడ్డి వ్యాఖ్యలపై అసహనం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధుల ఇళ్లలో కుల గణన సర్వే ప్రత్యేక శ్రద్ధతో నిర్వహించాలని హైదరాబాద్ కలెక్టర్‌కు తానే స్వయంగా సూచించానని తెలిపారు. కుల గణనలో భాగంగా ఇంటింటి సర్వే 60 రోజులు నిర్వహించామని, అప్పటికీ ఎవరైనా మిగిలితే ప్రత్యేకంగా నమోదు కేంద్రాలు ఏర్పాటు చేశామని, టోల్ ఫ్రీ నంబర్లు ఇచ్చామని గుర్తు చేశారు. ఇంటింటి సర్వేలోనే 96 శాతం పూర్తయిందని, ప్రత్యేక కేంద్రాలు, టోల్ ఫ్రీ నంబర్ల ద్వారా ఒకశాతం నమోదు చేసుకున్నారని, మొత్తం 97 శాతం సర్వే పూర్తయిందని తెలిపారు. నిజంగా కిషన్‌రెడ్డికి తన వివరాలు నమోదు చేసుకోవాలని ఉంటే, టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసినా సరిపోయేదని చెప్పారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణలో సామాజిక సమీకరణలు అమలు చేశామన్నారు. కేసీఆర్ మంత్రివర్గంలో 8 మంది రెడ్లు, నలుగురు వెలమ, ఒక కమ్మ, ఒక ఎస్సీ, ఒక ఎస్టీ సామాజిక వర్గానికి చోట్లు కల్పించారని.. దాదాపు 40 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు ఒక్కో పదవి ఇచ్చారని విమర్శించారు. తాము మాత్రం ఎస్సీల్లో నలుగురికి మంత్రి పదవులు, స్పీకర్ పదవి ఇచ్చామని చెప్పారు.

పనిభారం ఎక్కువనిపిస్తే తగ్గిస్తా..

మంత్రులకు పని భారం ఎక్కువనిపిస్తే తగ్గిస్తానని రేవంత్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి, పీసీసీ ప్రెసిడెంట్, ఉప ముఖ్యమంత్రి లేకుండా మంత్రివర్గ విస్తరణ, శాఖల మార్పుపై చర్చలెలా జరుగుతాయని ప్రశ్నించారు. కొత్త మంత్రులకు తన వద్ద ఉన్న శాఖలనే కేటాయిస్తానని చెప్పారు. సీనియర్ మంత్రులకు శాఖల మార్పులు ఉన్నాయా? అనే ప్రశ్నకు.. మంత్రులు పని ఎక్కువ అవుతోందని భావిస్తే, ఆ భారం తగ్గిస్తానని బదులిచ్చారు. తన దగ్గర 12 శాఖలున్నాయని, హైదరాబాద్ వెళ్లగానే మిగతా మంత్రుల శాఖలపై సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. క్రియాశీల రాజకీయాల్లో ఉన్నోళ్లకు పదవులు దక్కుతాయన్నారు. తన ఇంట్లో ఎవరూ అలా లేరని, అందుకే ఎవరికీ అవకాశం దక్కలేదని చెప్పారు.

రెండు రోజుల్లో కాళేశ్వరంపై ప్రజలకు వివరిస్తా

రెండు రోజుల్లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి కాళేశ్వరం అంశంపై ప్రజలకు వివరిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. "18 నెలల్లో ఎప్పుడూ బీఆర్ఎస్‌పై కక్ష పూరిత రాజకీయాలు చేయలేదు. అవినీతి ఆరోపణలపై కమిషన్లు వేశాం. కాళేశ్వరంపై సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఘోష్‌తో కమిషన్ వేశాం. కేసీఆర్‌తో పాటు అందరూ కాళేశ్వరం కమిషన్ ముందు తమ అభిప్రాయాలను తెలిపారు. కేసీఆర్ తన అభిప్రాయాలను చెప్పారు కాబట్టి.. కాళేశ్వరంపై నేనూ నా అభిప్రాయాలు చెబుతా. తెలంగాణలోని నాలుగున్నర కోట్ల ప్రజలే నాకు కమిషన్ కాబట్టి.. వారికి అర్థమయ్యేలా నా అభిప్రాయాలు వెల్లడిస్తా" అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

తెలంగాణ అభివృద్ధిని కిషన్‌రెడ్డే అడ్డుకుంటున్నారు..

తెలంగాణ అభివృద్ధిని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డే అడ్డుకుంటున్నారని రేవంత్ ఆరోపించారు. "కేటీఆర్ ఏం చెబుతారో, కిషన్‌రెడ్డి అదే మాట్లాడతారు. కేటీఆర్ మెట్రో విస్తరణను వ్యతిరేకిస్తున్నారు కాబట్టే కిషన్‌రెడ్డికీ ఇష్టం లేదు. తెలంగాణ నుంచి కేంద్రమంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి ఏనాడైనా రాష్ట్ర అభివృద్ధిపై సమీక్ష చేశారా? ఆయన ప్రతిపాదించకపోవడం వల్లే తెలంగాణకు ప్రాజెక్టులు రావడం లేదు. మోదీ దగ్గర ఏనాడైనా తెలంగాణ కోసం మాట్లాడారా? చెన్నైకి కేంద్ర మంత్రి నిర్మల, బెంగళూరుకు ప్రహ్లాద్ జోషి మెట్రో రైల్ తీసుకెళ్లారు. మరి కిషన్‌రెడ్డి ఎందుకు మెట్రో విస్తరణకు అనుమతి తీసుకురాలేకపోతున్నారో చెప్పాలి. నేను ఢిల్లీకి వస్తే, ప్రధానిని కలిస్తే తప్పుపడుతున్న కిషన్‌రెడ్డి.. తెలంగాణకు చెందిన 8 మంది బీజేపీ ఎంపీలతో రాష్ట్ర ప్రాజెక్టులపై ఎందుకు ప్రధానిని కలవడం లేదో చెప్పాలి. ఆయన సమీక్ష చేస్తానంటే నేనే స్వయంగా అధికారులందరినీ తీసుకొని ఢిల్లీ వస్తా. బీబీనగర్ ఎయిమ్స్ విషయంలో చాలా వేగంగా స్పందించానని కేంద్ర మంత్రి గడ్కరీ నాకు ఫోన్ చేసి అభినందించారు. అలాంటిది.. కిషన్‌రెడ్డి అభివృద్ధి చేద్దామంటే కలిసి పనిచేస్తాం కదా? కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంగా మారిందని మోదీ, అమిత్ షా ఆరోపించారు. ఇదే నిజమైతే బీజేపీ ఎంపీ ఈటల కాళేశ్వరం ప్రాజెక్టు అద్భుతమని ఎలా చెబుతున్నారు. ఈటల వ్యాఖ్యలనే కిషన్‌రెడ్డి సైతం సమర్థిస్తున్నారు" అని రేవంత్‌రెడ్డి చెప్పారు. కాగా, అసమానతలు ఉన్నంతకాలం నక్సలిజం అంతం కాదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన భూసంస్కరణలతో నక్సలిజం తగ్గుముఖం పట్టిందన్నారు. నక్సలిజమంటే ఫిలాసఫీ అని, శాంతిభద్రతల సమస్య కాదని చెప్పారు.

రెండేళ్లలో ఎస్ఎల్‌బీసీని పూర్తి చేస్తాం

» సొరంగం పనుల పునరుద్ధరణకు ప్రత్యేక చర్యలు

» సైనిక హెలికాప్టర్ల సాయంతో ఎలక్ట్రోమ్యాగ్నటిక్ సర్వే నిర్వహిస్తాం

» రక్షణ శాఖ సహాయం కోరాం...

» కేంద్రం అంగీకరించింది: ఉత్తమ్



న్యూఢిల్లీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగాన్ని రెండేళ్లలో పూర్తి చేస్తామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. సొరంగం ప్రమాద మృతుల కుటుంబాలను అన్నివిధాలా ఆదుకున్నామని, ప్రమాదాలు పునరావృతం కాకుండా పటిష్ఠ ప్రణాళికతో ముందుకెళుతున్నామని చెప్పారు. బుధవారం ఢిల్లీలో ఆయన రక్షణ శాఖ అధికారులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అనంతరం తెలంగాణ భవన్‌లో విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం నిడివి 44 కిలోమీటర్లు ఉండగా, ఇప్పటికే 35 కి.మీ. మేర పనులు పూర్తయ్యాయని తెలిపారు. మరో 9 కి.మీ. అటవీ ప్రాంతంలో ఉండడంతో ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ సహాయం కోరగా అంగీకరించారని చెప్పారు. ఆ ప్రాంతం పులుల అభయారణ్యంగా ఉన్నందున ఎలక్ట్రోమ్యాగ్నటిక్ సర్వే చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. దీనికోసం కల్నల్ పరీక్షిత్ మెహరా, సరిహద్దు రోడ్ల సంస్థ మాజీ డీజీ జనరల్ హర్పాల్ సింగ్‌ను డిప్యుటేషన్‌పై తెలంగాణకు పంపేందుకు కేంద్రం అంగీకరించిందని తెలిపారు. తెలంగాణ నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శిగా పరీక్షిత్ మెహరా రెండేళ్లపాటు కొనసాగుతారని చెప్పారు. ఎస్ఎల్‌బీసీతో పాటు దేవాదుల, సీతారామ తదితర ప్రాజెక్టుల పనుల్లో ఆయన సేవలను వినియోగించుకుంటామన్నారు. జనరల్ హర్పాల్ సింగ్ గౌరవ సలహాదారుగా ఉంటారన్నారు. డెన్మార్క్ నుంచి అత్యాధునిక ఎలక్ట్రోమ్యాగ్నటిక్ సర్వే పరికరాలు తీసుకొస్తున్నామని చెప్పారు. వాటిని హెలికాప్టర్‌కు అమర్చి సొరంగం నిడివి 44 కి.మీ మేర భూమి లోపల కిలోమీటరు వరకు పరిస్థితిని తెలుసుకుంటామన్నారు. ఈ సర్వే ద్వారా సొరంగం వాస్తవ పరిస్థితిని అంచనా వేయొచ్చన్నారు. 9 కి.మీ. మేరకే సొరంగం పనులు పెండింగ్‌లో ఉన్నప్పటికీ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని మొత్తం 44 కి.మీ. సర్వే చేయాలని నిర్ణయించామని తెలిపారు. జులై 12 నుంచి సర్వే ప్రారంభమవుతుందని, వారం రోజుల్లో పూర్తి చేస్తామన్నారు.

వివేక్‌కు గనులు, కార్మిక ఉపాధి కల్పన

కొత్త మంత్రులకు శాఖలు.. అడ్లూరికి ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమం

» వాకిటికి పశుసంవర్ధకం.. యువజన, క్రీడల శాఖల కేటాయింపు

» ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

» ప్రస్తుత మంత్రుల శాఖల్లో మార్పులు లేవు

హైదరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు కొత్త మంత్రులకు శాఖలు ఖరారయ్యాయి. గడ్డం వివేక్ వెంకటస్వామికి గనులు, కార్మిక ఉపాధి కల్పన శాఖలను కేటాయించారు. వాకిటి శ్రీహరికి పశు సంవర్ధకంతోపాటు.. యువజన, క్రీడల శాఖ.. అడ్లూరి లక్ష్మణ్‌కు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వికలాంగులు, వృద్ధుల సంక్షేమంతోపాటు.. ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖలను కేటాయించారు. ఈ మేరకు బుధవారం రాత్రి ప్రభుత్వం జీవో-131ని విడుదల చేసింది. కొత్తగా ముగ్గురు మంత్రులు ప్రమాణ స్వీకారం చేసినప్పటికీ.. వెంటనే శాఖలు కేటాయింపు జరగకపోవడంపై ఎవరికి ఏ శాఖలు కేటాయిస్తారనే అంశంపై సర్వత్రా నెలకొన్న ఉత్కంఠకు ప్రభుత్వం తెరదించింది. కొత్త మంత్రులకు శాఖల కేటాయింపు నేపథ్యంలో ప్రస్తుత మంత్రుల శాఖల్లో మార్పులుంటాయనే ప్రచారం జోరుగా సాగుతోందని, అందుకే సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లారనే ప్రచారం జరిగింది. అయితే.. ముఖ్యమంత్రి రేవంత్ తన వద్ద ఉన్న శాఖల్లోంచే కొత్తవారికి సర్దుబాటు చేశారు. పాత మంత్రుల శాఖల్లో ఎలాంటి మార్పులు చేయలేదు. కాగా.. మునిసిపల్, హోం, విద్య, మరికొన్ని శాఖలు సీఎం వద్దే ఉన్నాయి. తదుపరి జరిగే మంత్రివర్గ విస్తరణ తర్వాత.. సీఎం ఈ శాఖలను కొత్త మంత్రులకు కేటాయించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత మంత్రుల వద్ద ఒకటికంటే ఎక్కువ శాఖలున్నాయి. కొత్త మంత్రులకు కూడా అదే తరహాలో కేటాయింపులు చేయడం గమనార్హం..!

కొత్తగా రాష్ట్రమంత్రి వర్గంలోకి వచ్చిన గడ్డం వివేక్ ఓ ప్రత్యేకతను చాటుకున్నారు. ఆయన తండ్రి గడ్డం వెంకటస్వామి(కాకా) కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా పనిచేశారు. వివేక్ అన్న.. ప్రస్తుతం బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ కూడా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో.. కాంగ్రెస్ హయాంలో రాష్ట్ర కార్మిక మంత్రిగా పనిచేశారు. ఇప్పుడు వివేక్ కూడా అదే శాఖకు ప్రాతినిధ్యం వహిస్తుండడం గమనార్హం..!

ఊపిరి పీల్చుకున్న సీనియర్లు

రాష్ట్రంలో 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ ఏర్పడిన తరువాత సీఎం మినహా 11 మందితో మంత్రివర్గం కొలువుదీరింది. ఆ తర్వాత మంత్రివర్గ విస్తరణపై తీవ్ర చర్చ జరిగినా.. అదిగో-ఇదిగో అంటూ రాజకీయ వర్గాల్లో ప్రచారం జరిగింది. చివరికి ముగ్గురు కొత్త మంత్రులను నియమించారు. దీని వెనక భారీ కసరత్తే జరిగిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సామాజిక సమీకరణాలు, రాజకీయ పరిస్థితులను బేరీజు వేసుకుని, కొత్త మంత్రుల పేర్లను ఖరారు చేసినట్లు పేర్కొంటున్నాయి.అయితే.. కొత్త మంత్రుల రాకతో.. పాతవారి శాఖల్లో మార్పులుంటాయని ప్రచారం జరిగింది. అలాంటిదేమీ లేకపోవడంతో సీనియర్లుఊపిరి పీల్చుకున్నారనే చర్చ జరుగుతోంది.

తదుపరి విస్తరణపై చర్చ

కొత్త మంత్రుల శాఖల కేటాయింపు పూర్తయిన నేపథ్యంలో.. తదుపరి విస్తరణ ఎప్పుడనే చర్చ తెరపైకి వచ్చింది. నిజానికి మంత్రివర్గంలోకి ఆరుగురిని తీసుకునేందుకు అవకాశం ఉన్నా.. ప్రస్తుతం ముగ్గురికే అవకాశం కల్పించారు. ఇంకా ముగ్గురికి అవకాశం ఉంది. దీంతో.. రెండో విడత విస్తరణలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని ఆశావహులు ఎదురుచూస్తున్నారు.

ప్రపంచ నైపుణ్య రాజధానిగా తెలంగాణ

» సెమీ కండక్టర్ల తయారీ.. డిజైనింగ్‌లో 10 వేల మంది యువతకు శిక్షణ

» 2030కల్లా శిక్షణ పూర్తికి.. స్ప్రింగ్ సెమీ కండక్టర్స్ అంగీకారం: శ్రీధర్‌బాబు



హైదరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణను 'ప్రపంచ నైపుణ్య రాజధాని'గా మార్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్న యూకేకు చెందిన సెమీ కండక్టర్ దిగ్గజ సంస్థ 'ఆర్మ్ హోల్డింగ్స్' ప్రతినిధులతో బుధవారం ఆయన సచివాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణలో ఉన్న అనుకూలతలు, పారిశ్రామికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను గురించి సంస్థ ప్రతినిధులకు వివరించారు. సెమీ కండక్టర్ల తయారీ, డిజైనింగ్‌లో దిగ్గజ సంస్థగా ఉన్న ఆర్మ్ హోల్డింగ్స్ రాష్ట్రంలో పెట్టుబడులకు ఆసక్తి చూపించడం తమ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. 'తెలంగాణ రైజింగ్'లో భాగస్వామ్యయ్యేందుకు ముందుకొచ్చినందుకు ఆ సంస్థకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణకు యువతే పెద్ద ఆస్తి అని.. వారిలో ప్రతిభకు కొదువలేదని, కొంచెం సానబెడితే మెరికల్లా తయారవుతారని వివరించారు. మలేసియాకు చెందిన 'స్ప్రింగ్ సెమీ కండక్టర్స్' సీఈవోతోనూ మంత్రి సమావేశమయ్యారు. "సెమీ కండక్టర్ల తయారీ, డిజైనింగ్‌లో ఉన్న డిమాండ్‌కు అనుగుణంగా తెలంగాణ యువతను తీర్చిదిద్దేందుకు ప్రయత్నం చేస్తున్నాం. ఈ ప్రయాణంలో మీరు కూడా భాగస్వామ్యం కావాలన్నది మా ఆకాంక్ష. 10 వేల మంది యువత శిక్షణనిచ్చే బాధ్యతను తీసుకోవాలి" అని స్ప్రింగ్ సెమీ కండక్టర్స్ సీఈవో కెన్‌కూను మంత్రి కోరారు. దానికి కెన్ స్పందిస్తూ.. ఇక్కడి యువతను సెమీ కండక్టర్ల తయారీ, డిజైనింగ్‌లో అత్యుత్తమ మానవ వనరులుగా తీర్చిదిద్దేలా ప్రత్యేక కరికులమ్‌ను రూపొందిస్తామన్నారు. విద్యాసంస్థల సహకారంతో ఆర్నెల్లపాటు ఇక్కడే శిక్షణనిస్తామని, ఆ తర్వాత తైవాన్, దక్షిణ కొరియా, జపాన్ తదితర దేశాల్లో ఇంటర్న్‌షిప్‌నకు అవకాశం కల్పిస్తామన్నారు. 2030 నాటికి 10వేల మంది యువతకు శిక్షణ ఇచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తామని వివరించారు. కార్యక్రమంలో టీ-కన్సల్ట్ ఛైర్మన్ సందీప్ కుమార్ మక్తాలా, వరల్డ్ తెలుగు ఐటీ కౌన్సిల్ మలేసియా విభాగం అధ్యక్షుడు మారుతి తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్ వెంట్రుక కూడా
రేవంత్ పీకలేరు

(మొదటిపేజీ తరువాయి)

ధ్వజమెత్తారు. "రేవంత్.. ఓ చిల్లర ముఖ్యమంత్రి. ప్రభుత్వం నడపడం చేతగాని అసమర్థ నాయకుడు. మంత్రులకు శాఖలు కేటాయించే అధికారం కూడా లేనోడు. చివరకు ఢిల్లీకి వెళ్లి మంత్రిత్వశాఖలు నిర్ణయించుకునే దౌర్భాగ్య స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. రేవంత్‌కు క్యాబినెట్ అంటే అర్థం కాదు. అది ఎలా పని చేస్తుందో కూడా తెలియదు. రాష్ట్ర ప్రయోజనాల కన్నా.. రాజకీయ స్వార్థమే ముఖ్యమనుకొని రాక్షసానందం పొందడం రేవంత్‌రెడ్డి నైజం" అని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి గురువునే కరకట్టకు తరిమేసిన కేసీఆర్‌ను ఆయనేమీ చేయలేరని, కేసీఆర్ వెంట్రుక కూడా పీకలేరని వ్యాఖ్యానించారు. బీఆర్కే భవన్ వద్ద కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే కాళేశ్వరం, ఫోన్‌ట్యాపింగ్, ఫార్ములా-ఈ రేసింగ్ విచారణల పేరిట రేవంత్ కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకమైన కాళేశ్వరాన్ని వేరే దేశంలో కడితే కేసీఆర్ పేరుతోపాటు ఆ ప్రాజెక్టు చరిత్రలో నిలిచిపోయేదని, తెలంగాణలో మాత్రం బీజేపీ, కాంగ్రెస్ కుట్ర పూరిత రాజకీయాలకు పావులా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరం కమిషన్ ఎదుట కేసీఆర్‌ను నిలబెట్టి రేవంత్‌రెడ్డి పైశాచికానందం పొందారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నాలుగేళ్లలోనే ఆ ప్రాజెక్టు కట్టి తెలంగాణను కోటి ఎకరాల మాగాణం చేసినందుకు నోటీసులు ఇస్తారా? అని నిలదీశారు. రేవంత్ లాంటి చిల్లర వ్యక్తికి వంద జన్మలెత్తినా కేసీఆర్ గొప్పదనం అర్థం కాదన్నారు. "రూ.94వేల కోట్లతో నిర్మించిన ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి జరిగిందని తెలివి తక్కువ వాళ్లే అంటారంటూ నీ సతీమణి గీత తండ్రి సూదిని పద్మారెడ్డి చెప్పారు. వీలైతే నీకు పిల్లనిచ్చిన మామ దగ్గరికెళ్లి ఓ ఐదు నిమిషాలు కాళేశ్వరం ప్రాజెక్టు గురించి తెలుసుకో" అని రేవంత్‌కు సూచించారు. తమను ఇన్ని రకాలుగా వేధిస్తున్న కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టేదాకా వెంటాడతామని, ప్రజాసమస్యలను పక్కనపెట్టి చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్న ఆ పార్టీని బజార్‌లో నిలబెడతామని హెచ్చరించారు. నిజం నిలకడ మీద తెలుస్తుందని, కేసీఆర్‌ను వేధిస్తే ప్రజాక్షేత్రంలో ప్రజలే బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు.

నీటి నిల్వ నిర్ణయం
అధికారులదే

(మొదటిపేజీ తరువాయి)

కమిషన్ ఏర్పాట్లు చేయగా.. తనకు తీవ్రంగా జలుబు ఉందని, గుంపులో ఉంటే ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొనే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఓపెన్ కోర్టు విచారణ వద్దని చెప్పడంతో కమిషన్ అందుకు అంగీకరించింది. అప్పటిదాకా ఓపెన్ కోర్టులో కూర్చున్నవారందరితో పాటు కేసీఆర్‌కు తోడుగా వచ్చిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను బయటికి పంపించింది. అనంతరం ముఖాముఖి విధానంలో కేసీఆర్‌ను కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది. మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైన విచారణ 50 నిమిషాల పాటు కొనసాగింది. విచారణ సందర్భంగా 'కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు జీవధార' పేరుతో ఇటీవల హరీశ్‌రావు ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఆంగ్ల ప్రతిని కమిషన్‌కు కేసీఆర్ అందజేశారు.

కాళేశ్వరం బ్యారేజీ నిర్మాణ నిర్ణయం ఎవరిది? తుమ్మిడిహెట్టి వద్ద కాకుండా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో బ్యారేజీలు ఏ కారణాలతో కట్టారు?

కేసీఆర్: కాళేశ్వరం బ్యారేజీలు కట్టాలనే నిర్ణయం రాజకీయమైనదే అయినప్పటికీ.. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) తెలిపింది. అక్కడ 165 టీఎంసీల నీటి లభ్యత మాత్రమే ఉందని లేఖ రాసింది. అందులోనూ 63 టీఎంసీలు ఎగువ రాష్ట్రాలకు వాటా ఉందని, ఆ రాష్ట్రాలు ప్రాజెక్టులు కట్టుకుంటే 63 టీఎంసీల నీరు దిగువకు రావని చెప్పింది. మరోవైపు తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కట్టడానికి మహారాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చలు జరపగా... బ్యారేజీని 148 అడుగులతో కట్టడానికే అనుమతిస్తామని చెప్పారు. 152 అడుగులతో బ్యారేజీ కడితే ముంపు ఉంటుందని, ఇందుకు అంగీకరించబోమని అన్నారు. దీంతో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు నిర్ణయం తీసుకున్నాం. దీనికన్నా ముందు తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణం సాధ్యం కాదని, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కట్టాలని హైపవర్ కమిటీ సిఫారసు చేసింది. దీనిపై వ్యాప్కోస్‌తో లైడార్ సర్వే చేయించగా.. మేడిగడ్డ వద్ద 282.3 టీఎంసీల నీటి లభ్యత ఉందని అందులో 230 టీఎంసీల నీటి వినియోగానికి మేడిగడ్డ వద్ద అవకాశం ఉందని నివేదిక ఇచ్చింది. ఆ నివేదిక ఆధారంగానే బ్యారేజీల నిర్మాణంపై నిర్ణయం తీసుకున్నాం. ఈ నిర్ణయం మంత్రివర్గం, ప్రభుత్వం ఆమోదంతో తీసుకున్నదే. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదన్న సీడబ్ల్యూసీ లేఖలు, మహారాష్ట్ర అభ్యంతరాలతో రీఇంజనీరింగ్ చేసి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాం. ఇది అతిపెద్ద ప్రాజెక్టు. దీని నిర్మాణంలో 4వేల మంది ఇంజనీర్లు పనిచేశారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును 7 లింక్‌లుగా ప్రతిపాదించగా.. ఒక్క తుమ్మిడిహెట్టి బ్యారేజీ తప్ప.. మిగిలిన లింకులన్నీ ప్రాణహిత-చేవెళ్లలోనివే.



కేసీఆర్‌కు మద్దతుగా మాస్క్‌లు ధరించి నినాదాలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

బ్యారేజీల్లో నీటి నిల్వకు ఆదేశాలు ఇచ్చింది ఎవరు?

కేసీఆర్: ఆ నిర్ణయం అధికారులదే. కన్నెపల్లి(మేడిగడ్డ) వద్ద ఉన్న పంప్‌హౌస్ హెడ్‌కు నీరు అందేదాకా, సిరిపురం(అన్నారం) పంప్‌హౌస్ నుంచి మోటార్లు నడవడానికి నీరు అందేదాకా, కాశిపేట(సుందిళ్ల) పంప్‌హౌస్ హెడ్‌కు నీరు తాకేంతవరకు నీటిని అధికారులే నిల్వ చేశారు. నీటి నిల్వకు ఆదేశాలు ఇవ్వలేదు.

బ్యారేజీల వైఫల్యానికి ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ కూడా ఒక కారణమా?

రాష్ట్రంలో ప్రాజెక్టుల ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ కోసం రూ.280 కోట్ల నిధులు విడుదల చేశాం. 2020 డిసెంబరు 28న జీవో నెం.45 ద్వారా మాన్యువల్ విడుదల చేశాం. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌కు సరిపడా నిధులు రాష్ట్రంలో ఉన్నాయి. వాటి వినియోగించే అధికారాలను కూడా అధికారులకు దఖలు పరిచాం. గోదావరిలో భారీగా వరద వస్తున్నందున.. కట్టే ప్రాజెక్టులు నాలుగు కాలాల పాటు ఉండాలని కాళేశ్వరం బ్యారేజీల వద్దే ప్రత్యేకంగా క్వాలిటీ కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటు చేశాం. నిర్మాణ పనులు నాణ్యతతో జరుగుతున్నాయా? లేదా? అని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ) స్థాయి అధికారి పరిశీలించేలా చర్యలు తీసుకున్నాం. క్వాలిటీ కంట్రోల్ విభాగం ప్రతివారం ప్రభుత్వానికి నివేదికలు సమర్పించేది. ఆ నివేదికల్ని కమిషన్ తెప్పించుకోవాలి.

బ్యారేజీల నిర్మాణ స్థలాల మార్పు నిర్ణయం ఎవరిది?

బ్యారేజీల నిర్మాణ స్థలాల మార్పు వ్యాప్కోస్ నివేదిక ఆధారంగా తీసుకున్నదే. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కట్టలేమని నిర్ధారణకు వచ్చిన తర్వాత గోదావరిలో ఏయే ప్రాంతాలు బ్యారేజీ నిర్మాణానికి అనుకూలమని వ్యాప్కోస్‌తో సర్వే చేయించాం. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలు బ్యారేజీల నిర్మాణానికి అనుకూలమని వ్యాప్కోస్ నివేదిక ఇచ్చింది. అంతకుముందు హైపవర్ కమిటీ కూడా దీనికి సిఫారసు చేసింది. బ్యారేజీల స్థలాల ఎంపిక పూర్తిగా సాంకేతికమైనదే.

కాళేశ్వరం కార్పొరేషన్ ఏర్పాటు ఉద్దేశమేంటి?

భారీ ప్రాజెక్టు కావడంతో నిధులు సమీకరించుకోవడానికి కాళేశ్వరం ఇరిగేషన్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశాం. నిధులను సమీకరించడంతోపాటు నిర్మాణ సంస్థలకు నిధుల చెల్లింపు బాధ్యతలు కూడా కాళేశ్వరం కార్పొరేషన్ తీసుకున్నదే. ఆ కార్పొరేషన్ తీసుకునే రుణాలకు ప్రభుత్వం పూచీ ఇచ్చింది. ప్రాజెక్టు వినియోగం ద్వారా సమకూరే నిధులతో ఆ రుణాలు చెల్లించాలని అనుకున్నాం. వివిధ కారణాలతో సాధ్యం కాలేదు.



బీఆర్కే భవన్ ఎదుట కూర్చున్న ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, తదితరులు

తొలిసారి కమిషన్ ముందుకు

కేసీఆర్ తొమ్మిదినరేళ్లపాటు సీఎంగా ఉండగా... రెండు దశాబ్దాల కాలంలో ఒక కమిషన్ ముందు కేసీఆర్ హాజరుకావడం ఇదే తొలిసారి. కాగా, కేసీఆర్‌కు విచారణకు హాజరవుతున్న నేపథ్యంలో బుధవారం బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున బీఆర్కే భవన్‌కు తరలివచ్చాయి. దాంతో పోలీసులు ఉదయం 7 గంటల నుంచే అక్కడ భారీగా బందోబస్తును ఏర్పాటు చేశారు. విచారణ మొదలైనప్పటి నుంచి కేసీఆర్ కమిషన్ కార్యాలయం నుంచి వెళ్లేదాకా బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ... నిరసన తెలిపారు. కేసీఆర్ తనయుడు కేటీఆర్ బీఆర్కే భవన్ ముందు నిరసనలకు నాయకత్వం వహించగా.. మాజీ మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి కేసీఆర్ వెంట ఉన్నారు.



విచారణకు హాజరయ్యే క్రమంలో ప్రజలకు అభివాదం చేస్తున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

పది మందిలో ఎందుకని..!

కాళేశ్వరం విచారణలో ఇప్పటిదాకా 114 మంది కోర్టు విట్‌నెస్(సీడబ్ల్యూ)గా హాజరుకాగా... వారినందరినీ ఓపెన్‌కోర్టులో కాళేశ్వరం కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది. అయితే కేసీఆర్ విషయంలో మాత్రం ముఖాముఖి విచారణకే కమిషన్ అంగీకారం తెలిపింది. తొలుత ఓపెన్‌కోర్టు కావడంతో 20 మందికి పైగా జర్నలిస్టులు, 10 మంది దాకా అధికారులు, 9 మంది బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. అయితే దాదాపు 40 మంది ముందు విచారణ ఎదుర్కోవడం ఇష్టం లేకే ముఖాముఖి విచారణను కేసీఆర్ కోరినట్లు సమాచారం. జ్వరంతోపాటు జలుబు ఉండటంతో ఎక్కువ మంది ఉన్న సమూహంలో ఇబ్బందికరంగా ఉంటుందని కేసీఆర్ కోరడంతో ముఖాముఖి విచారణకు కమిషన్ అంగీకారం తెలిపింది. ఇక 114వ కోర్టు విట్‌నెస్‌గా హాజరైన మాజీ మంత్రి టి.హరీశ్‌రావు మొత్తం 22 ప్రశ్నలకు 18 నిమిషాల్లో జవాబులు చెప్పగా... కేసీఆర్ మాత్రం ఐదారు ప్రశ్నలకు 50 నిమిషాలు తీసుకోవడం గమనార్హం.

ముగ్గురూ ముగ్గురే!

కాళేశ్వరం కమిషన్ ముందు 113వ కోర్టు విట్‌నెస్‌గా హాజరైన మాజీ మంత్రి ఈటల రాజేందర్ ఏ జవాబులు చెప్పారో... 114వ కోర్టు విట్‌నెస్‌గా హాజరైన టి.హరీశ్‌రావు దాదాపుగా అవే సమాధానాలు చెప్పారు. తాజాగా కేసీఆర్ కూడా అవే జవాబులు చెప్పడంతో ముగ్గురూ ముగ్గురేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముగ్గురికీ కమిషన్ ఏకకాలంలో నోటీసులు పంపగా.. తొలుత ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 5న కేసీఆర్, 6న ఈటల రాజేందర్, 9న హరీశ్‌రావు విచారణకు హాజరుకావాల్సి ఉంది. అయితే ఆరోగ్యం బాగాలేనందున తాను 5వ తేదీన విచారణకు హాజరు కాలేనని కేసీఆర్ కమిషన్‌కు నివేదించుకున్నారు. దీంతో 11వ తేదీన రావాలని కమిషన్ తదుపరి నోటీసులు పంపించింది. కానీ, ఈటల రాజేందర్, హరీశ్‌రావును విచారించాకే.. తాను విచారణకు హాజరు కావాలని కేసీఆర్ వేసిన ఎత్తుగడలో భాగంగానే ఇది జరిగిందని అంటున్నారు. కాగా, క్రాస్ ఎగ్జామినేషన్ ప్రారంభం కావడానికి ముందు కేసీఆర్‌తో కమిషన్ ప్రమాణం చేయించింది. ఈ సందర్భంగా ఆయన 'భగవంతుడిపై ప్రమాణం చేసి... నేను చెప్పేవన్నీ నిజాలే. నిజం తప్ప మరేమీ కాదు' అని అన్నారు.

రేవంత్ కౌంటర్ అటాక్!

కాళేశ్వరంపై నేడో, రేపో ముఖ్యమంత్రి ప్రెస్‌మీట్.. బీఆర్‌ఎస్ ప్రచారాన్ని బలంగా తిప్పికొట్టాలని నిర్ణయం

- కేసీఆర్, హరీశ్‌కు బదులివ్వనున్న సీఎం
- పీపీటీ రూపంలోనే సమాధానం
- పత్రాలన్నీ సిద్ధం చేస్తున్న అధికారులు

హైదరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి బీఆర్‌ఎస్‌పై సీఎం రేవంత్ రెడ్డి ఎదురుదాడికి సిద్ధమవుతున్నారు. ప్రాజెక్టు నిర్మాణం, బ్యారేజీల వైఫల్యంపై బీఆర్‌ఎస్ చేస్తున్న వాదనేంటి? అసలు వాస్తవాలేంటి? అన్నది ప్రజల ముందు ఉంచాలని నిర్ణయించుకున్నారు. కాళేశ్వరం కమిషన్ ముందు మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్ వినిపించిన వాదనలు, చేసిన ప్రకటనలు, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో చేస్తున్న ప్రచారానికి కౌంటర్ ఇచ్చేందుకు ముఖ్యమంత్రి స్వయంగా రంగంలోకి దిగనున్నారు. ఈ మేరకు గురువారం లేదా శుక్రవారం నాడు రేవంత్ కూడా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఇందుకోసం బీఆర్‌ఎస్ ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను నీటిపారుదల శాఖ అధికారులకు పంపించిన ప్రభుత్వం.. అంశాల వారీగా కౌంటర్ ఇవ్వడానికి వీలుగా తగిన పత్రాలను సేకరించింది. మరోవైపు బీఆర్‌ఎస్ చేస్తున్న ప్రచారానికి వ్యతిరేకంగా రెండు కీలకమైన ఆధారాలు గత రెండు రోజుల్లో వెలుగులోకి వచ్చాయి. ప్రాజెక్టుల రీఇంజనీరింగ్ నిర్ణయం మంత్రివర్గ ఉపసంఘం తీసుకుందని కమిషన్ ముందు పలువురు సాక్ష్యం ఇవ్వగా.. వాస్తవం మరో విధంగా ఉంది. మంత్రివర్గ ఉపసంఘంలో చర్చించాకే కాళేశ్వరం బ్యారేజీలపై, ప్రాజెక్టుల రీఇంజనీరింగ్‌పై నిర్ణయం తీసుకున్నామని మాజీ మంత్రి హరీశ్‌రావు చెబుతుండగా.. మంత్రివర్గ ఉపసంఘానికి, కాళేశ్వరం బ్యారేజీలకు సంబంధం లేదని తేలింది.

సబ్‌కమిటీ కన్నా ముందే బ్యారేజీకి నిర్ణయం..

ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకంలో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కట్టాలన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటూ.. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణానికి రూ.2591 కోట్లతో పరిపాలన పరమైన అనుమతినివ్వాలని అప్పటి ఈఎన్‌సీ(ఇరిగేషన్) సి.మురళీధర్ 2016 ఫిబ్రవరి 18న ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. దానికి అనుగుణంగా ప్రభుత్వం మేడిగడ్డ బ్యారేజీకి పరిపాలనపరమైన అనుమతినిస్తూ 2016 మార్చి 1న జీవో నెం.231 జారీ చేసింది. అయితే ప్రాజెక్టుల రీఇంజనీరింగ్‌పై మేడిగడ్డకు అనుమతినిస్తూ జీవో విడుదలైన 14 రోజుల తర్వాత మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించి 2016 మార్చి 15న జీవో నెం.655 జారీ అయింది. అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి టి.హరీశ్‌రావు చైర్మన్‌గా, మంత్రులు ఈటల రాజేందర్, తుమ్మల నాగేశ్వరరావును సభ్యులుగా నియమిస్తూ జీవో ఇచ్చారు. అయితే మంత్రుల సబ్ కమిటీ తీసుకున్న నిర్ణయం మేరకే మేడిగడ్డ నిర్మాణం జరిగిందని, కాళేశ్వరం నిర్మాణాన్ని క్యాబినెట్ ఆమోదించిందని కేసీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్.. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట వాంగ్మూలం ఇచ్చారు. దీనిని నాటి సబ్ కమిటీలో సభ్యుడిగా ఉన్న ప్రస్తుత మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖండించారు. మంత్రుల సబ్ కమిటీకి, మేడిగడ్డ నిర్మాణానికి సంబంధమే లేదన్నారు.



కోరినట్లుగా నివేదిక ఇచ్చేందుకే వ్యాప్కోస్..!

కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) లేఖలతోపాటు వ్యాప్కోస్ నివేదిక తర్వాతే మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం చేపట్టినట్లు కమిషన్ ఎదుట కేసీఆర్, హరీశ్‌రావు వాంగ్మూలం ఇచ్చారు. కానీ, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో 'బ్యారేజీలు కట్టడానికి అనుగుణంగా' నివేదిక ఇవ్వాలని అప్పటి ప్రభుత్వం వ్యాప్కోస్‌కు పని అప్పగించినట్లు పత్రాలు వెల్లడయ్యాయి. మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మించేందుకు అవసరమైన డీపీఆర్ తయారీ బాధ్యతల్ని వ్యాప్కోస్‌కు అప్పగించడానికి అనుమతి కోరుతూ 2015 ఏప్రిల్ 2న నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శికి చీఫ్ ఇంజనీర్ లేఖ రాశారు. ఈ మేరకు ఆ బాధ్యతలను వ్యాప్కోస్‌కు అప్పగిస్తూ ప్రభుత్వం 2015 ఏప్రిల్ 13న ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో బ్యారేజీల నిర్మాణం కోసం ముందే నిర్ణయాలు తీసుకొని, ఆ ప్రాంతంలోనే బ్యారేజీలు కట్టడానికి అనువుగా డీపీఆర్ ఇవ్వాలని వ్యాప్కోస్‌ను ప్రభుత్వం కోరినట్లు తేలింది. ఇదే అంశాన్ని బట్టబయలు చేసే యోచనలో సీఎం రేవంత్ ఉన్నారు. పైగా, కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీలపై నిర్ణయం తీసుకోవడానికి ప్రభుత్వం వేసిన హైపవర్ కమిటీలో ప్రత్యేక ఆహ్వానితుడిగా వ్యాప్కోస్ సీఎండీ రజిందర్ గుప్తా ఉన్నట్లు వెల్లడైంది. 2023 మే 3న ఆయన నివాసంలో సీబీఐ దాడులు చేసి రూ.38కోట్లను జప్తు చేసింది. ఈ నగదు మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టుకు సమర్థన ఇచ్చినందుకు, ఆ ప్రాజెక్టులోని బ్యారేజీలకు అనుగుణంగా నివేదిక ఇచ్చినందుకు ప్రతిఫలంగా పొందినదేనని తర్వాత తేలింది. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టికి అనుకూలంగా డీపీఆర్ ఇచ్చిన వ్యాప్కోస్.. ఆ తర్వాత మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లకు అనుకూలంగా డీపీఆర్ ఇవ్వడం ఆ సంస్థ ప్రత్యేకత అని ప్రభుత్వం గుర్తించింది.

లోపాలను ఎత్తిచూపిన ఎన్డీఎస్ఏ..

జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్డీఎస్ఏ) కూడా కాళేశ్వరం బ్యారేజీల లోపాలను ఎత్తిచూపింది. మేడిగడ్డ వైఫల్యానికి, కుంగుబాటుకు.. కారణాలనూ గుర్తించింది. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం 2019లో పూర్తికాగా.. తొలి వరదలకే ఆ బ్యారేజీతో పాటు అన్నారం, సుందిళ్ల దిగువ భాగంలోనూ రక్షణ వ్యవస్థలన్నీ కొట్టుకుపోయాయి. ఇందుకు తగిన కారణాలు అన్వేషించి డిజైన్లు ఇస్తే వాటికి తగ్గట్లుగా పనులు చేస్తామని మేడిగడ్డ నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ కోరినప్పటికీ ఐదేళ్లపాటు గత ప్రభుత్వం స్పందించలేదని వెల్లడైంది. ఎల్ అండ్ టీ లేఖలు కూడా దీనికి సాక్ష్యాలుగా ప్రభుత్వం సేకరించింది. మరోవైపు అన్నారం, సుందిళ్ల బ్యారేజీ నిర్మాణ స్థలాలను తగిన భూభౌతిక/భూసాంకేతిక పరీక్షలు చేయకుండానే ఎంపిక చేసి నిర్మించారని ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ తేల్చింది. ఇక మేడిగడ్డ నిర్మాణంలో కాంక్రీట్ వినియోగం అడ్డదిడ్డంగా జరిగిందని, కాంక్రీట్ నుంచి ఉద్భవించే వేడిని చల్లార్చడానికి క్యూరింగ్ విధానం చేపట్టలేదని, దీనికి సంబంధించిన ఏ సాక్ష్యాలు లేవని గుర్తించారు.

ఐదేళ్లలో ఎత్తిపోసిన నీళ్లు 162 టీఎంసీలే..

కాళేశ్వరం ప్రాజెక్టుకు మేడిగడ్డ గుండెకాయ అని తొలుత చెప్పిన బీఆర్‌ఎస్.. ఆ తర్వాత కాళేశ్వరం అంటే మూడు బ్యారేజీలే కాదని, రిజర్వాయర్లు, టన్నెల్‌లు అంటూ ప్రచారం చేస్తోంది. 'మేడిగడ్డ మాత్రమే గుండెకాయ' అని గత ప్రభుత్వం పలు సందర్భాల్లో అన్న మాటలను ఎత్తిచూపేందుకు సీఎం రేవంత్ సిద్ధమవుతున్నారు. బ్యారేజీల వైఫల్యానికి మరో కారణం.. నీటి నిల్వ కాగా, "బ్యారేజీల్లో నీటిని నిల్వ చేసి, వంద కిలోమీటర్లు గోదావరిని సజీవంగా చేసిన అపర భగీరథుడు కేసీఆర్" అని ప్రచురించిన కథనాలను కూడా రేవంత్ ప్రస్తావించనున్నట్లు తెలుస్తోంది. తాజాగా బీఆర్‌ఎస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యలను కూడా ప్రస్తావించిన విషయం విదితమే. దీనికి కౌంటర్‌గా కాళేశ్వరం బ్యారేజీలపై బీఆర్‌ఎస్ ప్రచారాన్ని ప్రభుత్వం తిప్పికొట్టనుంది. ఇక మేడిగడ్డ 2019లో పూర్తికాగా.. ఆ బ్యారేజీ నుంచి 2019-20లో 61 టీఎంసీల నీటిని ఎత్తిపోశారు. అనంతరం 2020-21లో 31.82 టీఎంసీలు, 2021-22లో 33 టీఎంసీలు, 2022-23లో 25.97 టీఎంసీలు, 2023-24లో 8.93 టీఎంసీల చొప్పున ఇప్పటివరకు మొత్తం 162 టీఎంసీల నీటిని ఎత్తిపోశారు. అయితే ఎత్తిపోసిన వెంటనే వరదలు రావడంతో 63 టీఎంసీల నీటిని సముద్రంలోకి వదిలారు. దీంతో ఐదేళ్లలో 99 టీఎంసీలతో 22 లక్షల ఎకరాలకు నీళ్లు ఎలా ఇచ్చారని ప్రభుత్వం ప్రశ్నించే అవకాశం ఉంది. మరోవైపు హైదరాబాద్ జంట నగరాలకు తాగునీరు అందించడానికి మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌లే దిక్కు అని బీఆర్‌ఎస్ చెబుతోంది. అయితే 2014 నాటికే గోదావరి నుంచి హైదరాబాద్‌కు తాగునీటిని అందించే పనులు దాదాపుగా పూర్తయ్యాయని, ఇవే నీటిని మిషన్ భగీరథలో చూపించి.. ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసింది వాస్తవమా? కాదా? అని ప్రభుత్వం నిలదీసే అవకాశం ఉంది.



అప్పుడు గొప్పలు చెప్పి.. ఇప్పుడు సంబంధం లేదంటున్నారు

- కాళేశ్వరం..అతి పెద్ద ఇంజనీరింగ్ తప్పిదం
- ఆ తప్పులు చూడలేకే పార్టీ నుంచి బయటికొచ్చా
- ఆ ప్రాజెక్టు ద్వారా నీళ్లు ఇచ్చినప్పుడు రాష్ట్రంలో ధాన్యం దిగుబడి 2 కోట్ల టన్నులు మాత్రమే
- ఆ నీళ్లు రాకున్నా.. ఇప్పుడు 2.8 కోట్ల టన్నులొచ్చింది
- మీడియాతో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): "కాళేశ్వరం.. ప్రపంచంలోనే అతి పెద్ద ఇంజనీరింగ్ తప్పిదం.. ప్రాజెక్టు డిజైన్‌లోనే లోపాలు ఉన్నాయి.. ఏ కోణంలో చూసినా వైఫల్యాలే ఉన్నాయి.. అధికారంలో ఉన్నప్పుడు ప్రాజెక్టు గురించి గొప్పలు చెప్పారు. ఓ గవర్నర్ అయితే కేసీఆర్‌ను కాళేశ్వరరావు అని పిలిచారు. ఇప్పుడేమో విచారణ కమిషన్ ఎదుట కాళేశ్వరంతో మాకు సంబంధం లేదని బీఆర్‌ఎస్ నాయకులు చెప్పడం హాస్యాస్పదంగా ఉంది" అని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్టు నిర్మాణంలో తప్పులు, డిజైన్, నాణ్యత పరంగా లోపాలు, హైడ్రాలజీ, జియాలజీ పరంగా తప్పులు.. ఇలా అన్ని అంశాల్లో వైఫల్యాలే కనిపిస్తున్నాయన్నారు. సైన్స్ పరంగా, సివిల్ ఇంజనీరింగ్, ఇరిగేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఆర్థిక ప్రయోజనాల పరంగా తీవ్ర లోపాలు ఉన్నాయన్నారు. ఒక ఇంజనీరింగ్ విద్యార్థిగా ఆ తప్పులు చూడలేకనే బీఆర్‌ఎస్‌లో వ్యక్తిగతంగా గౌరవం ఉన్నప్పటికీ బయటకు వచ్చానన్నారు. వానా కాలంలో వరదలు వచ్చే సమయంలో నదికి వ్యతిరేక దిశలో ఎవరైనా నీరు ఎత్తిపోస్తారా? అని ప్రశ్నించారు. వర్షాకాలంలో కేసీఆర్ నదీ జలాలను ఎత్తి పోస్తే.. వరుణ దేవుడు అదే సమయంలో పై నుంచి కిందకు వరద వదిలే వారని ఎద్దేవా చేశారు. హరీశ్‌రావు చెప్పినట్టు కాళేశ్వరం వల్లే ధాన్యం దిగుబడి పెరిగిందనడం అబద్ధమని అన్నారు. కాళేశ్వరం నీరు వచ్చిన సమయంలో రాష్ట్రంలో ధాన్యం దిగుబడి 2 కోట్ల టన్నులైతే.. ఆ నీళ్లు రాకున్నా ఇప్పుడు 2.80కోట్ల టన్నుల దిగుబడి వచ్చిందని గుర్తు చేశారు. కాళేశ్వరం వల్ల ఉపయోగం లేదనడానికి ఇంతకంటే నిదర్శనం లేదని, దీనిపై చర్చ కూడా అనవసరమని అన్నారు. దీనిపై వివరంగా చెప్పాలంటే.. తన వద్ద త్రీడీ ప్రజెంటేషన్ ఉందని, అన్నీ చెబుతానని చెప్పారు. ఈ ప్రాజెక్టుకు కేంద్రం అనుమతులు ఇచ్చింది కదా? అని విలేకరులు ప్రశ్నించగా.. తాడు కొంటానంటే తాడే కదా అని ఒకరికి.. ముడి వేసుకుంటానంటే ముడే కదా అని ఒకరికి అనుమతిస్తుందని.. తాడు కొని ఉరి వేసుకుంటానంటే మాత్రం కేంద్రం అనుమతించబోదని స్పష్టం చేశారు.

ఈటల, హరీశ్‌రావు తప్పుడు సమాచారం ఇచ్చారు!

- కాళేశ్వరానికి, మంత్రివర్గ ఉపసంఘానికి సంబంధం లేదు
- జస్టిస్ ఘోష్ కమిషన్‌కు మంత్రి తుమ్మల లేఖ



హైదరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు.. మంత్రివర్గ ఉపసంఘానికి సంబంధం లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. నాటి మంత్రివర్గ ఉపసంఘంలో సభ్యుడైన తుమ్మల ఈ మేరకు జస్టిస్ పీసీ ఘోష్‌కు బుధవారం లేఖ రాశారు. 2016 ఫిబ్రవరిలోనే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంపై విధాన నిర్ణయం తీసుకున్నారని, 2016 మార్చి 1న మేడిగడ్డకు పరిపాలనాపరమైన అనుమతినిస్తూ గత ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. 2016 మార్చి 15న హరీశ్‌రావు చైర్మన్‌గా, తాను, ఈటల సభ్యులుగా మంత్రివర్గ ఉపసంఘం వేశారని గుర్తుచేశారు. ఇటీవలి విచారణలో కమిషన్ ముందు ఈటల, హరీశ్ అబద్ధాలు చెప్పారని కమిషన్‌కు నివేదించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అప్పటి మంత్రివర్గ ఉపసంఘంలో చర్చే జరగలేదని స్పష్టం చేశారు. అన్ని ప్రాజెక్టుల రీడిజైన్, సమస్యల అధ్యయనం కోసమే మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశారని, కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి కాదని తెలిపారు. కమిషన్‌కు తప్పుడు సమాచారం ఇచ్చిన హరీశ్‌రావు, ఈటలపై చర్యలు తీసుకోవాలని తుమ్మల కోరారు. ఈ మేరకు లేఖతో పాటు మంత్రివర్గ ఉపసంఘం జీవోలు, తీర్మానాలు పంపించారు.

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను వదిలేయాలి

- కేసీఆర్ వందల కార్లలో విచారణకు హాజరు కావడం ప్రజాస్వామ్యం కాదు.. గుంపుస్వామ్యం: కూనంనేని



పాలమూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం కాకుండా అందులోని అన్నారం, మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలను ఇక వదిలేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఈ మూడు బ్యారేజీల నుంచి నీరు రావడం లేదని, ఎల్లంపల్లి నుంచి వస్తోందని చెప్పారు. కాళేశ్వరంలో జరిగిన తప్పులపై త్వరితగతిన విచారణ చేయాలని కోరారు. అన్నారం, మేడిగడ్డ, సుందిళ్లకు సంవత్సరానికి రూ.10 వేల కోట్ల కరెంటు ఖర్చు అవుతుందని, దీనికి కోసం చేసిన అప్పుల వడ్డీ కూడా తీర్చాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ మూడు బ్యారేజీలను రద్దు చేస్తే కరెంటు ఖర్చు తగ్గుతుందన్నారు. బుధవారం ఆయన మహబూబ్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. చాలామంది ముఖ్యమంత్రులు, ప్రధానులు విచారణలను ఎదుర్కొన్నారని, కానీ కాళేశ్వరం విచారణకు హాజరయ్యేందుకు కేసీఆర్ వందల కార్లతో వెళ్లారని, ఇది ప్రజాస్వామ్యం కాదని, గుంపు స్వామ్యమని విమర్శించారు. ఎవరికి గుంపు ఉంటే వారిదే రాజ్యం అన్నట్లు ఉందని, అలాంటి చర్యలకు ప్రభుత్వం ఎలా అనుమతించిందని ప్రశ్నించారు. కాళేశ్వరానికి కర్త, కర్మ, క్రియ కేసీఆరే అని చెప్పేవారని, ఇప్పుడు తాను ఏమైనా ఇంజనీర్‌నా అని అంటున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ గురించి విచారణ జరగడం విచిత్రమని, విచారణలో హరీశ్, ఈటల తమకేమీ సంబంధం లేదన్నారని, ఇప్పుడు కేసీఆర్ కూడా అలానే అంటున్నారని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఎవరి పని వారు చేయాలని, అలా చేయనందునే సమస్యలు వచ్చాయన్నారు. నిర్ణీత గడువులో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలని కోరారు.

కన్నప్ప సినిమాను బ్యాన్ చేయాలి

» పలు బ్రాహ్మణ సంఘాల డిమాండ్

మల్కాజిగిరి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మంచు విష్ణు నటించిన కన్నప్ప సినిమాలో బ్రాహ్మణులను కించపరిచే సన్నివేశాలు ఉన్నాయని, విడుదలకు ముందే ఆ సినిమాను బ్యాన్ చేయాలని బ్రాహ్మణ సంఘాలు డిమాండ్ చేశాయి. నటుడు మంచు విష్ణు బ్రాహ్మణులకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలన్నాయి. బుధవారం మల్కాజిగిరిలో విలేకరుల సమావేశంలో సనాతన ధర్మ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు ప్రియతం రామకృష్ణ, తెలంగాణ వైదిక బ్రాహ్మణ సంఘం వ్యవస్థాపకులు రుద్రవీణ బాలసుబ్రహ్మణ్యం, నెమలికంటి కృష్ణమూర్తి, గోటేటి కిషన్‌లు మాట్లాడుతూ.. బ్రాహ్మణుల ఆచారం ప్రకారం ప్రతీ బ్రాహ్మణునికి పిలక(జుట్టు) ఉంటుందని, దీన్ని అవహేళన చేస్తూ 'పిలక గిలక' అంటూ బ్రాహ్మణుల మనోభావాలను దెబ్బ తీసే విధంగా సినిమాలో డైలాగ్‌లు ఉన్నాయని విమర్శించారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు నక్సల్స్ ఎన్‌కౌంటర్

చర్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లో పోలీసులు బలగాలతో జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు నక్సలైట్లు మృతి చెందారు. వీరిలో ఓ మహిళా నక్సలైట్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. రెండ్రోజుల క్రితం కుంట సమీపంలో మావోయిస్టులు పేల్చిన మందుపాతరకు అదనపు ఎస్పీ ఆకాశ్ రాయ్ మృతిచెందిన విషయం తెలిసిందే.! ఆ తర్వాత బలగాలు అడవుల్లో కూంబింగ్ ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం బలగాలకు మావోయిస్టులు తారసపడ్డారు. ఇరువైపులా పలు దఫాలుగా కాల్పులు జరిగాయి. మావోయిస్టుల వైపు కాల్పులు నిలిచిపోయాక.. బలగాలు గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలో ఇద్దరు నక్సలైట్ల మృతదేహాలు, ఒక ఇన్సాస్ రైఫిల్, 12-బోర్ తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఓపీఎస్ అమలుపై స్పష్టమైన ఉత్తర్వులివ్వండి

» కేంద్ర విద్యాశాఖ మంత్రిని కోరిన ఎమ్మెల్సీ మల్క కొమరయ్య

హైదరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పాత పింఛను విధానం(ఓపీఎస్) అమలుతోపాటు సీపీఎస్ రద్దుకు సంబంధించి తెలంగాణలో గందరగోళం నెలకొందని, దీనిపై కేంద్రప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు ఇవ్వాలని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య కేంద్రాన్ని కోరారు. బుధవారం నగరానికి వచ్చిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను మల్క కొమరయ్య కలిసి వినతిపత్రం సమర్పించారు. నూతన విద్యా విధానాన్ని తెలం గాణలోనూ పూర్తిస్థాయిలో అమలయ్యేలా రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రతి జిల్లాకు జవహర్ నవోదయ విద్యాలయాలను మంజూరు చేయాలన్నారు.

అనారోగ్యంతో మరణించినా.. బీమా చెల్లించాల్సిందే

» రాష్ట్ర వినియోగదారుల ఫోరం కీలక తీర్పు

హైదరాబాద్ సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఓ గృహ రుణానికి సంబంధించిన పాలసీ విషయంలో బీమా సంస్థకు వ్యతిరేకంగా రాష్ట్ర వినియోగదారుల కీలక తీర్పు ఇచ్చింది. పాలసీదారుడు అనారోగ్యంతో మరణించాడని సాకు చెప్పకుండా బీమా సొమ్ము మొత్తాన్ని సదరు సంస్థే రుణదాతకు చెల్లించాలని స్పష్టం చేసింది. హైదరాబాద్, మలక్‌పేటకు చెందిన దొడ్డన్న గౌడ్ సుద్దాల పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో రూ.1,39,29,439 గృహ రుణం తీసుకున్నారు. దీనికి సంబంధించి టాటా ఏఐజీ ఇన్సూరెన్స్ కో లిమిటెడ్‌లో హౌసింగ్ బీమా పాలసీ తీసుకున్నారు. అయితే, అనారోగ్యంతో ఆస్పత్రిపాలైన దొడ్డన్న గౌడ్ 2021 మే 5న చనిపోయారు. దీంతో దొడ్డన్న గౌడ్ భార్య సుజాత బీమా సొమ్ము కోసం టాటా ఏఐజీ అధికారులను సంప్రదించగా.. పాలసీదారుడు ప్రమాదవశాత్తు మరణిస్తేనే పరిహారం చెల్లిస్తామని, అనారోగ్య కారణాలకు కాదని చెప్పి ఆమె వినతిని తిరస్కరించారు. దీనిపై సుజాత జిల్లా వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేయగా.. బాధితురాలికి అనుకూలంగా తీర్పు వెలువరించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ టాటా ఏఐజీ ఇన్సూరెన్స్ సంస్థ ప్రతినిధులు రాష్ట్ర వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ఫోరం.. పాలసీదారుడు తీసుకున్న రుణం చెల్లించి, ఇంటి పత్రాలను ఫిర్యాదుదారుకు అందించాలని తీర్పు ఇచ్చింది. అలాగే, రూ.లక్ష పరిహారం, రూ.25వేల ఖర్చులు చెల్లించాలని బీమా సంస్థను ఫోరం ఇన్‌చార్జి ప్రెసిడెంట్ మీనా రంగనాథన్, సభ్యులు వీవీ శేషుబాబు బెంచ్ ఆదేశించింది.

సీఎం చేతగానితనం పంచాయతీ సిబ్బందికి శాపం

» నిధులిచ్చి పంచాయతీ వ్యవస్థను గాడిన పెట్టాలి: హరీశ్

హైదరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఏడాదిన్నరగా నిధులు ఇవ్వకపోవడంతో గ్రామ పాలన పడకేసిందని, సీఎం రేవంత్‌రెడ్డి చేతగానితనం పంచాయతీ అధికారులు, పారిశుధ్య సిబ్బందికి శాపంగా మారిందని బుధవారం 'ఎక్స్' వేదికగా మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. నిధుల్లేక గ్రామాల్లో పారిశుధ్యం కుంటుపడిందని, ప్రతి నెలా నిధులు విడుదల చేయకుండా నిర్వహణను గాలికొదిలేయడంతో గ్రామాలు మురికి కూపాలవుతున్నాయని పేర్కొన్నారు. పాలన గాలికి వదిలేసి ముగ్గురు మంత్రులకు పోర్టుఫోలియోలు కేటాయించేందుకు మూడు రోజులుగా ఢిల్లీలో తిష్టవేసిన సీఎం ఇప్పటికైనా కళ్లుతెరిచి వెంటనే నిధులు విడుదల చేయాలని, పాడైపోతున్న గ్రామపంచాయతీ వ్యవస్థను తిరిగి గాడిన పెట్టాలని డిమాండ్ చేశారు.

డబుల్ ఇంజన్ సర్కారుతో ఏపీకి డబుల్ ధమాకా

» ఆ రాష్ట్రానికి నిధుల వరద పారిస్తున్న మోదీ: సంజయ్



కేంద్ర సంక్షేమ పథకాల ప్రదర్శనను పరిశీలిస్తున్న బండి సంజయ్

తిరుపతి(విద్య), జూన్ 11(ఆంధ్రజ్యోతి): డబుల్ ఇంజన్ సర్కార్‌తో ఆంధ్రప్రదేశ్‌కు డబుల్ ధమాకా లభించిందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. కేంద్రంలో మోదీ పరిపాలన ప్రారంభమై 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేంద్ర సంక్షేమ పథకాలను వివరిస్తూ తిరుపతిలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కేంద్రం చేస్తు న్న సాయాన్ని లెక్కలతో సహా వివరించారు. 'ఏపీలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడ్డాక ఇదివరకు ఏ రాష్ట్రానికీ లేనంతగా కేంద్ర ప్రభుత్వం నిధుల వరద పారించింది. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన ఏపీని గట్టెక్కించేందుకు ప్రత్యేక ఆర్థిక సాయాన్ని మోదీ అందిస్తున్నారు. ఇప్పుడు తెలంగాణ ప్రజలు కూడా డబుల్ ఇంజన్ పాలన కావాలని కోరుకుంటున్నారు' అని అన్నారు.

'గోదావరి-బనకచర్ల అనుసంధానం'పై పీఎఫ్ఆర్

» అభిప్రాయాలు తెలపాలని పలు రాష్ట్రాలకు కేంద్రం లేఖ

హైదరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వం చేపడుతున్న 'గోదావరి-బనకచర్ల అనుసంధానం' ప్రాజెక్టుకు సంబంధించిన ప్రాథమిక సాధ్యాసాధ్యాల నివేదిక(పీఎఫ్ఆర్)ను కేంద్ర ప్రభుత్వం పలు రాష్ట్రాలతో పాటు గోదావరి, కృష్ణా నది యాజమాన్య బోర్డులకు బుధవారం పంపించింది. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఒడిసా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను ఈ నివేదికపై అభిప్రాయాలు తెలపాలని కేంద్ర జలవనరుల సంఘం కోరింది. ఈ ప్రాజెక్టు వల్ల తమ రాష్ట్రానికి ఎంతో నష్టం కలుగుతుందని తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది.

ఈఈ అక్రమాస్తులు రూ.100 కోట్లపైనే!

(మొదటిపేజీ తరువాయి)

అత్యంత ఖరీదైన కమ్యూనిటీల్లో 19 ఇళ్ల స్థలాలు, కరీంనగర్‌లోని పలు హోటళ్లలో వ్యాపార భాగస్వామ్యానికి సంబంధించి డాక్యుమెంట్లను గుర్తించామని ఏసీబీ డీజీ విజయ్‌కుమార్ తెలిపారు. అలాగే రెండు కార్లు, బ్యాంకు డిపాజిట్లు, లాకర్లను గుర్తించామని, సోదాలు కొనసాగుతున్నాయని.. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. ఈ ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.100 కోట్లకు పైగానే ఉంటుందని సమాచారం. మలక్‌పేటలో నివసిస్తున్న శ్రీధర్ మార్చి 6న తన కుమారుడి వివాహాన్ని డెస్టినేషన్ వెడ్డింగ్ తరహాలో థాయ్‌లాండ్‌లో అత్యంత ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు హైదరాబాద్ శివార్లలోని ఓ ఫాంహౌస్‌లో హల్దీ, సంగీత్ ఫంక్షన్ చేశారు. మార్చి 9న నాగోలులోని శివం కన్వెన్షన్‌లో కుమారుడి రిసెప్షన్ వేడుకలు నిర్వహించారు. కుమారుడి పెళ్లికి రూ.కోట్లు ఖర్చుపెట్టడంతో ఆయనపై ఏసీబీకి ఫిర్యాదులు అందాయి. శ్రీధర్ ఇరిగేషన్ ఇంజనీర్ల సంఘం అధ్యక్షుడిగా కూడా పనిచేస్తున్నట్లు తెలిసింది.

కవితను పలకరించని కేసీఆర్!

» గుడ్ మార్నింగ్ డాడీ.. అంటూ కవిత పలకరింపు

» మాట్లాడకపోగా.. ఆగాలంటూ సైగ చేసిన కేసీఆర్

హైదరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం కమిషన్ విచారణకు హాజరయ్యే క్రమంలో ఫాంహౌస్ నుంచి హైదరాబాద్ బయలుదేరుతున్న తండ్రి కేసీఆర్‌ను పలకరించేందుకు కవిత వెళ్లగా.. గులాబీ బాస్ ఆమెతో ఒక్క మాటైనా మాట్లాడలేదని సమాచారం. కేసీఆర్ గది వద్దకు చేరుకున్న కవిత గుడ్ మార్నింగ్ డాడీ అని పలకరించగా.. అందుకు ప్రతిస్పందనగా ఆగమంటూ ఆయన సైగ చేశారని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. అయితే విచారణకు వెళ్లే హడావుడిలో ఉన్న కారణంగానే ఆమెతో కేసీఆర్ మాట్లాడలేదని బీఆర్ఎస్ నాయకుడొకరు చెప్పుకొచ్చారు. బుధవారం ఉదయం 8.15గంటలకు భర్త అనిల్‌తో కలిసి ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌కు కవిత చేరుకున్నారు. పై అంతస్తు నుంచి లిఫ్ట్‌లో కేసీఆర్ కిందకు వచ్చే వరకు అనిల్, కవిత.. కేసీఆర్ వెంటే ఉన్నట్లు సమాచారం. అక్కడి నుంచి కేసీఆర్ కాన్వాయ్ హైదరాబాద్‌కు బయలుదేరిన కొద్దిసేపటి తర్వాత ఆమె తన వాహనంలో హైదరాబాద్ చేరుకున్నారు. ఇటీవలి పరిణామాల నేపథ్యంలో తొలిసారి కవిత.. ఫామ్‌హౌస్‌కు రావడం, కేసీఆర్ బయలుదేరే వరకూ భర్త అనిల్‌తో కలిసి అక్కడే ఉండడం బీఆర్ఎస్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. కాగా, కవిత విషయంలో బీఆర్ఎస్ సోషల్ మీడియా విభాగాలు వివక్షతో వ్యవహరిస్తున్నాయని తెలంగాణ జాగృతి వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఫాంహౌస్ నుంచి కేసీఆర్ బయలుదేరే సమయంలో తీసిన వీడియోల్లో.. కవిత ఉన్నప్పటికీ ఆమె కనబడకుండా ఎడిట్ చేసి సోషల్ మీడియా వేదికల్లో పోస్టు చేశాయని మండిపడుతున్నాయి. కాగా, ఫాంహౌస్‌లో కాలు జారి గాయపడి ఆస్పత్రిలో చేరిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఎమ్మెల్సీ కవిత పరామర్శించారు.

జడ్జిల ఫోన్లు ఎందుకు ట్యాప్ చేశారు?

ఆదేశాలిచ్చిందెవరు? మీ పరిధిని దాటి ఎందుకెళ్లారు?.. రెండో రోజు 8గంటలపాటు ప్రభాకర్‌రావు విచారణ



హైదరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు రెండో రోజున సిట్ అధికారుల ముందు హజరయ్యారు. బుధవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో సిట్ కార్యాలయానికి వచ్చి ఆయన.. విచారణ ముగిసిన తర్వాత రాత్రి 8గంటల ప్రాంతంలో తిరిగివెళ్లారు. దాదాపు ఎనిమిది గంటల పాటు ప్రభాకర్‌రావును సిట్ అధికారులు ప్రశ్నించారు. తదుపరి విచారణ నిమిత్తం 14న మరోసారి హాజరు కావాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. సాధారణంగా ఎన్నికల సమయంలో రాజకీయ నాయకుల ఫోన్ల ట్యాపింగ్ జరుగుతుంటుంది.. కానీ, న్యాయమూర్తులు, పారిశ్రామికవేత్తల ఫోన్లను ఎందుకు ట్యాప్ చేయించారు? ఎవరి ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు? ఈ వ్యవహారం వెనుక ఉన్నది ఎవరు? అని ప్రభాకర్‌రావును సిట్ అధికారులు ప్రధానంగా ప్రశ్నించినట్లు తెలుస్తోంది. తొలి రోజు విచారణలో ప్రభాకర్ రావు నుంచి ఆశించిన సమాచారం రాకపోవడంతో బుధవారం విచారణలో సిట్ అధికారులు మరో వ్యూహంతో ముందుకెళ్లినట్టు.. ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ డేటా ఆధారంగా ఆయన్ను ప్రశ్నించినట్టు సమాచారం. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం బయటపడిన తర్వాత అరెస్టు అయిన పోలీసు అధికారులు తిరుపతన్న, ప్రణీత్‌రావు, రాధాకిషన్‌రావు, భుజంగరావు నుంచి సెల్‌ఫోన్లు, కొన్ని హర్డ్‌డిస్క్‌లను సిట్ అధికారులు స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ విషయం బయటకు పొక్కడంతో ఈ వ్యవహారంతో ప్రమేయం ఉన్న పోలీసు అధికారులంతా తమ ఫోన్లు, పర్సనల్ ల్యాప్‌టాప్‌లు, హర్డ్‌డిస్క్‌ల్లోని సమాచారాన్ని డిలీట్ చేశారు. దీంతో సిట్ అధికారులు వీరు ఉపయోగించిన సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, హర్డ్ డిస్క్‌లను డేటా రికవరీ కోసం ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్)కు పంపారు. ఎఫ్ఎస్ఎల్ అధికారులు.. వాటిలో డిలీట్ చేసిన సమాచారాన్ని చాలావరకు రిట్రీవ్ చేసి సిట్‌కు అందించారు. ఆ డేటా ఆధారంగానే ప్రభాకర్‌రావును సిట్ అధికారులు న్యాయమూర్తుల ఫోన్ల ట్యాపింగ్‌కు సంబంధించి ప్రశ్నించడంతో ఆయన మౌనం వహించినట్టు తెలుస్తోంది. కాగా.. నిబంధనల ప్రకారం మావోయిస్టులకు సంబంధించిన సమాచారాన్ని భద్రపరచాల్సి ఉన్నప్పటికీ, రాజకీయ నాయకుల ఆదేశాలతోనే ఆ డేటాను ధ్వంసం చేయాల్సి వచ్చిందని, అది స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్‌కు విరుద్ధంగా జరిగిందని ప్రభాకర్ రావు ఒప్పుకొన్నట్టు సమాచారం. అలాగే.. గతంలో సిట్ అధికారులు కోరిన మేరకు తన రెండు సెల్‌ఫోన్లను ఆయన వారికి స్వాధీనం చేశారు.

విచారణ వీడియో తీయడంపై అసహనం..


విశ్వసనీయ వర్గాలు తెలిపిన సమాచారం ప్రకారం.. "ఫోన్ ట్యాపింగ్ ఎస్ఐబీలో అంతర్గత బాధ్యత అయినప్పటికి మీరు ప్రత్యేకంగా స్పెషల్ ఆపరేషన్ టీంను ఎందుకు ఏర్పాటు చేశారు? దీనికి ప్రభుత్వ అనుమతి ఉందా? అనధికారికంగా మీ అంతట మీరే ఏర్పాటు చేయించారా?" అని సిట్ అధికారులు ప్రశ్నించగా.. తాను విధి నిర్వహణలో భాగంగానే పనిచేశానని పలుమార్లు ప్రభాకర్‌రావు బదులిచ్చారు. "ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి.. ప్రైవేట్ వ్యక్తి అయిన శ్రవణ్‌రావు మీ బృందంలో ఎలా సభ్యుడయ్యాడు? అతణ్ని ఇందులోకి ఎవరి ద్వారా తీసుకొచ్చారు?" అని ప్రశ్నిస్తూ.. ప్రణీత్‌రావు, తిరుపతన్న ఫోన్ల నుంచి రిట్రీవ్ చేసిన కొన్ని వాట్సాప్ సంభాషణల కాపీలను సిట్ అధికారులు ప్రభాకర్‌రావు ముందుంచినట్లు తెలుస్తోంది. అలాగే.. "ఏదైనా ఫోన్‌ను ట్యాపింగ్ చేయాల్సి వస్తే ఏడు రోజుల తర్వాత రివ్యూ కమిటీకి ఆ విషయాన్ని రాతపూర్వకంగా మీరు తెలియచేయాలి కదా ఇన్ని వేల నెంబర్లను ట్యాపింగ్ చేసినా ఆ వివరాలు రివ్యూ కమిటీకి ఎందుకు తెలియచేయలేదు? మీపై ఉన్నతాధికారులున్నారు.. వారికన్నీ తెలుసు అంటున్నారు కదా.. నాటి హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి రవిగుప్తాను మీరు బేఖాతర్ చేశారా? లేక ఆయనకు తప్పుడు సమాచారం ఇచ్చారా?" అని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ప్రభాకర్‌రావు మోసపూరితంగా వ్యవహరించారని రవిగుప్తా హైకోర్టులో వేసిన అఫిడవిట్‌ను గుర్తు చేస్తూ "ఆయన మీ గురించి అలా ఎందుకు అనాల్సి వచ్చింది? అంటే మీరు ఒక సమాచారం ఇచ్చి మరో పని అనధికారికంగా చేశారా?" అని ప్రశ్నించినపుడు ప్రభాకర్‌రావు మౌనంగా ఉన్నారని తెలుస్తోంది. "నిఘా సమాచారాన్ని ఇతరులతో పంచుకోకూడదు కదా.. మరి మీరు ప్రైవేటు వ్యక్తిని ఇందులో భాగస్వామిని చేయడంతో పాటు ఆయనకు కొంత సమాచారాన్ని ఇచ్చినట్లు నిర్ధారణ అయ్యింది" అంటూ కొన్ని సంభాషణల స్క్రీన్‌షాట్‌ను ప్రభాకర్‌రావుకు అధికారులు చూపించినట్లు తెలుస్తోంది. ఇలా వారు ఆధారాలతో ప్రశ్నలు అడుగుతుండడంతో.. ప్రభాకర్ రావు చాలా ప్రశ్నలకు గుర్తులేదు అని చెబుతూ, కొన్ని ప్రశ్నలకు మౌనంగా ఉన్నారని.. మరికొన్ని ప్రశ్నలకు 'మీవద్ద ఆధారాలుంటే చూపండి' అంటూ ఎదురు ప్రశ్నలు వేశారని సమాచారం. కాగా.. విచారణ ప్రక్రియ మొత్తాన్నీ వీడియో రికార్డింగ్ చేయడం పట్ల ప్రభాకర్‌రావు కొంత అసహనానికి గురైనట్లు తెలిసింది. ప్రభాకర్‌రావు బెయిల్ పిటీషన్ సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉండటం ఆగస్టు 5వ తేదిన జరిగే తదుపరి విచారణ వరకు ఆయనను అరెస్టు చేయవద్దని సుప్రీంకోర్టు మధ్యంతర ఉపశమనం ఇవ్వడంతో ప్రభాకర్‌రావు విచారణలో ఏమాత్రం భయపడకుండా నిబ్బరంగా ఉన్నారని తెలుస్తోంది.

అప్రమత్తతతోనే ఫ్యాటీ లివర్‌కు చెక్

» ముందే గుర్తించాలి.. జీవనశైలి మార్చుకోవాలి

» వ్యాయామం, ఆహార నియంత్రణ అవసరం

» 'గ్లోబల్ ఫ్యాటీ లివర్ డే' సదస్సులో వైద్యులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): దేశంలో నానాటికీ 'ఫ్యాటీ లివర్' కేసులు పెరుగుతున్నాయని.. 24-30 శాతం మంది పిల్లల్లో సైతం ఈ సమస్య కనిపిస్తోందని ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడం, జీవనశైలి మార్చుకోవడం ద్వారా ఈ సమస్యకు చెక్ పెట్టవచ్చని ఆయన సూచించారు. వరల్డ్ ఫ్యాటీ లివర్ డే (ఏటా జూన్‌లో వచ్చే రెండో గురువారం) సందర్భంగా గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో 'యువర్ లివర్, యువర్ హెల్త్, యువర్ ఫ్యూచర్' అనే అంశంపై ఓ సదస్సును నిర్వహించారు. ఏఐజీ ఆస్పత్రి హెపటాలజీ విభాగాధిపతి డాక్టర్ పి.నాగరాజారావు సంధానకర్తగా వ్యవహరించిన ఈ సదస్సులో పలువురు వైద్యనిపుణులు పాల్గొని ప్రసంగించారు. తొలు త ప్రసంగించిన డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి.. ఇప్పుడు కాలేయ వ్యాధుల చికిత్స గురించి కాకుండా నివారణ గురించి మాట్లాడాల్సిన ఆవశ్యకత ఉందని అభిప్రాయపడ్డారు. ఫ్యాటీ లివర్ కారణంగా మధుమేహం తీవ్రత పెరిగే ప్రమాదం ఉందని, గుండె, జీర్ణక్రియ సమస్యలూ రావొచ్చని హెచ్చరించారు. కాలేయంలో కొవ్వును కనీసం 10% అయినా తగ్గించుకునేందుకు ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలని.. వ్యాయామాలు చే యడం, ఆహార నియంత్రణలు పాటించడం వంటివి చేయాలని.. అప్పుడే ఈ సమస్యకు చెక్‌పెట్టగలమని చెప్పారు. సన్నగా ఉన్నంత మాత్రాన ఫ్యాటీ లివర్ లేదనుకోవడం అపోహ అని, మద్యం అలవాటు లేనివారికి కూడా ఫ్యాటీ లివర్ సమస్య వస్తుందని చెప్పారు. మగవారికి నడుం చుట్టుకొలత 90సెంటీమీటర్లు, ఆడవారికి 80 సెంటీమీటర్లు దాటితే జాగ్రత్త పడాలని ఈ సదస్సులో పాల్గొన్న వైద్యులు సూచించారు. అల్ట్రా ప్రాసెస్డ్ ఆహారపదార్థాలు తినడం.. ఎక్కువసేపు కదలకుండా కూర్చోవడం, వ్యాయామా లు చేయకపోవడం వల్ల ఫ్యాటీ లివర్ సమస్య తీవ్రమవుతుందని హెచ్చరించారు. కాలేయంలో కొవ్వు చేరితే.. క్రమంగా అది ధమనులలోనూ చేరి గుండెపో టు, పక్షవాతానికి కారణమవుతుందన్నారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ సహకారంతో ఏఐజీ ఆస్పత్రి ఏఐ ఆధారిత టూల్‌ను తీర్చిదిద్దిందని.. దాన్ని ఉపయోగించి సీబీపీ, హెచ్‌బీఏ1సీ, ఎల్ఎఫ్‌టీ, ట్రైగ్లిజరైడ్స్, బీఎంఐ ఆధారంగా ఫ్యాటీ లివర్ ముప్పున్న హైరిస్క్ రోగులను గుర్తించగలుగుతున్నామన్నారు.

హైదరాబాద్ రియల్ ఎస్టేట్.. తగ్గేదేలే!

» కేపీహెచ్‌బీలో గజం రూ.2.98 లక్షలతో.. కొత్త రికార్డ్

» ఏడేళ్ల క్రితం మాదాపూర్‌లో గజం రూ.1.51 లక్షలు

» రెండేళ్ల క్రితం కోకాపేటలో ఎకరం రూ.100 కోట్లు!

హైదరాబాద్ సిటీ, జూన్11 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ దూకుడులో హైదరాబాద్ మహానగరం మరోసారి ఆల్ టైమ్ రికార్డు నమోదు చేసింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ 7వ ఫేజ్‌లో చేపట్టిన ప్లాట్ల వేలంలో పలికిన ధరలే ఇందుకు నిదర్శనం. దేశవ్యాప్తంగా రియల్ ఎస్టేట్‌లో స్తబ్ధత నెలకొన్న నేపథ్యంలో.. ప్లాట్లను వేలం వేస్తే కొంటారా? లేదా? అనే సందిగ్ధం నడుమ జరిగిన వేలం ప్రక్రియ సూపర్‌డూపర్ హిట్టయింది. అధికారుల అంచనాలకు మించిన ధరలకు ప్లాట్లన్నీ హాట్‌కేకుల్లా అమ్ముడయ్యాయి. హౌసింగ్ బోర్డు చదరపు గజానికి నిర్ణయించిన ధర కంటే రెట్టింపు స్థాయిలో ధర పలకడం.. ఒక కమర్షియల్ స్థలం ధర అత్యధికంగా చదరపు గజానికి రూ.2.98 లక్షలు పలకడం విశేషం. హైదరాబాద్ మహా నగరంలో భూములు, స్థలాల వేలమంటే నగరవాసులకే కాదు.. దేశ విదేశాల్లో ఉన్నవారికీ ఆసక్తే. హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో గతంలో నిర్వహించిన ప్లాట్ల ఈ-వేలంలో దేశ, విదేశాల్లో ఉండేవారు ఆన్‌లైన్‌లో పాల్గొని కొనుగోళ్లు చేసిన దాఖలాలున్నాయి. రెండేళ్ల క్రితం కోకాపేటలో ఎకరం ధర రూ.100కోట్లకు పైగా పలుకడం అప్పట్లో తెలుగు రాష్ట్రాల్లోనే సంచలనంగా మారగా.. ఆ తర్వాత నగరానికి 20 కిలోమీటర్ల దూరంలోని మోకిల్లాలో చదరపు గజం లక్షకు పైగా పలుకడం హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా జరిగిన హౌసింగ్ బోర్డు ప్లాట్ల వేలం వాటిని మించిన సంచలనం. రియల్ ఎస్టేట్ వర్గాల్లో ఆశలు రేకెత్తించిన పరిణామమిది. ఎందుకంటే.. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రైవేటుగా సాగుతున్న స్థలాలు, ప్లాట్ల క్రయ విక్రయాల్లో ధర అధికారికంగా ఖరారు కావడం లేదు. అమీర్‌పేట, కూకట్‌పల్లి, జూబ్లీహిల్స్ బంజారాహిల్స్, మాదాపూర్ ఇలా వాణిజ్యపరంగా అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో చ.గజం రూ.2.5 లక్షలు, రూ.3 లక్షల వరకూ ఉంటుందని అనడమే కానీ.. ఆయా ప్రాంతాల్లో స్థలాలను అమ్మేందుకు ముందుకు వచ్చేవారు.. కొనేందుకు ఆసక్తి చూపేవారు చాలా అరుదు. తాజాగా కేపీహెచ్‌బీలో జరిగిన ప్లాట్ల వేలంతో అధికారికంగానే ధర ఖరారయినట్టయింది. 2018 ఏప్రిల్ నెలలో హెచ్ఎండీఏ వేలం వేస్తే మాదాపూర్‌లో ఓ ప్లాట్ ధర చదరపు గజానికి రూ.1.51 లక్షల చొప్పున పలకగా.. అత్తాపూర్‌లో రూ.1.53 లక్షలు పలికింది. తాజాగా కేపీహెచ్‌బీలో రూ.2.98లక్షలు పలుకడం హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పడిపోలేదనడానికి నిదర్శనమని, మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.


ప్రతి పోలీసుకు వంగర పోలీసులు ఆదర్శం

వారిది నిజమైన పోలీసింగ్ అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశంస

» 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ట్యాగ్ చేస్తూ ఎక్స్‌లో పోస్ట్

» వంగర పోలీసులను అభినందించిన డీజీపీ, జితేందర్ రెడ్డి, మంత్రి పొన్నం

భీమదేవరపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సైకిలెక్కి గ్రామాల్లో తిరుగుతూ గంజాయి, సైబర్ నేరాలు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న హనుమకొండ జిల్లా వంగర పోలీసులు రాష్ట్రంలోని ప్రతీ పోలీసుకు ఆదర్శమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. ఈ మేరకు వంగర పోలీసులను సోషల్ మీడియా వేదికగా అభినందించారు. 'వారెవ్వా వంగర పోలీసు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో బుధవారం ప్రచురితమైన కథనానికి సంబంధించిన చిత్రాన్ని ట్యాగ్ చేస్తూ ఎక్స్‌లో ఆయన ఓ పోస్టు చేశారు. నేర నియంత్రణకు కఠినంగా వ్యవహరించడమే కాదు, నేరాల జరగడానికి మూల కారణాలను అన్వేషించి అర్థం చేసుకుని పరిష్కార మార్గాలను అమలు చేయడమే నిజమైన పోలీసింగ్ అని ముఖ్యమంత్రి తన పోస్టులో పేర్కొన్నారు. గ్రామాల్లో యువత తప్పుదోవ పట్టకుండా, గంజాయి వంటి దురలవాట్ల జోలికి పోకుండా, సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ, విద్య ప్రాధాన్యాన్ని వివరిస్తూ, సాంఘిక దురాచారాలపై చైతన్యం కల్పిస్తూ వంగర పోలీసులు నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. రాష్ట్రంలోని ప్రతీ పోలీసులకు వంగర పోలీసులు ఆదర్శమని ప్రశంసించారు. వంగర పోలీస్ సిబ్బంది ప్రతీ ఒక్కరికి అభినందనలు తెలియజేశారు. అలాగే, వంగర పోలీసులకు రాష్ట్ర డీజీపీ జితేందర్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా అభినందనలు తెలిపారు. ప్రజలతో మమేకమై యువతకు గంజాయి, డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ, ప్రజలను అప్రమత్తం చేస్తున్న వంగర పోలీసుల కృషి అభినందనీయమని డీజీపీ జితేందర్‌రెడ్డి ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇక, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఎస్సై దివ్యకు ఫోన్ చేసి పోలీసుల కృషిని అభినందించారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎక్స్‌లో చేసిన పోస్టు

కేపీ హెచ్‌బీలో గజం రూ. 2.98 లక్షలు

» హౌసింగ్ బోర్డు ప్లాట్ల వేలంలో అత్యధిక ధర

» హాట్ కేకుల్లా అమ్ముడు పోయిన ప్లాట్లు

» 18 స్థలాల విక్రయంతో బోర్డుకు రూ.142 కోట్లు

» 2000 సంవత్సరంలో అక్కడ గజం రూ.1818



హైదరాబాద్, కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాజధాని హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు కాలనీలో గృహ నిర్మాణ మండలి పరిధిలో ఉన్న ఓపెన్ ప్లాట్ల వేలంలో.. ఒక కమర్షియల్ ప్లాట్ ధర గజం రూ.2.98 లక్షలు పలికింది. చదరపు గజం ధర ఇంత భారీగా పలకడం ఇటీవల కాలంలో ఇదే మొదటిసారని రాష్ట్ర గృహ నిర్మాణ మండలి మేనేజింగ్ డైరెక్టర్ ఎండీ ఐఏఎస్ వి.పి.గౌతమ్ తెలిపారు. హౌసింగ్ బోర్డు పరిధిలో కేపీహెచ్‌బీ కాలనీ ఫేజ్-7లో ఖాళీగా ఉన్న 18 స్థలాలకు బుధవారం కేపీహెచ్‌బీ ఫంక్షన్ హాల్‌లో వేలం నిర్వహించారు. వీటిలో నాలుగు నివాసస్థలాలు కాగా.. 13 వాణిజ్య క్యాటగిరి, కైతలాపూర్‌లో ఉన్న బిట్టుతో కలిపి మొత్తం 18 స్థలాలు. వేలంలో ఇవన్నీ.. అధికారుల అంచనాలకు మించి హాట్ కేకుల్లా అమ్ముడైపోయాయి. ఈ ప్లాట్లలో 194 చదరపు గజాల నుంచి 978 చదరపు గజాల వరకూ రకరకాల విస్తీర్ణం గలవి ఉన్నాయి. వీటిలో 22వ నంబరు ప్లాట్‌కు (151 చదరపు గజాలు, కమర్షియల్) చదరపు గజానికి రూ.2.98లక్షల చొప్పున చెల్లించి కొనుగోలు చేశారు. కాగా మొత్తం 18 ప్లాట్లు కలిపి 6,236.33 చదరపు గజాలను వేలం వేయగా సగటున ఒక్కో గజానికి రూ.2.38 లక్షల చొప్పున ధర పలికింది. 5 ప్లాట్లు మినహా మిగతావన్నీ రూ.2.5 లక్షలకు పైగానే పలికాయి. వేలం పాటలో పాల్గొని ఈ ప్లాట్లను కొనుగోలు చేసిన వారు రెండు రోజుల్లో 4వ వంతు సొమ్మును, 30 రోజుల్లో 75% సొమ్మును చెల్లించాలి. మొత్తం 18 ప్లాట్ల వేలంతో బోర్డుకు రూ.142.78 కోట్ల మేర ఆదాయం సమకూరనుంది. వేలంలో 84 మంది పాల్గొన్నారు. కాగా.. కేపీహెచ్‌బీలో.. 13.11.2000న గజం రూ.1818కే రిజిస్ట్రేషన్ చేశారు. అప్పట్లో ఇక్కడ జాగా తీసుకున్న వారు.. తాజా వేలంలో గజం ఏకంగా రూ.2.5 లక్షల దాకా పలకడంతో 'వామ్మో' అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

వేలం ధరలు.. ప్లాట్ల వారీగా

క్రమసంఖ్య	ప్లాట్ నంబరు	చ.గజాలు	వేలం పాట ధర (గజం రూ.లక్షల్లో)
1	54 (ఎంఐజీ)	194.44	2,50,000
2	55 (ఎంఐజీ)	194.44	2,50,000
3	56 (ఎంఐజీ)	194.44	2,42,000
4	57 (ఎంఐజీ)	194.44	2,35,000
5	17	220.38	2,81,000
6	18	254.44	2,40,000
7	19	292	2,88,000
8	20	249.32	2,71,000
9	21	270.2	2,72,000
10	22	151.92	2,98,000
11	23	266.84	2,42,000
12	24	921.13	1,90,000
13	25	789.27	1,70,000
14	26	978.92	1,80,000
15	27	484.6	2,17,000
16	28	389.39	1,84,000
17	29	446	2,22,000
18	కైతలాపూర్	36.16	1,14,000

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.